భారతి

సచిత్ర మాసపత్రిక

అధిపతి

కా. నాగేశ్వరరావు

సంపాదకుడు

గన్నవరపు సుబ్బరామయ్య

సంపుటము ౧౦. సంచిక ౬.

ఆంధ్రపత్రికా ముద్రాలయము, మద్రాసు.

౧౯33

Printed at the
ANDHRAPATRIKA PRESS
G. T., Madras.



చెన్నపట్టణము, జూన్ ౧౯౩౩

సంపుటము ౧౦ శ్రీముఖ సంవత్సరము, జ్యేష్ఠమాసము సంఖ్య ౬

మేడూరివారి కోడలు

శివశంకరశాస్త్రి
[మాహేశ్వరాశ్రమము]

౧

మేడూరివారి కోడలి
కీడెవ్వరు గోచరింప రేగుణమందున్
కోడూరుగ్రామమందలి
స్త్రీ శావతులందు నెంత వెదకిన సరియే.

ఎదు రాడ దత్తగారికి
తదీయచిత్తానుసారతత్పరమతియై
సదనమున మెలగు నాయమ
పదిలమ్ముగ, అత్తగారు ప్రమదం బొందన్.

మితభాషిణి యాయమ నిజ
పతి కుపచారమ్ము చేయు భక్తిశ్రద్ధా
న్వితయై, కనుగొను లోకులు
సతీత్వమును బహువిధాల శ్లాఘింపంగన్.

వినబడియె నేని భిక్షుక
జనయాచ్ఞాకంఠరవము సత్వరగతితో
జని యాయమ బిచ్చమ్మును
కనికరమున బెట్టుచుండు కరయుగ్మమునన్.

ఆయమ షోడశవర్ష
ప్రాయమ్మున నత్తవారి భవనము చేరెన్
ఆయెను సుషమావృద్ధి త
దీయతనూవల్లియందు దివసక్రమమై.

ఆమెవిలోచనకాంతికి
వ్యోమము ధవళాంబుజంబునోజ వెలుంగన్
కోమలపాదస్పర్శను
భూమిస్థలి కోకనదముపోలిక జెలగున్.

కోడలు చనుదెంచినయా
యేడాదికె యత్తవారియింటన్ హెచ్చెన్
పాడియు పంటయు; గలిచిన
దోడెడియభియోగ మద్భుతోత్తర మగుచున్.

శుభలక్షణలక్షిత యని
యభిమానం బతిశయిల్లె నత్తకు స్నుషపై,
అభివృద్ధి గాంచ భర్తకు
నభిరతి నిజకాంతమీద నతివేలముగన్.

యామినివేళను రెండవ
యామమ్మున దీపకాంతియందు నపూర్వ
శ్రీ మెరయు నామెకన్నులు
స్వామి విలోకించి యధికసంభ్రమ మొందున్.

మోహామునగాని యత్యు
త్సాహమ్మునగాని యామె శయనమున స్వయం
గ్రాహమ్ము లొనగుచో న
స్నేహమ్ముగ భర్తస్మయము చెందుచునుండున్.

ఋజువుగ వాసరవేళను
రజనీసమయమ్మునందు రభసముతోడన్
నిజకాంత మెలంగుట కి
క్కజ మొందుచునుండు భర్త కరుణాళుండై.

వాసరములు వారమ్ములు
మాసమ్ములు గడిచె నిట్లు, మహితబలుం డా
భూసురుడు కోలుపోయె వి
కాసము వేసవిని నిమ్నగాస్రుతివోలెన్.

సోమునకు బహుళపక్ష
క్షామమువలె వల్లభునకు ఛవి యడుగంటన్,
ఆమె మనోజ్ఞశరీరం
బామనిని తురాయి తరువునట్లు చెలంగెన్.

౨

మేడూరివారి యింటికి
బాడబు డొక్కండు పోయి ప్రాతర్వేళన్
వేడెను భిక్షము: కోడలు
తోడనె బియ్యంబు నిండుదోసిట గొనుచున్.

గడప దిగిపోయి నాల్గయి
దడుగులు ప్రాంగణమునందు నాతని పాత్రన్
విడిచెను తండులములు సం
దడి చేయగ హేమవలయతతి హస్తములన్.

ఆయమ పరికించె మహో
కాయుని, రుద్రాక్షమాలికా రూపగ్రై
వేయుని, విశాలలోచను
నాయతి ముఖభస్మ కుంకుమాలంకారున్.

భూసురుడు తీక్ష్ణనయన వి
భాసురుడు తదీయవదనపద్మము గాంచెన్
దూసికొని పోవు దృక్కుల:
భాసురగాత్రికి జనించె భయసంభ్రమముల్.

తడబడు పాదమ్ములతో
వడివడి లోనికిని బోయి వాకిలి మూయం
బడతుక, చింతాన్వితుడై
వెడలె దదీయాంగణమ్ము విడిచి యతండున్.

"ఇమ్మెయిని వణకె దేటికి?
చెమ్మట గ్రమ్మినది వదనసీమను, చెపుమా

యిమ్మాడ్కి నైనకారణ
మమ్మా!"యని బుజ్జగించె నత్త లతాంగిన్.

ఫాలస్వేదకణమ్ములు
చేలాంచల మొత్తి తుడిచి చిన్నయెలుగునన్
లోలాక్షి పలికె: "భిక్షుకు
నాలోకింపంగ నాకు నతిభయ మొదవెన్!"

అని పలుకు ముద్దుకోడలి
కనునయవచనములు చెప్పి "అమ్మా, యిటుపై
జనబోకు నీవు భిక్షుక
జనముకడకు"ననియె నామె సస్నేహముగన్.

రెండవదినమున నా వి
ప్రుం డరుదేరంగ ప్రొద్దు పొడిచిన పిదపన్
నిండుగ దోసిట గొని చని
తండులములు పోసి యత్త తత్పాత్రమునన్—

"ఏమండీ, మాకోడలి
నేమో భయపెట్టినా రటే నిన్నను! ఇ
మ్మే మెపుడు చూడలేదీ
గ్రామమునకు మీరు క్రొత్తగా వచ్చితిరా?"

ఈరీతి బలుకరింపగ
భైరవభ ట్టనియె నిట్లు: "భయపడియెను మీ
గారాబు చిన్నికోడలు
నారూపము గాంచి. నేను నవ్వుడ నమ్మా.

"ఆమెను బోలిన యందరు
కామినులును నన్ను గాంచి కాంతురు భీతిన్
నాముఖకుంకుమ ఘనరే
ఖా మంజులకాంతి నయనకంటక మగుటన్."

"ఏమో వింతగ నున్నది!
కామినులకు నంతభయము కలుగునె చూడం
గా మీ తిలకము! మాంత్రికు
లేమో యనిపించుచున్న, దిది నిజమేనా?"

ఆయమ యిట్లు వచింపగ
నాయవనీసురుడు పల్కె నల్లన "నిజమే
ఏమెడనున్నది మీస్నుష?
ఈయుదయము గోచరింప దేమికతంబో?"

"నిన్న మిమ్ముం గన్గొని యా
చిన్నది యత్యధికభయము చెందగ, నేనే
అన్నాను పోవ వల దని
ఉన్నది తులసెమ్మచుట్టు నూడ్చియలుకుచున్."

అని యత్త చెప్పుమాటలు
విని తల పంకించి మరల విప్రుం డను: "మీ
యనుగుం గోడలి వర్తన
మున నెన్నడు వైపరీత్యమును గన లేదా?"

లే దనగ నామె, ఆయన
"కాదమ్మా, ఆవహించు గ్రహమాతరుణిన్!
ఖేదమ్ము చెందబోకుడు
మీద శుభ మ్మగును లెండు మీపుత్రునకున్.

"నమ్మకము లేనిచో నా
కొమ్మను రాతిరికి మీరు కొమరుని కడకుం
బొమ్మనక యెట్లొ మీశయ
నమ్ముననే నిల్పుకొనుడు నామాటపయిన్."

అని చెప్పి వెడలి పోయెను
తనయునకున్ దెలుప కామె ధైర్యముతోడం

దనకడ కోడలి నాయా
మిని నిడుకొని కనులుమూసిమేల్కొనియుండెన్.

రెండవయామము ముగియుచు
నుండగ మేల్కాంచి కోడ లుద్రేకమునఁ
రెం డడచి యత్తతలపై
పండుకొనం బోయె వడిగ పతిసన్నిధికిన్.

వినయవతియై మెలంగెడి
తనకోడలి నావహించి తత్సమయమునం
బెనుభూత మిట్లు చేయిం
చిన దని గ్రహియించి యామె చింతిలఁజొచ్చెన్.

మరునాడు భైరవార్యుం
డరుదేరగ, బిలిచి లోని కాయనను సమా
దరమున, కోడలి గ్రహమును
పరిహారము చేయు డనుచు బ్రార్థన చేసెన్.

... ...

మాటలు మీరును కోమలి,
పాటలు విపరీతముగను పాడును, లేచుం
బోటులకు, మాంత్రికుం డు
చ్చాటనమంత్రములు చెప్పసమయములందున్.

మండలకాలము నిష్ఠ న
ఖండిత జప హోమ తంత్ర కర్మంబుల వి
ప్రుండు పిశాచిం ద్రోలెను
ఖండనిశానాథమౌళికరుణ చెలంగన్.

ఆమెయతిమానుషం బగు
ధామము క్షీణించి సహజతనురుచి నిలిచెఁ
నీమముతోడ దటియ
స్వామికి క్రమ్మరను సహజవర్చ స్సొదవెన్

మేడూరివారి కోడలి
కీడెవ్వరు గోచరింప రేగుణమందుఁ
కోడూరుగ్రామమందలి
వ్రీడావతులందు నెంత వెదకినను సరే.

ఆంధ్రమున కొన్ని అన్యభాషాపదములు

కొమాండూరి శఠకోపాచార్యులుగారు, యమ్. ఏ., బి. యల్.

ఆంధ్రవాఙ్మయమున అన్యభాషాపదము లుపయోగింపవచ్చునా? అట్లయినచో నెంతవఱ కుపయోగింపవచ్చును? గ్రంథములందును, పత్రికావ్యాసములందును కొన్ని అన్యభాషాపదములను కొందఱుపయోగించుచున్నారు. కాని యట్టి ప్రయోగములను కొందఱు పండితులు తీవ్రముగా నిరసించి అట్టి పదములను బహిష్కరించుచున్నారు. స్వభాషను అన్యభాషాపదములతో నింపివేసి క్లిష్టముచేయుట యుచితము గాదు. కాని అన్యభాషాపదములు కొన్ని కారణములచేత ఉపయుక్తములు, అవసరములు, వాఙ్మయపోషకములు నయినచో వాటిని కేవలము అన్యభాషాపదములను కారణమున బహిష్కరించుట సవ్యము కాదనియు, అట్లు బహిష్కరించుటవలన మనభాషకును, ముఖ్యముగా జాతీయైక్యమునకును గూడ హాని కలుగుననియు తోఁచుచున్నది. బుద్ధిమంతులు తమ యభిప్రాయములను తెలియఁజేసి, అందఱిని జ్ఞానవంతులుగాఁ జేయుటయే వాఙ్మయముయొక్క ముఖ్యోద్దేశ మగుటచే వీలగునంతవఱకు భాష సులభముగాను, సామాన్యజనులకుఁ గూడ సుబోధకముగాను ఉండవలెను. లేనిచో వాఙ్మయమునకుఁ దగు ప్రచారము గాని, దానివలన జనులకు తగినంత లాభము గాని కలుగదు.

ఈసందర్భమున అన్యభాషాపదము లన నేవియో మనము నిశ్చయించుకొనవలసి యున్నది. శబ్దార్థమును బట్టి స్వభాషలోని దేశ్యములు దప్ప తక్కిన వన్నియుఁ గూడ అన్యభాషాపదము లని ప్రథమమున స్ఫురించును. కాని యీసూత్రమును బట్టి అందలి దేశ్యములుతప్ప నితరపదముల నన్నిటిని బహిష్కరించవలసి యుండును. అట్లు చేయుట సాధ్యము కానేరదు. బహిష్కరణవాదులకుఁ గూడ నట్టి ఆశయము లేదు. మఱియు అట్టి అచ్చతెనుఁగు భాషలో ఇప్పటికాలమున కుంఠితములగు భావములను తెలియపఱచు గ్రంథములను వ్రాసినను అవి యిప్పటిచదువరులలో చాలమందికి బోధపడుటయే కష్టము. మనభాష కత్యంతసన్నిహితమును, దీనికి ప్రకృతియు నగు భాషయందలి పదములను ప్రయోగింపవలెనని పండితు లందఱి యభిప్రాయము. ఈకారణమునను సంస్కృతశబ్దములను, వాటి తద్భవములను పండితులు స్వేచ్ఛగా ఆంధ్రమున వాడుచు అట్టిప్రయోగములు నిర్దుష్టము లనియు, స్వభాషకు సంబంధించినవనియు, నిరాక్షేపణీయము లనియు సమర్థించుచున్నారు. అయితే మన ఆంధ్రభాషకు ఇతరభాషలతో వేటితో మొదటినుండియు సహజ సంబంధము కలదు? అను సంగతి స్పష్టము కావలసియున్నది. ఏ భాషలోనైనను అధికసంఖ్యాకము లగు పదములు మఱియొకభాషలోనివిగా నున్నంతమాత్రమున, ఈ రెండవది ఆభాషకు ప్రకృతియని చెప్పుటకు వీలు లేదు. ప్రస్తుతము ఇంగ్లీషువాఙ్మయములోని పదములలో $\frac{2}{3}$ వంతు మాటలు లాటినుభాష సంబంధమైనవి. అయినను ఆంగ్లభాష లాటినులోనుండి గాని, ఆ భాషాకుటుంబములోనుండి గాని ఉత్పన్నము కాలేదనియు, అది జర్మను మొదలగు ట్యూటానిక్ -అనఁగా ఆంగ్లోసాక్సనుకుటుంబములోనిదనియు శాస్త్రజ్ఞులచే నిర్ణయింపఁబడినది. అందువలన ఈసందర్భమున మనదేశపు భాషల పరస్పర సంబంధమును కొంతవఱకు పరిశీలింపవలసి యున్నది.

మన భరతఖండమందు ముఖ్యమైనవి సుమారు పది దేశీయభాషలు గలవు. ఇవి ఆయా ప్రాంతములయందు లక్షలకొలఁది జనులచే స్వభాషగా నుపయోగింపఁబడుచు చక్కని సారస్వతమును గూడఁ గలిగియున్నవి. ఈభాష లన్నియు ప్రథమమునుండియు సంబంధము లేని వేరువేరుభాషలుగా నుండలే దనియు, కొన్నికొన్ని భాషలకు ఒక్కొక్క మూల

భాష యుండెడి దనియు, వానిలోనుండి కాలక్రమమున ప్రాంతీయభేదము లేర్పడి, ఆభేదములు హెచ్చయినమీఁదట — కొంతకాలమున కవి వేరువేరుభాషలుగా పరిగణింపఁబడుట కల్గె ననియు భాషాశాస్త్రజ్ఞుల అభిప్రాయము. ఇప్పటిభాషల క్రియలను, ప్రత్యయములను, ముఖ్యశబ్దములను పోల్చి చూచినయెడల నేయేభాషలు ఏకకుటుంబములోనివో నిర్ణయింపవచ్చును. అట్లు శాస్త్రీయపద్ధతిని పరీక్షింపఁగా మనదేశమునందలి ప్రధానభాషలు రెండు ముఖ్యశాఖలుగా నేర్పడునని శాస్త్రజ్ఞులు నిర్ణయించిరి. వీనిలో నొకటి ద్రావిడశాఖ: రెండవది ఆర్యశాఖ. అరవము, కన్నడము, మళయాళము మొదలగునవి ద్రావిడభాషలు. అనఁగా మూలద్రవిడమునుండి యుత్పన్నము లయినవి. హిందీ, బెంగాలీ, ఓఢ్రము, గుజరాతీ, మహారాష్ట్రము మొదలగునవి ఆర్యభాషలు. అనఁగా వేదకాలపు సంస్కృతమునుండి వచ్చినవి. మన యాంధ్రభాష వానిలో నేశాఖకు చేరును అనువిషయము చాల కాలము సందిగ్ధముగా నుండినది. మన ముఖ్యవ్యాకరణగ్రంథములలో తెలుఁగుభాషకు సంస్కృత, ప్రాకృతములు ప్రకృతులుగా చెప్పఁబడినవి. ముఖ్యముగ మన ప్రాచీనాంధ్రవ్యాకరణములు సంస్కృతముననే వ్రాయఁబడినవి. ఆంధ్రమహాభారతము, రామాయణము, హరివంశము మొదలగు ఆంధ్రవాఙ్మయమునందలి ప్రధానగ్రంథములు సంస్కృతశబ్దములతో నిండియున్నవి. ఆర్యజాతీయులగు చాళుక్యాదిరాజులు చిరకాలమాంధ్రదేశపాలకులుగా నుండిరి. ఆకారణములచేతను, చిరకాలమునుండి వచ్చుచున్న సంప్రదాయమును బట్టియు ఆంధ్రము ఆర్యభాషాకుటుంబములోనిదని ఆంధ్రలాక్షణికు లభిప్రాయపడుచుండిరి. ఇప్పటికిని చాలమంది పండితుల కిట్టి యభిప్రాయము గలదు. కాని భాషాసంబంధములను నిర్ణయించుటకు ముఖ్యాధారములు ఆయాభాషలందలి క్రియలు, ప్రత్యయములు, సంఖ్యానామములు, సర్వనామములును, నిత్యము ప్రతికుటుంబమందును వాడుకలో నుండు సులభ ప్రాతిపదికములును. ఇవి భాషకు మూలములు, ముఖ్యాధారములు నయి యున్నవి. వానిని పోల్చి చూచినయెడల ఆంధ్రమును, అరవము మొదలగునవియును నత్యంత సన్నిహితము లనియు, ఏకకుటుంబములోనివే యనియు స్పష్టము కాఁగలదు. ఈ సిద్ధాంతమును బట్టి ఆంధ్రభాషలోని సర్వనామములు, సంఖ్యానామములు, క్రియలు మొదలగువానిని ఆయా హిందీ మొదలగు ఆర్యభాషల శబ్దములతోను, సంస్కృతశబ్దములతోను పోల్చి చూచినయెడల నివి వేరువేరు కుటుంబములలోని వనియు, వానికి సన్నిహిత సంబంధము లేదనియు కనిపించును. అందువలన ఆంధ్రము ద్రావిడకుటుంబములోనిదే యనియు, ఆర్యభాషలలోనిది కాదనియు భాషాశాస్త్రజ్ఞులు నిర్ణయించియున్నారు. ద్రావిడభాషలన్నిటికి కాల్డ్వెలుగారిచేత నొకవ్యాకరణమును, భారతీయార్యభాషలన్నిటికి బీమ్సుగారిచేత నొక వ్యాకరణమును ఆంగ్లమున రచింపఁబడినవి. వానివలన భాషాకుటుంబనిర్ణయసూత్రములు, ఆంధ్రభాష ద్రావిడకుటుంబములోనుండి వచ్చినదని నిర్ణయించుటకు కారణములు స్పష్టము కాఁగలవు.

ఈసూత్రమునుబట్టి ఆంధ్రములో నుపయోగించు సంస్కృతశబ్దములు, తద్భవశబ్దములు కూడ అన్యభాషాపదములే యని నిర్ణయము కలుగును. అయినను లాక్షణికు లెవ్వరును అట్టిశబ్దములను, సమాసములను నిషేధింపలేదు. సరికదా, మన ఆంధ్రవాఙ్మయమునకు చిరకాలము సంస్కృతవాఙ్మయమే మాతృకగా నుండి ఆంధ్రభాషను, వాఙ్మయమును సంస్కృతమే చాల వృద్ధికిఁ దెచ్చినది. ప్రస్తుత మాంధ్రవాఙ్మయమున ౨/౩ వంతుకన్న హెచ్చుగా సంస్కృతశబ్దములు (తత్సమములు, తద్భవములు) కలవనుట అతిశయోక్తి కానేరదు. మరియు నిత్యకృత్యమునకూడ జనసామాన్యముచే సంస్కృతశబ్దములు విరివిగా వాడఁబడుచున్నవి. ప్రతిగ్రామమందును ఆంధ్రజనులు చదువు పత్రికలలోని వ్యాసము లన్నియు సంస్కృత శబ్దములతో నిండియున్నవి. అందువలన జనసామాన్యమున ముందుముందు సంస్కృతశబ్దముల యుపయోగ మింకను వృద్ధి కాఁగలదని తోఁచుచున్నది.

ఆవశ్యకములును, సులభములును అను సంస్కృతశబ్దములను తెలుఁగున వాడుట ఆంధ్రుల కెంతయు లాభకరముగనే యుండును. ఆంధ్రము భాషాశాస్త్రజ్ఞుల సిద్ధాంతమును బట్టి ప్రథమమున ద్రావిడకుటుంబములోనుండి వచ్చినదే యయినను, చిరకాలమునుండి దానిపైఁ గలిగిన సంస్కృతవాఙ్మయ ప్రభావమువలనను, సంస్కృతసంబంధము శబ్దములు ఆంధ్రమున విశేషముగా కలిసియుండుటవల్లను ఆంధ్రము సంస్కృతభవమే యని పండితులకుఁ గూడ సందేహము కలిగించు స్థితిలో నున్నది. మఱియు అరవము మొదలగు మిగిలిన ద్రావిడప్రాంతములకన్న మనకు మహారాష్ట్రము, ఓఢ్రము, మధ్యరాష్ట్రము, సంయుక్తరాష్ట్రము మొదలగు ఆర్యభాషిక ప్రాంతములు ఎక్కువ సమీపముగా నున్నవి. ఆప్రాంతములతో మనకు వ్యాపారాది సంబంధ మెక్కువ గలుగుచున్నది. మహారాష్ట్రము, హిందీ, ఓఢ్రము, బంగాళీ మొదలగు ఆర్యభాష లన్నియు సంస్కృతశబ్దమయము లని యందఱకును తెలిసినదే యున్నది. ఆంధ్రరాష్ట్ర మేర్పడినప్పుడు మనకు అరవభాషతో సంబంధము ఇంకను తగ్గును. మనహిందూదేశమంతటి మొత్తము జనసంఖ్యలో $\frac{3}{8}$ వంతుకన్న హెచ్చుమంది హిందీ, బంగాళీ మొదలగు ఆర్యభాషలు మాట్లాడువారే. ఈ భాషలవా రందఱు మామూలుసంస్కృతపదము లన్నిటిని వాడుదురు. అందువలన ఆంధ్రమున దేశ్యముల స్థానే సంస్కృతసంబంధములగు పదములు వ్యాపించుట వలన మనఆంధ్రమును ఆర్యభాషలవారును, హిందీ, బెంగాళీ మొదలగు ఆర్యభాషలను ఆంధ్రులును ఇంకను సులభముగ నేర్చుకొనఁ గలుగుదురు. ఈరెండుఫలితములును, అందు ముఖ్యముగా హిందీకిని ఆంధ్రమునకు సమీకరణము ప్రస్తుతపరిస్థితులలో మిక్కిలి వాంఛనీయములు.

మనదేశమునందు సామాన్య భాష యుండుట జాతీయదృష్టిచే చాల అవసర మనియు, అట్టిసామాన్య భాష యగుటకు హిందీభాషకే అర్హత కలిగి అందుకు ప్రజాభిప్రాయముకూడ అంగీకరించినందున హిందీని సామాన్యభాషగాఁ జేయుటకు దేశ మంతటను గట్టి ప్రయత్నము జరుగుచున్నదనియు అందఱకును తెలిసినదే యున్నది. హిందీకిని మనభాషకును సామీప్యము వృద్ధియగుటచే ఆంధ్రులు ఇంకను హిందీని నేర్చుకొనుట సులభమగును. హిందీ, బంగాళీ మొదలగు ఆర్యభాషలయందు చక్కని వాఙ్మయమును, వైజ్ఞానిక శబ్దములకు నిఘంటువులును ప్రత్యేకముగా నేర్పడి యున్నవి. అవి సాధారణముగా సంస్కృతభాషలోని శబ్దములు. ఆవైజ్ఞానికశబ్దములను అవసరము లయిన కొద్దిమార్పులతో ఆంధ్రభాషలోఁగూడ వాడుకొనుచుండిన మనకు ఆవైజ్ఞానికపదజాలము వృద్ధియగును. హిందీ, బంగాళీ, మహారాష్ట్రము మొదలగు భాషల గ్రంథములందును, ఆంధ్రమునను ఒకే వైజ్ఞానికపదజాల ముండుటచే భాషాంతరీకరణాదులకుఁ గూడ సౌకర్యము హెచ్చును.

ఈసందర్భమున నొకసంగతి గమనింపవలసి యున్నది. కొన్ని భాషలకు ఆంధ్రమునను, హిందీ మొదలగు ఆర్యభాషలందును సంస్కృతశబ్దములే వాడఁబడుచున్నను వాటిని హిందీ మొదలగు ఆర్యభాష లన్నిటిలో నొక అర్థమునను, ఆంధ్రమున వేరు అర్థమునను వాడఁబడుట సంభవించుచున్నది. కొన్ని ఉదాహరణములచే నాఅభిప్రాయము స్పష్టము కాఁగలదు. సంసారశబ్దమునకు తెనుఁగులో కుటుంబసంబంధమని యర్థము. హిందీలో సర్వప్రపంచ మని యర్థము. ఇట్లే—

1. ఆగ్రహ (హిందీలో అభినివేశము, తెనుఁగున క్రోధము అర్థములు)
2. ఉద్యోగ (హిం. పరిశ్రమ, (industry)— తె. నౌకరీ)
3. అవసర (హిం. సమయము – తె. జరూరు)
4. ఉపన్యాస (హిం. నవల – తె. వక్తృత)
5. సంగతి (హిం. కలయిక – తె. విషయము)
6. మర్యాదా (హిం. ఆదర్శ – తె. గౌరవము)
7. మందిర (హిం. దేవాలయము – తె. భవనము)

8. ఇతిహాస (హిం. చరిత్రము – తె. రామాయణ, భారత, భాగవతములు)
9. వ్యవసాయ (హిం. వ్యాపారము – తె. భూమి సాగు)
10. వ్యాఖ్యాన (హిం. ఉపన్యసించుట – తె. టీక)
11. మత (హిం. అభిప్రాయము – తె. ఆధ్యాత్మిక మగు నమ్మిక)
12. ధర్మ (హిం. మతము – తె. న్యాయము)

ఇత్యాదిసంస్కృతశబ్దములు హిందీలో నొకఅర్థమునను, ఆంధ్రమున వేరొకయర్థమునను ఉపయోగములలో నున్నట్లు కనఁబడుచున్నది. సంస్కృతములో సాధారణముగా నొక్కొక్కశబ్దమునకు చాల అర్థములుండును. అట్టిశబ్దములకు దేశభాషలందు వాడుకలో రూఢియగు నర్థ మొకటి కలుగుచుండును. 'అవసర' మొదలగు కొన్నిశబ్దములకు ఇప్పటి హిందీ మొదలగు భాషలలో నున్న యర్థమే తెలుఁగునఁ గూడ కొంత కాలమువఱకు ఉండినట్లు కనఁబడుచున్నది. ఒకే సంస్కృతశబ్దమునకు దేశభాషలలో సాధ్యమైనంతవఱకు ఒకే రూఢ్యర్థ ముండునట్లు వాడుట మంచిది. ఇదివఱలో కలిగిన భేదములు తగ్గునట్లును, ఇంకనుండి యిట్టిభేదములు కలుగకుండునట్లును ఉభయభాషలలో నన్య పదజాలములను ఆయాభాషలలోని గ్రంథలేఖకులు నియమముతో నుపయోగించుట యుచితముగా నుండును. ఈవిషయమున ఆయాభాషలందలి గ్రంథకర్తలే గాక ముఖ్యముగా పత్రికాసంపాదకులును, విలేఖకులును కూడ చాల సహాయము చేయఁగలుగుదురు. పత్రికలలో వాడు సాంకేతికపదములు, పారిభాషికపదములు కాలక్రమమున జనసామాన్యపు వాడుకలో వ్యాపించుచున్నవి. ఈపని ప్రత్యేక మొకభాషవారు గాక యితర భాషలవారికిఁ గూడ సంబంధించినది. అందువలన ఇంటుకు దేశమున కంతకు సంబంధించిన ప్రతినిధిసంస్థ యొకటి యేర్పడి అందుకు పూనుకొనవలెను. హిందీ ప్రాంతముల కన్నిటికి అఖిలభారత హిందీ సాహిత్యసమ్మేళనము ముఖ్య వాఙ్మయ సంస్థ యై హిందీ ప్రపంచమున చాల పలుకుబడి గలిగియున్నది. ఇట్లే బంగాళా ప్రాంతమున వంగీయసాహిత్యసమ్మేళనము ప్రధానసంస్థయై పనిచేయుచున్నది. ఇట్లే యితర ప్రాంతములకు సాహిత్యపరిషత్తులు గలవు. తమిళదేశమునందలి "తమిళసంఘము" చిరకాలము సంస్కృతశబ్దములను బహిష్కరించినను ఇటీవల ఆపట్టు వదలి సంస్కృతపదములు గూడ స్వీకరించుట కనుకూలముగా నున్నట్లు చెప్పఁబడుచున్నది. ఇవి గాక కలకత్తాలో నిఖిలభారతసంస్కృతి సాహిత్యపరిషత్తు గలదు. మన ఆంధ్రసాహిత్యపరిషత్తువారును, సాహితీసమితివారును ఇవి మొదలగు సంస్థలును ఆలోచించి పైని చెప్పిన యితరభాషల సంస్థలతో ఈ సంగతి చర్చించి ఒక్కొక్కభాషవారు ఒకరిద్దఱు చొప్పున ప్రతినిధుల నెన్నుకొని అఖిలభారత దేశీయ భాషాసంస్థ నొకదానిని నెలకొల్పినచో' ఆసంస్థ యీ సందర్భము లన్నియు ఆలోచించి యిదివఱ కాయాభాషలందున్న వైజ్ఞానిక నిఘంటువులు మొదలగు వాని సహాయముతో వైజ్ఞానిక పారిభాషిక సాంకేతికాది పదము లన్నిటికి దేశభాష లన్నిటియందు సామాన్యవ్యవహార ముండునట్లు అర్థము దెలియఁజేయుచు ఒకనిఘంటువును ఏర్పరుపవచ్చును. అట్లు చేసినచో దేశభాష లన్నిటికి చాల నుపయోగకరముగా నుండును. యూరపుఖండమందలి ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మను మొదలగు వేరువేరు దేశముల భాషలవారు వైజ్ఞానికవిషయములందు తమతమ భాష లన్నిటియందు నొకే పదములను ఒకే యర్థమున వాడుకొనుచున్నారు. అట్టిస్థితిలో నొకే దేశమం దుండు మనము మనదేశభాషలలో వీలగునంతవఱకు సామాన్య పదములను (సమానార్థమునచే) వాడుచుండుట చాల లాభకరముగా నుండును.

౮. సంస్కృతపదములే గాక హిందూస్థానీ భాషలో సర్వసామాన్యముగా వాడఁబడు మఱికొన్ని పదములు గూడ ఆంధ్రభాషలో వాడుకలో నున్నవి. ఈపదములలో కొన్ని ప్రాకృతమునుండి మార్పును చెందినవియు, కొన్ని అరబ్బీ, పారశీక భాషలలోనుండి గ్రహింపఁబడినవియు నై యున్నవి. ఏరీతిగా వచ్చినను అవి హిందీభాషలోను, ఉర్దులోను, మనదేశమందలి యితరార్యభాషలలోను సంభాషణలందును, గ్రంథ

ములయందును గూడ ధారాళముగా నుపయోగింపఁ బడుచున్నవి. ఉదాహరణముగా వీటిలో కొన్నిటిని ఈ క్రింద కనపర్చుచున్నాము.—

అజమాయిష్, అసల్, ఆసరా, కుండ, ఖద్దర్, ఖబర్దార్, ఖరార్, ఖరీద్, ఖర్చు, ఖాతా, ఖాళీ, ఖులాసా, గులామ్, జల్దీ, జబర్దస్తీ, జమీందార్, జవాబ్, జమా, జవాన్, జరూర్, జాగీర్దార్, జామీన్, టోపీ, డేరా, డోలీ, తబలా, తగాదా, తయార్, తహసీల్దార్, తాబేదార్, దఖల్, దర్బార్, దాఖల్, దివాన్, నకల్, నగద్, నమూనా, నమోద్, నామర్దా, నౌకరీ, పరదా, పసంద్, పహార్, పిచికారీ, పేచీ, ఫకీర్, ఫిర్యాదు, ఫయిసల్, బంద్, బుర్జ్, బైరాగీ, బేడీ, భర్తీ, మజా, మరమ్మత్, మంజూర్, రవానా, రజాయీ, రంగ్, రోడ్, లడాయి, లడ్డు, వసూల్, షరబత్, షికార్, సబబ్, సర్కార్, సలామ్, సర్దార్, సాకిన్, సౌదా, సామాన్, సాల్, సైతాన్, హుకుమ్.

ఇట్టిపదము లింకను చాలఁ గలవు. వీనిలో హలంతములకు ఆంధ్రాచారముప్రకారము చివర మాత్రము ఉకారమును చేర్చి ఉపయోగించుచున్నాము. మఱియు కదం, కవాయత్, ఖాతిర్, గంజా, చక్కర్, ఝుండా, దస్తఖత్, దాగ్, నక్కారా, పాయదా, బహదూర్, మదద్, ముద్దయి, రాస్తా, రుమాల్, సహనాయి, హైరాన్ మొదలగు పదములు గూడ నామమాత్రమగు మార్పుతో తెనుఁగులో ఆ యర్థమునందే వాడుచున్నాము. ఇట్టిశబ్దము లన్నియు మనభాషలో పరిపాటిలో నున్నవి. వాటిని వాఙ్మయములో నుపయోగించుటకు పండితులు అంగీకరించుట న్యాయ్యము. ఇట్టి పదములు చాలసులభములును, భాషలో స్వేచ్ఛగా వాడుచున్న వియును అయియున్నవి. పండితు లెంతనిషేధించినను గూడ ఇవి వాడుకలోనుండి పోవునట్లు కనపడదు. ఈపదములను ధారాళముగా నుపయోగించు హిందీభాషయొక్కయు, ఆ గ్రంథములయొక్కయు వ్యాప్తి మన ఆంధ్రదేశమున హెచ్చుచున్నది. మఱియు సుమారు డెబ్బదిలక్షలమంది ఆంధ్రులు నైజాము రాజ్యమున నున్నారు. అచ్చట హిందూస్థానీభాషా వ్యాప్తి పరిపాలకుల అభినివేశముచే దినదినమునకు హెచ్చుచున్నది. అచ్చటివారికి అచ్చతెనుఁగు, సంస్కృతపదములకన్న ఈపదములే యెక్కువ బాగుగా బోధపడును. వారితోను హిందీ, మహారాష్ట్రాది ప్రాంతములయందు కాఁపురముండు లక్షలకొలఁది ఆంధ్రులతోను సంసర్గము మనకు తప్పనందునను, ఆయా ప్రాంతములయందు వ్యాపారాదుల నిమిత్తము మనలో చాలమంది ప్రయాణములు చేయుచుండుటచేతను మనభాషలో నిట్టి హిందూస్థానీపదము లింకను హెచ్చును గాని తగ్గవు. వాటిని వాఙ్మయమునందుఁ గూడ విరివిగా నుపయోగించినయెడల ఆగ్రంథములు జనసామాన్యమునకు బాగుగా బోధపడుటయే కాక హిందీ మొదలగు ఆర్యభాషల పదజాలమునకును, ఆంధ్రభాషాపదజాలమునకును సామీప్యము వృద్ధియగును.

మఱియు పైని చెప్పిన కొన్ని సంస్కృతశబ్దములవలె కొన్ని హిందీశబ్దములు గూడ తెలుఁగులో వాడునపుడు అర్థములో స్వల్పభేదము కనఁబడుచున్నది 'రాజీ' అను శబ్దమునకు అర్థము హిందీలో అంగీకారము, తెనుఁగులో వివాదమునకు తరువాత సమీకరణము; 'బాకీ'— హిందీలో శేషము, తెలుఁగున ఋణము; 'సుమాన్'— హిందీలో అవమానము, తెనుగున కింవదంతి; 'కబూల్'- హిందీలో సమ్మతి, తెనుఁగున కదపా; 'తాణా'— హిందీలో పోలీసు కచ్చేరి, తెనుఁగున సాధారణముగా జమీందారీ ఆఫీసు; 'మతలబ్'- హిందీలో భావము, తెనుఁగున ప్రణాళిక; 'పుకార్'— హిందీలో పిలుపు, ఆంధ్రమున వదంతి. భాషలో కొన్ని శబ్దములకు మాత్రము ఇట్టిస్వల్పభేదము కలుగుట ఆశ్చర్యము గాదు. కాని యిట్టిపదముల విషయమై కూడ నేను సంస్కృతపదములకు సూచించిన రీతిని దేశీయసాహిత్యపరిషత్తు నియమితార్థముల నిర్ణయించితమ నిఘంటువులో నిబంధనలను ఏర్పరుపవచ్చును.

దేశీయభాష లన్నిటికిని కలిపి ఒక సాహిత్యపరిషత్తు ఏర్పడినయెడల పైని చెప్పిన విధముగానే గాక యింకను ఉపయోగకరములగు ఇతరపదములను గూడ ఆపరిషత్తు చేయవచ్చును. ఒక్కొక్క

భాషలలోని అమూల్యగ్రంథములను ఇతరభాషలలోనికి తర్జుమాచేయించుటకును, లిపిసమస్యను పరిష్కరించుట కును, వాఙ్మయమును ఇతరవిధముల వృద్ధిచేయుటకును, వివిధప్రాంతీయులకు సామరస్యము కల్గించుటకును వారు చాల సాహాయ్యము కలుగచేయవచ్చును. కనుక ఆంధ్రదేశపు భాషాభిమానులును, భాషాసంస్థలును మన దేశమందలి యితరభాషల సంస్థలతోను, భాషాభిమా నులతోను చర్చించి అట్టిదేశభాషాసంస్థను నెలకొల్పు టకు అనుకూల్యమును కలిగింపఁ గోరెదను.



ఏరుదాటు

(Wood-cut చిత్రము)

చిత్రకారుడు: టి. కేశవరావుగారు.

ఇటీవల చెన్నపురిలో జరిగిన లలితకళాప్రదర్శనమున నీ చిత్రమునకు 50 రూ. ల బహుమతి లభించినది.

"రాధికాసాంత్వనము"–పరిశీలన

కర్లపాలెం కృష్ణరావుగారు

శృంగారప్రబంధాలు చదవకూడదనేవారు కొందరున్నారుగాని వాటిలోగూడ చదువదగిన గ్రంథాలు కొన్ని వున్నాయి. ఏదైనా చదవండి, మంచిచెడ్డ లెలా తెలుస్తవి? శృంగారప్రబంధాలు చదివినంత మాత్రాన యువకులు చెడిపోతారనడం సమంజసంగాదు. చదువకుండా వున్నవారిలో తప్పుదారులు త్రొక్కినవారు నూటికి తొంభైమంది ఉన్నారు. నేటికాలపు ప్రణయగీతాల్లో చాలాభాగం రాధపరంగా వ్రాయబడినవి. ఇప్పటి తెలుగుభాషలో ఈదేవి కొక బంగారుగద్దె నిర్మించారు. రాగవతులలో అగ్రస్థానం రాధకే యిచ్చారు.

ముద్దుపళనిచే రచియింపబడిన రాధికాసాంత్వనము శృంగారరసప్రధానమగు పద్యకావ్యం. ఈగ్రంథం లభించడమే యీరోజుల్లో కష్టంగాఉంది. కారణం అందరికి తెలిసిందే. బహుప్రయాసతో దీన్ని సంపాదించి చదవడం తటస్థించింది నాకు. గ్రంథం చదువుతుంటే, విషయాలన్ని నే ననుభవిస్తున్నట్టే వుంది. స్వల్పలోపా లున్నా మొత్తముమీద గ్రంథం చాలాబాగుంది. ఇట్టి గ్రంథాలు చదువరాదని పలుమారు చెబుతూవుండే ఛాందసుల మీద నా కొకవిధమైన జాలి గలిగింది.

శ్రీకృష్ణునికి రాధ ప్రేమలాంఛనంగా ఒక కానుకను సమర్పిస్తుంది. అలాంటి కానుక ఎవరు ఇవ్వరు, ఇవ్వడానికి సమ్మతింపరు? కృష్ణునిమీద రాధకు గల ప్రేమానురాగములు, భక్తిశ్రద్ధలు వర్ణనాతీతములని, ఆదర్శప్రాయములని చెప్పడానికి యీకానుకే సాక్షి. తన మనోహరునికి తనయందు ప్రేమ యగ్గలమగుటకుగాను అతని కేది ప్రియతమమో, దానినే సమర్పించుటకు సంకల్పించింది, ముందువెనుక లాలోచించకుండా. ముద్దులుమూటగట్టు 'ఇళ' యను నొక మోహనాంగిని పెంచి, పెద్దదానినిజేసి, నీతులు నేర్పి, కృష్ణునికి సమర్పించి "జాగ్రత్తగ వాడుకొనవలసిన''దని మనవిచేసుకొంటుంది. రాధ అమాయికురాలుగాకున్న యిలా చేస్తుందా? ఏకారణంచేతనైనా, ఎట్టి క్లిష్టపరిస్థితులలోనైనా యీపని చేయుటకు స్త్రీ సమ్మతిస్తుందా?

రాధ తన శయనమందిరంలో చేరి చేసినపనికి పరితపిస్తుంది. అప్పుడు అన్ని ఆలోచనలు వాటంతట అవే ఉదయిస్తయి.

"సొమ్ము లియ్యవచ్చు సొమ్మంద మీవచ్చు
ఇయ్యరాని ప్రాణ మీయవచ్చు
తనదు విభుని వేరెతరుణిచేతికి నిచ్చి
తాళవశమె యెట్టిదానికైన?"

అని అనుకొంటుంది. అనాలోచితంగా సంచరించే స్త్రీల చిత్తవృత్తి యీసందర్భంలో

చక్కగా చూపబడ్డది. ఇంత పరితపించినగూడా తర్వాత కృష్ణునియొక్క ఒక్క గాఢాలింగనంతో యివన్ని మరచిపోతుంది. పాపము, కుడుము చేతికిస్తే పండుగనుకొనే పిచ్చిది రాధ.

కొన్నాళ్లకు, ఇళాదేవితో సుఖిస్తూ కృష్ణుడు దూరమవుతాడు. రాధ మళ్లీ ప్రేమపు ప్రారంభిస్తుంది; తన్నుదాను తిట్టుకొంటుంది; ఆహారవిహారములయందు శ్రద్ధ తప్పిపోయి పిచ్చిదానివలె సంచరిస్తుంది; కృష్ణునికి సందేశ మంపుతుంది; ఎట్టకేలకు తన జీవితేశుని సంపాదించుకొంటుంది. ఈ గ్రంథమందలి కథ యిది.

గ్రంథకర్త్రి యీ గ్రంథాన్ని చక్కగా నిర్మించింది. రాధయొక్క గొప్పతనము, త్యాగబుద్ధి, రసికత చక్కగా వర్ణింపబడ్డవి. తన తెలివితేటలతో ముగ్ధయగు ఇళను అచిరకాలంలో రాధ ప్రౌఢనుజేస్తుంది. కవిత్వం జాతీయంగా, మృదుమధురమగు శైలిలో మహారసవంతంగా ఉంది. మదధార, సుఖరసము, ఆటది, వలపుల దొరసాని, ఎదురుమ్రొలలు, దీవెనపీడెము, జిలుగుబిట్టలు - ఇత్యాది పదము లెన్నో సొంపుగా కూర్చబడ్డయి. సామెతలు, లోకోక్తులు పద్యములం దిమడ్చబడి, వింతయందాన్ని దాల్చింది. మచ్చునకు కొన్ని చూపిస్తాను—

౧. "అల్పునకు కల్మి వచ్చిన నర్ధరాత్రి
గొడుగు దెమ్మన్న కథగాను కోమలాంగి"

౨. "కొన్నంగడిలో పలసే
యన్నవలామారుబేరమునునే చెలియా,"

౩. "అత్తమీద కన్నులు, అంగటిపై చేతులు"

౪. "ఎల్లవారికి శకునంబు లెల్లబలికి
బల్లి తా బోయి తొట్టిలో బడినరీతి"

౫. "పేగులోని తీటవిధ మాయె."

ఈ గ్రంథకర్త్రి మగవారి బుద్ధి యిట్టిదని రాధచేత చెప్పించిన పద్యం చూడండి—

"కలలోనైన నమ బాయక
కలకాలము నన్ను విభుడె కనుగాయకునై
పలుచనజేసె నటన్నక్
చెలియా, మగవారి వలపు చెడ్డదిసుమ్మీ!"

సాధారణంగా అన్ని శృంగారప్రబంధాలలోను ఉన్న అసహజాలు ఈ గ్రంథంలోగూడ ఉన్నయి. కాని దోషములకంటె గుణములే యెక్కువని చెప్పవచ్చు. ఇప్పటి సినిమా ప్లాటులవలె పూర్వపు శృంగారప్రబంధాలన్నీ ఒకదాన్ని ఒకటి అనుసరించినవి. అట్టి పద్యకావ్యాలన్నిటిలోను రాధికాసాంత్వనము ఏవిషయంలోను తీసిపోదనరేకదా, మీదుమిక్కిలి చదవదగ్గ గ్రంథమనికూడా చెప్పవచ్చు. గ్రంథకర్త్రి రసపోషణకు దిగి భావగాంభీర్యమును లోపింపజేసినా అన్ని ప్రబంధాలలోవలె పాతపాటలు, రోతమాటలు గాకుండా శైలి మంచిపాకంలో ఉంది. మచ్చునకు రెండుపద్యాలు చూపి యీ వ్యాసాన్ని ముగిస్తాను—

"వలచినవారు లేరో? యెడ
బాసినవారలు లేరో? వారలీ

యలమట లందిరే? మిగుల
    నందియు నావలె జీవయుక్తులై
నిలిచిరె? యేటిమాట లవి,
    చేరక నాడితి ధూమమండగా
కలిగెను శౌరితో చెలిమి
    కామిని, గంధగజేంద్రగామినీ!"

"కాలివాల్ పిట్టల కలకలంబులు మీరె
    పగడకన్నుల రొజ్జ బయలు జేర,
నెలరాజు పశ్చిమాచలరాజమును జేర
    బలుచంద్రకాంతపు శిలలు పేర,
తారకాగణముల తళుకులెల్లెడ జారె
    దీపంబు లెల్లను తెల్లబారె,
పవనుడు రేయెల్ల పనిజేసి వేసారె
    ధర వియోగుల పరితాప మారె,
తమ్ము లలరారె, కలువల తావుదీరె,
కోకములు తేరెను, చకోరకులము తారె,
నిమగు గడితేరె, నిశులు మెయిండ్లుమారె,
తెలివి చేకూరె, బల్లున తెల్లవారె."

తెలుగువారిలో ఇట్టికావ్యాలు నిర్మించే స్త్రీ లున్నారని మనం గర్వపడాలి.



సంతకు

(Wood-cut చిత్రము)

చిత్రకారుడు: టి. కేశవరావుగారు.

ఇటీవల చెన్నపురిలో జరిగిన లలితకళాప్రదర్శనేమువారి మెప్పునుగన్నది.

శబరి

మల్లాది రామకృష్ణశాస్త్రిగారు

(చింతా దీక్షితులుగారు, వరూధిని కావ్యావళి, తెనాలి, ౧-౫౦.)

హనుమంతుడు తరతరాలనుంచీ తెలుగు వారి యిష్టదైవము: పారిజాత తరుమూలవాసియైన ఆపవమానసనందనుణ్ణి.. శాకినీ గణాల్ని తరిమివేయమనో, సంతానావాప్తి నొనగూర్చమనో, ఎప్పుడూ ఎవరో ఒకరు పనికల్పిస్తూనేఉంటారు: పట్టుమని పదిగడియలు ఏకాంతంగా ఉండి రామనామాన్ని జపించడానికైనా తీరికలేకుండా ఉంది ఆనిత్యబ్రహ్మచారికి. 'ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబకమ్' అన్నట్లు సంసారతాపత్రయము తనకు లేకపోయినా, లోకంలో గొడవలతో అతనికి క్షణం తీరిక ఉండదు: రామబంటుగానూ, మెదిలితే రాక్షసులను తన్ని తగిలివేసే వస్తాదుగానూతప్ప హనుమంతునిగూర్చిన వేరువిషయాలు వాల్మీకికూడా వ్రాయలేదు: దీక్షితులుగారి శబరి చదివినప్పుడు, హనుమంతుడికి, రామభక్తికైపు లేకపోతే మామూలుగా అందరితోబాటు సంసారిఅయి, వంశాభివృద్ధి చేసుకునేవాడేమోనన్న సూచనలు కనబడుతున్నవి. ఇ్రరి చాలాఅల్లరిపిల్ల-కాని ధర్మపత్నికి కావలసిన గుణాలన్నీ ఆఅమ్మాయిలో పొటకరిస్తూన్నాయి: రామ అనే రెండక్షరాలతో పంజరం నిర్మించుకుని బంధితుడిలాగా కాలంగడపబోయే అంజనాతనయుడికి, లోకతత్త్వం చూచాయగానైనా తెలియచెప్పింది ఆపిల్లే- లేకపోతే, అనర్ఘమణిహారం చేతికిస్తే అందులో రామనామం లేదని ఆవలికి విసిరివేసే అలౌక్యుడికి, రాముడి విషాదవిప్రలంభం అర్థంచేసుకుని అనుతాపపడగల తాహాతు ఎక్కడనుంచి వచ్చిందీ? అదంతా ఆసవరపిల్ల చలువ: దీక్షితులుగారు చాలా చక్కగా చిత్రించి, అంతకన్నా ఎక్కువ మనోహరంగా ప్రదర్శించారు ఆరెండు మూర్తులనూ.

చాతకముని, ఒట్టి ఉత్సవవిగ్రహము: సంసారంసంగతి పుస్తకాల్లోనైనా చదువుకోకుండానే, సన్యసించడానికి తలపడి, జడలు పెరగడంచేత మునిగామారిన సాధకుడు: మతంగుడు దివ్యులలో కలిసిపోయినతరువాత, ఆశ్రమవాటికఅంతా..శూన్యంగాఉండకుండా.. ఉబుసుపోవడానికి, నాటకం నడవడానికీ, అవతరించిన-కల్పింపబడిన 'కాబోయేముని' చాతకుడు: తనవేసం చూసి, తనలోతానే నవ్వుకునే స్వభావం ఉన్నట్లు గోచరించే అమాయకుడు: నాటకానికి, పావురములు తోడ్పడినంతవట్టుకైనా సాహాయ్యకారి కాలేకపోయినాడు: కాని చాలాతమాషా ముని:

శబరి, ఎంతో ఆదుర్దాతో, రాముడు ఎప్పుడు వస్తాడాఅని ఎదురుచూస్తూంటే, చూసేవాళ్లకు..ఉహుం-నాటకం చదివేవాళ్ల

కు-ఆతడు సీతావియోగదుఃఖితుడని తెలిసినా కూడా.. ఎందుకు అంతఆలస్యం చేస్తున్నాడని కోపం వస్తుంది.. శబరిభక్తి అప్రతిమానము.. వైష్ణవజనసహజమైన, సామాన్యప్రతిపత్తివిశేషం తనయిష్టదైవంఎడల వెలయించి, ఆదరించింది, రామాయణానికంతటికీ ఆమె ఒకతయే: సీతాన్వేషణానికి బయలుదేరిన వానరులకు దోవలో హేమ చేసినవిందు శబరి ఆదరణకు సాటిరాదు: రాముడు ఎప్పుడు వస్తాడోఅని ఎంత ఎదురుచూసింది!—ఎంత ఆదుర్దా.. ఉబలాటపడ్డసీ.. చివరకు ఆతడు సాక్షాత్కరించినప్పుడు, అపారవశ్యముద్రను వీడకుండానే, ఆదిత్యలోకాన్ని అనుసరించి.. అతిక్రమించిపోయింది.. శబరిస్వభావాన్ని నిరూపించడంలో.. ఆయమభక్తినీ, పారతంత్ర్యాన్నీ చిత్రించడంలో చాలానైపుణ్యం కనబరిచారు దీక్షితులుగారు.. ఇంత సర్వతోముఖసామర్థ్యంతో పాత్రకల్పనమూ, పరిపోషణమూ పెంపొందింపబడిన నాటకాలు.. నవీనులు రచియించినవానిలో రెండోమూడో ఒకవేళ ఉండటం తటస్థించినా, వాని అన్నిటికీ నాయకమణిగా .. 'శబరి' నే నిరూపించవలసివస్తుంది.. దీక్షితులుగారి రచనలన్నిటిలోనూ సర్వోత్కృష్టమైనది.

శబరి, తాను ఎంగిలిచేసిన పళ్లు రఘూత్తమునికి ఆరగింపజెట్టినదని అపవాదుగా భావించి.. దీక్షితులుగారు.. ఔచిత్యంకోసం కాబోలును.. ఆశ్రమకీరాలచేతనే ఫలసమార్జనము చేయించారు.

పండూ ఫలమూ తిని, పండీయుందామంటే
　　పక్షిజాతుల ఎంగిలీ..
వెలయ జలము తెచ్చి కడిగివేతామంటే
　　జలధీమత్స్యము లెంగిలీ..

.. .. ..

ఎంగిలన్నవారు అజ్ఞానులౌ తేను
　　జగమంతా ఎవరెంగిలీ!

అన్న వేదాంతతత్త్వార్థానుగుణ్యంగా శబరి చేతనే ఎంగిలిచేయించి, ఆమె రుచిచూసి, సరిగా ఉన్నవని తలచినపిమ్మటనే రామునకాఫలమూలాదికంబుల నారగింప బెడితే సంప్రదాయానుగుణ్యంగా ఉండేదేమో?— అయినా ఈమార్పుకూడా మనోహరంగానే ఉన్నదనవచ్చును:

నాటకాన్నంతా ఆవరించియుండే మనోహరభావప్రాబల్యానికి ప్రచురణాంగముగా.. దీక్షితులుగారికి భాషమీద ఉండే అధికారం తోడ్పడుతూన్నది: 'వింతభావావ్యాదకడానికి' వింతరచనలు సల్పడానికీ, నవీనులందరిలోకీ జయవీరుడు ఆయన ఒక్కడేనన్నది దీక్షితులుగారు శబరిమూలంగా సార్థకపరచుకున్నారు

రలయతి

నూరిగుచ్చి రామమూర్తిగారు

అప్పకవి తృతీయాశ్వాసమందు యతిప్రసంగవశమున 'అగ్రాహ్యవిరామములు' అను శీర్షికక్రిందఁ గొన్ని పద్యములు కవిజనాశ్రయములోనివని యుదాహరించి వాని గ్రాహ్యతాగ్రాహ్యతలఁగూర్చి చర్చించియున్నాఁడు. ఈ పద్యములు వికటకవికల్పితంబులని యప్పకవి యాశయము. అట్లు గానిచో సిద్ధశలాక్షణిక విరుద్ధలక్షణములు భీమన చెప్పియుండఁడని యాతని యభిప్రాయము.

అందు 'అగ్రాహ్యభేదవర్గయతులు' అనునవి చెప్పుసందర్భమున రెండు పద్యములు చెప్పెను. ఇందులో రెండవది—

" భరితభువనార్ణవంబుతో వ్రంత సరియె
రమ్యమణిరాజరాజుతో లక్క సరియె
లలితవీణారవంబుతో థక్క సరియె
యనఁగఁజెల్లు నభేదాఖ్య నమరు వళ్లు.''
(అప్పకవీయము, 3 ఆ. ప. ౨౬౦)

"ఈమూఁటిలోపలను భ ర రవ కారములకు నభేదవర్గవిరతి గనుక ప్రయోగింపవచ్చును. లవర్ణ థవర్ణములకు నభేదవర్గవిరతులును గావు. కనుక ప్రయోగింప రాదు. రేఫమునకు లకారమునకు గ్రాహ్యంబుగాదు.'' (3. ౨౬౧) అను పైపద్యమును వచనమును వివరించి గ్రాహ్యతాగ్రాహ్యతల నిర్ణయించెను. ప్రస్తుతమిందలి రలయతినిఁగూర్చి విమర్శింతము.

ప్రాచీనకాలమునుండియు రేఫలకారములకు విరతిఁ గూర్చు విషయమున భిన్నమతము లున్నవని పైవిషయమునుబట్టి మనకుఁ దెలియుచున్నది. శ్రీనాథాది ప్రామాణికకవులు గొంద ఱీరలయతినిఁ బ్రయోగించిరి, ఈ ప్రయోగములఁ గొన్ని లక్షణవిలాసమువారు చూపియుండిరి.

"కైలాటరాయ యభినవ
లీలామకరాంకచంద్రరేఖాంకురచూ
డాలంకారపదాంబురు
హాలింగితసుఖితనిర్మలాంతఃకరణా."
—శృంగారనైషధము, ౧. ౧౧౦.

"దానవసుందరు లత్తఱి
జానకి నందలముమీఁద సమ్మద మొదవం
గా నిలుప శారదాభ్రవి
లీనత నేపారు చంద్రరేఖయపోలెన్."
—రామాయణము, ౨౩౨౩.

వీనికి నప్పకవి లక్షణవిలాసమువారికిః దెలియదని యాక్షేపించుచు, "సంస్కృతమునందు రేఖాలేఖాశబ్దములు రెండును గలవు గనుక పద్యములందుఁ జెప్పిన రేఖాశబ్దము మొదలఁ దృతీయాంతస్థమని యెఱుంగునది" (అప్ప. 3. ౨౬౪) అని వ్రాసెను. ఇట్లప్పకవి చెప్పుట కాధార మెద్దియుఁ గాన్పింపదు. రూపాంతరముండుటఁ జేసి తృతీయాంతస్థ మాదిఁగల్గు రూపమే యని చెప్పి స్వమతమును సాధించు

టయే ప్రయోజనము గాని మఱియొంకు గాదని పైయంశమునుబట్టి మనము గ్రహింపవచ్చును. మఱియు—

ద్వి. "చీఁకటి విరియించుఁ జిఱునవ్వుపసిఁడి
రేకులతో నెదిర్రించు చెక్కులును

కొందఱు 'రేకులతో మురాళించు చెక్కులును' అని చదువుదురు. అది వ్రాతతప్పు గాని కవిహృదయము గాదు " అని హరిశ్చంద్రునికథయందలి ద్విపద నొకదాని నిచ్చి, "ఎదిరించు, మురాళించు"అనువానిలోఁ బ్రథమ పాఠమే కవిహృదయమని తెలియఁజేసెను. మఱియు వసుచరిత్రమందలి

"ఓ లంబాలక……………………
లోలంబాలక యోర్తు గ్రుంకిబిసవల్లుల్ దున్మి…"

—వసుచరిత్రము, ౩. ౧౬౨.

ఈపద్య మిచ్చి, "యీపద్యము రెండవచరణమున లోలంబాలక గ్రుంకి యని కవిహృదయము. ఇది గానక కొందఱు 'ఇందిందిర శ్చంచరీకో రోలంబో బంభరోఽపిచ' అని నిఘంటు వున్నదని రోలంబాలకయని చదువుదురు. అట్లని రామరాజభూషణుతలంపు గాదు." (అప్ప. ౩. ౨౭౮.) అని వివరించెను. ఈ పై యంశములఁబట్టి రేఫలకారములకు విశ్రాంతి లేదని చెప్పుటలో నప్పకవి కెంత పట్టుదల కలదో మనకు స్పష్టపడుచున్నది.

ఇట్టి పట్టుదల యప్పకవి కుండుటలో హేతువు దురూహ్యము. కాని రేఫలకారములకు మైత్రిఁ గూర్చువిషయమునఁ గొన్ని యుపపత్తులు మనకుఁ గాన్పించుచున్నవి. సామాన్యముగఁ బ్రాచీనకవులు యతివిషయమున వర్ణములకుఁ బరస్పరస్థానప్రయత్నసామ్యము నాధారముగఁ జేసికొని మైత్రిని నిర్ణయించిరని చెప్పవచ్చును. అట్లగుట రేఫ లకారము లేక స్థానజములే గదా. మఱియుఁ గొన్ని దకారము గల "ఎద, దొంగ, దిగి, దొప్ప"యీ మొదలగుపదములందలి దకారమున కాదేశముగ వచ్చునట్లు, "ఎడ, డొంగ, డిగి, డొప్ప" యీ మొదలగు పదములందలి డకారమున కాదేశ యతిగ దకారడకారములును మైత్రి గూర్పవచ్చునని యప్పకవి సూచించిన యంశమేగదా. అట్టియెడ లకారమునకు రేఫ యాదేశముగఁ బ్రాకృతాదిభాషలయందును వచ్చుట మన మెఱిఁగియే యున్నాము. ఆంధ్రవ్యాకరణకర్తలుకూడ బహువచనమందలి లు, ల లకు రు, ర లాదేశముగ వచ్చుటను జెప్పుట కూడ మనకుఁ దెలిసియే యున్నది.

౧. ప్రాకృతమున హేమసూత్రమగు "రసోర్లశౌ" (౮. ౪. ౨౮౦) అను దానిచే "రాజా—లాఆ, పురుషః—పులిశే, పరిచయః—పలిచయే"—ఈరూపము లగుచున్నవి. పైనుదాహరింపఁబడిన 'రాజా' మొదలగు వానియందు లకార మాదేశమై 'లా ఆ' అను మొదలగు రూపము లగుట మనకుఁ గాన్పించెడి.

౨. ఆంధ్రవ్యాకరణములందును బహువచనమందు 'లు, ల' లకు

"లాన్తాత్తు రుశా తయోః క్రమేణ స్తః"
(ఆంధ్రశబ్దచింతామణి, అజన్త పరిచ్ఛేదము, ౧౫ సూ.)

అని రు, ర లాదేశముగ వచ్చెడి 'బాలురు, బాలుర్ల' అను రూపములును, ద్విత్వయుక్త లాంతంబుమీఁది లు, ల లకు రు, ర లాదేశముగ 'మల్లురు, మల్లుర్ల' మొదలగు రూపములును సాధింపఁబడియున్నవి. ఈపైవానినిబట్టి రేఫలకారముల కెట్టి సంబంధము కలదో, దానిని బుచ్చుకొని మైత్రి సలుపుటలో నెంత వఱకుపపత్తి కలదో గ్రహింపవచ్చును.

"రాయంచ కాళ్ల దాలకయమున్న"
—వసు. ౪. ౨౫.

ర ల లకు విరతి ప్రయోగించిన యీ పద్య మొకటి వసుచరిత్రమునఁ గాన్పించెడు. ఇయ్యది యప్పకవిదృష్టము గాదని మన మూహింపవచ్చును. అట్లు గానిచో నీదృశ రేఫ లకారవిశ్రమము స్వమతానుగుణ్యముగనే చేయువాఁడనుట యనాలోచితోక్తి గాదు. అహోబలపండితుఁ డీపద్యపాదమందలి ర, ల ల మైత్రిని గూర్చి విమర్శించుచు "రలయో ర్లడయోః.........................స్యాదభేదః. ఏవంస్థితే అప్పకవినా యదుక్తం యత్తు రలయో ర్మైత్రతాస్తీతి లాక్షణికానా ముక్తి ర్నప్రామాణికీతి లీలామకరాంకచంద్రరేఖాం కురచూడాలంకారపదాంబురుహాలింగిత మహీతసిర్మలాంతఃకరణేత్యాదా రేఖాశబ్దస్య లాదిత్వమపి నైఘంటికై రుక్తత్వాన్న రేఫాదిత్వమితి త దవిచారితాభిధానమేవేతి స్పష్టమేవ. ఏతేన 'రాయంచకాళ్ల దాలకయమున్న' ఇత్యాది కవిప్రయోగాణాం నకించిద ప్యసామంజస్య మితి ధ్యేయమ్."

"కలహంసకాళ్ల దవులకమున్న" అని మఱి యొండు పాఠము దీనికిఁ గాన్పించుచున్నది.

"లీలాహాస్యకళాప్రసంగములనుల్లేకించి"-
—కాశీఖండము ౬. ౨౦.


దీనికి 'లీలాహాస్యకళాప్రసంగముల నుల్లేఖించి' అనియుఁ గలదు. ఇట్టియెడ ర, ల లకు యతి ప్రాచీనకవిసమ్మతమని యే చెప్పనొప్పును. కాని యేలాక్షణికున కాలాక్షణికుఁడు స్వమతమున కనుకూలమగునట్లు ప్రయోగముల దిద్దుచువచ్చిరి. ఇట్టిప్రయోగబాహుళ్యము లున్న కతనఁ గవిసమ్మత మిదియని నిర్ణయించుటకు వీలు లేకున్నది. కాని రేఫలకారములకు యతి వేయుట సమంజసమగునా, కాదా? అని చర్చించినచోఁ బైనఁ దెలుపఁబడిన యుపపత్తులఁ బురస్కరించుకొని రలయతి నంగీకరించుట సోపపత్తికముగ నున్నదని తోఁచెడిని.

మహాత్ముని ఉపవాస చిత్రములు




౧. గాంధిమహాత్ముడు

'ఉపవాసకాలమధ్యమున'



౨. శ్రీ థాకర్సే సతీగారు

'పర్ణకుటి' యజమానురాలు.



3. 'పర్ణకుటి'
మహాత్ము డుపవసించిన భవనము.

దశరథుఁడు సత్యవాదియగునా!

శ్రీ తి. వ. నారాయణస్వామిగారు రచియించిన 'దశరథుఁడు సత్యవాది యగునా' అను పేరుగల వ్యాస మొకటి ఆంగీరస సం. ఆశ్వయుజమాసపు భారతియందు ప్రకటిత మయినది. అందలి వస్తువు దానిపేరువలననే తెలియవచ్చుచున్నది. నారాయణస్వామిగారికి రామాయణమున వివరింపబడిన విషయములను మున్నిడికొనియె 'దశరథుఁడు చలచిత్తుఁడనియు, కామవశుఁడనియు, నసత్యవాదియనియు సందేహింపవలసివచ్చినది.' ఆవ్యాసమును ఖండించుచు (౧) శ్రీ కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు, (౨) శ్రీ దర్భా కృష్ణమూర్తి శాస్త్రిగారు, (3) శ్రీ ఇంకొలను సీతారామ శాస్త్రిగారు వ్యాసములను వ్రాసినారు. మూఁడును ఖండనరూపములేయయ్యును అవి వెవ్వేరుమార్గముల ప్రవర్తిల్లినవి. యథామాత్రుకముగ వానిని ప్రకటించిన గ్రంథ మపరిమితముగ పెరుగును. కావున వానియందలి సారాంశములు క్రమముగా నీదిగువ పేర్కొనబడుచున్నవి:

౧. శ్రీ కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారి వ్యాసము 'దశరథుఁడు సత్యవాదియే' అను శీర్షికగలది. దానియందలి యంశములు :

దశరథుఁడు దుశ్శకునములను పరికించి తనకు మృత్యువు సన్నిహితమని యూహించి శ్రీరామపట్టాభిషేకమునకు గడఁగినాఁడు. మోసముచేయు తలఁపుగలవాఁడు ప్రజల నందరిని సభకూర్చి వారికి తాను తలపెట్టిన పట్టాభిషేకవృత్తాంతమును చెప్పఁడు; రహస్యముగా సాగించును. తన ప్రయత్నమున కాటంకము చేయు ప్రజలు తనరాజ్యమున లేరు కావున ప్రజలను కట్టుకొను తలంపును దశరథునకు బనిలేదు. దశరథుఁడు కైకేయిని మోసపుచ్చఁ దలంచినచో నామెకు పట్టాభిషేకవార్తయే తెలిపియుండఁడు; ఆమెను సరకుపెట్టియే యుండఁడు. కైకకు రామునియెడలగల గౌరవానురాగములు బాగుగా తెలిసినవాఁడు కావున నతనికి పట్టముగట్టువార్త ఆహ్లాదజనకమగునని ఆమెకు తెలిపినాఁడు. కైక రామపట్టాభిషేకము భంగముచేయబూనినపుడు వెంటనే యామెను కారాగారమునకు బంపియుండును కాని కాళ్లపైబడి బ్రతిమాలఁడు. కైకకు వరముల నెగవెట్టలేఁడు. శ్రీరాముని వియోగజాలక యామెను దీనాతిదీనుఁడయి వేఁడుకొనినాఁడు, వేరువరమును కోరుకొమ్మని. కైకను పెండ్లియాడుటకు ఆమెతండ్రితో చేసిన శపథముమాట మరచిపోయినాఁడు, దశరథుఁడు. పుత్రవియోగమునకు పరితపించుచు మృతినొందవలసిన మునిశాప మందుకు కారణము. కైకవివాహమునాటి ప్రతిజ్ఞ మామయల్లుండ్రమాత్ర మెరిగినది; లోకవిదితము కాదు. అటులేని కైకను పెంచి పెద్దచేసి కూడవచ్చిన అంతఃపురదాసి మంథరకు తెలిసియుండకపోదు. అపుడు మంథర కైక కావిధమున స్వార్థలాభమును బడయ బోధించియుండునుగాని, వరములమాట యెత్తియుండదు. కావున కేకయదశరథుల కట్టి యొడంబడిక జరుగనే లేదనుట యథార్థము. ఈవిషయమును తెలిసినవాఁడు రాము డొక్కఁడే. అతఁడును తన్ను దోడ్కొనిపోవుటకయి వచ్చిన భరతున కావిషయము చెప్పినవాఁడు కాని లక్ష్మణునికి, కుపితుఁడయి తల్లిని, దండ్రిని దూషించుచున్నపుడుగూడ చెప్పినవాఁడు కాఁడు. కైకకిచ్చిన వరములను పాలించి సత్యసంధతను నిలుపుకొను

టకే పంపినా డనివాదు, భరతునితోనైన. ఆతడెంతకు తన్ను విడిచి మరలిపోవడని తలంచిచెప్పిన లౌకికోక్తి యది. లౌకికనైపుణ్యముగను కాని యట్లు చెప్పుట మోసముకాదు. ఇంకొకమారును రాము డిట్లే చేసినాడు- రాముని రథముపై నెక్కించుకొని అడవులకు గొనిపోవుచుండగా దశరథుడు సుమంత్రుని రథము నిలుపగోరినాడు. రాముడు వలదని వారించినాడు; మీ కేక నాకు వినరాలేదని దశరథునితో చెప్పుమన్నాడు. పిల్లలు పట్టుపట్టినపుడు పండ్లిత్తుమనియు, నగలు చేయింతు మనియు కల్లలాడు తల్లులవంటివాడే రాముడు. కైకేయీదశరథసంవాదఘట్ట మంతయు దశరథుని సత్యసంధతను దృఢపరుచును. కైక తనమాటను వినలేదు. అపుడు తూలినాడు రామునికి వాగ్దత్తమయిన రాజ్యమును మరల యాచించినాడు.

దశరథుడు రాముని పట్టాభిషేకమున కుపవాసము చేయింప వసిష్ఠుని పంపినాడు. కేకయదశరథుల యొడంబడిక నిజమయినచో వసిష్ఠభగవాను డూరకయుండునా ? దశరథుని హెచ్చరింపడా ?

విశ్వామిత్రునివెంట రాముని పంప వెనుదీయుచుండ మున్ను కోరినదెల్ల నిత్తునని పలికి, ఇపుడు ఇట్లు వెనుకాడుట సత్యరతుడవగు నీకు తగదని వసిష్ఠుడు మందలించియుండ లేదా ! కాబట్టి దశరథశపథవార్త కల్పితమని తోచుచున్నది. ఇట్లు సత్యసంరక్షణార్థము ప్రాణములను కోలుపోయిన దశరథుడు అసత్యవాది కాజాలడు.

స్వామిగారి చూపినరీతిని సత్యనిర్ణయము చేయబూనినచో రామాయణవర్ణితవ్యక్తులెల్ల మోసగాండ్ర పట్టికలోనికే చేరుదురు. ఆవ్యక్తులు :

౧. ఋశ్యశృంగుని వేశ్యల బంపి వంచించి రప్పించిన రోమపాదుడు.

౨. తండ్రికి దెలుపక శాంతను పెండ్లాడిన ఋశ్యశృంగుడు.

౩. శ్రీరాముని తనవెంట బంపగోరుచు అతడు నారాయణుడని చెప్పక 'అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమం' అని యన్యాపదేశముగా చెప్పిన విశ్వామిత్రుడు.

౪. రాముడు శ్రీహరియని తెలుపక "కృతాస్త్ర మకృతాస్త్రంవా నైవం శక్ష్యంతి రాక్షసాః" అని చెప్పి నిజస్థితిని కప్పిపుచ్చిన వసిష్ఠుడు.

౫. సీతను కాపాడుటకయి రామునిచే నియమితుడయ్యును అట్లు చేయక మాయలేడిమాటను విని సీతను విడిచిపోయిన లక్ష్మణుడు.

౬. సీతను వెదుక లంకకు బోయి 'నీ వెవ్వ' రని యడుగ తన పేరును చెప్పక లంకను చూడవచ్చినవాడ ననిన ఆంజనేయుడు.

౭. తన్ను కాచియున్న రాక్షసస్త్రీలు ఆంజనేయుని గని యాత డెవ్వడని యడుగ శ్రీరాముబంటని చెప్పక నాకేమి తెలియునని చెప్పిన సీత.

౮. సీతాన్వేషణమునకు తాబెట్టిన గడువు దాటించిన సుగ్రీవుడు.

౨. శ్రీదర్భా కృష్ణమూర్తిశాస్త్రిగారి వ్యాసము "దశరథు డసత్యవాదియా" అను శీర్షిక గలది. దానియందలి అంశములు :

దశరథుడు పట్టాభిషేకార్థము కేకయజనకులను తప్ప మరియితరరాజులనుగూడ పిలిచినట్లు రామాయణమున గనుపడదు. దశరథుడు సార్వభౌముడు కావున అందరు రాజులు అతనిని సేవించుచు అక్కడనే యుండిరి. 'ఉపాసాంచక్రిరే' అను క్రియాపదమే దీనిని తెలుపుచున్నది.

కేకయజనకులను పిలువమికి అవకాశము లేకపోవుటయే కారణముకాని దశరథుని కుత్సితమనస్కత కాదు. పుష్యచంద్రయోగము పట్టాభిషేకమునకు ప్రశస్తము కాన, అది మరునాడే కావున భరతాదులు వచ్చుట కవకాశము లేదు. రాజనాశసూచకము లగు దుర్నిమిత్తములవలన మరియొక ముహూర్తము చూచుకొనుట కవకాశము లేకపోయెను.

పట్టాభిషేకనిశ్చయము కావించుకొని వెంటనే కైకకడకు దశరథుడు పోయెను. కైకకు రాముని యందు ప్రీతి గలదని దశరథుడు రామపట్టాభిషేక వృత్తాంతము నామెకు చెప్పినాడు. వివాహసమయ ప్రతిజ్ఞకు భంగములేదు. అట్టి ప్రతిజ్ఞ చేయలేదు. గుణగరిష్ఠుడగు కొండొకకొమరుని పట్టాభిషేకసమయమున జ్ఞాపకముచేయుమనినాడు, దశరథుడు. అట్లు కేకయుడు జ్ఞాపకముచేయలేదుకావున దశరథుడసత్య వాది కాడు. దశరథుడు తొలుత కైకతో కోపదుఃఖములకు లోనయ్యు, నీకోరిక చెల్లింప ననియు "ధర్మబంధేన బద్ధోఽస్మి" అని చెప్పి వరముల నిచ్చి మాటచెల్లించి నాడు. స్వామిగారు దశరథుడసత్యవాదియని నిశ్చయించిరే దశరథుని సత్యవాదితనుగూర్చి యొకమాట యైన జెప్పరేమి. దశరథుడు సత్యవాది యనుటకు హేతువులు గలవు.

3. శ్రీ ఇంకొలను సీతారామశాస్త్రి గారి వ్యాసము— "దశరథుడు సత్యవాది యగును" అని దాని శీర్షిక అందలి సారాంశము:


భరతునికి రాజ్యమిచ్చు విషయమున దశరథుని ప్రతిజ్ఞ సామాన్యవిశేషరూపములు రెండువిధము లగును. దేవాసురసమరమునప్పటిది సామాన్యము. కైక వివాహమప్పటిది విశేషము. కైక కోరినట్లు రాము నవనికి పంపినందున సామాన్యప్రతిజ్ఞ కించియు భంగము లేదు. "తతో దశరథ స్స్వమనోరథపరిపూరణాయ యతమానస్సన్ మమ తనయా యదిభవేయు స్తదా తేషా మన్యతమస్య తనయస్య పట్టబంధకాలే త్వయా యద్యహం స్మారిత స్స్యాం తదా తథైవ కుర్యా మితి ప్రతిజ్ఞాయ కైకేయీ ముదవహత్. తస్మాత్ 'ద్విప్రోషితశ్చ భరత' ఇతి సమ్యగుక్తం దశరథేన. ఏవంచ భరతస్య సాకేతపురసద్భావదశాయాం శ్రీరామస్య రాజ్యార్హత్వం"— (రామాయణ రహస్యరత్నాకర తృతీయ తరంగః) దీనివలనను, ఉమాసంహితావచనము (స్వామి గారి వ్యాసమున గలదు) వలనను విశేషప్రతిజ్ఞయు వినష్టము కాలేదు. 'పంచానృతా న్యాహు రపాతకాని' అనున్యాయము ననుసరించియు నిది దోషము కాదు. పట్టాభిషేకభంగభయమున కేకయుని పిలువక పోవుట యుక్తమే. జనకుడు రామునికి మామగారు కదా! ఆతని నేల పిలువకూడదు? కాబట్టి వారిని పిలువక పోవుట కవకాశాభావమే కారణము. దశరథుడు ప్రజల అనుమతిని పొందుటకు వారి నడిగెను. రాజునకు గలిగిన హాని పట్టాభిషేకమునకు విఘ్నముకాని భరతుని పక్షమునను భరతునికి రాజ్యమగుట విఘ్నముగాదు. "భరతునకు రాజ్య మిచ్చెదనంటిని. వాడు లేనపుడే నీకు పట్టముకట్టెదను. వాడు వచ్చి రాజ్య మడుగునేని ఇవ్వకతప్పదు. అసత్యదోషము సంప్రాప్తమగును" అన్నాడు గాన అసత్యదోషమునకు జడిసియే దశరథుడు రామునకు పట్టముగట్ట తొందర పడెను. దశరథునికి "వివాహస్తు మమాభీష్టో నపుత్రే రాజ్యతర్పణమ్" అను సత్యోపాఖ్యాన రామాయణ వాక్యానుసార మాతనికి రాజ్యప్రదానప్రతిజ్ఞ అనిష్టము. మరియు కేకయుడు జ్ఞప్తిచేయలేదు; రాజ్యము భరతున కీయలేదు. ఇం దసత్యదోషము లేదు. దశరథుడు వంచింపజూచినను కేకయరాజు తన మనుమని కిచ్చెదనన్న రాజ్యము నింకొకని కిచ్చుచుండ నూరకుండునా? మీదుమిక్కిలి కేకయుడు రామ రాజత్వమునే అంగీకరించినాడు. దశరథుడు వంచకుడే యైన కైకకోరిన వరముల నేల ఎగవెట్టడు? అట్లు చేయక సత్యబద్ధుడయ్యెను. దశరథునికి మూడు ఇక్కట్లు — (౧) కైకవివాహమునాటి ప్రతిజ్ఞ, (౨) కైకకిచ్చిన వరములు, (3) పౌరులసమక్షమున రామునకు బట్టముగట్టెద ననుట. వీనిని తప్పించుకొని దశరథుడు సత్యసంధుడని ఖ్యాతిగనినాడు.

ఇంకను ఇట్లే-రామాయణకథ సాగవలయుననుభావమునకు తగిన మరికొన్ని విషయములు. ఈమూడువ్యాసముల సారాంశ మిది.

వీనివలన స్వామిగారు చూపిన సందేహములు తీరునవి కావని పాఠకులు తెలిసికొన

గలరు. "రాముడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. ఆతని తండ్రియగు దశరథు డసత్యవాదియా? రామాయణమూలపురుషుని కీగతి పట్టింతురా?" అనుదృష్టి యుండునంతవరకు తత్త్వము నరయజాలకపోవుట వింతకాదు. ఖండనకారులలో తొలుతటివారు సెలవిచ్చినట్లు పురాణేతిహాసపాత్రములయందు లోపములనుకొనునవన్నియు లౌకికతంత్రములనుకొనుట యుక్తము. పురాణేతిహాసముల గాథలన్నియు లౌకికవ్యవహారబోధకములు. వానియందలి పాత్రములు తదనుకూలములుగ సృష్టింపబడియుండును. మీదుమిక్కిలి పురాణేతిహాసములు సంతిష్ఠప్రతిష్ఠభాగములకు స్థానములని ధీవిశాలురగు విమర్శకు లనేకులు చెప్పియున్నారు. తన్మాత్రికల సూక్ష్మపరిశీలనము వారి కాధారము. కావున తద్గుణదోషపరిగణనవివాదము లసాధుకార్యములు. వానికంటిన దోషములను పరిత్యజించి గుణముల నాదరించుట భావ్యము. దోషముల సాన్నిధ్యముననే గుణములకు ప్రకాశమధికము.

—సంపాదకుడు, భారతి.



కాశీవద్ద గంగానదిపై వంతెనలు
(ఒకటి రైలుబాట, మరియొకటి బండిబాట)

P. S. N.

నిరపరాధి

కుందుర్తి నరసింహారావుగారు

౧

నిండినయింట్లో ఆనందదేవత గంతులు వేస్తూంది. పెళ్లిసందట్లో పందిరిస్తంభాలు పెళపెళమంటున్నవి. అటూ యిటూ మోటారుకార్లు హడావుడిగా తిరుగుతున్నవి. వాటి చప్పుడు విని దూరంగా కొట్టంలో కట్టివేసివున్న ఆవుదూడలు బెదిరి గంతులువేస్తుంటే, వాటి తోకలు పట్టుకొని ఆడుకుంటూవున్న పిల్లకాయలు దూరంగా తొలిగి చప్పట్లు చరుస్తున్నారు. వాళ్ల గోలకు ఉడుకుబోతుతనం వచ్చి దూడలు ఇంకా అరుస్తున్నవి. వాళ్లు ఇంకా చరుస్తున్నారు.

పెళ్లికొడుకుకారు ముందు నడిచింది. దానివెనకనే ఆడబిడ్డలకారుఅంగలువేస్తూంది. మఱి చుట్టాలందఱికోసం యేర్పాటుచేసిన మూడుబస్సులూ దానివెనకనే మూలుగుతూ పోతున్నవి. ప్లెషర్ కార్లకంటే పెద్దవైన తమ నందఱినీ వెనకవేసి వాటిని ముందు నడిపిస్తున్నారనే ఉక్రోషంచేతనో, తమ సంగీతం వినిపించకుండా లోపల కూచున్న ముత్తైదువలు గడబిడచేస్తున్నారనే కంగారుచేతనో అవి సామాన్యంగా కదలటంలేదు; డ్రైవర్లకు లొంగటంలేదు; వాళ్లు చెవులు మెలివేసినా, తెక్కలు విఱిచినా, కాళ్లతో తన్నినా సహించి పూరుకుంటున్నవికాని ప్రయాణంమాత్రం మనస్ఫూర్తిగా సాగించేట్టు లేదు. చిట్టచివరకు మిగిలింది ఒకచిన్నకారు. అందులో ఒకరిమీద ఒకరు నలుగురు కుఱ్ఱవాళ్లు పడ్డారు. వెనుకసీటులో కుడివైపుగా వాలి ఆనుకొని కూర్చున్న పుండరీకం చేతిలోకి కళ్లజోడు తీసుకొని జేబురుమాలతో తుడుచుకుంటున్నాడు.

అందఱికంటే ముందు దారితీస్తున్న మేళగాళ్లల్లో ఒకడికి చీమ కుట్టింది. వాడు మద్దెల చాలించి మడిమ గోక్కున్నాడు. మద్దెల నిలిచిందని సన్నాయివాడు చాలించాడు. తాళపువాడు దగ్గాడు. మేళం నిలవంగనే ఫర్లాంగు దూరంలో ఉన్న బ్యాండువాళ్లు వెనక్కి తిరిగి చూచారు. ముందు నడుస్తున్న పెద్దమనుష్యులంతా కబుర్లు చాలించి నిలబడ్డారు. కారులన్నీ ఒకటితరువాత ఒకటి క్రమక్రమంగా నిలిచిపోయినవి.

వరసగా పోతున్న పెళ్లివాళ్లను చూడటానికి ముత్తైదువులంతా వచ్చి వాకిళ్లల్లో నిలబడ్డారు. బాలవితంతువులు తలుపులచాటున నక్కిచూస్తున్నారు. కొత్తపెళ్లికూతుళ్లు మేడలమీదినుంచీ మెరుస్తున్నారు. తలంటిపోసుకొన్న శిరోజములు చిక్కుడీసుకుంటూ సుందరమ్మ మేడమెట్లమీద నుంచోనుంది.

వరసగా నిలుచున్న కార్లలో ఒక్కొక్కటీ కదిలింది. మేళం, తాళం మళ్లీ ప్రారంభించినవి. స్వరం విన్న నాగేంద్రులవలె బస్సు

లన్నీ బుస్సుమన్నవి. శ్రీనివాసరావుగారి యింటి కెదురుగా నిలిచిన చివరకారుమాత్రం కదల్లేదు. డ్రైవరుతమ్ముడు దిగి స్టార్టుచేస్తా నన్నాడు; అది వొద్దన్నది; అసహ్యించుకొన్నది; తలవూపింది;తంతా నన్నది. 'అయ్యగార్లను దింపి, నెట్టనన్నా నెట్టండిరా' అన్నాడు డ్రైవరు. ఆమాట విని పుండరీకం కళ్లజోడు కటిక్కిన పెట్టుకొన్నాడు; తలుపు తెరిచి తొందరగా దిగాడు. భాస్కరం, ప్రకాశరావు అతనివెంటనే దిగి 'మనంగూడా నెడదాం పట్టండి' అన్నారు. పుండరీకం నవ్వాడు. రుద్రాక్షించు ఉత్తరీయం చుట్టచుట్టి సీటులో పడవేసివుంటే తీసుకొని భుజాలమీద ఎగుడు దిగుడుగా వేసుకున్నాడు. కాళ్లకు తొడుక్కున్న ఆకుచెప్పులలో ధోవతిఅంచులు చిక్కుకొంటే వొంగి తీసుకుంటూ "మనం నడిచిపోదాం, భాస్కరం" అన్నాడు.

శ్రీనివాసరావుగారు చెంబు పట్టుకొని మేడమీదనుంచి చరచరా దిగివస్తున్నాడు. మెట్లమీద భార్య నిలబడి వుంది; విడిపోయిన వెంట్రుకలు భుజాలమీద గుత్తులుగట్టి నల్లత్రాచుల్లాగా వేలాడుతున్నవి; ఎడమచేయి మెట్లకటకటాలమీద ఆనుకొని, అరచేతిలో చెక్కిలి వొత్తి అనిమిషనేత్రాలతో చూస్తున్నది; చేతిలోని దవ్వైన మెట్లమీద జాజి పడిపోయింది; కుడిచేతి వేళ్లు కటకటాల అంచులమీద మెల్లగా ఆడుతున్నవి, వీణ తంత్రులు మీటుతున్నవి;

'కమలాకుచకలశీభర
విపులీకృత పులకం'

అనే పల్లవి తమలో తామే ఆలాపిస్తున్నవి. "ఇంతపెందలాడే లేచావు. మేళం వినేటప్పటికి మెలకువ వచ్చిందా యేమిటి?" అంటూ శ్రీనివాసరావుగారు మెట్లు దిగిపోతూవున్నాడు. సుందరమ్మ మాటలాడలేదు. ఆమాటలు ఆమెకు వినబడలేదు.

"అబ్బా! పసిపిల్లలాగా పెళ్లిమేళమంటే ఎంతకులాసా నీకు?" అని ఆయన ఆగి చూస్తున్నాడు.

"పసిపిల్లను కాదా యేమిటి?" అని సహజంగా అని ఊరుకున్నది. కాని యేమన్నదో ఆమెకే తెలియలేదు. అంతచనువుగా అన్న మాటతో కలిసి ఆమెమొగముమీద ఒక్క చిఱునవ్వు వస్తేనా! శ్రీనివాసరావుగారికి ముద్దువచ్చినది. "ఎంతచక్కగా మాటలాడుతావే, నీవు!" అన్నా డాయన, చూపులనిండా ఆనందరసం ఒలుకుతూ.

ఈఉషస్సులో, బాలసూర్యకుసుమము చిమ్ముతున్న బంగారుపుప్పొడిలో, మనోమోహనములగు మంగళవాద్యములముందు, స్వర్గసోపానసన్నిభమై యుండవలసిన యీ మేడమెట్టుమీద, ఈదంపతులవద్ద రసాభాస వర్ణింపవలసివచ్చింది. అంతసంతోషపడిన పెనిమిటికి ప్రత్యుత్తరముగా ఒక్క చల్లనిచూపైనా సుందరమ్మ చూడగలిగింది కాదు. ఆమె తల, మొగము, కండ్లు, మనసు, ప్రాణము—

అన్నీ ఆకార్లసందడిలోనే, ఆ ఆగిపోయిన చిన్న కారుమీాదే లీనమై వున్నవి. పంతులు గారు కొంచెమునే పట్లాగే చూచి చూచి, ఆగిపోయిన కారువంకా, ఆమెవంకా చూచి, మళ్లీ చూచి బెదిరిపోయినాడు; వెంటనే చెంబు తీసుకొని చరచరా దిగిపోయినాడు.

రోడ్డుమీాద సంగతి చూడండి: చుట్టా లంతా ముందు సాగిపోయినారు. వెనకబడితే విడిదిలో ఉప్మా, కాఫీ దొరక్కుండా పోతయి. గంటసేపు నెట్టినా కారుచప్పు డయ్యేట్టు లేదు. దాన్ని బాగుచేసుకుంటూ డ్రైవరు చెమటలు కారుస్తున్నాడు. ప్రకాశరావు 'రావోయ్' అంటూ పుండరీకంచొక్కా పట్టుకు లాగాడు.

"నడిచిపోతే చుట్టాలంతా నవ్వరు టోయ్?"

"అట్టయితే ఇటు కాఫీహోటలుకు పో దాం పద!" అన్నాడు ప్రకాశరావు.

"ఎంత అభిమానం! పరిగెత్తుకు పోయి ఆ వెనక కారులో ఎక్కుదాం పద" అని భాస్కరం అన్నాడు. పుండరీకం మొగం చిట్లిస్తూ, "అబ్బే, ఆడవాళ్లబండిలోనా?" అని మళ్లీ నవ్వాడు.

భాస్కరానికి పొట్ట బగల నవ్వు వచ్చింది. "ఆడవాళ్లంటే అట్లా బెదిరిపోతా వేమిటోయ్ నువ్వు! ఆకూచున్న అన్నయ్యా వాళ్లంతా మొగవాళ్లు కారూ? చదువుకునే కుఱ్ఱాడివి యింకా......"

భాస్కరాన్ని ఇక మాట్లాడనీయకుండా భుజము పట్టుకొని నెట్టాడు, పుండరీకం. అందలూ నవ్వుకుంటూ వెనక్కి తిరిగిపోతున్నారు. పుండరీకంగొంతులో ఎప్పుడూ ఒకరాగం ఆడుకుంటూ వుంటుంది. అతని పెదవులమీాద ఒకపాట పరిగెత్తుతూ వుంటుంది. ఇతరులు అతణ్ణి ఎగతాళిచేస్తుంటారు. అతడు తల వంచుకొనిపోతూవుంటాడు. ఉత్తరీయంచెఱగులు మాటిమాటికీ జారిపోతున్నవి. అవి మళ్లీ సర్దుకుంటున్నాడు.

ఒక్కొక్క ముత్తైదువా వొంగి గడపలో ముగ్గులు వేస్తున్నది. కొందఱు ఆడవారు తలుపులు వేసి లోపలికి పోయినారు. పిల్లకాయలు పెండ్లివారివెంట పడ్డారు. సుందరమ్మ చూస్తూనే నిలుచుంది. ఆమెమనస్సు చెదర లేదు. కాలు కదలలేదు. కారు ఆగిపోయిన చోటనే ఆమెదృష్టి సుస్థిరమై వుంది. అక్కడ మాత్రం ఇప్పు డేపదార్థమూ లేదు. కారూ లేదు, మనుష్యులూ లేరు. కాని ఆమె అక్కడే చూస్తూవున్నది. అయిదునిమిషాలక్రింద ఆమె మనస్సు అక్కడ వ్రాలి ఒకమూర్తిని సృష్టించింది. ఆమూర్తి అక్కడనే వుంది, ఆగాలి లోనే, ఆరోడ్డుమీాదనే, ఆకారు నిలిచిన చోటనే—సన్నగా, ఊగుతూ, నవ్వుతూ......

౨

వీరయ్యగారి పెళ్లిపందిట్లో వెయ్యి మందిజనం ఉన్నారు. ఒక్కరోజుపెళ్లి కాబట్టి ఊళ్లో పెద్దలంతా ఆవేళే వచ్చారు. పెళ్లికూ

తుర్ని మేనమామ తీసికొనివచ్చి పీటమీద కూర్చోబెట్టాడు. ఆమె వెంటనే సుశీలా, సుందరమ్మామాత్రం అలంకారాలతో వచ్చి వెనక నుంచున్నారు. వచ్చే పేరంటాల నందరినీ వారు సత్కరించవలసివుంది.

పీటలకు ఎదురుగా పెళ్ళికూతురుతండ్రీ, అన్నలూ కూర్చున్నారు. వారిపక్కనే భాస్కరం, పుండరీకం తమలపాకులూ, అత్తరూ మొదలైనవి పెట్టిన పళ్ళెమొకటి ముందు పెట్టుకొని చిల్లరడబ్బులసంచీ ఒకటి పట్టుకొని కూచున్నారు. పెళ్ళిమంత్రాలు సాగుతున్నా వీళ్ళ కబుర్లేమిటో వీళ్ళు చెప్పుకుంటున్నారు గాని వెనక్కి తిరిగి చూడలేదు. కాసేపటికల్లా పెండ్లికొడుకుకు కట్నం వెండిపళ్ళెంలో పెట్టి పది వందరూపాయినోట్లు ఇచ్చారు. అతడు పురోహితుడిచేతి కియ్యగా ఆయన పెండ్లికొడుకు తండ్రి పేరిరాజుగారి కిచ్చాడు. పచ్చపచ్చని ఆపదికాగితాలలో ఎంతవిలువ ఉన్నది? ఆ పెళ్ళికూతురుతండ్రి యెన్నాళ్ళు అష్టకష్టాలూ పడి అవి సంపాదించాడోకదా! అందఱికళ్ళూ వాటిమీదే వున్నవి. పేరిరాజుగారు నాలుగుసార్లు వాటిని లెక్కపెట్టుకున్నాడు. కొడుకును కన్నందుకు కృతార్థుడి నైనానుగదా అనుకున్నాడు. వేయిరూపాయలు! కొడుకుకు మెట్రిక్యులేషన్ చెప్పించిన ఖర్చుకు రెట్టింపు వచ్చిందనుకున్నాడు. మళ్ళీ బొత్తిని ఒక్కసారి లెక్కపెట్టి, పక్కన వున్న పుండరీకంను పిలిచి, "అబ్బాయీ! ఒకసారి చూడు—బావగారు కౌంటర్ ఫీట్లేమన్నా...!" అంటూ నవ్వాడు.

పుండరీకంకూడా సహజమైన చిఱునవ్వు నవ్వుతూ, లెక్కపెట్టి "మంచివేలే, బాబూ! దుంపతెంచక—" అన్నాడు.

సుందరమ్మకళ్ళు చెదిరినవి; చెక్కులు పండినవి. అది రోడ్డు కాదు. కారు ఆగిపోయిన చోటు కాదు. అయినను ఆమెదృష్టి నిశ్చలమైపోయినది.

పేరిరాజు చేయి చాచి 'ఇటు తె' మ్మన్నాడు. పుండరీకం నవ్వుతూ, 'బాబూ! డబ్బు ముందర పెట్టెలో వేసుకుంటావేం? అమ్మాయికి రెట్టింపుసొమ్ము అందియ్యాలి, తెలుసునా?' అన్నాడు. 'నీమొగంలే, ఇటు తేవోయ్! మాఅమ్మాయికి సొమ్మేమిటి?' అంటూ ఆయన పుండరీకంకందువా పట్టుకొని లాగాడు. నాగవల్లి వేళ అయింది. అందఱూ లేవబోతున్నారు. ఉత్తరీయం రెండుబుజాల మీదా విసురుకుంటూ 'జజ గగనమే జయ గీతాలీ' అనుకుంటున్నాడు పుండరీకం.

సుందరమ్మ కన్నులు మూసుకొన్నది; తెరిచి చూచింది. అది పందిరి; అడ్డమైన జనమూ ఉన్నారు. చరచరా లోపలికి పోయింది.

"సుందరమ్మ పాటలు పాడకుండానే పోతున్నది—" అన్నది సుశీల. ఆమె తిరిగి చూడలేదు. అయినా బాగుండదని, 'హారతిపళ్ళెం సరిగా వెయ్యరని అలిగిపోతుందా యేమిటమ్మా' అన్నది సుశీల. సుందరమ్మ అదృశ్య అయింది.

3

'సుందరీ'—

శ్రీనివాసరావుగారు క్రొత్తగా ప్రాక్టీసు పెట్టారు. అంతభాగ్యవంతుడికి కొంచెము ఆలస్యంగా పెండ్లి కావడం చూడడానికి ఆశ్చర్యకరంగానే ఉంటుంది. ఇరవైయారేండ్లకు సుందరమ్మను వివాహమాడాడు. మరునటిమేడే ఆమె కాపరానికి వచ్చివున్నది. తను ఆమెను ప్రేమిస్తున్నా ననుకుంటాడు. ఆమెకు తనే ప్రాణమని నమ్మాడు. ఆమె సహజంగా తనతో మాట్లాడడానికి సాహసించదు; సిగ్గు. అప్పుడప్పుడు ఏదో ఒకమాట అంటే ముద్దు వస్తుంటుంది.

ఇప్పుడు, ముప్ఫైయేండ్ల పొట్టి భారీ మనిషి; మొగముమీద స్ఫోటకపుమచ్చలున్నవి. గొడుగు వేసుకొని కోర్టునుంచి అప్పుడే వచ్చాడు. బైసికి లున్నది గాని మూడుపూట్లా అది తొక్కలేక యింట్లోనే ఉంచి పోతాడు. గబాగబా మేడపైకి పోయి పిలిచాడు. భార్య పలికినట్లు లేదు. జేబురుమాలుతో మొగము మీది ముత్యాలు పాడుజేసుకుంటూ మళ్లీ పిలిచాడు:

'సుంతరీ'—

సుందరమ్మ కిటికీదగ్గర కూర్చుండి వీథి వంక చూస్తూవుంది. భర్తమాట ఆమెకు వినబడింది గాని పలకటానికి సత్తువ లేదు. ఆమె గొంతులో యేదో ఉండగట్టి గిరగిర తిరిగింది. ఆకిటికీలోనుంచి రోడ్డుమీదికి, ఆచోటికే, చూస్తూవున్నది. కాని అక్కడ ఏమీ లేదు. ఏమైనా వున్నా, ఆమెకు కనబడటానికి వీలు లేదు. ఆమెదృష్టికి పలుచని నీటితెర వొకటి అడ్డపడి వున్నది.

శ్రీనివాసరావు పైగుడ్డ మంచముమీద పారవేసి, మెల్లగా పోయి భార్యభుజముల పైన చేతులు వేశాడు; హాయి అనుకొన్నాడు. పన్నీటిలో తడిసిన బంగారుబొమ్మవలె ఉన్నది సుందరి. రోగివలె మెల్లగా ఆమె వెనుకకు తిరిగి చూచింది. ఆకంటిపొరలవెనుక, విషాదచ్ఛన్నమైన మూర్తి ఒకటి, ఆమె మనస్సు సృష్టించుకొన్న మూర్తి ఒకటి, నాట్యముచేస్తున్నది. 'ఉత్తరీయ మేదీ?' అని అకస్మాత్తుగా అన్న దామె. అతడు బిత్తరపోయి 'ఇదేమే, ఇట్లా వున్నావు? నే నెవరిని?' అన్నాడు.

ఆమెకు ఏడుపు వచ్చింది; వీథివైపుకు చూడగా ఆగిపోయింది; భర్తవైపు మళ్లీ చూడగా మళ్లీ వొచ్చింది. సిగ్గుపడి చివాలున లేచిపోతున్నది.

'ఇవ్వాళ టీ లేదా?'

సుందరమ్మ మాట్లాడకుండా దిగిపోయింది.

అసలే అతని కనుమానము. ఈపది రోజులబట్టీ యీవిచ్చిత్ర మేమిటి? ఆనాడు— ఇవ్వాళ— ఈప్రవర్తన యేమిటి?

తనభార్యకు సొమ్ములు పెట్టినది తాను; అన్నము పెట్టుచున్నది తాను; పైగా, ఆమెను

పెళ్లి చేసుకున్నది తాను. ఆమె తనతో ఎందుకు మాట్లాడదు?

తనకు అంద మున్నది; ఆస్తి వున్నది; వయ స్సున్నది; హృదయ మున్నది—తనతో సుందరి మాట్లాడ దెందుకు సరిగ్గా?

ఆమె తాను చెప్పిన పనియెల్లా చేస్తుంది; తను ఏది కావలె నంటే అది యిస్తుంది; తనకు లోబడి వుంటుంది—మరి మాట్లాడ దెందుకు?

అతడు కిటికీలోనించీ చూశాడు. పేరిరాజుగారి యిల్లు బాగా కనబడుతున్నది. తులిశమ్మ బయట అంట్లు తోముతున్నది. బాబురావు బర్రెమూడకు మేత వేస్తున్నాడు. పక్కగదిలో అద్దెకు వున్న కుఱ్ఱవా డెవరో పడక కుర్చీలో కూర్చుని చదువుకుంటున్నాడు. అతణ్ణి యెక్కడనో చూచినట్టుంది. ఎక్కడబ్బా!

ఇంతలోనే టీ తీసుకొని సుందరి వచ్చింది. భర్తముందు అది పెట్టి తల వంచుకొని నిలబడ్డది. ఆలోచనలో మునిగివున్న అత డది ముట్టుకోకుండానే, 'సుందరీ! పేరిరాజుగారి గదిలో అద్దె కున్నవా రెవ్వరే' అని యథాలాబంగా అడిగాడు.

ఆమె ఉలికిపడ్డది. నిలువున వొణికింది. తల మరింత వొంచుకొని, 'నా కేం తెలుసు?' అంటూ పోబోయింది.

'నీవు సాధారణంగా పోతూవుంటావుగా?' ఆమె యిక నిలువలేక, తొందరగా దిగిపోతూ, 'నా కివ్వాళ తలనొప్పిగా వుంది' అని గొణుగుకొన్నది.

౪

పొద్దు గూకింది. పేరిరాజుగారి ప్రహరీ ముందు వచ్చి నిలుచున్నారు శ్రీనివాసరావు గారు. ఆకుఱ్ఱవాడు ఇంకా చదువుకుంటూనే వున్నాడు. పడకకుర్చీకి అంటుకు పోయింది అతని దేహం. ఒంటిమీద రుద్రాక్షంచు ఉత్తరీయం ఎగుడుదిగుడుగా పడి వేలాడుతున్నది.

'అబ్బాయీ!'

'ఎవరండీ?'

'పంతులుగా రున్నారమ్మా?'

'నాకు తెలియదు. పక్కన కనుక్కోండి.'

'ఓహో! మీరు బాడుగకు ఉంటున్నారా? ఏమిస్తావు నాయనా, ఈగదికి?'

'కూర్చోండి. మూడురూపాయలు.'

'చదువుకుంటున్నావా?'

'బి. ఏ.'

'నీపేరు?'

'పుండరీకాక్షుడు అంటారు.'

శ్రీనివాసరావు నిదానించి చూచాడు. అతని కళ్లలో ఆగ్రహం, ఈర్ష్య, భయం అవతార మెత్తివున్నవి. పుండరీకాని కేమీ అర్థం కాలేదు. 'నాతోటి యేమన్నా పని వుందా అండీ?' అన్నాడు.

'లేదు' అంటూ ఆయన వెనక్కి తిరిగి తమ మేడమీదికి చూస్తూ తిరిగిపోయినాడు. ఆకిటికీవద్ద సుందరిసుందరనయనద్వయము మెరుస్తున్నది. కాని అందులో సంపూర్ణమైన మానవలోకవిశాలదృష్టి లేదు. అవి ఒకటే లక్ష్యముమీద నిలిచివున్నవి. భర్త ఆమెకు కనబడనే లేదు.

పుండరీకం పుస్తకం మూసి, ఉత్తరీయం పైన కప్పుకొని, కళ్లజోడు తుడిచిపెట్టుకొని, గదికి తాళంవేసి, షికారుకు బయలుదేరాడు; తలకాయి వంచుకొని కూనరాగం తీసుకుంటూ శ్రీనివాసరావుగారి యింటిముందగా నడిచిపోతున్నాడు.

శ్రీనివాసరావు కాళ్లజోడు చప్పుడు చేసుకుంటూ మెట్లమీద నడుస్తున్నాడు. పైనుంచి, తలుపు లన్నీ తెరిచివేసి, దుఃఖపూరిత నయనాలతో వీధివంకకే చూస్తూ సుందరి పరుగెత్తుకొని వస్తున్నది. అతని తలపైన పిడుగు పడింది. ఆశ్చర్యంతో "ఎక్కడికే సుందరీ?" అని అడిగాడు.

ఆమె కేమీ అర్థముకాలేదు. ఈలోకములో లేదు. తనమనసులో మూర్తి, కన్నులలో మూర్తి కలిసి ఒకటైనవి. తల వంచుకొని లోపలికి పోయింది.

శ్రీనివాసరావు మరి భోజనము చేయలేదు. సైకిలు వేసుకొని బయలుదేరాడు. విసుగు పుట్టిందాకా తిరిగాడు. ఇంటికి వచ్చి తల పట్టుకొని కూర్చున్నాడు. మంచముమీద పడి అటూ యిటూ పొర్లాడు. ఎంతసేపటికీ మనస్సు కుదరలేదు.

అర్ధరాత్రివేళకు లేచి తనభార్యకోసం చూశాడు. ఆమె పక్కమీద లేదు. కిటికీ దగ్గర కూర్చునివున్నది. ఆశ్చర్యపడ్డాడు. ఆలోచించకుండా మేడ దిగి పేరాజుగారి యింటి వద్దకు పరిగెత్తాడు.

"అబ్బాయీ! పుండరీకం!"

రెండుమూడు పిలుపులకు గాని అతడు లేవలేదు. పొద్దుపోయిందాకా చదువుకున్నాడు శాబోలు. తెల్లవారితే సెలెక్షన్సు ప్రారంభం. మూడున్నరకు అలారం పెట్టి పడుకున్నాడు. అర్ధరాత్రప్పుడు ఎవరు వచ్చి పిలుస్తారు? తలుపు తీసి చూస్తే సాయంకాలం వచ్చిన పెద్దమనిషి ప్రత్యక్షం!

'ఏమిటండీ?'

'నువు కవిత్వం రాస్తావుట గదూ?'

'ఎందుకు?'

'నీకు దేవు డెప్పుడన్నా కనపడ్డాడా?'

'మీ రెందుకు వచ్చారో చెప్పండి?'

'నీకు దేవుణ్ణి చూపించడానికి—'

'ముందు నీసంగతి చెప్పవయ్యా, దేవుడా!'


పుండరీకానికి భయం పుట్టింది. శ్రీనివాసరావు చేతులో పిస్తోలు తీసి పట్టుకున్నాడు.

'దుర్మార్గుడా! నీవు నాసుందరిని వదలిపెట్టు—'

'ఎవరు సుందరి?—ఇదేమిటో నా కర్థం కావడం లేదు.'

మఱుక్షణంలో శ్రీనివాసరావుచేతులో ఉన్న పిస్తోలు ఢామ్మని మ్రోగింది. పొగ తగ్గిందాక అతడు బైట పడి, యింటివద్దకు పరిగెత్తాడు. మేడమీాదికి చూశాడు. సుందరి కళ్లు రెండూ, ఆకిటికీలోనుంచి దూరానికి చూస్తూ, చీకటిలోకూడా మెరిసిపోతున్నవి. ఆకంటిపొరలలో లోతుగా ఒకమూర్తి ప్రకాశిస్తుంది—సన్నగా, పొడుగ్గా, ఉత్తరీయంతో కళ్లజోడుతో.........

అస్పృశ్యత కర్థము గలదా ?



హరిజనుల వెంటను నాగరికుల వెంటబడుచున్నాము.

హరిజనులమ్మెడివాటిని తినుచున్నాము. రోగులను ముట్టుచున్నాము. స్నానమెరుగని పవళ్లను తాకుచున్నాము.

అశుద్ధమును తిను కుక్కలనాదరించుచున్నాము. హరిజనులను తాకి, ఆదరించుటేనా దోషము.

'మిస్ లైలా'

గొల్లపూడి జోగారావుగారు

౧

నాటిరాత్రి యెనిమిదిగంటలకు రాజమండ్రీ స్టేషను వదిలేను. ఒంటరిగా ఉండొచ్చునని, పెద్దవాళ్లు ఎక్కే బండనీ రైలు కదలుతుందనగా వెళ్లి ఒకమూల కూర్చున్నాను. ఎక్కడికెళ్లినా యీదీనురాలి జీవన మొక్కలాగే వుంది. నన్నిట్టిబాధల గురిచేయుచున్న విధిని దూషించేను. మాతృదేవి మంగళాకారమును దృష్టిపథమున గుర్తించుకొని వెక్కివెక్కి యేడ్చే నొక్కగడియ. నాతండ్రి మనోహరమూర్తి చిత్రించుకొని దుఃఖించేను. ఈవిశాలప్రపంచములో నన్నొక అనాథను గావించిన భర్త నొకసారి స్మరించుకున్నాను. నన్నింతవరకు పెంచిన మేనమామకు మనసులోనే వందన మొనరించేను. ఈర్ష్యావేశురాలై...గర్వాంధురాలై...నన్నిట్టి నీచురాలిని గావించిన డాకేశ్వరినిర్దయకు చింతించేను. ఆమె అధికారగర్వమున కంతరాయము కలుగకపోవునా? దిక్కులేనిదానవని తెలిసియు నన్ను బారదోలిన-దోస మామెకు దగులక పోవునా?...అని మనసులో సంతుష్టి పొందేను. ఆమె భర్తకు చెల్లెలికూతుర్ని. అట్టి నన్నామె యేరీతి హింసించినదో గ్రహించి విలపించేను. 'దాసీదానిగా వుంటా......నాకు దిక్కు లేదు. నన్ను తరిమికు......' అనిన నా దీనవచనములు పెడచెవిని పెట్టిన ఆమెకాఠిన్యమునకు ఆశ్చర్యపోయేను. 'తండ్రీ! నన్నింతదాని జేసి నాకు వివాహం చేసావు. ఇప్పుడు నన్ను వదిలిస్తావా?' అని మేనమామదగ్గర రోదన మొనరిస్తూంటే, 'నాయింటివద్ద యేడవకు... అవతలికి పో' యను ఆమెఅధికారగర్వమునకు తెల్లబోయేను. భర్తవంకవాళ్లు భాగ్యవంతులై నా యిల్లాంటి దీనస్థితిలో పనికొచ్చేరు కారు గదా అనుకున్నాను. నాజననిస్నేహితురాలు అన్నపూర్ణ ఆదర భావమున కలరుతూంటే నాదురదృష్ట మామెయేకపుత్రీ మృత్యు వెట్లయిందో తలచి నామందభాగ్యమునకు నిందించుకున్నాను. పుట్టి పెరిగిన రాజమండ్రీలోనే కష్టదశయందు జీవనోపాయము లేకపోయింది కదా అని విస్మయ మందేను. నాలాంటి నిర్భాగ్యలు-అనాథలు-నిష్కృతలై యెంత కీవిశాలప్రపంచమున రోదన మొనర్చుచుండిరో యని వెక్కివెక్కి యేడ్చా, మరొక్కమారు. రైలు రోజుకొనుచూ పోతూంది. ఎంతదూరం పోయిందో, యెక్కడెక్క డాగిందో నేను చూడనే లేదు... అల్లా నాఆలోచనలు పోయాయి. తుదకు ఒకస్టేషనులో ఎవరో చేసున్న పెట్టె తోసి లోపల ప్రవేశించారు. నన్ను చూడ్డంతోటే ఆయన దిగిపోబోయారు కాని రైలు కదలింది. ఆపురుషు డల్లా కూర్చోవాలి సొచ్చింది. నావికృతాకారం వింతగా తట్టుండొచ్చు. ఒక్కగడియ నిదానంగా చూచే డాతడు.

'మీది రాజమండ్రీ కాదూ?' అని ప్రశ్నించే డాయన. ఇంతసిగ్గు విడిచీ జీవనం చేస్తూన్నా పరపురుషు డల్లా ప్రశ్నించడంతోటే నాముఖాన్ని విపరీతపు సిగ్గు దొంతరలు అవనతక్రియలో దాచేశాయి. నీరవమైన కంపెదవులు చలించిపోయేయి.

అతడు మళ్లీ ప్రశ్నించేడు.

'సత్యనారాయణగారు మీ మేనమామ గారూ?'

అవునని జవాబు చెప్పే గాబోలు.

అతడు నాకేసి తిరిగిచూడలేదు.

బండి ఆగింది మళ్లా. ఆపెట్టెను విడిచి దిగి వెళ్లి పోయా డాయన. నావిపరీతపు సిగ్గును చూచే అత డల్లా వెళ్లిపోయుంటాడని గ్రహించేను. అట్టి సత్పురుషులు—సాధుశీలురు ఒకరిద్ద రున్నారని ఆనందించేను. వేసిమబ్రిడ్జిస్టేషనువరకు అల్లాగే కూర్చున్నాను. ఎవరో హాటు వేసుకొని దొరటోపి చంకను పెట్టుకొని ఒకాయనాబండీ యెక్కే రక్కడ. టికెట్టు నాదగ్గర

లేదని తెల్పుకుని అతడు పెదవులు బిగించేడు. అతని వికృతాకారమునకు ఒడలు జలదరించింది. ఈరీతిగా సంభాషణ జరిగింది మాకు—.

అతడు—ఎవరు నువ్వు? టిక్కెట్టు లేకుండా యెందు కెక్కావు?

నేను—నే నొకదీనురాలిని...చెన్నపట్నంలో నాజీవనోపాధిని సంపాదించుకొనుటకై యిల్లా వచ్చేను.

అతడు—టిక్కెట్టుసొమ్ము లేకపోయిన బండి దిగు.

నేను—తండ్రీ! నేను అభాగ్యను. నన్ను వదలి.

అతడు—దిగు... లేకున్న బలాత్కారముగా పైకి తోసేస్తా.

ఆకఠినహృదయుని మరలింపజాలనని తెలుసుకున్నాను.అతని క్రోరచూపులకు ఒళ్లు వణికింది. నెమ్మదిగా బండి దిగిపోయాను.

'పద — స్టేషనులోకి.'

నే వాతని నిర్దాక్షిణ్యమునకు తెల్లబోయి చూస్తున్నాను. నన్ను బండిలో ప్రశ్నించిన పురుషుడేతెంచి,

'ఎందు కామె నిట్లు బాధిస్తున్నావు?' అని ప్రశ్నించే డతణ్ణి యింగ్లీషులో.

'టిక్కెట్టు అడుగుతున్నా' (ఇంగ్లీషులోనే).

పురుషుడు మాట్లాడకుండా జేబులోంచి టిక్కెట్టు తీసి యిచ్చేడు. జరగిన సమాచారము గనుచూ స్తంభించిపోయాను. ఆవింతపురుషు డెవరని యోచించేను అతని మొగముకేసి తెల్లబోయి చూస్తున్నాను.

'లీలావతీ, బండీలోకి పోయి కూర్చో. పని మీద వెళుతూన్నా. మళ్లా నిన్ను కలుసుకుంటాను.'

మాట్లాడకుండా వెళ్లి పెట్టెలో కూర్చున్నాను. 'అతనికి నీపే రెల్లా తెలిసింది' అని మనసు నన్ను ప్రశ్నించింది. అత డెవరు? అతని నామమేనియు తెలిసికొనవందులకు నాలో దూషించుకున్నాను. అత డేదేనా దురుద్దేశముతో యిల్లా చేస్తూన్నాడేమో అని భీతిల్లేను. ఇట్టి దీనజీవనము చేయుటకన్న మరణించుట మేలని భావించుకొని దుఃఖించేను.

౨

అల్లా యెంతసే పున్నానో స్టేషనుదగ్గర. అతడెప్పటికీ రాలేదు. అమద్రాసుమహాపట్టణం లో ఎక్కడికి వెళ్లడం? ఈదీనురాలిని చూచేవా రెవరున్నారు? వెళ్లాల్సిన స్థలము మనోగతం కాకపోవుటచేత కాళ్లు వెనక్కు లాగేయి. అయితే అరుబయలున్నండి యీపతికి చేసే దేముంది కనుక! ఆచలిగాలిలో వణుకుతూ—కళ్లవెంబడి నీళ్లు కారుస్తూ బయలుదేరేను, ఎచటికో. ఆపట్నంలోని ధ్వనులు మెల్లగా అంతరిస్తున్నాయి అప్పుడే. ఒకవిశాలమైన భవనందగ్గర కొచ్చాను. లోపల దీపాలతో కాంతిమంతమై ఉంది. గేటుమీద చెయ్యానుకుని శూన్యదృష్టులతో చూస్తూ నించున్నాను. ఈఅభాజనురాలి శల్యపంజరమును దాచుకొనుట కింత వసతి ఉంటుందని ఆశ జనించింది. ఈదిక్కుమాలిన దీనురాలిపై జాలి వహించకపోతారా యని ధైర్యం కలిగింది. గేటు తెరచి మెల్లగా అడుగులేసుకుంటూ లోపల ప్రవేశించాను. నాహృదయంలోని ఆక్రాంతఆశను ఎగరవైచుకు పోదామని సమీరణుడు కూడ నాసుకుమారశరీరాన్ని మరింత వేధిస్తున్నాడు.

'ఎవరు?......' అని గంభీరనాదం వినబడ్డాది.

'నాయనా, నే నొక అనాథను. ఈరాత్రికి తల దాచుకొనుట కింత తావు లేదా?' అని జాలితో అడిగేను.

'దొరలు నివసించు బంగళా. ఇక్కడనుండి వెంటనే వెళ్లిపో......'

నా ఆశలన్నీ నిరాశ లయేయి. నాహృదయ కేదారమున మొలకలెత్తిన ఆశలన్నీ ఆ గభీరఝంఝూనిలంలో పటాపంచ లయిపోయేయి.

'బాబా, దొరలైన నేమి?...ఒకమూల పడుండి ఉదయాన్నే పోతా!—' అన్నాను.

'ఏమి నీమూర్ఖత్వము! ఇచట పనికిరాదు. మరోదగ్గరకు పో.'

'నాయనా, నాకీ ఊరు క్రొత్త. ఈచలిలోనే చలిపోవనున్నాను' అని రోదన మొనరించేను.

'అవతలికి గెంటివేయవలెనా?' అని జవాబు వచ్చింది. అతని మూర్ఖత్వమునకు ఆశ్చర్యపోయాను. నానిర్భాగ్యత్వమునకు చింతించేను. దుఃఖము అతిశయించింది. వెక్కి వెక్కి యేడ్చాను. ఏడ్పి లాభ మేముంది గనక. మరల బయలుదేరా, ప్రపంచంలోకి. ఆకలి ఒకమూల దహించివేస్తూంది. రాజమండ్రీలో ఆవేళ మధ్యాహ్నము తిన్నా, ఆఖరుసారి. ఆనాటి దృశ్యము చిత్రించుకోనడంతోనే హృదయము ద్రవీభూతమైంది. అమాయకురాలైన విమలమరణమునకు కారకురాలిని గదా అని నాలో దూషించుకున్నాను. ఆమెను అరుగుపై ఒంటరిగ విడిచిపోయిన మహాపాపిని గదా అని వలవల యేడ్చాను. ఏకపుత్రీ వియోగమునకై అన్నపూర్ణ యెల్లా విలపిస్తూందో అని నీరవనై పోయా. ఏమైతే యేం లాభం? అరుగుపైనుండి పడి చనిపోయిన విమల బ్రతికిరాదు. కరుణాస్వరూపురాలగు అన్నపూర్ణ వికలమైన హృదయం పరికాదు......నిర్భాగ్యురాలగు ఈపాపికెల్లా శాంతి కలుగుతుంది? అడుగులు తడబడుతూండగానే నడిచా. ఎంతదూరం నడిచానో— ఎంతసేపు నడిచానో: మళ్లా ఒకభవనంముం దాగేను. క్రిందటిదానిమల్లే యిది నిశ్శబ్దంగా వుండలేదు. దాని యొక్క స్థితిగతులుబట్టి ఒకహోటలై వుంటుందని భావించుకున్నా. మెల్లగా నడిచి గేటుదరకు వెళ్లాను.

'ఎవరమ్మా మీరు? ఇక్కడ బసచేస్తారా?' అని జాలి ఉట్టిపడేలా అడిగేడొకాయన, అరవంతో.

(తర్వాత తెలిసింది అత డాహోటలుయజమానని.)

'నే నొక అనాథను. నాదగ్గర తగినధన మేమీ లేదు. నన్నీరాత్రిచట తల దాచికోనీయండి' అన్నాను.

నే చెప్పిన దానికి బోధపడనట్టు చూచేడు. బోధపడీ అల్లా నటిస్తున్నాడో. అతనితో మాటాడు చుండిన పురుషు డొకడు-నేచెప్పిన దానికి అరవంతో తెలియచేసేడు. ముఖంలోని భావప్రకటనబట్టి అతడు నావిన్నపమును నిరాకరించినట్లు తెలిసికున్నాను. నా దురదృష్టమున కొకసారి విచారించాను.

'నాయనా, నాకెవ్వరూ దిక్కులేరు ఈ విశాలప్రపంచములో నే నేకాకిని....కట్ట గుడ్డ నిండుగా లేదు....తినుటకు తిండి లేదు. అట్టి యీదీనురాలిపై మీకు నిర్దయ యెందుకు?......' అని యింకా యేమేమో చెప్పబోతున్నాను. ఆపురుషుడు నావైపు పరికించి చూచేడు. ఆచూపులలో ఏదో అర్థముంది. అట్టి దృష్టిఘాతములకు భయవిహ్వల నయ్యేను. హోటలు యజమానితో యేదో భాషించే దాతడు. తర్వాత నాకేసి తిరిగి,

'అమ్మాయీ! నావెంట రా. నీకు తగిన సదుపాయము చేస్తా' అన్నాడు.

ఆకంఠస్వరములో మధురత్వము లేదు. అతని వెంట పోవటం మంచిది కాదేమో అని జంకేను. ఇట్టి పతితను హింసించి అత డేల పాపమున కొడిగట్టుకొనునని ధైర్యము వహించేను. ఆపన్నురాలను, అబలను; అట్టినాయెడ నాతడు వేరువిధముగ నేల చరించునని గర్వించేను. అతనివెంట బయలుదేరా. మేడమీద ఒక గదిలోకి తీసికెళ్లా డాయన. గదిమధ్య కెళ్లి యేదో నాగించేడు. కొలదికాలములోనే భోజనపదార్థములు పట్టుకొని ఒక డొచ్చాడు.

'ఇచట ఉంచి వెళ్లి పో.'

అట్టిగర్వితుణ్ణి చూచేను. నా శరీరము నాకు లొంగక వణక నారంభించింది.

'అమ్మాయీ!...మంచిబట్ట లిస్తా, అవి విప్పు.'

నాకివే చాలునని చెప్పలేకపోయాను. నాకేవీ అక్కరలేదు, పడుక్కుంటాను అని చెప్పాలనుకున్నాను. నో రెండిపోయింది. అతడు గదితలుపు

వేసాడు. నేను నీరసనై పోయా. సూటుకేసులోనుంచి ఒకచీర తీసి నాదగ్గర కొచ్చాడు. నాఅవయవములు మరి పనిచేశాయి కావు అతడు నాచెయ్యి పట్టుకున్నాడు. నాసౌందర్యమే నా కిట్టికీడొనగూరుస్తూందని తెలుసుకున్నాను. నాయీహృదయవైకల్యమునకు కారణము నామనోజ్ఞాకారమే అని గ్రహించేను. కవ్వన నార్పి దూరంగా పోయా. ఎలాగో నాకే తెలీదు. అతని భావములు మారలేదు. నేను స్తంభించిపోయాను.

'నిన్ను రక్షించేవా రిక్కడెవరూ లేరు. నీ కెందుకీదుఃఖము?...నిన్ను ఆనందసాగరమున ముంచేస్తా......' అని యింకా రేమేమో చెప్పబోతున్నాడు.

నాభర్త విశ్వలాకారమును చిత్రించుకున్నాను. 'బొటబొట' కన్నెంబడి నీళ్లు కారిపోయాయి. ఈ దీనురాలి కేల యిన్ని సంకటములు? హా విధీ! నన్నిలా పరీక్షిస్తున్నావేమి?

పఠాలున తలుపు విరిగింది. నాకు రైలు దగ్గర కనబడిన పురుషుడు — చేత్తో కర్రను బట్టికొని, ఒక డ్రయివరు లోపలి కొచ్చారు.

అతని నేత్రాలలోంచి అగ్ని కురుస్తోంది.

అతని ముఖమంతా వేడిరక్తంతో కూడుకొనుంది.

'దురాత్ముడా! ఆమె నీసోదరి కాదటరా?... అట్టి అనాథను బాధింపవలచితివా?...ధన సమన్వితుడవైన నీకన్న...పవిత్రహృదయ యగు ఆమె వేయిరెట్లధికము కాదా!......'

అంతవర కావరించిన అంధకార మాతేజోమూర్తివల్ల పటాపంచ లయింది...'నీవు నాపాలిటి దైవమవు....నాదురదృష్టములో నే నదృష్టవంతురాలినే' అనుచు మూర్ఛపోయాను.

* * * *

3

మధ్యాహ్నసమయానికి దగ్గరగా మళ్లీ తెలివొచ్చింది. నే నొక ఆసుపత్రిలో పరుపుమీద పరుండున్నాను. తలకి కట్టుకట్టుంది. నాజీర్ణవస్త్రాలెల్లాగో మాయమయేయి. ఈదురదృష్టవంతురాలి కిట్టి సదుపాయ మెల్లా సంభవించిందా అని సంకోచించాను. దగ్గ రెవరో వున్నట్టుగా తోచింది. కర్టెను తొలగించి చూచేను. దేనినో నిదానించి చూస్తున్నాడాతడు. అతని చూపుల్లో బాధ మిళితమై వుంది. ఆచూపుల్నే అనుకరించాను. కాని నా కేమీ అగుపించలేదు. ఆలోచనాపూర్వకంగా నించున్నాడాతడు. అతని సమాధిని చెరపకుండా కొంతసేపు పూరుకున్నాను. కాని నాహృదయాందోళన ఆగలేదు. ఆబాధలో దగ్గొచ్చింది. అతనిసమాధి భిన్నమైంది. అతడు వెనుదిరిగి చూచేడు. నాచేతిని తీసి నాడి పరీక్షించే డాతడు.

'ఒంట్లో మరేమీ బాధ లేదుకదా?'

ఇల్లాంటి జాలిపలుకులు మళ్లా మూడుసంవత్సరాలకి విన్నాను.

'లేదు. నిద్రపోయాను. తిరిగీ మందిస్థితికి వస్తూన్నా ననుకుంటాను.'

అతడు మందిచ్చి వెళ్లిపోయాడు.

ఆరాత్రే అతడు నాచరిత్ర సంతను విన్నాడు. నే పడిన బాధలన్నీ తెలిసికున్నాడు. ఒక దీర్ఘనిశ్వాసము విడిచే డాయన. రోజూ రెండుపర్యాయములు చూస్తూ వుండేవారు.

ఆవేళ మామూళ్లలుగా ఉదయం ఏడుగంటలకి మేరీ వచ్చింది నాదగ్గరకు. మేరీ తెల్లనిశరీరం...విశాలనేత్రములు... పరుల నాకర్షిస్తాయి. ఆచూపులా పవిత్రహృదయ ప్రేమనైర్మల్యమును చాటుతాయి. రోగులను ఆమె నిర్మలమైన, సుకుమారమైన వేళ్లతో తాకేది. ఆమెకంఠము ముగ్ధవచనాలని వర్షించేది....ఆమె నిర్మలహృదయ. ఆమె పవిత్రహృదయ. అందుచేతే ఆమె

తేజఃపూరితమై వుంది. ఆతేజస్సు ఆమె నేత్రాలలో నిండుకొని వుంది; ఆమె పెదవులపై దీపిస్తూంది.

అట్టి మేరీకీ నాకూ పరిచయం కలుగజేసిన దేవుణ్ణి కీర్తించాను. ఆమెకు నాయెడ నుండే ప్రేమకు... ఆదరణభావమునకు సంతసించేను. ఈ ప్రపంచంలో ఇల్లా ఒకరికి ప్రేమార్హురాల నయ్యేకదా అని ఉప్పొంగేను. ఈమూనాలుగురోజుల పరిచయములో మేరీకి నాయెడ కలిగిన గాఢమైన ప్రేమకు గర్వించేను.

మేరీకి నాకూ ఇల్లా సంభాషణ జరిగింది—

మేరీ—డాక్టరుగారొచ్చి చూసేరా?

నేను—ఊఁ.

మేరీ—ఏమంటున్నారు?

నేను—మేరీ చాల కష్టపడిందన్నారు.

మేరీ—టానిక్కు పుచ్చుకున్నావా?

నేను—ఇప్పుడే తీసుకున్నాను.

మేరీ నాదగ్గర కొచ్చి తలగాయం పరీక్షించింది. ఆమె సుకుమారమైన వేళ్లు నాజుత్తును సరిచేస్తున్నాయి. ఆమెనిశాలనేత్రాలలోకి చూచేను. నాజాలిచూపులలోని రక్తిమ కనిపెట్టిందామె.

'లీలావతీ! నీ వెన్నో బాధల కోర్చేవు. డాక్టరు గారి వల్ల నీచరిత్రంతా విన్నాను. ఆనందరావు, డాక్టరు గారు చనువుకున్నారు. నీభర్తను చూస్తే అతనికెంతో ప్రేమ. ఆనందరావు హాస్పిటలులో చనిపోవునపుడు నే దగ్గరే వున్నాను. అతను దురదృష్టవంతుడు.'

నాకళ్లలో గిరగిర నీళ్లు తిరిగేయి.

'దుఃఖించొద్దు. భగవంతుని నమ్మియుండుము. అతడే నీకు సుఖము చేకూర్చగలడు.'

'నా కీజన్మమున నిక సుఖము లేదు, మేరీ!... నే తగిలివేయబడ్డా. ఎక్కడికి వెళ్లినా తగిలివేయబడ్డాను...ఆసుపత్రిలోనుండికూడా వెళ్లి పోవాలి... మళ్లా యీలోకంలో నే నేకాకినే....భిక్షురాలినే. ...మేరీ! నన్ను రక్షింపవు?'

౪

ఆసాయంత్రము మేరీ నన్ను తనగదిలోకి తీసుకు పోయింది. ఆమెమంచాని కెదురుగా యేసుక్రీస్తు బొమ్మ తగిలించుంది. మేరీ చిన్నతనంలోనే ఆమెజననీ జనకుల గోల్పోయింది. కాన్వెంట్ (Convent) స్కూలులో విద్యాభ్యాసమొనరించి...తన జీవితమును పరుల కుపయోగింప నిశ్చయించి నర్సయి నిందు వెళ్లింది. మేరీ ఆసుపత్రిలో దాదిగా ప్రవేశించబడే మూడేళ్లవుతుంది. మేరీ వివాహం చేసుకోలేదు. ఆమె తన వక్షస్థలమున దీపించుచున్న క్రాసు (Cross) నే నమ్మింది.

గదిలో ప్రవేశించగానే మేరీ తన పరుపుమీద నా కాసనం చూపింది. ఆ ప్రేమమూర్తిలమును మనసులోనే కీర్తించాను. ప్రక్క నున్న కుర్చీలో కూర్చుందామె. మేరీ మొగములోని సూచనలబట్టి ఆమె నా కేదో చెప్పదలచుకున్నట్టు గ్రహించేను. టేబిలుమీదున్న బైబిలు తీసి దాని నూరక త్రిప్పుచు నాకేసి చూచింది.

మేరీ—లీలావతీ! నీ కీనరకకూపమునుండి వెలబడుట కొక ఉపాయం ఉంది.

నేను—అల్లాంటిది నాకు చెప్పమనే కాదూ కోరింది.

మేరీ—నీవుకూడ నొకదాదిగా నేల ప్రవేశింపరాదు?

నేను—అట్టిపని నాకు లభ్యమవడం ఎల్లాగ?

మేరీ—నీయిష్టం చెపితే డాక్టరుగారితో చెప్పి నీ కది సాధ్యం గావిస్తాను. పరులకై యీజీవితము నుపయోగించుటకన్న ఘన మేమీ లేదు.

నేను—మేరీ! నేను నిజముగా నట్టిదానికి పాత్రురాలనేనా?

మేరీ—నీజీవితము నంతకంటె మంచి విధముగా నుపయోగింపజాలవు.

మేరీమూర్తి నాకు రోజూకన్నా అందంగా కనబడ్డది. ఆమె కాంతితో నిండుకొనిఉంది. మేరీ

వక్షస్థలాన్నున్న క్రాసులో ఎదురుగా నున్న యేసు మూర్తి ప్రకాశిస్తూంది. 'మేరీహృదయం గ్రహించు. ఆమె చెప్పినట్లు చెయ్యి' అని అతడు చెపుతూన్నట్టుగా అనుకున్నాను. ఈపతిత యిల్లా ఒరులకు పరిచర్య సలుపడానికి వీలు కలుగుతుంది కదా అని నాలో ఆనందించేను. పనికిమాలిన యీదీనురాలు పరులకష్టదశలో నుపయోగపడునని తలచి నాకష్టములను మరచిపోయాను. తినుటకు నిండుగా తిండిలేని యీనిర్భాగ్య స్వతంత్రజీవనము సలుపటానికి తగిన సమయం వస్తుంది కదా అని ఒకటిరెండు హర్షాశ్రువుల రాల్చేను. మానభంగమునకై వెఱచిన యీదీన మళ్లీ పవిత్రజీవనము చెయ్యగలదని గ్రహించి సంతసించేను. 'రాజేశ్వరీ! నీవు నన్ను తగిలీనేవు; అది నా కుపకారమే అయింది' అని ఆమెను మనసులోనే తలచుకున్నాను.

'మేరీ! నేనూ ఒకనాటి నర్సుతా. నాసోదరుల నెందరినో మృత్యుగహ్వరమునుండి తప్పిస్తాను. ఇల్లా దీనదశలో వుండే నా దేశానికై పాటుపడతా.'

'ఏసు నీకు మేలొనగూర్చుగాక!' అంది మేరీ.

'మేరీ! నీవు ప్రేమజీవివి. అల్లా జీవించడం నాకూ చెప్పేవు. నీవు నాగురువువి.'

'అందరికీ గురువు ఆయేసువు.' అంది మేరీ.

ఆప్రేమజీవిని ధ్యానించే నొక్కసారి.

మేరీ నిశ్చలాకారమును చూచేను. మంచం దిగి పోయి ఆమెపాదములదరి మోకరించేను.

'మేరీ! ఒక పేదరాలిని రక్షించిన పవిత్రహృదయవు నీవు.'

ఆ తెల్లని చేతిని నా పెదవుల కంటించేను. మేరీ నామొగ మెత్తి నానుదుటిని ముద్దాడింది నిశ్శబ్దంగా.

ఆసాయంకాలమే మా పరిచితురాలు లీలావతి 'మిస్ లైలా' అయింది.



తులసీఘట్టము, కాశీ

(ఈ చెట్టుక్రిందనే తులసీదాసు రామాయణమును వ్రాసె నని ప్రవాదము.)

P. S. N



[తా. క. ఇకమీద భారతిలో పిట్టకథలకు తావులేదు. —సంపాదకుడు, భారతి.]

వాణిజ్య సూత్రాలు

కారంశెట్టి వెంకటరంగయ్యగారు

ఒక గ్రామంలో ఒకకోమటి. అతడు లక్షాధికారి. ఇంత దానం ధర్మం కూడ ఎపుడయినా చేస్తూ ఉండేవాడు. వర్తకం బాగా సాగింది అతడికి. అతడికి లేకలేక చాలఏళ్లకు ఒకకొడుకు పుట్టాడు.

కొడుకు బాగా పెద్దవాడు కాకుండానే సెట్టికి చావు సమీపించింది. అప్పుడు కొడుకును దగ్గిరికి పిలిచి "నాయనా, వర్తకానికల్లా నాలుగే సూత్రాలు. వాటిని బాగా అర్థంచేసుకొని చక్కగా వ్యాపారం అభివృద్ధి చేసుకోవాలి నీవు" అని, "నీడలో పోయి నీడలో రా; అప్పిచ్చి అడగవద్దు; ప్రియంగా కొని నయంగా అమ్ము" అనే మూడు సూత్రాలనూ రహస్యంగా చెవులో చెప్పి నాలుగోది చెప్పకుండానే ప్రాణాలు విడిచాడు.

చిన్నసెట్టి తండ్రిమాట జవదాటకుండా వర్తకం సాగించడం మొదలుపెట్టాడు. మొదటి సూత్రంప్రకారం ఇంటిదగ్గరనుంచి అంగడి వరకూ పందిరి వేయించి ఆ నీడనే నడుస్తూ ఉండేవాడు. రెండోసూత్రంప్రకారం అడిగిన వారికల్లా అప్పిచ్చి, మళ్లా వాళ్ల నడగడం మానేశాడు. మూడోసూత్రంప్రకారం సరకును వెల ఎక్కువ పెట్టి కొని తక్కువ కమ్ముతూఉండేవాడు.

ఇట్లా చేస్తూండడంవల్ల దినదినానికీ ధనం విపరీతంగా తరిగిపోతూవచ్చింది. ఏమయినా సరే, తండ్రిమాట జవదాటేవాడు కాడు అబ్బాయి.

ఇట్లా కొన్నాళ్లయింది. ఒకనాడు పెద్దసెట్టినేస్తం ఒకాయన వాళ్లింటికి వచ్చాడు; అబ్బాయిపద్ధతంతా కనిపెట్టాడు. మనస్సు ఉండబట్టక అతణ్ణి అడిగాడు. "నాన్న చెప్పినట్లు నేను చేస్తూన్నా" నన్నా డబ్బాయి. ఆయన కాశ్చర్యం వేసింది. "ఏం చెప్పాడు మీనాన్న?" అన్నాడు. ఎంతకు చెప్పాడు కాడు, అబ్బాయి, అది రహస్యమని. చివరకు కొత్తాయనబాధ పళ్లేక చెప్పేశాడు.

అబ్బాయి తెలివితక్కువకు చింతిస్తూ ఆయన "వెర్రిబాబూ, మీనాన్న చెప్పిన సూత్రాలకు అర్థం అది కాదు. నేను చెబుతాను విను: మొదటిసూత్రానికి 'సూర్యోదయం కాకుండానే అంగడికి పోయి, పగలల్లా, రాత్రి పొద్దుపోయేదాకా బేరంచేస్తూండాలి. తర్వాత ఇంటికి రావాలి' అనీ, రెండో సూత్రానికి 'మనదగ్గిర సొమ్ము అప్పు తీసుకు పోయి మనం అడక్కుండానే మళ్లీ ఇచ్చే వాళ్లకే అప్పు ఇవ్వాలి' అనీ, మూడో సూత్రానికి 'బజారులో అందరికంటె కొంచెం ఎక్కువధర పెట్టి మంచిసరుకు కొని దాన్ని అందరు అమ్మేవెలకంటె కొంచెం చౌకగా అమ్మాలి' అనీ అర్థం. అట్లా చేస్తే చాలా లాభం వస్తుంది, వర్తకంలో. నీవు అట్లా చేసుకోవోయి" అని బుద్ధి చెప్పాడు. అబ్బాయి కళ దెలుసుకున్నాడు. ఆయన చెప్పినట్లే చేసి కొన్నాళ్లకల్లా తండ్రిని మించా డన్నిట్లో. నాలుగోసూత్రం ఏమి టయితే నేం?

నీ డ

ఆకుండి సత్యనారాయణగారు

వెనుకటికాలమున ఒకఊరిలో ఒకమహాత్ము డుండేవాడు. అతని ప్రేమ స్వార్థరహిత మయినది. అతని హృదయము నిష్కల్మషమయినది. అతడు పరోపకారపరాయణుడు.

ఒకనాడు దేవతలు అతనికి ప్రత్యక్ష మయినారు. "ఈశ్వరునకు నీపయిని అనుగ్రహము కలిగినది. వరము కోరుకో" మ్మన్నారు. అత డేమియు మాటాడలేదు. "నీ దృష్టి మీదపడినమాత్రమున ఎంత పతితులైనా పరమపవిత్రు లవుతారు" అని దేవతలు తామే వరమిచ్చారు. దాని కత డంగీకరించలేదు. దేవతలు తిరిగి "నీ ముఖము చూచినంతమాత్రమున పరమనాస్తికులయినా ఆస్తికు లవుతారు" అన్నారు. అత డందులకును సమ్మతించలేదు. దేవతలు విసుగు చెంది, "మహాత్మా, ఈ వరములు నీ కెందుచేత ఇష్టపడలేదు?" అని అడిగినారు. "దయామయులారా, ఈశ్వరుని ఇచ్ఛామాత్రమున నేకాగల కార్యములను నేను చేయుచున్నా నను అహంభావము నా కేల? ఆయనకు నా పయి దయ గలిగినప్పుడు, ఇంకను నేను కోరవలసిన దేమున్నది?" అన్నాడు. "ఏమయినా సరే, నీవు వరము కోరక తప్పదు. ఇది ప్రభువాజ్ఞ" అన్నారు దేవతలు. "ఇక తప్పనిసరి అయినపుడు నావలన లోకానికి ఏపాటి మేలు కలిగినా దానిని నే నెంతమాత్రము గుర్తించలేనట్లు కటాక్షింపుడు" అన్నాడు మహాత్ముడు. దేవతలు అంతర్ధానమయినారు.

అప్పటినుంచి ఆమహాత్ముడు ఏదిక్కుకు మళ్లినా ఆయనసీడమాత్రము ఆయనకు వెనుక ప్రక్కనే పడుతూఉండేది. ఆ సీడ పడిన చోటులలో అద్భుతమయిన మార్పులు జరుగుతూఉండేవి. ఎడారులు పచ్చికబయళ్లు అయ్యేవి; మోడులు చివురులెత్తేవి; ఎండిన బావులు నీటితో నిండేవి; రోగపీడితు లారోగ్యవంతు లయి అభినవ జీవకళలతో ప్రకాశించేవారు.

మహాత్ముడు తన యీ ప్రభావము నెరుగడు. అతని ప్రేమ స్వార్థరహితము; హృదయము నిష్కల్మషము. అతడు నిరంతరము పరోపకారమునకయి పాటుపడుతూ ఉండేవాడు.

ప్రజలు క్రమక్రమముగా ఆయన పేరును కూడా మరచిపోయినారు; 'సీడ' అనే పిలువ సాగినారు.

అయోమయము

జి. జాషువగారు

౧

"నా కవిత్వంబునందు రత్నములు గలవు-వానిఁ బెకళించి చూపెడువాఁడు లేడు
కాల మిట్లున్న" దని మొనగాఁడుబోలె-బలుకు కవిగాఁడ యేటి కీస్వాతిశయము?

౨

ఏవీ యారతనంబులు? - నీవే పెకళించి చూపి నీయింటికిఁ గొం
పోవోయి! అట్లొనర్పఁగ - నీవల నగాద, యింక నీల్గెద వేలా?

౩

"ఇయ్యది నిక్కపుంగవిత, యీ కవనంబును జూచెనేని, న
న్నయ్యయుఁ గొయ్యవాఱి చనఁడా" యని వెఱ్ఱిమొగాలు పప్పరా
మయ్యలు కొంద ఱన్న విని యాత్మను బొంగుదె? వడ్లగింజలో
బియ్యపుగింజ గా కిది కవిత్వమటోయి బడాయిపోట్టగన్!

౪

కమ్మని భావము గల పద్య మ్మొక్కటి వ్రాయఁజాల వన్నిటిలో, ము
గ్ధమ్మో, ప్రణయమ్మో యని - యుమ్మలికించెదవు, నీదియుం గవనంబా?

౫

ధ్వనిచే ముద్దులుగారు భావములు చిందన్ ముచ్చటల్ సెప్పుచున్
దెనుఁగుం గబ్బపు వన్నెలాఁడి మును జన్మించెన్ గవిబ్రహ్మ తా
ల్చిన ఘంటంబున, నీ యభావ కవితాచిత్రాంగినిన్ దిక్కునా
ర్యని ముం దేల ప్రవేశపెట్టెదు, తృణాయుష్కాలగర్వోద్ధతిన్?

౬

పరిగడ్డింబలెఁ బేలవంబగు నభిప్రాయంబు గర్భంబునం
దిఱికింపంబడి, పెద్ద మూఁగదయిపోయెన్ బద్య మీ సొమ్ము లూ
సరవెల్లుల్, జరణంబు సాఁగని నికృష్టంబైన మార్గానఁ జీ
దరఁ బుట్టించెద వేల, శ్రోతల కనర్థ వ్యర్థ వాచాలతన్?

౭

కవిసమయంబుఁ దప్పి, నుడికారపు సొంపును పాడుచేసి, నీ
వెవతుకకోసమో కుమిలి యేడ్చుచుఁ జక్కని తెల్గుకైత కా
యువులు గుదించి యేమిటి కరోమయముం బొనరింతు వోయి! నీ
కవనము పాడుగాను చెడుగా, యింక నేనియు రమ్ము దారికిన్.

౮

ఇమ్మాడ్కి ప్రణయ మధుర రసమ్మున్ జవిసూపి నిన్ను సాధించుచు నీ
గమ్మత్తుసేయు నెవ రా - యమ్మాయి వచింపరాదటయ్యా, మాతో?



కుట్టుపని III


కో. నరసింహాచారిగారు


చిత్రము a కంబళి కుట్టు (Blanket Stitch) అనబడుచున్నది. దారమును 1 వద్ద వెలికి దీసి 2 వద్ద గ్రుచ్చి మరల 3 వద్ద వెలికి దీసినయెడల కుట్టు ఏర్పడును. ఇదే రీతిని, వరుసగా చిత్రము b యందలివిధముగ 4 వద్ద గ్రుచ్చి 5 వద్దను, 6 వద్ద గ్రుచ్చి 7 వద్దను దారమును వెలికి లాగుచు వచ్చినయెడల కుట్లు వరుసగా ఏర్పడును. ఇదే కుట్టును చిత్రము b వలె దూరదూరముగ నైనను, c వలె దగ్గర దగ్గరగనైనను వేయవచ్చును.

f, g, లయందలి కుట్టునకు Open loop అని పేరు. ఇందలి కుట్లు ఒకదానితో నొకటి చేరక యుండుట యొకవిధము (చిత్రము h). ఒకదానితో నొకటి చేరియుండుట మఱియొక విధము (చిత్రము j). ఈకుట్టునందు సూదిని గ్రుచ్చవలసిన ప్రదేశములు, చిత్రము d, e ల యందు చూపబడియున్నవి. ఇందలి యంకెల వరుసనే 1 యందు దారమును వెలికి దీసి 2 వద్ద గ్రుచ్చి 3 వద్ద f నందు చూపినవిధముగ వెలికి దీసి మరల 4 వద్ద గ్రుచ్చి 5 వద్ద వెలికి దీసిన యెడల (చిత్రము g) ఒకకుట్టు ఏర్పడును. ఇదే రీతిని మరల 6 వద్ద గ్రుచ్చి 7 వద్ద వెలికి తీసి 8 వద్ద గ్రుచ్చి 9 వద్ద వెలికి దీయవలెను (చిత్రము h). ఈకుట్టునందలి 1,-2; 5,-6; అనెడు శృంగములను ఒకే చోట చేరునట్లు కుట్టినయెడల (చిత్రములు o, q, r, s) Closed loop అను కుట్లు ఏర్పడును. ఈరెండువిధముల కుట్ల యందును తోకలు (3-4; 7-8) కుఱుచగానైనను, నిడుపుగానైనను (చిత్రములు i, k) కుట్టవచ్చును. ఈవిధపుకుట్లను పూవులు కుట్టుటకు ఉపయోగించవచ్చును (చిత్రముము m,n). చిత్రము m నందు Open loop కుట్లున్ను, చిత్రము n నందు Closed loop కుట్లున్ను కల పూవులు కలవు. l నందు తోక లన్నియు ఒకే చోట చేరియున్నట్లు కుట్టబడి యున్నవి. చిత్రము m, n లందు తోకలు మధ్య భాగమును చేరక ముందే ముగియుచున్నవి.

x. y. కుట్లకు బత్తాసు రంధ్రపు కుట్లు (Button-hole Stitch) అని పేరు. బత్తాసురంధ్రమునకు అంచుచుట్టును కుట్టుటకు ఉపయోగించును. చిత్రము w నందుగల కుట్టు, విచ్చియుంచిన coat - stand ను బోలియున్నది.

దారమును 1 వద్ద వెలికి లాగి, 2 వద్ద గ్రుచ్చి లాగి, 6 వద్ద గ్రుచ్చి 7 వద్దను, 8 వద్ద గ్రుచ్చి 3 వద్ద వెలికిలాగి, 4 వద్ద గ్రుచ్చి 5 వద్ద వెలికి 9 వద్దను లాగుచు కుట్టవలెను.





౪. ఉపవాసదినములందు మహాత్ముని పరీక్షించుచుండిన వైద్యులు. నడుమ శ్రీ సరోజినీదేవి.



౫. శ్రీమతి సరోజిని దేవి
'పర్ణకుటి' భవన ద్వారపాలిక



౬. తాన్ యుషాన్

మరణాంతోపవాసమునకయి శపథముచేసిన చైనాసన్న్యాసి.

చిత్రము z, a, b, c లలో Ear-stitch అను కుట్టు చూపబడి యున్నది. 1 దారమును తీసి, 2 వద్ద గ్రుచ్చి 3 వద్ద తీసి, 4 వద్ద గ్రుచ్చి మరల 3 వద్దనే వెలికి దీసి, 5 వద్ద గ్రుచ్చి మరల 3 వద్దనే వెలికి దీయవలెను. ఈరీతిని వరుసగా కుట్టుచు బోయినయెడల c వద్ద నుండు విధమున ఏర్పడును. పైని చెప్పబడిన కుట్లు ప్రత్యేకముగనైనను, ఒకవిధమగు కుట్టును మరియొకవిధమగు కుట్టుతో చేర్చియైనను మన కిష్టము వచ్చినన్ని చిత్రరూపములను ఏర్పరచుకొనవచ్చును. ప్రారంభమున గల చిత్రము c యందలి కుట్టును ఆకురూపములందు కూడ నుపయోగించవచ్చును.

పాతపాటలు

నేదూరి గంగాధరంగారు

౧

ముగ్గురన్నలతోటి నే బుట్టినాను
నానడుము మువ్వంచు చీర గోరింది
నలుగురన్నలతోటి నే బుట్టినాను
నానడుము నల్లంచు చీర గోరింది
అయిదుగురన్నలతోటి నే బుట్టినాను
నానడుము అద్దాల రవికె గోరింది.

౨

గోడమీద గుడ్డ గొలుసుల గుడ్డ
ఇంత చక్కనిగుడ్డ యెవ రంపినారు
మన్నేన వుండేటి బా వంపినాడు
మన్నెమ్మ పేరేమి బావ పేరేమి
మన్నెమ్మ రాజమండ్రి బావ పుల్లయ్య.

౩

పన్నెండు ధనియాలు పత్తిగింజల్లు
అవి యివి కలబోసి సీత కొడిగట్టి
శ్రీరాము తవ్వేడు సీత తోడింది
మారాము తవ్వేడు మగువ తోడింది.

౪

చెంగుమీద చెంగేసి చేడ చెంగేసి
ఆపైని చెల్లెలిది చేమంతిచెంగు
పడుచు నిస్తావ అన్నా! పాడి నిస్తావ
పడుచు నివ్వ నమ్మా, పాడి నిస్తాను
అక్క వెళ్లి చెల్లెలు కోపగించింది
పాడి నివ్వ నమ్మా, పడుచు నిస్తాను.

౫

వెళ్లే వెళ్లేతోవలో మేడ లున్నాయి
మేడమీద మేనత్త కూతు రున్నాది
మేళమ్ము కట్టుతే మేడ దిగనీదు
సరసమ్ము లాడుతే సాగి నడనీదు.

౬

చక్కన్నివాడమ్మ సారంగధరుడు
చిక్కేడు పింతల్లి చిత్రాంగిచేత
కన్నతండ్రిచేత కట్టుబడలేక
మారుటితల్లి చే మాటబడలేక
అడవిపాలై పోయె అతను సారంగు.

౭

రాయండ్రా పిల్లల్లాల్లా
రాతికింద ముత్యాలు
కరణాలదొడ్లో కాసులపేరు
పందిరిమీద పువ్వులకోడి
కోడి కోడి కొక్కరో కో.

౮

వైరికుక్కను బట్టి వేటాడరాదు
చాదస్తు పెనిమిటితో వేరుండరాదు
గుణవంతుడు పెనిమి టైతే కూడి వుండరాదు.

౯

తిరుపతి చదరాడ తీరైన కొల్లేరు
తగిన పెద్దాపురము తామరాడ
రామచంద్రపురము రచ్చలకు పెద్ద
అటుకులు బెల్లం తినుట కనపర్తి పెద్ద
రాజమహేంద్రమ్ము రంగులకు పెద్ద
కాలసుఖములకును కాకినాడ.

౧౦

పాలడుగు చేబ్రోలు మరి పత్తిపాడు
పులివర్రు సంతన రాఘారు పొనుసూరు
మంగళగిరియును మరి మంచి మునుగోను
నాదెండ్ల రాయిపూడి ఆది నూతక్క
కూచిపూడి తాడికొండ గుంటూరు
పదునాల్గు వసతులు పట్టణములును
కొండవీటి సీమను మరి దండి రొప్పు.

౧౧

చాములు ఉలవలు సజ్జలు కందులు
అరిగలు పెసలు ఆముదాలు మినుగులు
జొన్నలు రాగులు చోళ్లు బొబ్బర్లు
పత్తియు చందలు పదునాల్గు పంటలు
మరి చెప్ప యింకేమి మాచెర్ల సీమ.

౧౨

కాసు పుట్టని వూళ్లు వూసరమళ్లు
దాసరి దేవళ్లు మాసినగుళ్లు
చెవుల ముత్తెముజోళ్లు చిత్రపుమాళ్లు
పెద్దమద్దెళ్లు కడు వేటకాళ్లు
పరదేశి సావళ్లు బంగారు మెడనూళ్లు
తోపుమామిళ్లు మరి తుమ్మబీళ్లు
కర్ణాటదేశమ్ము కలిమి నిలువెళ్లు.

౧౩

పాలరేవళ్లును పాంకోళ్లు సిగముళ్లు
చెవుల వజ్రపురాళ్లు నోర సిగముళ్లు
చేయూటి పదిమూళ్లు చిగురుమాళ్లు
చాలు మామిళ్లు లోతునీళ్లు గల యూళ్లు
ఉప్పుమళ్లు తూర్పు నున్న దేశాలు.

౧౪

సూర్యగ్రహణ మొకటి చుక్కల్లగ్రహణ
మొకటి
ఏడాది కొకసారి చంద్రగ్రహణమ్ము.

ఆస్తి

సోమంచి యజ్ఞన్న శాస్త్రి గారు

'ఆస్తి' అనగా వస్తువులను ఉపయోగించుటకును, అనుభవించుటకును, ఇష్టము వచ్చినట్లు చేయుటకును గల ప్రత్యేకహక్కు. ఇది నా 'ఆస్తి' అనగా నావస్తువును నే నుపయోగించుటకును, ఉపయోగింపక పోవుటకును, దానమిచ్చుట, విక్రయించుట, అద్దె కిచ్చుట మొదలగు పనుల చేయుటకును హక్కు నాకు గలదనుట.

ఉపయోగించుటకును, అనుభవించుటకును హక్కు ఉన్నమాత్రమున నది యాస్తి కానేరదు. ఇల్లు నద్దె కిచ్చినపుడు కాపురమున్నవారాయింటిని ఉపయోగించి అనుభవించుచున్నారు. కాని అది వారి యాస్తి మాత్రము కాదు. ఇష్టమువచ్చినట్లుపయోగించు హక్కు 'ఆస్తి' కి ముఖ్యము. కాపురమున్నవారు అద్దె యింటిని దానవిక్రయాదులు చేయలేరు.

ప్రస్తుతము లోకములో—ఒక్క బోల్షివికు రష్యాలో తప్ప—మనుజుల కున్న హక్కులలో నీ 'ఆస్తి' ఒకటి. అనగా, ఏమనుజుడైనను ఆస్తిని సంపాదింప వచ్చును. అట్లు సంపాదింపబడిన ఆస్తులనురించిన 'న్యాయముల'కై కోర్టువారి సంరక్షణ పొందవచ్చును.

కాని పూర్వమునుండియు అన్నిచోటులను ఈ హక్కు లేదు. అమెరికాలో బానిసత్వ మున్నపుడు బానిసలు ఆస్తిని సేకరింప వీలు లేకుండెడిది. Feudalism లో సాధారణముగా భూమియంతయు ప్రభువులది. రైతులు దానిని కవులుకు తీసుకొన మాత్రము సమర్థులు.

ఫ్రెంచిరివల్యూషనులో వారు గుర్తించినహక్కులలో నొకటి 'ఆస్తి'. అటులనే అమెరికా యింగ్లాండునుండి విడిపోయినపుడు 'ప్రతిమానవునకును—బానిసలు తప్ప—అనగా ప్రతి తెల్లవానికిని—ఆస్తిని సేకరించుటకు హక్కు గలదు' అని గుర్తించిరి.

కాని యీహక్కు మంచిదా, చెడ్డదా యను సందేహము ౧౯-వ శతాబ్ది చివరభాగమునుండి ప్రబలుచు వచ్చినది. రష్యాలో చివరకు ౧౯౧౭ లో ప్రత్యేక ఆస్తు (Individual Private Property) లుండకూడదని తీర్మానించిరి. రష్యాలో ఎవరినుటును వారాస్తులను సేకరించకూడదు. ఆస్తియంతయు సంఘమునకు చెందును. ప్రతిమానవునకును అనుభవించుటకో, ఉపయోగించుటకో మాత్రమే హక్కు గలదు.

కాని మిగిలినదేశము లీపని చేయలేదు. పూర్వము వలెనే ప్రతిమనుజుడును ఆస్తిని సంపాదించి యనుభవింప వచ్చును. కాని కొన్నికొన్ని మార్పులుమాత్రము జరిగినవి.

ఈ పరిణామమునకు కారణము ఆస్తి కొన్ని చెడుగులకు కారణ మగుచున్నదని గుర్తించుటయే. అందుచేత మన విమర్శనము, ఏ యేకారణములచే 'ఆస్తి' సంఘకల్యాణమునకు కారణమో, ఏవిధముగా నది చెరుపో, యిప్పటి కర్తవ్య మేమో ఆలోచింపవలసి యున్నది.

ప్రత్యేకముగా ప్రతియొకరికిని 'ఆస్తి' ఉండవలె ననుటకు కారణములు:

౧. ఏమనుజుడు కష్టపడిన, దాని ప్రతిఫలము వాడే యనుభవించుట నీతిదాయకము, ధర్మము. చెట్టు నాటినవాడొకడైన ఫలములు తినువాడు మరియొకడుండుట న్యాయము కాదు. బానిసలు కష్టపడి పండించినదానిలో భాగమైనను వారి కీయక యజమానులనుభవించుట తప్పనియే బానిసలను విడిపుచ్చి, వారికికూడ ఆస్తిని సేకరించుకొనుటకు హక్కు నిచ్చుటకు ముఖ్య కారణము.

అది గాక తాను జేసినదానికి ఫలముగ తాను గాక మరియొకడు సౌఖ్యపడు నని తెలిసిన పనిచేయువారరుదుగ నుందురు. అందరును ఆత్మత్యాగు లగుదురా? పనిచేయనివారి సంఘము సోమరిపోతుసంఘమై చెడి

పోవును. అట్టి సంఘమున కధోగతియే కాని ఊర్ధ్వగతి యుండదు. అందుచేత మనుజులు పనిచేయవలెనన్న, వారి ఫలము వారికి ముట్టునను నమ్మక ముండవలయును. అట్టిదియే ఆస్తిని కలిగియుండుటకు గల హక్కు.

౨. మానసికముగ నాలోచించిన మనుజుడు కష్ట పడుట కదైన 'యెర' యుండవలయును. కూలిపని వారి కష్ట మింతింత యనరానిది. ఏ పని చేయుటకూడ కష్టమే. కాని కూలివాడు ధనముకొరకై కష్టపడి పని చేయును. అటులనే ప్రతివాడును. తన కదైన ప్రతి ఫలము ముట్టునని నమ్మక ముండిన గాని యెవ్వరికిని పనిచేయ నిచ్ఛ పుట్టదు. అట్టి యిచ్ఛను పుట్టించి మను జునిచేత పనిని చేయించునది 'ఆస్తి' యే.

౩. మనుజు డెల్లకాలమును ఆరోగ్యవంతుడై యుండి పని చేయలేడు. కొంతకాల మతనికి జబ్బు చేయవచ్చును. వార్ధక్యమున పనిచేయుట కష్టము. లేదా పనిచేయ శక్తి యున్నను పని దొరకక పోవచ్చును. పని చేసినపుడు 'ఆస్తి' ని సంపాదించుకొనియున్నచో ఇట్టి సమయముల నాతనికి పనికివచ్చును. కాకపోయిన మిగుల కష్టపడును. అందుచేతనే ప్రతివారును సంపాద దనము కొంత వెనకకు వేసికొని కూడబెట్టుకొందురు. అట్లు కూడబెట్టుకొనుటకు హక్కు ప్రతివారికిని ఉండవలెననుట న్యాయము.

౪. మనుష్య నాగరికతను మనము జూచిన యెడల నాగరికత వృద్ధి పొందుటకు కారణము 'ఆస్తి' యే యని తేలుచున్నది. చరిత్రకు పూర్వకాలమున (Pre-historic) 'ఆస్తి' లేదు. వేటాడి జీవించు నపుడు తాను చంపినదానిని తిని వేసెడివాడు. తొడుగు కొనిన కొన్ని చర్మములు తప్ప 'నావి' అనుకొనుటకు వాని కేమియు లేవు. వారు దేశదిమ్మరులు. వేటాడుచు నెంతదూరమైనను పోయెడివారు. అట్టివారికి విజ్ఞానము, నాగరికత చాల తక్కువ. కాని రాను రాను, 'ఉన్న దానిలో వెనుక వేసికొనుట' ప్రబలినది. ఎక్కువ దొరకిన నాడు కొంత దాచుకొని, దొరకనినా డుపయోగించు కొనెడివారు. తరువాత భూములను వ్యవసాయము చేయుట వచ్చినది. అప్పుడైనను 'ఆస్తి' యంతయు సంఘమునకు చెందియుండెడిది కాని ప్రత్యేకముగా ప్రతి ఒక్కరికిని 'ఆస్తి' లేదు. రానురాను ఎవరిమటుకు వారాస్తిని సంపాదించుకొని, ఉపయోగించుకొనుటకు మొదలిడిరి. అప్పుడే నిజమైన విజ్ఞానము, నాగరికత ప్రబలినవి. 'నాది' యనుదానియం దొకవిధమైన భావ మునయించును; నాదేశము, నాతల్లి అనుభావములు 'ఆస్తి' కి హక్కు గుర్తింపబడినతరువాతనే వచ్చినవి. అందుచేత నాగరికతకు మూలము 'ఆస్తి' యే.

౫. ఆస్తిమూలమున మరికొన్ని చిన్నలాభములు కూడ కలిగినవి. ధన మున్నవానికి దానముచేయవలె ననుబుద్ధి, బంధువులయెడ ప్రీతి, వారిని పోషించుట మొదలయిన సుగుణము లలవడును. అందుచేత 'ఆస్తి' మూలమున సంఘము చాల లాభములను పొందినది, పొందును. 'ఆస్తి' యే లేకపోయినచో నాగరికత, విజ్ఞానము వృద్ధి పొందవు.

ఈ సమర్థనవాదముల ననుసరించి ప్రతిదేశమునను ప్రతిమనుజునకును 'ఆస్తి' కి హక్కు ఈయబడినది. కాని దీనిమూలమున సంఘమునకు కొన్ని చెరుగులు గూడ కలిగినవి. అందుచేత 'ఆస్తి' కి ప్రతిమానవున కును హక్కుండకూడదనియు, అథవా ఇప్పుడున్న టుల గాక యీహక్కును కొంత మార్చవలయు ననియు నొక బలమైన వాదము బయలుదేరినది. ఈవాదము ననుసరించియే రష్యాలో Private Property ని తీసివేసిరి. ఆస్తిని వలదని యెవ్వరును అనరు. కాని 'ఆస్తి' సంఘమున కుమ్మడిగా చెంద వలయునా లేక ప్రతిమనుజుడు వేరువేరె 'ఆస్తి' ని కలిగి యుండవచ్చునా అనునదియే సమస్య.

దీనికి కారణములు :

౧. తాను చేసిన పనికి ప్రతిఫలము తాను పొంద వలయుననియు, నట్టిది 'ఆస్తి' మూలమున జరుగు చున్నదనియు చెప్పు వాదము సత్యము కాదు. ఇప్పు డున్న 'ఆస్తి' యేవిధముగ వచ్చినదో మనము పరీక్షచేసి చూచిన యీసంగతి బోధపడును. మనలో

'ఆస్తి' ని కలిగి యున్నవారిలో ముప్పాతికమంది జమీందారులు. వీరందఱును ఒడలు వంచి కష్టపడుట మూలముననే వీరికీయాస్తి వచ్చినదా? కష్టమే గణింపబడునేని నిజముగ కష్టపడువా డెవ్వడు? తెల్లవారుజామున నాలుగుగంటలనుండి రాత్రి తొమ్మిదిగంటలవరకు, ఎండనక వాననక కష్టించునది రైతా, లేక కాలుమీద కాలు వైచుకుని కూర్చుని, మెత్తనిదిండ్ల కారులలో 'కడుపులోని చల్ల కదలకుండ' తిరుగు జమీందారులా? ఒకరు కష్టించినదాని ప్రతిఫల మింకొక రనుభవింపకుండుటకు 'ఆస్తి' కి హక్కుండవలయునట? కష్టపడునది రైతుబిడ్డ; కవులుకు తీసికొనినవాడు. అనుభవించునది భూమి నొకమారైనను జీవితకాలములో చూడక, భూమి యేదిక్కున నున్నదోకూడ తెలియని జమీందారుబిడ్డ. ఇది 'ఆస్తి' మూలముననేకదా. ఇదియా ధర్మము, న్యాయము? జమీందారున 'కాస్తి' యెటుల వచ్చినది? దైవవశాత్తు జమీందారునింట పుట్టినంత మాత్రమునకదా! ఇట్టి స్థితిలో 'ఆస్తి' కష్టమునకు ఫలమని చెప్పుట సత్యమా? ఇప్పటిస్థితిలో చాలమటుకు 'ఆస్తి' పుట్టుకకు ఫలముగ కన్పడుచున్నది గాని, కష్టమునకు ఫలముగ కన్పించుట లేదు.

మనము నివసించునది ప్రజాస్వామిక పరిపాలనములో. ఇందు పుట్టుకకు స్థానము లేదు. శక్తియే ముఖ్యము. మాక్డొనాల్డు పూటకు గతిలేనివాని కొమరుడు; పైకివచ్చినది తనశక్తిమూలమున. కాని అంతటివాని కొమరుడు కుంటి కావచ్చును. మేక్డొనాల్డుకొడుకని యాతనికి ప్రత్యేకస్థానము లేదు. పుట్టుకకు స్థానము లేనపుడు, పుట్టుకపై నాధారపడియుండు 'ఆస్తి' (Hereditary Property) కి కూడ స్థానము లేదు. దీనికుదాహరణము: సంతానము లేని ధనవంతుడు చనిపోయినపుడు పదిహేనుతరములనాటి ౨౦ వేల్లు విడిచిన మేనత్తకొడుకో, పినతల్లికొడుకో, వారసుడొకడు బయలుదేరి 'ఆస్తి' ని తెచ్చుకొనును. అది దేనిపై నాధారపడిన హక్కు? అబద్ధము లాడి కష్టపడినందుకా? కష్టమునకును ప్రతిఫలమైన 'ఆస్తి' కిని సంబంధమే లేదిపుడు. అందుచేత ఈ వాదన సత్యము కాదు.

లేదా, ఒకవేళ కొంచెము సంబంధ ముండినను చాల వ్యత్యాస ముండవచ్చును. రోజంతయు కష్టపడిన కూలివానికి నాలుగణాలు. మోసముచేసి మాయమాటలు చెప్పి దొంగసరకు లంటగట్టు సాహుకారునకు రోజున కేబదిరూపాయిలు.

కాకపోయిన, చేయుపని సంఘమునకు లాభకారి కాకపోవచ్చును. అబ్కారీపాట పాడి కల్లమ్మినవానికి ధనము మిక్కుటముగ వచ్చును. కాని దాని మూలమున సంఘనీతి, శాంతి మొదలయినవి చెడిపోవుచున్నవి. అందుచేత నిట్టి 'ఆస్తు' లను కష్టములకు ప్రతిఫలములని సమర్థించుట సత్యము కానేరదు.

౨. రెండవవాదము కూడ—పనిచేయవలెనన్న కోరిక యుండవలెననుట—సరికాదని రష్యావా రిపుడు లోకమునకు చాటుచున్నారు. రష్యాలో ప్రతివాడును 'ఆస్తి' కూడబెట్టుకొనుటకు వీలు లేదు. 'ఆస్తి' అంతయు సంఘమునకే చెందును. కాని అచట పని చేయుట లేదా? వారి ఐదేండ్ల ప్రణాళిక నెగ్గినదని వా రనుకొనిరిగదా!

సోమరితనముకూడ కష్టమే. ప్రతివాడునుకూడ కొంతపనిని చేయ నిచ్ఛగించును. కాని పని మిగుల కష్టమైన దయినప్పుడే వాడు ప్రతిఫలము కోరును. అందుచేత పని విసుగెత్తకుండ చూచినయెడల మనుజులు ప్రతిఫలము లేకనో, లేక కొంచెము ప్రతిఫలముతోనో—తాను సౌఖ్యముగ నివసించుటకు తగినంతతో—తృప్తిపడును. అందుచే మనుజులచే పనిచేయించుటకుగొప్ప 'ఆస్తు' లవసరము లేదు.

౩. కూడబెట్టిన 'ఆస్తి' యంతయు తాను కష్టకాలములందున్నపుడు సహాయపడుటకు కూడపెట్టినది కాదు. నూటికి ౧౦ రూ.లకు వడ్డీకిచ్చి, పాపమును కూడబెట్టినట్లు ధనమును కూడబెట్టిన పీనాసి చనిపోవునపుడు డాక్టరునకైన దమ్మిడీ నిచ్చుటకు సమ్మతింపడు. ఇట్టివాటికి సరియైన మార్గము 'ఆస్తి' ని కూడబెట్టుకొనుట కాదు. భీమాలను చేయించుకొనుటయే. ఇంగ్లాండు మొదలయిన దేశములలో పనిలేనివారి

జీవితములకు భాయిలాపడినపుడు, ముసలితనమునకు భీమా లున్నవి. వానిమూలముననే నిజమైన, సరియైన సహాయమును పొందగలుగుచుందురు కాని సంపాదించిన 'ఆస్తి' మూలమున కాదు.

౪. అన్నిటికన్నను ముఖ్యమైనకారణ మింకొక టున్నది. మనము చరిత్రను బాగుగ పరికించి చూచిన యెడల నది యంతయు రాజకీయవిషయములవల్ల నైనది కాదు. చాలమట్టుకు — అంతయుకూడ నని — ఆర్థికవిషయములవలన నేర్పడిన దని, లెనిన్, మార్క్సు (Lenin, Marx) మొదలయిన మహాశయుల యభిప్రాయము. జపానునకును, చైనాకును జరుగు యుద్ధము రాజకీయ సంబంధములవలన కాదు; ఆర్థికవిషయముల వలననే. అటులనే గడచిన ఐరోపాసంగ్రామము, ఫ్రెంచి రివల్యూషను, అమెరికను యుద్ధము, ఇంగ్లండులోని అంతఃకలహము (Civil War) అని చాలమంది యభిప్రాయము. అందుచేత నార్థికవిషయము చాల ముఖ్యమైనది. దానిపైననే దేశకల్యాణము, లోకకల్యాణము ఆధారపడి యుండును.

ఇపుడు లోకములో ధన మెట్లు పంచబడి యున్నదో చూచినయెడల కనిపించునది, వేళ్లమీద లెక్కింపదగు ధనికులు, లెక్కకు మిక్కిలిగు బీదలు. బీదలకు, ధనవంతులకు సంబంధమే లేదు. "బీదలును, ధనవంతులును రెండు కులము" లని యొకరు చెప్పినది చాలమట్టుకు సత్యము. దీనిమూలమున సంఘమునకు చాల నష్టములు కలవు.

ఏపనిని చేయుటకైనను, ధనము — పెట్టుబడి — అవసరము. అది కొందరిదగ్గరనే యుండును. కాన వారే ప్రభువులు. బీదలకు వారే ఆధార మగుటవలన బీదలు గొప్పవారిచేతిలో కీలుబొమ్మలు. వారి ప్రాణము లింకొకరిచేతులలో నున్నపుడు వా రేమి చెప్పిన చేయరు? అందుచేత చాలమంది బీదవారు పేరునకు స్వతంత్రులయినను, నిజమునకు ధనవంతులకు బానిసలు. రాజకీయ-బానిసత్వము, మతైక-బానిసత్వము పనికిరాదను నీకాలము ఆర్థిక-బానిసత్వమును సహించునా? సహించిన, పూర్వము చెప్పినటుల, రాజకీయ మార్థికముపై నాధారపడి యుండుటచే నావిషయమున మాత్రము వారు బానిసలు కారా?

మనలో చాలమందికి 'వోటింగు' అధికారము కలదు. ఇందులో నిజముగా, తగినవానికి వోటు నిచ్చెడివా రెందరు? ఇతరులకు లోబడి వోటుచేసెడివా రెందరు? ఒక జమీందారునికడనున్న పరివారమువా రందఱును ఆతనిపై ఏవిధముగ నాధారపడి యున్నను, చెడ్డవా డని తెలిసినను, ఆతనికో, ఆతను చెప్పినవానికో వోటుచేసి తీరవలయును కదా. లేకపోయిన తమ యుద్యోగము, తిండి పోవు నని భయము. మరి యిక వోటువలని ప్రయోజన మేమి? ఆర్థికముగ దాసానుదాసులై యుండి, మేము రాజకీయముగ వోటుచేయగల యధికారమును పొందియున్నారము గావున స్వతంత్రుల మని చెప్పుకొనుటయందలి యర్థ మేమి? ఎన్ని యెలక్షనులలో ధన మిచ్చి వోటులను వేయించికొనుట లేదు? నిజముగా నాలోచించిన ఎలక్షనులను నీతిరహితముగ జేసి పాడుచేసినది యీ ధనవంతులే.

రాజకీయముగనే గాక సాంఘికముగకూడ నొకని కడనే ధనరాసు లుండుట చాల అనర్థదాయకము. సంఘమున ధన మున్నవాని మాటయే చెల్లును. బీదవా డెంత సుగుణవంతు డైనను ఆతనిమాట లెక్కకే రాదు. ధనము నెవ రిచ్చి వేనిని కొనిన, వానినే సంఘము తయారు చేయుచుండును. ధనవంతు డొకడు, అనవసరమైనను, పదివేలరూపాయిల నొక మోటారుకారు కొర కీయగలుగును గాన సంఘము మోటారుకారులనే తయారు చేయును. పదివేలమంది 'అన్నమో రామచంద్రా' యని యేడ్చుచున్నను వారు ధనము నిచ్చుకొనలేరు గాన వారిసంగతి పాలకించువారే యుండరు. సంఘకల్యాణమునకు న్యాయబుద్ధితో, ధర్మబుద్ధితో నాలోచించిన ఏది ముఖ్యము? కారా, లేక పదివేలమందికి భోజనమా? అమిత ధనవంతులు లేక, ధనము ప్రతివారికి కొంచెముకొంచె మున్నయెడల ఒకనికి కారు లేకపోయినను, పదివేలమంది కన్నము దొరకియుండును కదా? కారులు మొదలగు భోగవస్తువుల (luxuries)

ము చేయుటకు ఎంతమంది పనిచేయుచున్నారో? అమితధనము కొందరికడనే కూడియుండినయెడల, వారిమూలమున సంఘముయొక్క శక్తి 'అవసరముల' (necessities) కొరకు కాక భోగములకొరకు వెచ్చింపబడును. Laski మహాశయుడు వ్రాసినట్లు, పదివేల పడిపోవు గుడిసెలప్రక్క నొక రాజసౌధము. వేలకొలది జనమునకు గంజి త్రాగి ప్రాణముల నిల్పుకొనుటకుగూడ లేనప్పు డొక జమీందారునకు 'సిగరెట్లకాగితము' లు ప్రత్యేకముగ పారిసులోనో, అమెరికాలోనో తయారు కాబడి వచ్చును. ఇదియా న్యాయము?

ఇంతే కాక, ధనవంతులు చేసినపనిని బీదలుకూడ ననుకరింపజూతురు. ధనమదాంధతచే క్రొవ్వియున్న పుల్లమ్మ ధరించిన 'లోలకు'ల వంటివి—డైమండులవి కాకపోతే, ఇమిటేషన్వైనా సరే—ప్రతి వెంకమ్మ, యెల్లమ్మ ధరించవలసినదే. 'మింగ మెతుకు లేనివాని మీసాలకు సంపెంగనూనె' యను సామెత వ్యర్థమైనది కాదు. ఇట్టివాటిమూలమున దేశములో దారిద్ర్యదేవత తాండవించును. సంఘమున దురాచారములు హెచ్చును కాని కల్యాణమును పెంపొందింపవు. అందుచేత ఇప్పుడున్న విధమున ప్రత్యేకపు ఆస్తి (Private Property) ప్రజాస్వామికపరిపాలనమునకు, సమత్వమునకు, స్వతంత్రత్వమునకు వ్యతిరిక్తము. అందుచేత 'ఆస్తి' ని ఇప్పుడున్నటులకాక మార్చుటయో, లేక పూర్తిగా తీసివేయుటయో ముఖ్యావసరము.

ఒకవేళ పనిచేయుటకు కొంత 'ఆస్తి' రూపకమైన ప్రతిఫల మవసరమని యొప్పికొనినను, ఇప్పుడున్న పరిస్థితులు దానికి సహాయకారిగ నుండుట లేదు. ఇప్పుడు ధనమున్నవారు 'వారికే మమ్మా, తండ్రులు గడించి పెట్టారు. హాయిగా కాలిమీద కాలేసుకు తినొచ్చు' ననే స్థితిలో పడ్డారు. పని చేయకపోయిన సంఘము సోమరిదగును. పనిచేయవలెనన్న 'ఆస్తిని' చేసికొనుటకు హక్కుండవలె ననునది వ్యర్థవాద మగుచున్నది. 'ఆస్తి' యుండుటచే పనిచేయుట మానివేయుచున్నారు, చాలమంది. అందుచే ధనమే సోమరిసంఘమును తయారుచేయుచున్న దేమో యను అనుమానము గల్గుచున్నది.

౫. మన మిప్పుడు ధనదాసులము. ధనదాహ మందరికి మెండు. ధనమును పూజచేయుచున్న కాలమిది. 'రూపాయిలో దేవు డున్నా' డనునది సామెతై పోయినది. దీనికి కారణము 'ఆస్తి' యే. లెక్కకు వచ్చినది ధనమే కాని, ధన మెట్లు సంపాదింపబడినదో యెవ్వరికిని అక్కరలేదు. 'వెధవసొమ్ము. భోగంది గడిస్తుంది' అను మాటలు పాతమాట లయినవి. ధనవంతునకే అందరును చేతు లెత్తుట. ఆ ధనము ప్రజలను మోసము చేసి సంపాదించినను సరియే. అందుచేత నిప్పుడు ప్రతివానికి ఎంత త్వరితకాలములో — మంచినో, చెడ్డనో—గొప్పవా డగుట యెట్లా యనెడి చింత తప్ప వేరొకటి లేదు. అందుచేత సంఘము చెడిపోయి, నీతి శూన్యమగుచున్నది కాని మరొకటి కాదు.

దేశములోని రాజ్య మందరికొరకును ఏర్పడియున్నది కాని దేశములోని ఒకపక్షమువారికొరకు కాదు. కాని ఎప్పుడును ధన మున్నవారి చేతియందే అధికార ముండుటవలన జరిగెడి పనులన్నియు వారి సౌకర్యముకొరకే జరుగునుగాని బీదల సౌకర్యముకొరకు గాదు. నూటికి ఒకడో యిద్దరో ధనవంతులు కొను కారులపై సుంకముల తగ్గింతురు కాని, ఊరక వచ్చిన, దానిమూలమున నింకొక వస్తువు బీదలకు కొన వీలగునట్లు చేయరు, ఉప్పుమీది పన్నుకు లెక్కచేయువా రెవరును ఉండరు. టోలుగేట్లు కారుల కక్కరలేదట, ఎద్దుబండ్ల కుండవలెనట!

అందుచే రాజ్యము, సంఘము ధనవంతుల దగుచున్నది కాని ప్రజల దగుట లేదు. దీని మూలమున 'న్యాయము, ధర్మము, నీతి' మంట గలియుచున్నవి. మొన్న మాస్కోయందు బ్రిటిషువారిని విచారణ చేయుచు, రషియను కోర్టులు న్యాయస్థానములు కావనినదానికి జబాబుగ నచటి న్యాయవాదిగారు 'ఆదేశములలో బీదల కొకవిధమైన న్యాయమును, ధనవంతులకు మరియొకవిధ మయిన న్యాయమును గలదు. కాని రషియాలో న్యాయ మందరికి నొకటే' అనిరి.

ఈదుర్గుణము లన్నియు మూర్తీభవించినవారు మన 'మహారాజులు.' వీరు తిండిలేక మలమల మాడు ప్రజల

కడనుండి పన్నులను వసూలుచేసి, సంవత్సరమున కారు నెలలు పారిసులోనో, లండనులోనో గడపి ధనము నంతయు తగులవేసెదరు. వీరినిగురించి యెంతకఠినముగ వ్రాసినను అన్యాయము, అసత్యము కానేరదు.

అందుచేత ఇప్పటి సమస్య: మంచికంటె చెడుగులనే యెక్కువగా గల యీ 'ఆస్తి' కి హక్కును ప్రతిమనుజునకును యివ్వకుండ, రష్యాలో వలె పూర్తిగా సంఘమునకే యిచ్చుటా, లేక 'ఆస్తి' యొక్క చెడుగు దేనివలననో కనుగొని, ఆచెడుగులు రాకుండ యీహక్కును మార్చుటా?

'ఆస్తి' ని పూర్తిగా తీసివేసిన, దానియొక్క మంచికూడ పోవును. వ్యాధిగల మనుజుని వ్యాధిని తీసివేయక, మనుజునే సంహరించినట్లు, 'ఆస్తి' నే పూర్తిగ తీసివేసిన, ఉండు నని చాలమంది పెద్దల యభిప్రాయము. రష్యాలోకూడ నిమర్శన కొన్ని విధము లైన వస్తువులను 'ఆస్తి' గా స్వీకరించవచ్చు ననియనిరి.

ఇన్ని చెడుగులకు ముఖ్యకారణము ధనము చాల కొద్దిమందియొగ్గర చేరుకొనుటయే. అందుచేత ముఖ్యముగ చూడవలసినది, యెవరికడనుకూడ ధనరాసులు కూడకుండుటయే. అందుచేతనే కాంగ్రెసువారు, ఉద్యోగమునకు నెలకు ౫౦౦ రూ. ఉండిన చాలు నని యభిప్రాయపడిరి. ౧౦ రూ. సంపాదించువారు ౧౦ వేల మంది, ౨౫ వేలు సంపాదించువారు యిద్దరు ఉండుట కంటె అందరును ౫౦ రూ. మొదలు ౪౦౦ రు. వరకు కలిగియుండుటచే సంఘమునకు కల్యాణదాయకము. అందుచేత చెడుగులను తగ్గించుటలో నొక విధము ఇంతకంటె యెక్కువ జీతము లుండరా దనుట. ప్రతిదేశములోను ఈ సంగతి గుర్తింపబడినది. తన సొమ్ము కాదని పంచిపెట్టే హిందూదేశంలో తప్ప, ఎక్కడా యింత హెచ్చు జీతములు లేవు. అది గాక Income-tax, Super-tax, Profession-tax ల మూలమున కొంత సంఘమునకు చేరుచున్నది.

లోకములో గనులు, భూమి మొదలయినవి స్వభావసిద్ధములు. వీనిని మనుష్య ప్రయత్నముచే నెక్కువచేయలేము. కావలెనన్న ఒక్క రోజులో కొన్ని కోట్ల గజముల గుడ్డను తయారుచేయవచ్చును. కాని సెంటుభూమినికూడ కల్పించలేము. అందుచేత వీనిని జాగ్రత్తగా వాడుకొనవలెను. భూమి యున్న గాని ధాన్యము పండించుటకు వీలు లేదుగదా? ఒక లక్షాధికారి చుట్టుప్రక్కల భూముల నన్నిటిని కొని చాల ఎక్కువకు గాని కవుల కీయనని పట్టుపట్టిన మరి సామాన్యుల గతి యేమి? ఇట్టిస్థితి యేర్పడినపుడే పూర్వము రోము నందును, గ్రీసునందునుకూడ కొన్ని యెకరముల భూమి కంటె నెవ్వరును ఉంచుకొనకూడదను శాసన మొకటి యుండెడిది. అట్టిశాసన మొకటి ముఖ్యావసరము.

అది గాక, యీ హక్కునకు గలది—ఉపయోగించిన ఉపయోగించవచ్చును, లేకపోయిన ఊరకొనవచ్చును. అందుచే 'గడ్డివాములోని శునకము' వలె స్వభావసిద్ధమయినవాటిని (భూమి మొ.) ఉపయోగింపకపోయిన, ఎవరికిని లేకుండచేసినవా రగుదురు. అట్టివి జరుగకుండ చూడవలెను.

కష్టపడకుండ ఎవరికిని ధనము అనవసరముగా రాకుండ చూచుట చాల ముఖ్యమైనది. అనగా, తండ్రి సంపాదించిన సొమ్ము కాలుమీద కాలు వేసికొని తిను వారి సంఖ్య తగ్గించవలెను. ఇంగ్లాండు మొదలయిన దేశములలో ఎస్టేటుదారు చనిపోయి, ఆతనికొడుకు దాని కధికారి అయిన ఆతనికడనుండి ౫౦% వరకు పన్ను క్రింద తీసికొందురు. ఇందుమూలమున తండ్రి సంపాదించిన అంత ధనమునకును ఆత డధికారి గాక, కొంతదైనను రాజ్యమున కిచ్చును.

ఇప్పటికాలమున 'ఆస్తి' చాలమటుకు పెట్టుబడి మూలమున ఉన్నది. మిల్లులయందో, వ్యాపారమునందో పెట్టుబడి యైయున్నది. అట్టి 'ఆస్తి' యొక్క హక్కును మూడువిధములుగ విభజింపవచ్చును—

i వడ్డీని అనుభవించుటకు

ii లాభములను పొందుటకు

iii అధికారము చేయుటకును, స్వాధీనమునం దుంచుకొనుటకును గలహక్కులు (right to control).

వీనిలో ఒక్క మొదటిదాని ననుభవించుటకే న్యాయమైన యధికార మున్నది. లాభమును అందరితోను కలిసి—మిల్లునకు పెట్టుబడి పెట్టిన, మిల్లులో పని చేయువా రందరితో కలిసి—యనుభవించవలెను. అధికారము చేయు హక్కుండకూడదు. గవర్నమెంటు సెక్యూరిటీలలో ధనమును పెట్టుబడి పెట్టినను కూడ గవర్నమెంటువారిపై నధికారము చెలాయించుటకు ఎట్లు వీలు లేదో, అట్లే మిల్లులో పెట్టుబడి పెట్టినను కూడ మిల్లును స్వాధీన పరచుకొనుటకు అధికారముండకూడదు. అట్టి అధికారము రాజ్యమునకో, సంఘమునకో యుండవలయును.

వీనిని చేసినయెడల 'ఆస్తి' వలన కలుగు చెడుగులు చాలమటుకు తగ్గిపోయి దాని మంచిలాభము లనుభవించుటకు వీలగును. ప్రజాస్వామిక రాజ్యములో ఇప్పుడున్నటువంటి 'ఆస్తి' కి తావు లేదు. లేకపోయిన ప్రజాస్వామిక రాజ్యము వెక్కిరింపు, కన్నీళ్లతుడుపు కాని నిజము కానేరదు.

ప్రేమగాయకుఁడు

బాలాంత్రపు వేంకటరావుగారు

౧

మాన్యుఁ డగు రాము చరిత రామాయణముగ
మానవతి సీత చరిత రామాయణముగ
మానవప్రేమచరిత రామాయణముగ
మౌని వెలయించెఁ దన ప్రేమగానమందు—

౨

సీత పూతచరిత్ర ప్రసిద్ధమయ్యెఁ
గుశ లవ సురూప విభవంబు విశదమయ్యె
జానకీపతిమది సుప్రసన్నమయ్యె
మౌనిరత్న దివ్య ప్రేమగానమందు—

౩

లలిత సుకలాభ్యుదయమూర్తి లవునియందు
కుశలమంత్రాభ్యుదయమూర్తి కుశునియందు
చిరపవిత్రాభ్యుదయమూర్తి సీతయందు
మౌని వెలయించెఁ దన ప్రేమగానమందు—

౪

ఇతఁడె-ఆ ప్రేమగాయకుఁడు-ఇతఁడె-యితఁడె
యాతఁడె-యితండె యని పంచభూతములును,
దశదిశ, లనంతభువనముల్, నిశలుఁ బవలు,
పాడి చెప్పుచునున్నవి నాఁడు-నేఁడు—

వ్యవసాయ మన నేమి?

దువ్వూరి బాలకృష్ణమూర్తిగారు

"కృషి", "వ్యవసాయము" అను ఈ రెండును సంస్కృత పదములు. సంస్కృతములో "కృషి" అనగా నేల దున్నుట, పంటలు పండించుట అని అర్థము. వ్యవసాయము అనగా ప్రయత్నము, పాటు పడుట అని యర్థము. అయినను తెనుగులో "వ్యవసాయము" అనుమాట నేలను దున్ని పంటలు పండించుట అను అర్థమున వాడుచున్నారు. ఈ అర్థమును దెలుపుటకు ఇంగ్లీషులో "అగ్రికల్చర్" అనుమాట వాడుదురు. ఈ మాటకు నేలను పనిచేయుట అని వ్యుత్పత్త్యర్థము.

వ్యవసాయము అనుమాటలో ఎంతో గొప్ప అర్థము ఇమిడియున్నది:— నేలను మొక్కలు పెరుగుటకు తగిన స్థితికి తెచ్చు మార్గములు అవలంబించుట, అందుకు కావలసిన పనిముట్లను, ఇతర సాధనములను సేకరించుట, దేశ కాల భేదములనుబట్టి ఆలోచించి తగిన విత్తనములను సంగ్రహించుట, ఆవిత్తనములు చెడకుండునట్లు కాపాడుట, దానిని చల్లుటకు కావలసిన పరికరములను, సాధనములను కూర్చుట, విత్తనములు మొలచిన తరువాత మొక్కలకు చీడలు పట్టకుండునట్లు కాపాడుట, ఆ మొక్కలకు కావలసిన ఆహారము నేలలో సమకూర్చుట, నీరు కావలసినప్పుడు వాన లేనిమెడల ఏళ్లు, చెఱువులు, బావులు మొదలగువానినుండి మొక్కలకు నీరు పెట్టుట, అందుకు వలయు సాధనములను సమకూర్చుట, ఆమొక్కలకు గాలి, పశువులు, పక్షులు, దొంగలు మొదలగువారివలన బాధలు కలుగకుండునట్లు సంరక్షించుట, పండిన చేలు యుక్తకాలములో కోసి, నూర్చి, గింజలను శుభ్రముచేయుట, ఆగింజలలో ఎంచి మంచివి విత్తనములకొరకు భద్రపరచుట, వ్యవసాయపుపనులకు కావలసిన పశువులను సేకరించి వానికి వ్యాధులు రాకుండునట్లు కనిపెట్టి సంరక్షించుట, వాని ఆరోగ్యమునకు హాని కలుగకుండునట్లు వాని మలమూత్రాదులను భద్రపరిచి నేలకు ఎరువుగావేయుట— ఇవి మొదలుగాగల అన్నిపనులును వ్యవసాయ శబ్దార్థములో ఇమిడియున్నవి.

యూరోపు మొదలగు పశ్చిమఖండముల వారు ఇంకను పెక్కుపనులు వ్యవసాయములోనివిగానే భావించుచున్నారు:—పశువులను పెంచి, పాలు, పెరుగు, వెన్న, నేయి మొదలయిన పదార్థములను తీసి, వానిలో నిలువ చేయవలసినవానిని చెడకుండునట్లు నిలువ చేయుట, పాడికి పనికిరాని పశువులను కటిక వారి కమ్ముటకై కొవ్వెక్కునట్లు మేపుట, పనులు చేయుటకు తగిన మంచిమంచిజాతుల

ఎడ్లను, గుఱ్ఱములను వృద్ధిచేయుట, కటిక వారికి అమ్ముటకొరకు పందులను పెంచి వాని ఆహారముకొరకు దుంపజాతులు మొదలగునవి పండించి ఆ పందులను క్రొవ్వు పట్టునట్లు మేపుట, కోళ్లు మొదలగు పక్షులను పెంచి, వానిని, వాని గ్రుడ్లను అమ్ముకొనుట, బొచ్చు కొరకును, మాంసముకొరకును గొఱ్ఱెలను పెంచుట, చెరువులు మొదలగు జలాధారములలో వివిధజాతుల చేపలను పెంచుట, తేనటీగలను పెంచి, వానికి వలయు తేన గల పూవులకొరకై చెట్లు పెంచి, మంచి మంచి తేనపట్లు పెట్టించుట, పట్టుపురుగులను పెంచి, వాని ఆహారముకొరకు, తగిన చెట్లు పెంచి, "కోసెనకాయలు" పట్టించుట—ఇవి మొదలగు పనులన్నియు వ్యవసాయములోనివే అని వారు చెప్పుదురు.

మొత్తముమీద అన్నవస్త్రములకు పనికి వచ్చు మొక్కలను, జంతువులను పెంచుట వ్యవసాయము అనవచ్చును.

భారతభూమికి వ్యవసాయము వెన్నెముక

శాస్త్రీయ మగు మంచి వ్యవసాయమే హిందూదేశమునకు మోక్షసాధనము. వ్యవసాయము మడిలోను, మందలోను నేర్వతగినది గాని బడిలోను, బ్రటలోను అబ్బదు.

కసువు లేనిదో పశువు లేదు.

పశువు లేనిది పెంట లేదు.

పెంట లేనిది పంట లేదు.

సేద్య మొక వ్యాపారము; వ్యవసాయ మొక శాస్త్రము; ఈ రెంటి సమ్మేళనమే సాఫల్యసాధనము.

దేశైశ్వర్యవృక్షమునకు వ్యవసాయము తల్లివేరు. పరిశ్రమలు, వాణిజ్యము శాఖాపత్రములు. వేరు చెడిన, కొమ్మలు ఎండి, ఆకులు రాలి చెట్టు నశించును. మంచి వ్యవసాయమున కెన్నో మార్గములు గలవు.—

ముఖ్యమైనవి మూడే మాటలు—

1. మంచివిత్తనముల నెంచుట

మంచివిత్తనము కల్తీలేకుండుటచే, ఒకే కాలమందు సరాసరిగా పండి, చీడలబాధ తగ్గి మంచిలాభము నిచ్చును.

2. కలుపు తీసి నేలను శుభ్రపరచుట

కలుపుమొక్కలు పొలములలోని దొంగలవలె పైరుమొక్కల స్థలము నాక్రమించి, వాటి నీటిసత్తువులను హరించి పాడుచేయును.

3. పశువుల ఎరువును భద్రపరచుట

పేడ పిడకలుచేయక, పశువులను సరిగా పోషించి, చెత్తచెదారములు చేర్చి, మూత్రమును పోనీక, ఎండవానలనుండి యెరువును కాపాడవలయును.

వివరములను వ్యవసాయశాఖోద్యోగీయుల నడిగి తెలిసికొనవలయును.

రామరాజన బఖైరు

డాక్టరు నేలటూరి వెంకటరమణయ్యగారు

(తరువాయి)

ఈప్రకారము యేనుగులను తెప్పించి ఖాసా యేనుగుల ు కవచములు ఆయుధములతోడి అంబారులు పవడోలు వేయించి, ఆపవడోలునందు ధనుర్బాణములను పెట్టించి ముస్తీదు చేయించ [మనగా*] అట్లె ఆరొను. ఈ యేనుగులుగాక ౧,౦౦౦ నిశానియేనుగలు, ౨,౦౦౧ జజాయియేనుగలు, ౩,౦౦౦ హాతరనాళి యేనుగలు సహితము తెప్పించి ౮౨ నియోగములు సమస్త మార్బట తాళదంతమాబలసహితుడైగ తుంగభద్రాతీరమున ఎనిమిది ఆమడలదూరము అడ్డముగ విడిసి కృష్ణాతీరముపర్యంతము శిబిరమును బయట వేయించినవా డాయెను. రాజభూపరు డన్నానో కసబా తాళరగెరె కృష్ణానదుల మధ్య విడిసినవా డాయెను.

అటుప్రక్క దౌలతాబాదు సింహాసనాధీశ్వరు డగు నిజాంశాహాభైరీపాదుశాహా భీమరథినదిని దాటి సుల్తానుపురము అను పేరు గల ఫేరోజాబాదు అను నగరము బయట విడిసెను. అక్బరజలాలుద్దీన్ పాదుశాహా దుర్గము బయట నిలచిరి. వాహిబల్ హింబల్ కుతుబుశాహా పాదుశాహా తెలుగాణ్యమునకు చేరిన ముదగల్లు, రాయచూరులమధ్య తన సైన్యముతో విడిసెను. వరాడ దేశపు ప్రభువు ఇమామ్-ఉల్-ముల్కు తన సైన్యముతో కూడ— అట్లే విజాపుర సింహాసనాధీశ్వరు డగు అలీ ఆదిలశాహాపాదుశాహా స్వసేనాపరివృతుడై— జమాల్ ఘుర్ అను దుర్గమునకు వచ్చి విడిసినవారైరి.

నాలుగు దిక్కులను ముసల్మానుపాదుశాహుల సైన్యము నిండినది. ఈదండునకు సంబంధించిన కాలిబంట్లగుంపు, పిండారీలగుంపు, బాణకారులగుంపు, దొంగసిపాయీలు [సహా*] కృష్ణానదిని దాటి వచ్చి రాజభూపరుని దేశమునకు చేరిన సీమల నన్నిటిని లూటిచేసి, చెరబట్టి, కొలజేసిపోవ నారంభించిరి. కర్ణాటకదేశమునందంతటను జనులు గ్రామ, నగర, దుర్గ, పట్టణములకు వలసలుపో నారంభించిరి.

రాజభూపరు డన్నను తమదండునకు, సరదారులకు తాకీదు చేసిన వివరము: జినుసుబాజారు బయట ౧,౦౦౦౦ గుఱ్ఱములు, ౨,౦౦౦౦ కాల్బలము; దానికి సంబంధించిన సామాను:[3] ఈప్రకారము యిచ్చి తమ వజీరులకు మీరు మీమీదళము [తత్సంబంధమైన *[యుద్ధసామగ్రులతో కూడ సరిహద్దు సమీపమున నుండు డని ఆజ్ఞ చేయగా అప్పుడు రాజకుమారులు, రాజకంఠీరవులు, రాజమార్తాండులు, రాజతేజోనిధులు, రాజరత్నాకరులు, ఛత్రపతులు మొదలగునట్టి యసంఖ్యాకులైన క్షత్రియకులపు కూరులు తమసైన్యసహితముగా రాక్షసతగడి బయట విడిసినవారైరి.

అటుతరువాత [యుద్ధసంబంధమైన] సామగ్రి కొనిపోయన వివరము: స్థూలయంత్రములు మూడువేలు. మధ్యమధ్యస్తయంత్రములు మూడువేలు: అణువుయంత్రములు నాల్గువేలు. ఈప్రకారము యంత్ర

---

౧. ఈమాటకు అన్వయము చక్కగ బోధకాలేదు.

౨. ఇచ్చట మూలవాక్యములోని కొన్నిమాటలకు అర్థము తెలియలేదు.

౩. ఇచ్చట కొంత గ్రంథపాత మున్నది. రాజభూపరుడు గడిప్రాంతముల నచ్చటచ్చట కాపుండుటకు కొంతసైన్యమును సర్దారుల కిచ్చి పంపినట్లు తెలియుచున్నది. అట్లు కాపలాయుంచిన స్థలములలో జినుసుబాజా రొకటి. తక్కిన స్థలములను చేర్కొనక "ఈప్రకారము" అని తరువాతి వాక్యమును ఆరంభించుట వలన ఇచ్చట గ్రంథపాత మున్నదని యూహించుట కవకాశము కలుగుచున్నది.

ధారులు సైన్యముచుట్టును ఆవరించుకొని [యుండిరి*]. అట్లే యసంఖ్యాకులు జంజాదారులు, బాణాకారులు కాలుపేదలు సహా సైన్యమున కూడియుండిరి. ఆసమయమునందు [అచ్చట నున్న*] బాణవిశేషములు: ధనుబాణములు, రామబాణములు, కుమారబాణములు, చ[ం*?]డీ బాణములు, యీప్రకారము నాల్గుదినములబాణములు ౪౦,౦౦,౦౦ లను యెద్దులమీద నెక్కించుకొని వచ్చి నిలచినవారైరి. అట్లే నాజూకైన మందుగుండ్లను తెప్పించిరి. సమస్తమైనవారికి మందుగుండ్లను పంచియిచ్చిన వారైరి.

ఈప్రకారము యుద్ధసామగ్రితో కూడుకొన్నవారై సైన్యమున, మహాబలిష్ఠమగు యుద్ధము జరుగు సమయమందు, ఎవ్వరెవ్వరేప్రకారము నిలిచియుండవలయునో ఆప్రకారము నిలిపి, తరువాత నరపతి [తన*] యొద్ద నున్న సేనానాయకులు, అష్టప్రధానులు, దళవాయీలు, బిసలప్ప నాయకుడు, కార్తికనాయకుడు, వీరప్పనాయకుడు మొదలగు నాయకులను పిలిపించి వారికి తగినటువంటి ఆధార[౧] బహుమానములను, నూతన రత్నఖచిత కటక కంఠమాల కుండల కిరీట కౌంస్తుభాంగుళ్యహారములను, కలికితురాయీలను దత్తముచేసి అట్లే నూతన విచిత్ర[౨] వస్త్రములను యిచ్చి బహుమానము చేసి వారికి ఆజ్ఞాపించిన వివరము: "మహమ్మదీయ పాదుశాహులు మనమీద నడచివచ్చుచున్నారు. వారితో యుద్ధము సేయుటకు యుద్ధసామగ్రిని కొనిపోయి చక్కగ యుద్ధము సేయుడు" అని యాజ్ఞాపించగా తత్క్షణమే వారు రాక్షసతగిడి దగ్గరనుండి లేచిపోయి[కృష్ణా*]నదిసమీపమున విడిసిరి.

ఈ సమాచారమును, నలుగురు ముసల్మాన పాదుశాహుల హరకారీలు, చోడేదారులు[౩], వెస్తవారు తీసుకొనిపోయి తమ ఖామందులకు మనవిచేసుకొన్నవారైరి. ముస్గరు[౪] పాదుశాహులును కూడి యేకస్థులై వజీరోమ్రా సేనాపత్యష్టప్రధానదళవాయీల నందరిని పిలిపించి బహుమానము చేసి, "ఇప్పుడు నరపతి పాదుశాహు దండుతో వచ్చి రాక్షసతగడి బయట విడిసియున్నాడు. యికమీద మనము వెనుక నుండరాదు. చక్కగ సమరము సేయవలయును" అని చెప్పి, తమతమ జగతఖానా[౫]వారిని పిలిపించి—పెద్దపెద్దఫిరంగులు ౪,౦౦౦, మధ్య [రకపు*] ఫిరంగులు ౫,౦౦౦, చిన్న ఫిరంగులు ౬౦,౦౦౦, జంజాలు ౫,౦౦౦, హాతరకాలు[౬] ౧,౦౦,౦౦౦, శేఖీలు ౧౨,౦౦౦[౭], సుతరనాళీకలు[౮] ౧౨,౦౦౦, బంమాకులు ౫,౫౬,౦౦౦,...... ౫,౦,౦౦౦౦[౯], విండ్లు అంబులు ౨,౦౦,౦౦౦, గాడిద

౧. 'ఆధారబహుమానగళ' అని మూలము.

౨. 'అచోద్యవస్త్రగళన్ను' అని మూలము: 'అచోద్య' "not marvellous, not strange" అని కిట్టెలుదొర అర్థము వ్రాసియున్నాడు. ఆయర్థము ఈ సందర్భమున సరిపోదు.

౩. ఒక తరగతి చాకర్లు. చేయుకార్యము ఇట్టిదియని తెలియదు.

౪. 'నాల్కారు'—'కొందఱు', 'కొన్ని' అని యీ మాటకు అర్థము. ఇచట 'నాల్కారు'ను 'కొండ' అని యాంధ్రీకరించుటకంటె, ముస్గరని యాంధ్రీకరించుటయె సమంజసముగ నున్నట్లు తోచినది. అందుచేత నట్లు చేయడమైనది.

౫. ఈమాటకు అర్థము సరియైనది తెలియదు. మందు గుండు మొదలగు యుద్ధసామగ్రులకు సంబంధించిన కచ్చేరి యని తోచుచున్నది.

౬. ఈ ఆయుధముల స్వభావ మిట్టిదని నిర్ణయించుటకు వీలు లేకున్నది.

౭. డిటో.

౮. ఉష్ట్రముల మూపులపై నిల్పి కాల్చు చిన్న ఫిరంగులు.

౯. ఆయుధముల పేరు మూలమునందు వదలబడియున్నవి.

వారు[౧] ౩,౦౦,౦౦౦, పరంగివారితో ౨,౦౦,౦౦౦. ఈప్రకారం అందఱిని పిలిపించి రాజ భూవరునితో యుద్ధము చేయవలయునని ఆజ్ఞాపించగా [వారు*] ఆరాజభూవరుడు దండు దిగినట్టి రాత్రి పలిగిడీకి యోజన ప్రమాణమునందు వచ్చి విడిసినవారైరి.

అటుపిమ్మట నిజాంశాహా పాదుశాహా, ఇబరాహీమ్‌కుతుబ్‌శాహా, ఇమామ్-ఉల్‌ ముల్కు వీరు ముగ్గురు[౩] కూడి తమ సైన్యమును యేకముచేయుటకు నారంభించిరి. అటుతరువాత [అనుకొన్న*] మాటప్రకారము చక్కగా లడాయిచేయవలెనని మనస్సులో నిశ్చయము చేసుకొనియెదురెక్కి నడచివచ్చి యెదిరించియుద్ధమునకు ఆరంభించినవారైరి. దీనిని నరపతి చూచి తమ సైన్యములోని సమస్త సరదారులను పిలిచి సైన్యము యేకము చేయించి 'సిపాయితనమునకు కీర్తి తెచ్చుకొనవలె' నని చెప్పగా అట్లే (?) యుద్ధమునకు నడచినవారైరి. ఇమామనముల్కునపాదుశాహాసైన్యముతో కూడ ఒకప్రక్కకు జఖులావుకూడిర యుద్ధమునకు నడచినవాడాయెను. దీనిని చూచి కర్ణాటకసైన్యము ధైర్యముగ నడచినవారైరి. ఒక అరాపు* యుద్ధమునకు [వచ్చిన*] ఆసైన్యమును వర్ణించుటకు శక్యము కాదు. మూడు దివములు మందుపొగవల్ల ఒకరిముఖ మింకొకరికి కనుపించలేదు. మందు సామానులు పేలు శబ్దములు: ధడధడఢంఢం అను శబ్దము; ఘడఘడఘడ యను శబ్దము; క్రమముగ బారుతెంచు గుండ్లశబ్దము; సరసరసర సురుసురుసురు అను శబ్దములు; ఛటఛటఛట, ఛటల్ అనెడు తుపాకుల శబ్దములు యీప్రకారము అనేకశబ్దములు [వాతావరణమును నింపుచుండెను*]. ఒకచోట సిపాయీలు సిపాయీలతో చేతులుచేతులు కలిపి యుద్ధము చేసిరి. ఏకరీతిని మూడుదినములు యుద్ధము నడచెను. కర్ణాటకమువారు బహు పరాక్రమమును చూపిరి. అప్పుడు దౌలతాబాదు సింహాసనాధీశ్వరుడగు నిజాంశాహాపాదుశాహ తెలుగుప్రాంత్య [ప్రభువగు*] కుతుబుశాహాపాదుశాహ వీరుకూడి యుద్ధము చేసిరి. ఉభయపక్షముల యందును చలముపట్టి యుద్ధము చేసిరి. సమరరంగమునందలి వర్తమానమును చూచుటకు శక్యపడలేదు; వినుటకు శక్యము గాలేదు; చెప్పుటకును శక్యము గాలేదు. ఉభయపక్షములయందును మృతినందినవారును, గాయపడినవారును అసంఖ్యాకులు. కనుపడక పోయినవారి సంఖ్య చెప్ప శక్యము గాదు.

నిజాంశాహాపాదుశాహా, కుతుపుశాహాపాదుశాహాలు తమయుద్ధము చక్కగ నడచిన దనియు, అవమానము కలిగినందుకు దొడ్డ కర్యము నడచుటకు దేవుడు అనుగ్రహించినా డనియును సంతోషపడిరి. వీరిలో ననేకులు [యుద్ధమునందు*] మృతినందిరి. తమకర్మఫలమువల్ల దేవుడు కృప యుంచినాడని సంతోషపడుచు వెనుకకు తిరిగిపోయిరి.

---

౧. 'గాడదేరు' అని మూలము. మొదటిశబ్దము 'గాడి' యైన 'బండ్లవా' రని యర్థమగును. 'గాడిద' అయినచో 'గాడిదలవారు' అని యర్థము.

౨. మూలము తారుమారుగా నుండుటచేత తర్జుమా యథామాతృకముగ చేయుటకు వీలైనది కాదు.

౩. "ఆపేరె నిజాంశాహాపాదశాహాను యిబరాహీంశాహా యిమామ్ కుతుపుశాహాను యివరిబ్బరుకూడి" అని మూలము. 'ఇబ్బరు' అని యున్నది గాని వాక్యమునందు మూడు పేర్లున్నవి. (1) నిజాంశాహా, (2) యిబరాహి[ంకు*]కు[పు*]శాహా, (3) యిమామ్ కుతుపుశాహా [కుతుపుశా అనుట పొరబాటు. ముల్ముల్కు అని యుండవలయును.]; కావున 'ఇబ్బరు' అనుట తప్పనియు, 'మూరుమంది' యనియు ండవలయు ననియు తలచి యూయూహ ననుసరించి యాంధ్రీకరించితిని. ఇందుకు అనుగుణ్యముగ యుద్ధమునకు నడచిన తురకరాజులలో ఇమామనముల్కు ఉన్నట్లు మూలములోని యీ క్రిందివాక్యమువల్ల తెలియుచున్నది. "యిమామనములకున పాదశాహాన సైన్యమందు కడనె జఖులావు కూడి యుద్ధాకు నడిదవరాదరు."

౪. ఈమాటకు అర్థము తెలియదు.

౫. 　　డిటో.

అటుతరువాత కన్నడజాణ అల్లి ఆదులశాహా పాదుశాహా, తదొరదేశపువాడను[౧] వాహిం [?*] మన ముల్కు పాదుశాహా[౨] వీరిరువురును తమతమ సైన్యమును ముస్తైదు చేసుకొని తమతమ స్థళములయందే ఉండిరి. యుద్ధమునకు పోలేదు. ఆయినను[౩] తమమీద కావలె నని నడచివచ్చినయెడల 'ఒకచేయి చూతము' [అని*] యూరకనె యీ మూడు దినముల యుద్ధములోను [తట స్థులై యుండిరి*].[౪]

ఈ నిజామాబాదు పాదుశాహా ఖైరీ[౫] తెలుగాం ణ్యరువారి పాదుశాహాకుకుపుశాహా [వీరి*] దండులో పల [మృతినందిన*] వారిలో అనామీకులు పోగా చిక్కిన పేరుగలవారలు :—

గాయపడిన వివరము :— శివాజీరాజు, నాగో జీరాజు, నింబాళికారె, వీరోజీబాపు, సూరరావు, అంకుశరావు, హసనాజి, ఇబరాయిత్ ఖాన్, సుజాత ఖాన్, లిమెలఖాన్, మర్తుజా బేగ్, సిద్దిహోజీ జిలా, హినాయతఖాన్, మమదుఖాన్, దావతు ఖాన్, అల్లీఖాన్, యేకలాసఖాన్, హజరతుఖాన్, హసన ఖాన్, అంబాజీరావు, సుబ్బరావు, ధళసోజలరావు, నాగోజీ తుకదేవు. మొత్తము ౨౫.

చెర జిక్కినవారు :—అల్లి నాయక, మహంమదు జనాలు, అబ్దుల్ నాయక, పీరునాయక, శిలాలు నాయక, పరసనాయక, మల్లి నాయక, నాగోజీనా యక, తిమ్మనాయక. మొత్తము ౯.

చనిపోయినవారు :—యల్లాజి కుకుదేవ, జమాత వాతి కులశిరావు, కేదాజీ సూర్యవంశి, చంగాజిబండ గహ, భుజబలరావు, సులతాన్ ఖాన్, బడేఖాన్, మల్లిక్‌సాహేబు, హసన్‌ఖాన్, హుశేన్‌ఖాన్, అకబత్ ఖైరుఖాన్, రహిమత్ ఖాన్, ముఖరాబు అల్లి ఖాన్, మహమ్మదల్లిఖాన్, జాఫరల్లి ఖాన్, రసూల్ ఖాన్, సిద్దిముస్తఫా ఖాన్, భుజంగరావు, యల్లాజి రావు, సుఖానరావు, ఖాంసెరావు, శివరావు, హిందూ రావు, మురారిఘోర్పడే, రామరావు. మొత్తము ౨౫.

రామరాజుయొక్క జను

పట్టుబడిన వివరము :—[౬]

చనిపోయినవారు :—రాఘువప్ప నాయక, కార్త వీర్య, కొమారరావు, అవధూతరావు, శివాజిరావు, అంకుశరావు, శూరణరావు, జగతీపతిరావు. మహీపతి రావు, భుజంగరావు, యల్లాజిరావు, తిమ్మనాయక, దేవరాజు, శెట్టిసాళువ, సోమంణనాయక, దళవాయి జగతీపతి, గోపాలరాజు, రాజకుమార, శంకరరావు, రాజగోపాల, రాజహంసరాజ, సేనాపతి రఘువీర నాయక, పులితోలు సారంగనాయక, హళాకశేషంసె వీరప్ప నాయక.

---

౧. 'తదొరదేశాదాత్రను' అని మూలము: దేశా దాత్ర మశబ్దము తప్పు. 'దేశదాతను' అని యుండవల యును. 'తదొర' యనుదేశ మెచ్చటిదో తెలియదు. ఒకవేళ 'బిదర' యనుశబ్దము వ్రాయసకాని చేర్పువల్ల 'తదొర'గ మార్పు జెందినదేమో !

౨. వాహిం ?...మనముల్ క్ ఇమామనముల్ క్ కాజాలడు. ఏలన అతడు నిజాంశాహా కుతుబుశాహాలతో ఏకీభవించి రాజధూమరునితో యుద్ధము చేసినట్లు ఇంతకు ముందు చెప్పబడియున్నది. కాబట్టి యుద్ధము నకు పోక ఆదలశాహాతో కలిసియుండిన మనముల్ కు మజీరెయొకడుగ నుండవలెను. అతడు బరీదుల్ ముల్కుగ నుండవచ్చునా ?

౩. 'తత్రాపిశి' అని మూలము: రూపు మారి పోవుటచేత మాటకు సరియైన యర్థము తెలియలేదు.

౪. ఈసందర్భములో 'నామాంకితపుత్రయివన తప్పిశి' అనువాక్యము పూర్వాపర సందర్భశుద్ధి లేక త్రిశంకువునుబోలి మధ్య వ్రేలాడుచున్నది. గ్రంథపాత మున్నట్లు తోచుచున్నది.

౫. 'ఖైరవ' అని మూలము. 'ఖైరవ'యే 'ఖైరీ' గా మారినదని యందరెఱుగుదురు. నిజామా బాదు అహమదు నగరమునకు నామాంతరమేమో ?

౬. పట్టుబడినవారి పేర్ల జాబితా మూలమునందు లేదు. గ్రంథపాతమున్నట్లు తోచుచున్నది.

గాయము [పడినవారు*]:— సిలారఖాన్, సైదలీ, లాలశివాజీరావు, సులతాన్ జీరావు, హీరోజీరావు, కృష్ణాజీ రావు, దౌలతుసింగు, రాజఅంకుశ, రాజభీమాసన, భాస్కరరావు.

ఈప్రకారము పట్టుబడినవారు, గాయపడినవారు, చచ్చినవారల సమాచారమును రాజభూవరుడు విని తనకడ నున్న కొందఱు వజీరులను, దొడ్డదొడ్డసరదారులను, సైన్యములతో కూడ జమాయితుకాండ్రను పిలిపించి, బహుమానముచేసి, చెప్పినది: 'మీరు మీ మీ స్థళములలో సకలసైన్యయుక్తులై సిద్ధమై యుండుడు. మేము వచ్చువఱకును యుద్ధమునకు పోవద్దు. మేము వచ్చినపిమ్మట శత్రువును మర్దించుటకు సమస్తసైన్యమును జమచేసికొని అటుపిమ్మట యుద్ధమునకు సన్నాహము చేసి పోవచ్చును." అని చెప్పి, అల్లీ ఆదలపాదశాహునిదగ్గరకు దళవాయి గిరప్పనాయకునితోడను, జమదరఖానపవాడినాయకునితోడను చెప్పి పంపిన వివరము:

"నీ వన్నెనో బాల్యమునుండియు మా కుమారుడవనిపించుకొనుచుంటివి. నీవు మాయొద్దకు వచ్చి, తొడమీద కూర్చుని పసితనమందు ఆడుకొనియున్నావు. నిన్ను ఆటలాడించి పెంచినందుకు, ఇంతటి చెడుకార్యమునకు పాల్పడితివి. ముసల్మానులు ముగ్గురితో కలసి మామీద దండువెడలుట యుక్తము గాదు. నీకు పాలువెన్నలకు రాయచూరు, ముదగల్లు, ఆదవాని యీ మూడు సీమలును యిచ్చి నిన్ను సంరక్షణ చేసియున్నాము. నీవు వారితో కూడి మామీద నడచి వచ్చుట మంచిది కాదు. నీకు ఉత్తరోత్తరము [శుభము*] అగును." అని చెప్పి పంపగా దానికి అల్లీ ఆదలశాహ పాదశాహగారు జవాబు ఇచ్చినది:

"నే నన్నెనో వారితో మనసు యిచ్చి కలసినవాడను గాను. వారై బలాత్కారముగ నారాజ్యములో ప్రవేశించి, రాష్ట్రమును పాడుచేసిరి. నా రాజ్యములో పర్వతారణ్యప్రదేశము విశేషముకలదు. పర్వతమును కొట్టి చదునుచేసి అఘాటు మార్గములందు గుఱ్ఱములు సహా నడచునట్లు మార్గమును విస్తరింపజేసుకొని బలాత్కారముగ నారాజ్యమును జొచ్చియున్నారు. నేను ఏమియు చేసినవాడను కాను. ఇట్లు నీ కొమారుడ ననిపించుకొని, నీతొడమీద కూర్చుని, నీకు హృదయమును యిచ్చియున్నాను. దానికి విరోధము లేదు. ఇచ్చిన ఆనకు తప్పుట లేదు. మీరు నామీద ఆయాసపడవద్దు. నేను మిమ్ము కలసియేయున్నాను. కార్యమును కాలమును అనుసరించి వచ్చియున్నాను. అంతే గాని మనఃపూర్వకముగ కాదు."

అని వచ్చిన హీజీబులకు చెప్పి, సందర్భోచితములగు మాటల నాడి పంపించినవాడాయెను.

వీరు వచ్చి రాజభూవరునికి యావద్వర్తమానమును విన్నపము జేసి తమతో కూడ తోడితెచ్చిన అల్లీ అదలశాహగారి హీజీబులకును హరకారాలకును రాజాగారి భేటీ చేయించి ఉత్తమమైన వస్త్రములను ముత్యాలతురాయి, కమర్‌బందు, శాలువ, ఖబాయి, జలతారు పాగ యిప్పించిరి. అల్లీ అదలశాహగారికి యుత్తమమైన ఫిరంగి, వెలగల ముత్యమును,౧ [రాజభూవరుడు*] యిచ్చిపంపెను. ఈ సమాచారమును, దౌలతాబాదు సింహాసనాధీశ్వరుడగు నిజాంశాహ భైరీ పాదుశాహ, గోలకొండ తెలుగాణ్యపు ప్రభువు కుతుపుశాహపాదుశాహ, జహాల్నాపుర సింహాసనాధిపతి అకబరు జలాదీను మొగలపాదుశాహ, వీరు ముగ్గురును విని అల్లీ అదలశాహకు చెప్పి పంపినది:

"మేము మీరు యేకస్థలమై రాజభూవరుని మీదికి యుద్ధము-౨ వెడలితిమి. నీవు లోపలలోపల అనుసంధానమును పెట్టి రాజు[కు*] వస్త్రముల[నేల*]పంప

౧. దుర్జ అని మూలము. 'దుర్జ' అనగా మద్యము త్రాగినపిమ్మట పానపాత్ర యడుగున నంటుకొనియుండు మద్యలేశము. దీనిని రాజభూవరుడు బహుమానము నంపియుండడు గదా: దుర్యా (ముత్యము) సరియైన పాఠముగ నుండవచ్చును.

౨. 'బందీ' యని మూలము. ఇది సరియైన మాట కాదు.

వలయును ? ఆయన నీకు [ఏల *] పంపవలయును ? దీనికి కారణ మేమి ? నీవు కుట్రకు లోంగితివి. నిన్ను నమ్మహాదు. నీవు యీప్రకారము సేయుట యుక్తము కాదు. అందరము కూడి రాజరాజుమీద తంబిపాహజాయిసగా వలెను. కార్యమును జయము సేయవలయును అని చెప్పి పంపుచున్నాము. ఇంకను నీవు కుట్రలో హెల్గొనుచుండిన, మేము వేరై తిరిగిపోవలయును. వేరు [మార్గము*] లేదు. నీవు మాతో కూడ వచ్చిన మంచిదే. నీవు మాతో కూడ రాకపోయినను మంచిదే. మేము రాజభూవరునిమీద [యుద్ధమునకు*] పోవలయును [అను*] సిద్ధాంతము ఉన్నది. భావికాలమున నిన్ను రాజభూవరుని యిద్దరిని కూడ తంబి పాహజాయించి లడాయి చేయుదుము.

అని చెప్పి పంపగా దానికి అల్లి అదలశాహ భయస్థుడై [జవాబు *] చెప్పి పంపినది:

"మీరు ఏమి ఆలోచన చేయుచున్నారో అది నాకు సమ్మతమే. మీరు చెప్పినట్లు వినెదను" అని హరకారాలయొద్ద చెప్పి పంపగా ముగ్గురు పాదుశాహులును సంతోషభరితులై వచ్చిన హరకారులకు బహుమానము నొసగి పంపిరి.

అటు తరువాత రాజభూవరుడు రాక్షసతంగిడి దగ్గర నొక మైదానము ఉండగా అచ్చటికి పోయి విడిసి రణఘంటను కట్టి రణస్తంభమును నాటెను. ఆ రణస్తంభముదగ్గర విడిసెను. కర్ణాటక సైన్యము సర్వము ఒక సంపై విడిసెను. అటుతరువాత యుద్ధము ఆరంభము ఆయెను. ఇరువదియేడు దివసములు పోరు నడచెను. జ[ల*]నపురి సింహాసనాధీశ్వరుడగు అఖబరజలాయిక్ మొగలు పాదుశాహ పఠానులు, రాజపుత్రులు, మహారాష్ట్రులు, వజీరులు, సామంతులతో కూడి, తాళికోట నలువదివాడలమధ్య విడిసిరి. వీరితో యుద్ధము ఆయెను. ముగ్గురు పాదుశాహులును కూడి రాజభూవరునిమీదికి నడచివచ్చిరి.

రాజభూవరునికడనున్న ౨ రాచబిడ్డలు, తక్కిన దొడ్డదొడ్డ వజీరులు ఉమ్రావులు తమతమ బలసహితముగా వచ్చి ప్రాతఃకాలమునుంచి ఆరంభము చేసుకొని తొమ్మిది ఘంటల పర్యంతము [యుద్ధము చేసిరి *]. ఉభయపక్షములయందును లడాయి చక్కగ నడచెను. ఉభయపక్షములయందును రణమై యనేకులు మడిసిరి. అనేకులు గాయపడిరి. రాజభూవరుని పక్షమందలి రాచబిడ్డలు వజీరులు, సమస్తమైనవారు యేకాంతమందు రాజభూవరునితో మనవి చేసుకొన్నది:

"ముగ్గురు పాదుశాహులును యేకస్థులై నడచి వచ్చినారు. మనము వెనుకబడక ఎదుటికి పోయి ముఖమున (?) నిలిచి అట్లే యుద్ధముచేసి సంహారము సేయవలయును. ఆ ప్రకారము మొగములపై గొట్టి కార్యమును జయించవలయును. అల్లీ అదల్ శాహు, ఇమాంమన[ము*]ల్క వీరిద్దరు తమ సైన్యముతో తమ స్థలమునందు ఉంటున్నారు. వారు లడాయికి రాబోవునది లేదు. వారు మోసము చేయవచ్చును. వారియందు మాకు నమ్మకము లేదు. ౧౨,౦౦౦ గుఱ్ఱములును, ౨౦,౦౦౦ కాల్బలమును, ఒక నాయకుని [వారిని అడ్డగించుటకు*] నియమించితిరా మేము నిశ్చింతితులమై సమాధానముతో యిటుప్రక్క శత్రువులసంగడ యుద్ధము చేయుదుము. తంబీ పవుజాయింతుము." అని రామరాజాయొక్క సేవకులు విన్నవించుకొనిరి. రాజు సంతోషించినవాడై, అదే ప్రకారము దళమును పంపి విన్నపము చేసినవారికి బహుమానములను యిచ్చి, తమ వజీరుల కందరికిని నూతనమైన వస్త్రములు నొసగి ఆయా స్థలములకు యుద్ధమునకు పంపెను.

అటుతరువాత యుద్ధము బహుళముగ నడచెను. అఖబరజలాదీనుపాదుశాహ యుద్ధముచేసి వెనుకకు జరిగెను. అటు పిమ్మట మొగలు పాదుశాహ, నిజామశాపాదుశాహ, వీరిద్దరు కూడి చలపట్టి యుద్ధమును

---

౧. ఈ పార్సీమాటలు రూపుచెడియుండుటచేత అర్థము కాకయున్నవి. వాని భావ మిట్టిదని యూహించుట సులభము.

౨. 'కడెనిదాలు' అని మూలము: తప్పు.

చేసిరి. వారి కెవ్వరును కృపరాలు౧ కాలేదు. నిజాము శాహపాదుశాహ, కుతుబుశాహపాదుశాహ తమ ఫౌజు తీసుకొని యొకతట్టునకు పోయిరి. కర్ణాటకము వారు బహుసంతోషితులైరి. అప్పుడు లక్షబాణములకు యేకరంజకము చేసి విడిచిరి. ఆసమయమందు యిద్దరు పాదుశాహుల దండును అనేకప్రకారములై కొందరు మడిసిరి. కొందరు గాయపడిరి. కొందరు తమతమ స్థలములకు బోయిరి. మరల యిద్దరు పాదుశాహులును వచ్చి యుద్ధము చేసిరి. రెండు ప్రక్కలను యుద్ధము చక్కగా నడచినది. అనేకులు గాయములు పడిరి. అటు తర్వాత రామరాజు మిక్కిలియు కోపమును జెందినవాడై వజీరుల నందరిని పిలిచి ఉత్తరువుల చేసినవాడాయెను.౨ 'రాజహంస'౩ యనెడు (అమృతపు)౪ ఏనుగమీద కూర్చుని, యావత్తుసైన్యమును వెంటబెట్టుకొని, యెడమప్రక్క గొప్పగొప్ప పేరుగల యోధుల యంబారులయందు గూర్చుండబెట్టుకొని, వెనకప్రక్క భేరీనినాదము సేయించుచు, ముందర తుత్తారలు, పిల్లనగ్రోవులు, తప్పెటలు, సన్నాయిలు, బజంత్రీలు మొదలగువాద్యముల ఘోషతో నలుగురు౫ పాదుశాహులమీద యుద్ధమునకు నడచెను. ఫిరంగులు, రామసింగులు, జంజాలు, బాణములు, ఉక్కు బొంబాసుగుండ్లు అసంఖ్యాకముగ తెప్పించి ఆ సమయముందు యేకరంజకము చేసిరి. పాదుశాహులప్రక్క లెక్కలేనందరు ప్రాణములను గోల్పోయిరి; మూర్ఛిల్లిరి; గాయమును పొందిరి. ఈప్రకారము మూడు దినములమీద తొమ్మిదిగంటలపర్యంతము యుద్ధము సాగెను. అప్పుడు ముగ్గురు పాదుశాహుల పక్షము వారు సుంపై పలాయనమై పారిపోయినది లెక్కలేదు. నలుగడల, నాల్గుదిక్కులకు జరాకట్టి౬ పలాయనము చెప్పి జీవము తప్పించుకొనిపోయిరి. అడవిని పట్టి పారిపోయిరి.

అటుతరువాత ముసల్మానుపాదుశాహులు రెండు క్రోసులు [దూరము *] వెనుకకు జరిగి విడిసిరి. అటు పిమ్మట రాజఘూపరుని దండు బహుకుశాలుపడి తమ యుద్ధము జయమైన దని వినోదములు పల్కుచు తమ తమ విడిదల కరిగిరి. దండంతయు అచ్చెరువందియుండెను.౭ ఇక మనమీద యెవ్వరును రాబోవునది లేదు. మనకు లక్ష్యము లేదు. అని యజాగ్రతతో సావకాశముగ విడిసియుండిరి. వారివారి రాణువలవారు కోటెపాళి౮ కట్టుటకు ఆరంభించిరి.

ఆదే సమయమున ముగ్గురు పాదుశాహులును తమలో తాము ఆలోచన చేసుకొని అలీ అదులశాహ పాదుశాహదగ్గరకు తమ హేజీబులనున్ను, బంధువుల

౧. 'కృపరాలు' అని మూలము. మాటకు అర్థము తెలియదు. క్రింది వాక్యమువల్ల మహమ్మదీయుల దండు భగ్నమైనట్టు తెలియుచున్నది.

౨. రామరాజు చేసిన ఉత్తర వేదో మూలములో లేదు - గ్రంథపాతము కలదేమో.

౩. 'రాజహంస' రామరాజు గుఱ్ఱముపే రని యింతకుపూర్వము చెప్పబడినది. ఆ పేరిటి యేనుగు నొకటి యుండెనేమో!

౪. 'అమృతదు' అని మూలము. ఈసందర్భమున 'అమృతద' అనుమాటకు సరియైన అర్థము తెలియ లేదు.

౫. 'నాల్కుమంది' అని మూలము. తప్పు. 'మూడుమంది' అని యుండవలయును.

౬. అర్థము తెలియదు.

౭. 'అచోద్యవాదరు' అని మూలము. ఈ మాటకు "not marvellous - not strange" అని కిట్టెలు పండితుడు అర్థము వ్రాసియున్నాడు. ఈ యర్థము ప్రస్తుత సందర్భమున సరిపోదు.

౮. 'కోటిపాళి' యనగా యుద్ధభూమి యందు సైనికులు తమచుట్టు తాత్కాలికముగ కట్టుకొను ప్రహరి.—'అజాగ్రతతో సావకాశముగ విడిసిరి' అను పూర్వవాక్యముతో 'కోటిపాళి కట్ట నారంభించిరి' అనువాక్యము విరోధించుచున్నది.

మన్ను, పెద్దలనున్ను, కొండఱు వకీరులనున్ను పంపించి, "నీవన్ననో యుద్ధమునకు రాలేను: 'దండు మునిగి పోయినను పోవచ్చును, జయమైనను కావచ్చును' అని శత్రువుయొక్క బలమును దలచి, వెనుక నిలిచి యుద్ధమునకు రాకపోతివి. మంచిది. దేవుడు చేయించినది అగునని మేము మనశ్శుద్ధితో యుద్ధముచేసి జయించుచున్నాము" అని పల్కిరి.

అదే ప్రకారము [వారు*] తమ పెద్దలముందు పల్కినవారైరి. అందుకు పెద్దలు [జవాబు*] చెప్పినది: "వీరు ఆడినారే పరత్తుమాట, ఆమాట నిదానముగ జయమగును" అని చెప్పగా అదే ప్రకారము తమ దండుయొక్క భరవసా తమకు కలుగునని అప్పుడు మరల లడాయికి ఆరంభము చేసిరి.

అదే సమయమందు పదునొకండు గంటలప్పుడు అల్లి అదులశాహపాదుశాహ మూడవ నమాజు చేసుకొని, తమ దేవుని మనస్సున వేడుకొని, 'స్వామి! మామనస్సునందున్న మనోరథసిద్ధి కావలెను' అని యనేకప్రకారముల దేవుని ప్రార్థనజేసి, "మనసున నున్నట్టి కార్యము జయము చేయవలయును. మా ముసల్మాను పాదుశాహుల మానమును నిల్పుము, స్వామి!" అని ప్రార్థన చేసి దండును సర్వమును ఆయితపఱచుకొని రాజభూవరుని దండుమీద పడి లడాయి చేయుటకు ఆరంభించెను. రాజభూవరుని దండు అజాగ్రత్తగ నుండినకారణము చేత గొల్లవారితోకూడా దండు యావత్తు మునిగిపోయెను. దండు, బేదండు[౧] అంతయు లూటీ అయిపోయెను. అప్పుడు రాజభూవరుని పట్టుకొనెను.[౨]

అటుతరువాత రాజభూవరుడు అల్లిఅదలశాహుతో పల్కినది: "నీవన్నను నా కుమారుడనిపించుకొని యీప్రకారము చేయుట యుక్తము కాదు. నీవన్ననో ధర్మవంతుడవు. పెంచినతండ్రిని కన్నతండ్రిని ద్రోహముచేసినతరువాత వృద్ధికాగలవు. ముందు గొప్ప అదృష్టశాలివి కాగలవు. గురుద్రోహ పితృద్రోహములకు యీసడింపు లేదు, వెనుకతీయుటలేదు. విశేషముగ కీర్తి వచ్చినది. మానము చేకూడినది.[3] ఇకమీద నాయత్న మేమున్నది? దండంతయు మునిగిపోయినది, రణమండలమందు మడిసిపడియున్నది. కొడుకని నేను నమ్మియుంటిని. నన్ను మోసము చేయవని నమ్మియుంటిని. నీవు విశ్వాసఘాతకుడవైతివి. నన్నుగూడ మోసము జేసితివి. మంచిది. ఏమైనది?[౪] నీవు కుమారుడవైనందుకు నన్ను శత్రువుచేతికి పట్టియిచ్చి తల గోయించవద్దు. నీవె ఫిరంగి తీసుకొని మా శిరమును కొట్టివేయుము. ఇప్పటినుంచి పుత్రపౌత్రపర్యంతము భాగ్యము ననుభవించుకొని యుండవలెను. పరంపరగ ప్రభుత్వమును చేయుచుంటిరి. తలిదండ్రులు గురుదైవములమీదనైనను అవహితము సేయుచుంటిరి. అదృష్టశాలురై పుట్టితిరి. రాజ్యమునంతటిని ఒకటి చేసితివి. ఇకమీద నేమి కానున్నది? నీమనస్సున నున్నట్లు అయినది. ఇక యత్నము జరుగదు. మా మరణకాలము వచ్చినది. ఇకమీద నాపోవలసిన కారణము లేదు."

అని చెప్పి ఖరీదు గల టోపి మాణిక్యపుకులాయి పెట్టుకొని పూల[౫] శాలువను కప్పుకొని తన దైవమును స్మరణచేసికొని, అటుతరువాత అల్లీయేదులశాహను

౧. బేదండు అనగా యుద్ధములో పాల్గొనక యుద్ధము సేయు వారికి సర్వవిధములగు సామగ్రులను సార్లా చేయువారు. వీరిని నాన్ కంబాటెంట్సు అని యిప్పు డందురు*.

౨. ఈ కడపటివాక్యము రామరాజు అల్లీ అదులశాహునితో నాడు పరుషోక్తులమధ్య మున్నది. అది ప్రథమముననే యుండుట యుక్త మని తలచి తర్జుమాలో యట్లే ప్రథమమున చేర్చితిని.

3. "నావూసికి బంత్తు" అని మూలము. ఈ వాక్యము సందర్భశుద్ధి లేక పూర్వాపరవాక్యములతో విరోధించుచున్నది. సందర్భానుసారముగ మార్చినాను.

౪. 'ఏనాయితు?' అని మూలము. 'ఏనో. ఆయితు'—'అయినదేమో అయిన' దని నా మిత్రులు హెచ్. శేషయ్యంగారు అర్థము చెప్పినారు.

౫. 'పూలి' అని మూలము. అనగా జరీబుటేదారి పనిచేసిన అని యర్థము.

పిలిపించి చెప్పినది: "నీవు నాకుమారుని వైనంగున వైరి చేతికి నన్ను పట్టి యియ్యక నీవె కత్తి తీసుకొని ఒక పెట్టుకు నరికివేయుము. రెండవదెబ్బకు అవకాశము ఉండనీయకుము" అని దొడ్డ ఆనబెట్టి తన దేవుని స్మరణ చేసుకొనెను. అటుతరువాత అల్లి అదులశాహ [రాజభూవరుడు*] ఉండినచోటికి వచ్చి యెదుట నిలుచుకొనెను. స్వయము తానే ఫిరంగి తీసుకొని రాజభూవరుని తలను కొసెను. ఈ సమాచారమును ముగ్గురు పాదుశాహాలును విని సంతోషించినవారైరి.

తర్వాత కర్ణాటకపు దండు సమగ్రము లూటి కొట్టబడెను. దండంతయు పారిపోయెను. అనేక గుఱ్ఱములు, మందుగుండు నింపిన ఖజానా సర్వమును లూటి అయిపోయెను. మిగిలిన సైన్యము విజయనగరమునకు పరుగెత్తి వచ్చెను. రాజభూవరుడు చనిపోయిన సమాచారము నగరపు చంద్రలయందున్న తల్లిగారికి వచ్చెను. [కుమారుడు*] చనిపోయిన సమాచారమును విని [ఆమె*] అపరిమితముగ దుఃఖించెను. కుమారుని సోమమునకు 'జెల్లాహారమును'౧ పుచ్చుకొని ప్రాణత్యాగము చేసెను. ముగ్గురు భార్యలున్ను యిదే ప్రకారము తమతమ ఆభరణములు, వస్త్రములు, నవరత్నఖచితమైన అలంకారములు, జడబంగారు సీసఫల్లు,౨ ముత్యపుదండ, బాదంబల్యాభరణము,3 నూతనవస్త్రములుసహా యజ్ఞపురుషాంతగణకు డను పరమాత్మునికి సమర్పణము చేసి 'జెల్లాహారము' తీసుకొని ముక్తిని బొందిరి.

అటుతరువాత ముగ్గురు పాదుశాహాలున్ను సైన్యసహితముగ విద్యానగరమునకు వచ్చి ఊరిముందర బయలులోని కోటలో నుండిన సామాను, ఖజాన [లో*] సేకరించియుండిన అపరిమిత ద్రవ్యము నూతనమైన వస్త్రాలంకారములతో సహా మూలముగా యెత్తుకొని గజతురగ రథములు, నానావాహనములు తీసుకొని తమతమ స్థానములకు తెరలిపోయినవారైరి. అఖబర జలాలుద్దీను పాదుశాహాను, యిమాములకు పాదుశాహాను, వరాడదేశమువాడు నిజాముశాహి ఖైరిపాదుశాహును [ఈ*] ముగ్గురుపాదుశాహాలును బహుమానము చేసి పంపి తర్వాత రాజభూవరుని [యస్తులను*] కాసివారణాసికి పంపించి జయించునిమిత్తము తాను పెనుగొండకు సైన్యము సాగించుకొని తెరలిపోయి, నెలవరకు ముట్టడి వేసి విశేషముగ యుద్ధము చేసి చల పట్టి యా కోటను జయించి అచ్చట దండును నిలిపి విజాపురమునకు తెరలిపోయినవాడాయెను.

రక్తాక్షి సంవత్సర వైశాఖ బ ౧ సోమవారము శ్రవణ నక్షత్రమునందు రాజభూవరుడు ముక్తుడాయెను.

క్రోధి నామ సంవత్సర ఆషాఢ బ ౪ రామరాజుయొక్క బఖైరు సంపూర్ణము.

---

౧. విషాహారమని యర్థము. విషము జెల్లముతో కలిపి తినుటచే ఆపేరు వచ్చినట్లున్నది.

౨. ఈ నగయొక్క స్వరూప మిట్టిదని తెలియదు

3. ఖో.

ప్రపంచదుస్థితి: దానిని తొలగించుటకు మార్గములు

అంతర్జాతీయభావములను పెంపొందించుటయొక్క ప్రాముఖ్యము

డా. వెం. హనుమంతరావుగారు, యమ్. ఏ., బి. ఇడి.

౧

ప్రస్తుతకాలములో ప్రపంచము ఆర్థికముగ చాల క్లిష్టపరిస్థితులగుండ పోవుచున్నదని అందరకును తెలిసిన విషయమే. ఈవిషమపరిస్థితులనుండి బయటికి వచ్చుటకు మార్గము లెవ్వి? ఇకముం దెప్పుడును వీలైనంతవర కిట్టిపరిస్థితులే ఏర్పడకుండ చేయుట ఎట్లు? అనుప్రశ్నలు ప్రపంచమందలి వివిధదేశముల ప్రభుత్వములచేతను, ధీమంతులచేతను ఆలోచింపబడుచున్నవి. ప్రస్తుతపరిస్థితులకు కారణములను నిర్ధారణ చేయుటలో వివిధదేశనిపుణులమధ్య భేదాభిప్రాయములు లేవనియే చెప్పవచ్చును. మొత్తముమీద వాటిని గురించి అందరును ఏకాభిప్రాయమునే కలిగియున్నారు. కాని ఆకారణములకు తగినట్టి సంస్కరణము లెవ్వి? ఎట్టిసంస్కరణము లాచరణయం దుంచబడవలెను? అనువిషయములనుగురించి భేదాభిప్రాయము లున్నవి. ఇట్టి ప్రపంచ మంతను ఆవరించిన ఈసమస్యాసందర్భములలో అట్టిభేదాభిప్రాయము లుండుట సహజమే.

౨

ప్రపంచ-ఆర్థికదుస్థితికి కారణములలో ప్రధానస్థానము యుద్ధసంబంధమైన నష్టపరిహారములకును, వాటితోపాటే యుద్ధఋణముల సమస్యకును ఈయవలసి యున్నది. జర్మనీ యుద్ధములో ఓడిపోవుటచే ఆదేశస్థులు గెల్పొందినపక్షమువారికి వార్సేల్సు సంధిప్రకారము నష్టపరిహారముల నిచ్చుటకు తీర్మానింపబడెను. జర్మనీవారు కొంతకాలము వాగ్దానము ప్రకారము నష్టపరిహారముల నిచ్చినప్పటికిని, తరువాత తమదేశపు ఆర్థికస్థితినిబట్టి ఆటుతరువాత తగ్గుమొత్తములకాని ఈయలేమనిరి. ఆసంగతిని విచారించుటకై మొట్టమొదట డాస్ అనునాయనను, తరువాత యాంగ్ అనునాయనను మధ్యవర్తిగ ఏర్పాటుచేసి, వారు చెప్పిన ప్రకారము తగ్గుమొత్తములను జర్మనీవారు ప్రతికక్షుల కిచ్చుచుండిరి. చివరకు జర్మనీదుస్థితి క్రమేపి హెచ్చుగుటచే వారసలే ఏమియు నష్టపరిహారములక్రింద చెల్లించ లేమనిరి. ఈనష్టపరిహారములు జర్మనీ చెల్లించవలెననిన, డబ్బు, లేక బంగారుతో చెల్లించవలెను. లేదా, వస్తువులరూపముగ చెల్లించవలెను కాని వాటిని పుచ్చుకొనువారిలో ముఖ్యులగు ఫ్రెంచివారు, బెల్జియమువారును బంగారులో గాని నష్టపరిహారములను తీసికొనమని పట్టుపట్టుటచే పరిస్థితులు మరింత దుర్భరమయ్యెను. కాని ప్రస్తుతప్రపంచపరిస్థితుల ననుసరించి ఒకదేశము ఆర్థికముగ నీరసస్థితియం దుండుటవలన ఇతరదేశములకు గూడ నష్టమే. ఇట్లు జర్మనీ నష్ట పరిహారముల నిచ్చుకొనలేక కష్టదశయం దుండుట ప్రపంచపునరుద్ధరణమునకు, ప్రపంచ ఆర్థికోన్నతికి భంగకరమని గ్రహించిరే యూరపియన్‌రాజకీయవేత్తలు వాటిని తొలగించుటకు నిర్ణయించునిమిత్తము పోయినసంవత్సరము లాసేనిసమావేశమును ఏర్పాటుచేసిరి. ఆసమావేశమునందు జర్మనీ నష్టపరిహారముల నికముందు ప్రతిసంవత్సరము నీయ నవసరము లేదనియు, మొత్తముగా ఒకసారిగా నష్టపరిహారముక్రింద కొంతసొమ్మును బ్యాసిల్ అంతర్జాతీయబ్యాంకునందు కట్టునట్లేర్పాటుచేసిన సరిపోవుననియు నిర్ణయింపబడెను. ఆనిర్ణయముప్రకారము నష్టపరిహారసమస్య పూర్తిగ పరిష్కరింపబడిన దనియే చెప్పవచ్చును. నష్టపరిహారములు తొలగింపబడుటవలన జర్మనీకి తన జాతీయ-ఆర్థికజీవితమును స్థిరమైన పునాదులపై

ఏర్పాటుచేసికొనుట కనుకను పరిస్థితు లేర్పడినవి. కాని జర్మనీస్థితి దానివలన బాగుపడినదని తలంచుట పొరపాటు. ప్రపంచమం దితర దేశములతోపాటు జర్మనీ కూడ ఆర్థికదుస్థితి, వర్తకపుకష్టములకు లోనై క్లిష్ట పరిస్థితుల కాలవాల మగుచున్నదని మనము జ్ఞాపక ముంచుకొనవలసి యున్నది. ఇతర దేశములవలెనే జర్మనీ కూడ అవసరమునకు కావలసినవాటికంటె హెచ్చువస్తువులను తయారుచేయుటయందు నిమగ్నమై యుండుట వలన వర్తకము పడిపోవుటతో ఆసరకు లమ్ముడుపోక, పరిశ్రమలు లాభములు తగ్గిపోవుటయు, పనిచేయువారలకు కూలియందు "కోతలు"ను, పనులనుండి తొలగింపులును హెచ్చయినవి. నిరుద్యోగసమస్య హెచ్చుగా నున్న దేశములలో జర్మనీదేశముకూడ ప్రధానస్థానము నాక్రమించుచున్నది.

3

నష్టపరిహారసమస్యతో ఎక్కువసంబంధము కలదియు, ప్రపంచఆర్థికదురవస్థకు కారణములలో నొకటియు ననునది యుద్ధఋణముల సమస్య. యుద్ధఋణములు యూరపియన్ దేశములు అమెరికాకు ఈయవలసినవై యున్నవి. యుద్ధమునకు కావలసిన డబ్బు అమెరికా పెట్టుబడి పెట్టుటచే అమెరికావా రాయప్పును తీర్చుడని కోరుటలో తప్పేమియు లేదు. కాని ఆఋణములను బంగారులోనే తీర్చవలె ననుపట్టు పట్టుట ప్రపంచమునకు, అందు ముఖ్యముగా యూరపియన్ దేశములకు, అమెరికాకు కూడ అధికనష్టము కల్గించుచున్నది. యూరపియన్ దేశములకు జర్మనీవద్దనుండి నష్టపరిహారములు వచ్చుచున్నంతకాలము వారికి అమెరికా దేశపుఋణమును తీర్చుట కష్టముగా లేకుండెను కాని, నష్టపరిహారములు లాసేనీఒడంబడిక ప్రకారము తీసివేయబడినప్పటినుండియు, వారికి తమ ఋణసంబంధమగు వాగ్దానముల నెరవేర్చుట చాల కష్టముగా నున్నది. ఈ ఋణముబాధ ఎంతఒత్తిడి కలుగచేయుచున్నదియు, ఫ్రాంసులో దీనినిగురించి హెరియట్ ప్రభుత్వమువారు చాల ధైర్యముగ పోరాడి రాజీ నిచ్చిరనియు, ఇంగ్లండులో బంగారుప్రమాణము తొలగింపవలసి వచ్చినదనియు, ఇకముం దేదేశము గాని యుద్ధఋణములు తీర్చు స్థితియందు లేకపోవుటచే వాటినిగూర్చి యేదో యొక నిర్ణీతపరిష్కారమునకు రావలసిన యావశ్యకతను ప్రతివారును గ్రహించుచున్నారనియు చెప్పిన స్పష్టము కాగలదు. ఈసమస్యనుగురించి పర్యాలోచన చేసి ఒక విధమగు నిర్ణయమునకు వచ్చుటకు త్వరలో ఒకసమావేశము ఏర్పాటు చేయబడు ననువార్తలు వినవచ్చుచున్నవి. యుద్ధఋణములను పూర్తిగ తొలగించి వాటి నీయవలసిన దేశములకు కొంత విశ్రాంతి నిచ్చిన గాని ప్రపంచోద్ధరణోద్యమమునకు తగుప్రోద్బల మేర్పడదని గ్రహింపవలసి యున్నది.

౪

ప్రపంచపునరుద్ధరణకై ముఖ్యముగ జరుగవలసిన సంస్కరణములలో సుంకముల నిర్మూలనము ఒక ముఖ్యవిషయమై యున్నది. యుద్ధానంతరము ఏర్పాటుకాబడిన మధ్యయూరప్‌నందలి చిన్నచిన్న దేశములును, యుద్ధమునకు పూర్వము హెచ్చుగ వ్యవసాయమునిూదనే ఆధారపడియుండిన ఇండియా మొదలగు దేశములును తమతమ బాల్యావస్థయం దుండిన పరిశ్రమలకు రక్షణ నిచ్చుకొనుటకై సుంకములను మొట్టమొదట విధించుట మొదలిడి క్రమక్రమేణ వాటిని హెచ్చుచేయుచు వచ్చినవి. క్రొత్తగా పరిశ్రమల నభివృద్ధిచేసికొను ఈదేశములే గాక పూర్వమునుండి పరిశ్రమలందు ముందడుగు వైచుచుండిన అమెరికా, జర్మనీ, రష్యా మొదలగు కొన్ని పెద్దదేశములు తమతమ సుంకముల రేట్లను విపరీతముగ హెచ్చుచేయ మొదలిడినవి. చివరకు చిరకాలమునుండియు "ఫ్రీ ట్రేడు" సూత్రము నవలంబించుచు, ప్రపంచమందలి "ఫ్రీ ట్రేడు" పద్ధతి నవలంబించుదేశములలో అగ్రస్థానము వహించుచుండిన ఇంగ్లండు కూడ ఆపద్ధతిని వదలి సుంకములపద్ధతినే అవలంబించుట తటస్థించినది. సుంకములను విధించు పద్ధతివలన ప్రపంచమున కేవిధముగ నష్టమని మన మాలోచించిన తేలును. ఏమనగా, వివిధదేశములమధ్య

నిరాటంకముగ వర్తకవ్యాపారములు జరుగుటకు దాని వలన నిరోధము లేర్పడుటయే. సుంకములమూలమున ఒకదేశమునుండి ఇంకొకదేశమునకు వస్తువులఎగుమతి తగ్గిపోవును. వర్తకము తగ్గిపోవుటవలన పరిశ్రమలవలన తయారయిన వస్తువుల అమ్మకము తగ్గిపోవును. పరిశ్రమలఫ్యాక్టోరీలకు పని లేకుండపోవును. ఫ్యాక్టోరీలకు పని తగ్గిపోవుటతో పనిచేయువారలకు పని లేకుండపోయి జీవనోపాయము లేకుండపోవును. నిరుద్యోగసమస్య యభివృద్ధి చెందుటయు, నిరుద్యోగులదుస్థితి హెచ్చగుటయు, ప్రజలలో చాలమందికి డబ్బు లేకపోవుటచే తయారగుచున్న వస్తువు లమ్ముడుపోకుండుటయు, వాటిధరలు పూర్తిగ పడిపోయి ప్రజాసామాన్యమునకు తీరనినష్టము వాటిల్లుటయు సంభవించును. ఈవిధముగ ఒకనష్టమునుండి ఇంకొకనష్టము, ఒకకష్టమునుండి ఇంకొకకష్టము, ఒకదానిఫలితముగ ఇంకొకటి బయల్వెడలి ప్రపంచదుస్థితిని హెచ్చుచేయుటకు మాత్రమే తోడ్పడుచున్నవి. ఇవన్నియు ఒకదానికొకటి పరస్పరసంబంధమున్న విషయము లగుటచే, ఒకదానిని నిర్మూలము చేయవలెనన్న అన్నిటికిని మూలాధారమగు సుంకములను తొలగించుమార్గ మేర్పాటుచేసిన క్రమేణ తక్కిన వన్నియు వాటియంతట నవియే సర్దుబాటగును.

ఏదేశమున కాదేశము ఈవిషయమై నిర్ణయించుకొనవలసి వచ్చిన ఎన్నటికిని కూడ సుంకములసమస్య తృప్తికరముగ పరిష్కరింపబడు నమాట కవకాశములు లేవు. దేశదేశములమధ్య నున్న అసూయలు, అనుమానములు పూర్తిగా నశించి ప్రతిదేశమును ఇతరదేశముల ప్రసక్తి లేకుండ సుంకముల తగ్గించునని తలంచుట వెర్రితనము. జర్మనీ ఫ్రాంసుల మధ్య, ఫ్రాంసు ఇటలీల మధ్య, అమెరికా జపానుల మధ్య ఇట్లు దేశదేశములమధ్య నున్న అసూయలు వాటియంతట నవి తగ్గిపోయి వాటికి సమైక్య మేర్పడునని చెప్పుట సాహసమే. వివిధదేశముల ప్రతినిధుల నొక్కచోట చేర్చి, అన్నిటికిని అనుకూలముగను, సంతృప్తికరముగను ఉండునట్టి ఒక పరిష్కారమును సమష్టిపై ఏర్పాటు చేయుటయందే ఈ సమస్యాపరిపూర్తి ఇమిడియున్నదని చెప్పవలసి యున్నది. అట్టి అంతర్జాతీయ పరిష్కారము నేర్పాటు చేయుటవలననే వివిధదేశముల లాభమును ప్రపంచలాభముకూడ చేకూరగల దను నభిప్రాయము దినదినము ప్రబలముగుచున్నప్పటికిని, చిరకాలమునుండి యుండిన అనుమానపిశాచము, జాతీయభావములు పూర్తిగ పోకుండుటయే, ఆ ఫలితము రాకుండుటకు అడ్డుగ నున్నదని చెప్పుటలో విరుద్ధమేమియు లేదు. సుంకములమూలమున, ప్రపంచవర్తకమునకు కల్గిన అడ్డంకులమూలమున ఆవర్తకవ్యాపారము ౧౯౨౯ సంవత్సరముకన్న ౧౯౩౨ లో సగముకంటె ఎక్కువగా తగ్గిపోయినదనియు, వివిధదేశములందలి నిరుద్యోగులసంఖ్య ౧౦ మిలియన్లనుండి ౩౦ మిలియన్లవరకు పెరిగినదనియు నానాజాతి సమితివారి ప్రచురణలయందు కలదని మన మీ సందర్భములో జ్ఞాపక ముంచుకొనవలసి యున్నది.

సుంకముల విషయమై ఆలోచించునప్పుడు దానితో ఎక్కువసంబంధము గల వేరొకవిషయమును మనస్సునం దుంచుకొనవలెను. ప్రపంచమందలి దేశము లన్నియు ఒకేస్థితియందు లేవు. కొన్ని దేశములు పూర్తిగ పారిశ్రామికదేశములుగా నున్నవి; మరికొన్ని వ్యవసాయమే ప్రధానవృత్తిగా గలవిగా నున్నవి. కాని ఏదేశము కాని ఎల్లప్పుడును వ్యవసాయదేశముగానే కాని, లేక ఎల్లప్పుడును పారిశ్రామికదేశముగానే కాని యుండునని తలంచుట పొరపాటు. అది స్వభావమునకు వ్యతిరేక మగునట్టి విషయము. గమనించి మనము చూచిన ఏదో ఒక్కవృత్తిమీదనే ఆధారపడియుండు దేశము త్వరలో తన పరిస్థితులయందు మార్పు కోరుట గోచరించును. ఆవిధముగనే పూర్తిగ పారిశ్రామికదేశమగు ఇంగ్లండు ఇప్పుడిప్పుడు వ్యవసాయపరిశ్రమయొక్క ప్రాముఖ్యమును గ్రహించుట తటస్థించుచున్నది. పూర్తిగ వ్యవసాయ వృత్తిపైననే ఆధారపడియుండిన హిందూదేశమువంటి దేశము పరిశ్రమల నభివృద్ధి చేసికొనుటకు ప్రయత్నించు


చున్నది. కాని ఈమార్పు అనుకొనినంత, కోరినంత త్వరలో వచ్చునని తలంచుటకు వీలు లేదు. అది చాలకాలము తీవ్రప్రయత్నముమీద కాని కొనసాగ నేరదు. క్రొత్తపరిశ్రమల నేర్పాటుచేసికొని, వాటి యభివృద్ధికొరకై తంటాలుపడుచున్న దేశములకు తమ ఉద్దేశ్యమును నెరవేర్చుకొనుటలో సుంకముల విధించుట ఒక ముఖ్యమార్గముగ నున్నది. అట్టి దేశములు సుంకములు తగ్గించుట కుద్దేశింపబడిన యుద్యమమునకు సహాయపడు నని తలంచుట కవకాశములు లేవు. ఈ సందర్భములలో ఏవిధముగ ఈ సమస్య పరిష్కారము చేయబడవచ్చు నని మన మూహించిన తేలున దేమనగా, క్రొత్తగా పరిశ్రమల నేర్పాటుచేసికొనుచున్న దేశములకు తగు ప్రోత్సాహ మిచ్చి ఆయా దేశముల కనుకూలముగ నుండు పరిశ్రమల నభివృద్ధి చేసికొనుట కవకాశములు కలుగజేయుటయు, ఆ మార్గముగ ఆదేశములకుగూడ ఇతర పారిశ్రామిక దేశములతోపాటు తమ ప్రజాజీవితమును, జాతీయజీవితమును పెంపొందించుకొనుటకు వీలు కల్గించుటయు నై యున్నది. దీనివలన ప్రపంచవర్తకము మామూలు పద్ధతులకు వచ్చుటకు కొంత అడ్డము కలుగు ననుమాట నిజమే. ఎందువల్ల నన, ఏదేశమున కాదేశమే స్వశక్తిపై నాధారపడియుండు పరిస్థితులు దానివలన నేర్పడును. కాని దేశమునందు తయారయిన వస్తువులు అమ్ముడువోవుచుండుటచే, దేశీయపరిశ్రమలకు ప్రోత్సాహము కల్గి, నిరుద్యోగసమస్య కొంత తగ్గుటయు, అవసరమునకు హెచ్చుగా వస్తువులు తయారగుట తగ్గిపోవుటయు, మొత్తముమీద లాభమే కల్గుటయు జరుగును. పైన చెప్పినదానిని బట్టి తేలున దేమనగా, ప్రతిదేశమునందును ఏదో ఒక్కవృత్తియందే ప్రజ లందరును నిమగ్నులై యుండక, వీలైనంతవరకు వ్యవసాయము, పరిశ్రమలు రెండింటిని కూడ అభివృద్ధి చేసికొనుటయే ప్రపంచముయొక్క దుస్థితిని తొలగించుటకు ప్రధానమార్గ మనువిషయమై యున్నది.

౬

ప్రపంచ ఆర్థికదుస్థితిని తొలగించుటకు ముఖ్యమార్గము ఆర్థికవిషయములలో అంతర్జాతీయభావములను పెంపొందించుటయే. ప్రపంచమందలి వివిధ దేశముల మధ్య ఆర్థికసంయోగము చేకురనంతకాలము ఈ అల్లకల్లోలము తగ్గుట కవకాశములు లేవు. కాని అంతర్జాతీయభావములు పురికొల్పవలెనని మనము తెలిసికొనిన లాభము లేదు. అట్టిమార్పు ఆచరణలోనికి దీసికొనివచ్చుటకు అనుకూల పరిస్థితు లేర్పాటుచేయుటకు ప్రయత్నము చేయవలసియున్నది. లేకపోయిన ఎంత కష్టముమీద, ఎంతజాగ్రత్తగ అంతర్జాతీయసౌధమును నిర్మించినప్పటికిని దానికి బలహీనమైన పునాది యుండుటచే ఏమియు సంతృప్తికరమగు ఫలితములు రాకపోవచ్చును. ఈ పునాదులు బలముగ నుండుటకు కావలసినది ప్రపంచశాంతి. ప్రపంచశాంతి అంతర్జాతీయ ఆర్థిక పునరుద్ధారణముపై ఎట్లాధారపడియున్నదో అట్లే ఆర్థిక జీవిత పునరుద్ధారణ ప్రపంచశాంతి పూర్తిగ ఏర్పాటయిన గాని జరుగుట దుర్లభము. వీటిరెంటింటికిని పరస్పర అవినాభావసంబంధ ముండుటవలన ప్రపంచప్రజ లందరును ఏకగ్రీవముగ కోరదగిన దేమన, ప్రస్తుతము జనీవాలో జరుగుచున్న ప్రపంచ-ఆయుధవిసర్జనసమావేశము జయప్రదముగ ముగియవలె ననునదై యున్నది. కాని ఆ సమావేశము జయప్రద మగుటకు ప్రధానమగు అడ్డంకులలో ఒకటి దానియందు పాల్గొనుచున్న వివిధదేశములమధ్య నిజమగు సహయోగ్యత లేకపోవుటయు, ఒకదేశమును చూచి ఇంకొకదేశ మోర్వలేక పోవుటయు, అపనమ్మకము లెక్కువగ నుండుటయును. రెండవవిషయము : జర్మనీ ఫ్రాంసులకు కొన్నితరములనుండి వచ్చుచున్న విరోధము వలన జర్మనీ ఫ్రాంసుతో సమానముగ ఆయుధసామగ్రులను కల్గియుండుటకు హక్కు కావలెనని పట్టుపట్టి, తనహక్కు నిరాకరింపబడిన ఆయుధవిసర్జన సభనుండి విడిపోయెదనని బెదరించుచున్నది. ఇట్టిసందర్భములలో సమావేశము భగ్నమగుట కంగీకరించుటకంటె ఇతర దేశములు జర్మనీయొక్క హక్కును అంగీకరించుట కనుమతించుట కొంతవరకు శుభదాయకమే. ఆయుధవిసర్జన

కొడైకెనాల్ చిత్రములు

(యస్. శంకర సుబ్రహ్మణ్యంగారి చిత్రములు)



౧. చెరువు, ఒకమూల



౨. చెరువు, ఆరామము



3. చెరువుకట్ట



౪. పడవపై విహారము

సమావేశముపై ప్రపంచశాంతి ఆధారపడియున్నదనియు, ప్రపంచశాంతిపై ప్రపంచ-ఆర్థికపరిస్థితుల బాగోగులు ఆధారపడి యుండుననియు ఇదివరలో చెప్పియుంటిమి. ఈ విషయమును ప్రపంచమందన్ని దేశములవారును గ్రహించియే యున్నారు. ప్రపంచ ప్రజాభిప్రాయము దీనికి పూర్తిగ అనుకూలముగ నున్నది. ఆయుధవిసర్జన సభయందు కూడిన వివిధదేశ ప్రతినిధులకు ఈ ప్రజాభిప్రాయమును తృణీకరించుటకు గాని, దానికి వ్యతిరేకముగ నిర్ణయించుటకు గాని సాధారణ సందర్భములలో అవకాశ ముండదనియే చెప్పవచ్చును. ముందు రాబోవు యుద్ధములో-అట్టియుద్ధము వచ్చుటయే తటస్థించునో-ప్రజలకు కలుగుకష్టములు ఇంతింత యని చెప్ప నలవిగాకుండ నుండునని అందరును గ్రహించిన విషయమే. వాటి హృదయనిర్భేదనమునుగూర్చి ఈమధ్యనే బాల్డ్విను గారు పార్లమెంటులో వర్ణించియున్నారు. అట్టికష్టములకు ప్రపంచమును పాల్పడచేయకుండ నుండు గొప్ప బాధ్యత వివిధప్రభుత్వములపై నాధారపడియున్నది.

౭

ఆయుధవిసర్జన ఇంకొక సందర్భమును బట్టికూడ పపంచపునరుద్ధరణకు చాల ముఖ్యమైనదిగా నున్నది. ఆర్థికదుస్థితికి ముఖ్యకారణములలో యుద్ధఋణములొకటి యనియు, వాటివలన ప్రపంచమందలి బంగారమంతయు ఒక్క అమెరికాదేశమందే కేంద్రీకరింపబడుటచే ఇతర దేశములలో సంక్షోభ మెక్కువయై ద్రవ్యసంబంధమైన సంచలన మెక్కువ యగుచున్నదనియు ఇదివరలో చెప్పియుంటిమి. యుద్ధఋణములసమస్య ఈమధ్య చాల ప్రాముఖ్యము వహించినది. అమెరికాప్రభుత్వమువారు డిశంబరు ౧౫-వ తేదీ వాయిదానాటికి తమకు రావలసిన యుద్ధఋణములను చెల్లించవలసినదని యూరపియన్ దేశములను తొందరచేయుటయు, అట్లు చెల్లించుటకు తమకు శక్తి లేదని ఫ్రాంసు, బెల్జియము మొదలగు దేశములు ప్రకటించి తమ వాయిదాలను చెల్లించలేకపోవుటయు, ఇంగ్లండుమాత్రము ఎట్లో అతికష్టముమీద తా నీయవలసిన అప్పువాయిదామొత్తము (సుమారు ౯౫,౫౦౦,౦౦౦ డాలర్లు (డాలరు=సుమారు రు. ౩-౮-౦) ను చెల్లించి ఇకముందు చెల్లింపలేమని తెల్పుటయు అందరకును తెలిసినవిషయములే. ఆ యుద్ధఋణములను పూర్తిగ మానివేయవలెనని ఇంగ్లండు, ఫ్రాంసు మొదలగు దేశములు కోరినప్పుడు, అమెరికా 'యూరపియన్ దేశములు ఆయుధవిసర్జన చేయక, ఆయుధములను సమకూర్చుకొనుటలో డబ్బుఖర్చుచేయుచున్నంతకాలము ఋణముల నిచ్చుకోలేమని చెప్పుటయు, వాటిని తొలగించుమనుటయు అసమంజసములగు కోరికలనియు, 'అట్లు తగ్గించుటకు వీలు లేదనియు బదులు చెప్పెను. అమెరికాప్రభుత్వము తమకు రావలసిన యుద్ధఋణములను తీర్చుడని, యూరపియన్ దేశములను కోరుటలో తప్పేమియు లేదు. ఆయుధవిసర్జనయొక్క ప్రాముఖ్యమునుగూర్చి పట్టుపట్టుటలో కూడ వారు న్యాయముగనే ప్రవర్తించిరని చెప్పవలసి యున్నది. కాని జ్ఞాపకముంచుకోవలసిన విషయము లేమన, యుద్ధఋణము లమలులో నున్నంతకాలము యూరపియన్ దేశముల ఆర్థికస్థితి బాగుపడుట కవకాశము లేదనియు, దానియందు అభివృద్ధి కన్పడినకాని ప్రపంచ-ఆర్థికస్థితి యభివృద్ధికి అడ్డు ఎప్పటివలెనే యుండు ననియు, ప్రతి యూరపియన్ దేశపు ఆదాయమందును పూర్వముకన్న చాల తగ్గుదల యున్నదనియు, అమెరికా ప్రపంచ పునరుద్ధరణోద్యమమునకు సహాయపడుటకు మార్గము యుద్ధఋణములు తొలగించుటయే యనియు నను నవై యున్నవి. యుద్ధఋణముల భావిదశ నాలోచించుటకు అమెరికాప్రభుత్వము అంగీకారముగ నుండుట, దానికై ఒక అంతర్జాతీయసమావేశము నేర్పాటుచేయుట కంగీకరించుట శుభచిహ్నమే. కాని యుద్ధఋణములను తొలగించుటతో ఆయుధవిసర్జన సమస్యకూడ పరిష్కారమైనయెడల ప్రపంచమున కంతకును ఎంతేని లాభము కలుగును.

౮

ప్రపంచ ఆర్థికదుస్థితిని తొలగించుటకు ముఖ్య మార్గ మొక్కటే కలదని ఇంతవరకు స్పష్టమైనది.

అది అంతర్జాతీయ సమావేశము; అంతర్జాతీయప్రబోధము. ఏదేశమున కాదేశము, ఏఖండమున కాఖండము ప్రత్యేకించి తన సమస్యలను నిర్ణయించి, వాటిని తమంతట తాము పరిష్కరింప జూచుకొనుటవలన లాభ ముండదు. ఈకాలమందు అన్నివిషయములందును ప్రపంచ మంతయు ఏకమగుచున్నది. శాస్త్రసంబంధమగు క్రొత్త మార్పులవలనను, ఇతరకారణములవలనను ప్రపంచజీవిత మంతయు ఏకోన్ముఖమునకు తీసికొని రాబడినది. ఒకదేశమున ఏవిషయమై గాని కొంత కలవరము బయలుదేరిన, అది ఆదేశముతో అంతరించక, ప్రపంచమందలి దేశములన్నింటిలోనికి వ్యాపించి, అన్ని జాతుల జీవితమునందును అలజడిని కల్గించును. అన్ని విషయములందును ఈ అంతర్జాతీయభావము యుద్ధానంతరము హెచ్చుగ పెరిగినది. నానాజాతిసమితి ఏర్పాటగుటతో ఈభావములకు ప్రోత్సాహము బాగుగ కలిగినది. ఇట్లు ప్రపంచమందలి దేశము లన్నియు ఒకదానిపై ఇంకొకటి ఆధారపడి యుండుటచే, ఒకదేశమందలి పరిస్థితులింకొకదేశమందు ప్రతిఫలించుటచే, ఏదేశము కాని తనంతట తాను తన సమస్యలను పరిష్కరించుకొనుటకు స్థితిగతు లనుకూలముగ నుండవు. ఏ ముఖ్యసమస్య తీసికొనినను దానికి అంతర్జాతీయపరిష్కారమును ఆలోచించి మాత్రమే పని చేయవలసి యున్నది. అట్లు చేయుటకు తగు పరిస్థితులు ప్రస్తుతము పూర్తిగ ఏర్పడలేదనిన దానికి కారణము, ఇదివరలో చెప్పినట్లుగానే, ఇంకను అన్నిదేశములందు ప్రజలును, ప్రభుత్వములు కూడ స్వజాతీయత, స్వజాతీయభావములు మొదలయిన వాటినుండి విడివడలేకుండుటయే కాని, అంతర్జాతీయ మార్గము ననుసరించుటలో తప్పులు, లోపములు ఉన్నవని కాని, అదియే సరియగు మార్గ మనువిషయమును గురించి అభిప్రాయభేదము లున్నవని గాని కాదని స్పష్టముగ గ్రహింపవలసి యున్నది. జాతీయభావముల వలన, ఒకదేశము మాత్రము ప్రపంచమందలి ఏఇతరదేశముతోను సంబంధము లేకుండ ఆర్థికసమస్యను పరిష్కరించుకొనుటకు పూనుటవలన ఏమినష్టము లున్నవో, ఎంత కష్ట మున్నదో రష్యాదేశపు ఈమధ్యఆర్థిక చరిత్ర గమనించిన తెలియగలదు. ఆదేశమందు "౫ సంవత్సరముల ప్లాను" ననుసరించి పని జరుపుటలో ఆదేశమునకు కొంతలాభము కల్గి యుండవచ్చును. కల్గిన దనియే మన మొప్పుకొనవలెను. కాని ఆలాభము ఏవిధానమువలన కలిగినదో, ఇతరదేశములకు దానివలన నష్ట మెంత కల్గుచున్నదో కూడ మనము గ్రహించిన, రష్యాదేశపు ప్రత్యేకప్రయత్నములో నున్న లోపములు గోచరించును. ఈలోపములను గ్రహించిన, అంతర్జాతీయ మార్గముయొక్క లాభములు వెంటనే కాకపోయినను కొద్దికాలముతరువాతనైనను ప్రపంచ మంతయు ఆమోదించి ప్రపంచప్రజాసౌఖ్యమున కదియే ప్రధానమార్గమని తెలిసికొనకుండ ఎవరు నుండజాలరు.


కాన ప్రపంచ మేమార్గము త్రొక్కిన ప్రస్తుత కలవరమునుండి బయటపడుట కవకాశము లున్నవను విషయమును గురించి భేదాభిప్రాయములు చాల తక్కువగ నున్నవి. కాని అభిప్రాయములందు ఏకత్వ ముండినప్పటికిని, వాటి నాచరణయం దుంచుమార్గములలో అచ్చటచ్చట భేదాభిప్రాయములు, అనుమానములు, అభ్యంతరములు లేకపోలేదు. అయినను నానాజాతి సమితి పనిచేయుచున్నంతకాలము, కొన్ని ముఖ్యదేశములలో అంతర్జాతీయభావములు దినదినాభివృద్ధి నొందుచున్నంతకాలము, తప్పక ఈవ్యాసమునందు పైన సూచించిన మార్గ మెప్పటికైన అవలంబింపబడు నను ఆశ నిరాశ కాజాలదు.

౬

మన ప్రస్తుతసమస్య హెచ్చుగ ఆర్థికసమస్య. ఆర్థికముగ ప్రపంచమందు మామూలుపరిస్థితు లేర్పాటయిన, తక్కినవిషయములందుకూడ అట్టిపరిస్థితులే త్వరలో ఏర్పాటగునని తలంచుట కవకాశ మున్నది. దీని కనువగు మార్గములను విచారించుటయే త్వరలో సమావేశము కానున్న ప్రపంచ-ఆర్థికమహాసభ (World Economic Conference) యొక్క ప్రధానకర్తవ్యమైయున్నది. ఆసభయొక్క సమావేశముపైననే ఇప్పుడు

ప్రపంచసృష్టి యంతయు కేంద్రీకరింపబడి యున్నది. ఆ సమావేశమునందు సుంకములు, యుద్ధఋణములు, నాణెముల సమస్యాపరిష్కారణము మొదలగు విషయము లను గూర్చి ఏర్పాట్లు చేయవలసి యున్నది. ఆయేర్పాట్లు ప్రపంచమున కంతకును అనువర్తించునట్లు చేయుట చాల ముఖ్యమైన కార్యము. వర్తకసంబంధములు వివిధ దేశములమధ్య ఏర్పాటుచేసి, ఏయే దేశములు ఏయే దేశ ములతో ఎట్టిషరతులపై వర్తకము చేయవలసి యుం డునో ఆలోచించుటకు, ఆవర్తకపు టొడంబడికలు' వాటి షరతులు ఆచరణయం దుంపబడునట్లు చూచు టకు ఒక శాశ్వతమగు ప్రపంచ-ఆర్థిక-సలహాసంఘము (World Economic Advisory Council) నేర్పాటు చేయుట కూడ ఆసభయందు జరుగవలసి యున్నది. ఈ సంఘమువారు నానాజాతిసమితివారి యాజమాన్యము క్రింద పనిచేయున ట్లేర్పాటుచేసిన దాని నిర్ణయములు పాటింపబడుట కెక్కువ అవకాశము లుండును.

ఇంకొక ముఖ్యమగు మార్పును సూచించి ఈ వ్యాసమును ముగించెదము. ప్రస్తుతము ప్రపంచమం దున్న బంగారములో చాలభాగము అమెరికాదేశమం దును, అంతకన్న కొంత తక్కువభాగము ఫ్రాంసునం దును చేరియుండి తక్కిన దేశములందు బంగారము చాల తక్కువగ నుండు పరిస్థితు లేర్పడినవి. ఇతర దేశములలో బంగారము ఇంత తక్కువ యుండుటయే వాటియందు వస్తువులధరలు తగ్గిపోవుటకును, ప్రజలలో దుస్థితి పెరుగుటకును కారణమైనది. ప్రపంచమందలి వ్యవ సాయప్రధాన దేశములకు ఈ ధరలు తగ్గిపోవుటవలన ముఖ్యముగ తీరనినష్టము వాటిల్లుచున్నది. మన హిందూదేశమునుండి కొంతకాలముగా కోట్లకొలది విలువగల బంగారము విదేశములకు, ముఖ్యముగ ఇంగ్లండు నకు ఎగుమతి యగుచున్న సంగతి ఎల్లరు నెరింగినదే. ఈ బంగారమున కంతకును చివరకు అమెరికాదేశ మందలి ఫెడరల్ రిజర్వు బ్యాంకే గమ్యస్థానము. ఇట్లు బంగారము దేశమునుండి ఎగుమతి యగుచున్నంత కాలము, ఇదివరలో బంగారము కూడబెట్టి, దానినే తమ మూలధనముగ జూచుకొనుచున్న మన హిందూ దేశప్రజలవంటివారికి ఎంతనష్టము కల్గునో వేరుగ చెప్ప నక్కరలేదు. దీనికి కావలసినమార్పు, కొన్ని దేశము లందే కూడియున్న బంగారమును అవసరమును బట్టి ఇతర దేశము లన్నింటికిని పంచిపెట్టుట యైయున్నది. దానికి అమెరికా, ఫ్రాంసు దేశములు ప్రస్తుత మంగీక రింపక పోవచ్చును. కాని అట్టి మార్పుయొక్క లాభ మును వారు గ్రహించునట్లు చేసిన వారు దాని నామో దింతు రనుటలో సందేహము లేదు.



మణికర్ణికా ఘట్టము, కాశీ   P. S. N.

దేశీయవ్యాయామ ప్రాముఖ్యము

శ్రీ యశ్వంతసింహగారు
(ఆంధ్రవ్యాయామ మహాసభాస్థాయిసంఘ కార్యదర్శి.)

చరిత్రార్హమైన దేశీయ వ్యాయామ విధానము శరీరాభ్యుదయ పద్ధతులలో తగుస్థానము వహింపకుండుటకు మనము పాలితుల మగుట కారణమని భావించెదను. మనకర్తవ్య మేమనిన, మన విధానముయొక్క విలువను గ్రహించి అవలంబించుటయే. దేశీయ వ్యాయామ విధానము మన విజ్ఞానమునకును, సంప్రదాయములకును, నాగరికతకును అనుగుణముగ నున్నది. మన సాంఘికాచార వ్యవహారములకును, హిందూదేశ శీతోష్ణస్థితికిని ఎంతయో తగియున్నది. మనపద్ధతిని అనుసరించిన దేహబలము, మనోబలము ఉచితరీతిని వృద్ధియగును. ఈడునకు తగిన ఆరోగ్యము, శరీరపాటవము మనుజుని కొసంగుటయే మనశిక్షణాదర్శము.

క్రీస్తుకు ౫౦౦౦ సం. లకు పూర్వమే, తత్వవేత్తలగు మనఋషులు వేదగీతికల గానముచేసినప్పటికే మనవ్యాయామవిధానము వాడుకలో నుండెను. పతంజలి మహాఋషి యోగవ్యాయామపద్ధతిని సూత్రరీత్యా క్రీస్తుకు ౧౫౦ సం. లకు పూర్వమే కట్టుదిట్టము చేసెను.

పురాణయుగమందు సప్తమహాఋషులలో ఒకడును, క్షాత్రతేజోవిరాజితుడును నగు విశ్వామిత్రుడు రాజకులతిలకుడగు శ్రీరామచంద్రమూర్తికి వ్యాయామ విధానము నేర్పెనని వినుచున్నాము. ద్రోణాచార్య భీష్మాచార్య కర్ణ కృష్ణార్జునాభిమన్యులు మొదలైన పురాణపురుషులు చూపిన దేశీయ వ్యాయామక్రీడల ప్రదర్శనములనుంచి అనేకోదాహరణము లివ్వవచ్చును.

చరిత్రాత్మక దృష్టితో చూచిన అలెగ్జాండరు హిందూదేశముపై దండెత్తి వచ్చినప్పుడు సింధునదీప్రాంతమున పురుషోత్తమ మహారాజు చూపిన శౌర్య బలపరాక్రమముల కచ్చెరు వందెను. ప్రతిసర్దారును, రాజన్యుడును దేశీయ వ్యాయామపద్ధతులపై క్రమశిక్షణ నొందెడివారు. జగద్విఖ్యాతమగు మనవ్యాయామపద్ధతిని నేర్చుకొనదలచి అరేబియా, ఈజిప్టు, టర్కీ, పాలస్టైన్, యూరపుఖండ మధ్యదేశములనుండి పలువురు నలంద, తక్షశిల విశ్వవిద్యాలయములకు వచ్చెడివారు. మౌర్యులును, గుప్తులును రాజ్యము చేయుచున్న కాలమున దేశమం దెల్లెడలను వ్యాయామశాలలు స్థాపింపబడి వృద్ధి గాంచెను. మొగలు సామ్రాజ్యసంస్థాపకుడైన అక్బరుచక్రవర్తి దేశీయ వ్యాయామపద్ధతినే శిక్షణ నొందెను. సుప్రసిద్ధుడగు అక్బరుసార్వభౌముడు మన పద్ధతుల ననుకరించుటవలననే అద్భుత మగు మనోదేహ బలసంపన్నుడాయెను. మహారాణా ప్రతాపసింహుడు, రాథూరు దుర్గాదాస్, ఛత్రపతి శ్రీ శివాజీ, సింహగడ విజయి యగు తానాజీయు, భారతదేశ స్వాతంత్ర్యమునకై ఘోషించి కరవాలంబును కరంబున దాల్చి రణరంగంబున నిజప్రాణము లర్పించిన ఝాన్సీ లక్ష్మీబాయియు, రాజనీతికోవిదురాలగు అహల్యాబాయి సర్కార్, రణనీతి విశారదయైన చాంద్ బీబీ, సిక్కులను రణోన్ముఖుల గావించిన పదియవ గురువగు గోవిందసింహుడు, విజయనగర సమ్రాట్టులైన శ్రీ కృష్ణదేవరాయలును మొదలైన సుప్రసిద్ధ హిందూ మహమ్మదీయ వీరులు దేశీయ వ్యాయామవిధాన ప్రకారమే క్రమశిక్షణ నొందిరి. నేటికిని ఆచరిత్రాత్మకమైన విధానము మొక్కవోవక ఉత్తేజముగ నుంచుటకు కారణభూతులైన అస్మద్గురువులగు రాజరత్న ఆచార్య మాణిక్యారావుగారు బరోడాయందు శాయాజీ రావు మహారాజులంగారి సానుభూతిని జుమ్మాదాదా వ్యాయామ కళామందిర మనుసంస్థను స్థాపించి ముప్పది సంవత్సరములనుండి తదేకదీక్షతో పెక్కురు యువతీయువ

కులకు శాస్త్రసమ్మతముగా మనవ్యాయామవిద్యను నేర్పి ఆర్యావర్తమున ఈవ్యాయామవిద్యను గరపు ఉత్సాహ సంపన్నులైనవారలతో మించినవారైరి. ఆంధ్రవీర కంఠీరవ, మల్లరాజతిలక, జగదేకవీర మొదలైన బిరుదాంకితులైన కోడి రామమూర్తిగారు మనవ్యాయామపద్ధతినే అవలంబించుటవల్ల ప్రఖ్యాతులైరి. ప్రస్తుతము ప్రపంచకమున నెల్లరకును మల్లవిద్యలో అగ్రజులైన గామా పైల్వానులు మనపద్ధతినే అవలంబించి వన్నెకెక్కెను. ఈరోజులలో కినుక వహింపక క్రమశిక్షణ నొసంగెడి వారలలో అగ్రగణ్యులైన శ్రీ బలుసు రామజోగారావుగారు దేశీయపద్ధతులనే శిరసావహించుట మీకందరకును బాగుగ తెలియును.


ఇటీవల నేను మైసూరుప్రాంతముల కేగినపుడు అక్కడ కర్ణాటయువకుల గాంచితిని. వారు వజ్రముష్టి యందు మిక్కిలి నేర్పరులు. మన దేశీయవ్యాయామ విధానమందు ఇది యొక ముఖ్యాంగము. పాశ్చాత్య వ్యాయామ వ్యామోహము ప్రబలియున్న ఈకాలమున వేదకాలమునుండియు ప్రసిద్ధి గాంచిన సూర్యనమస్కారముల మహిమను గుర్తింపజేసి అనేకులచే ఆచరించుటకు చేయూత నొసగిన ఔంధుప్రభువును మన మెప్పటికిని మరువజాలము. స్వసంప్రయోగ (Active form of Exercise) మనియు, అన్యసంప్రయోగ (Passive form of Exercise) మనియు మన వ్యాయామ విధానము రెండువిధములు. ఒక్కొక్కటి నాలుగు ఉపశాఖలుగా విభజింపవచ్చును. రెండవపద్ధతిలో ౧. ఖుబ్కా, ౨. చంపీలా, ౩. కందలితము, ౪. Hacking ఉన్నవి. ఏవిధమైన పరిశ్రమ చేయలేనివారు ఈపద్ధతుల సాహాయ్యమున ఆరోగ్యము గాంచగలరు. స్వసంప్రయోగములో: ౧. సాధనములతో, ౨. సాధనరహితము, ౩. ఒక్కొక్కరు చేయుట (Individualistic), ౪. పలువురు కలసి చేయునది (Team Exercises). సాధనసహిత వ్యాయామములలో ముఖ్యమైన వేవనగా, ౧. ఏకంగ్ లక్డీ, ౨. దో అంగ్ లక్డీ, ౩. ఫిరంగ్ ౪. లాఠీ, ౫. పరీగద్కా, ౬. లజీమ్, ౭. జోడీ, ౮. కరేలా, ౯. వజ్రముష్టి, ౧౦. మల్ఖాం, ౧౧. బాగ్ నఖ్, ౧౨. ధనుర్విద్య-మొదలైనవి.

౧. జోర్, ౨. పలువిధములైన బస్కీల్, ౩. సూర్యనమస్కారములు, ౪. ఈత, ౫. కుస్తీ మొదలైనవి సాధనరహిత వ్యాయామములు.

ఈపై వ్యాయామములన్నియు వ్యక్తిగతముగను (Individualistic), సంఘములుగను (Groups) కూడా చేయుటకు వీలైనట్లు కవాతులో అమర్పబడి యున్నవి. పదియేండ్ల బాలబాలికలకును, ఇరువదియేండ్ల తరుణులకును, నలుబది సంవత్సరముల ప్రౌఢులకును కూడ నభ్యసించుటకు అనుగుణముగ నుండునట్లు మన వ్యాయామపద్ధతులు చక్కగ విభజింపబడి యున్నవి. జోర్, బస్కీ, శ్వాసనిరోధక వ్యాయామములు మొదలైనవి ఛాతీ, నడుము, కాళ్లు, చేతులకు బలము నొసంగును. వ్యాయామము చేయువారికి విసుగు జనింపకుండునటుల పలువిధములగునవి కలవు. వ్యాయామ మాచరించు మనుజుడు ఇచ్చవచ్చినట్లు శక్తిని దేహమునందలి వివిధభాగములలో కేంద్రీకరించుటకై వీలు కలదు. ఈప్రాణాయామము సరుముఖముగా తెలుసుకొనతగినది. ఇది ఆరోగ్యాభివృద్ధి కల్గించును. కరేలా, జోడీ మొదలగు వ్యాయామము లభ్యసించినచో భుజములకును, శ్వాసకోశములకును, చేతులకును బలము కలుగును. ఈత, లాఠీ మొదలగునవి నిర్వ్యాపారులకు (Men of sedentary habits) చాలా లాభకరములు. వీనివలన వారిదేహములం దుత్తేజము కలిగి రక్తప్రవాహము వృద్ధి గాంచును. లజీమ్ అభ్యసించుటయందు గుమకుట, తన్నుట, గంతులు వేయుట, దేహమును పలువిధములుగా వంచుట మొదలగు వివిధక్రీడలు కలవు. అందుచే ఆపాదమస్తకము పరిశ్రమ కల్గి అభివృద్ధి గలుగును. ఏడేండ్లు మొదలుకొని పదునాలుగేండ్ల వఱకు వయస్సు గల బాలబాలికలందరును అభ్యసింప తగిన పరీగద్కా చాలా పౌరుషమును పెంపొందించు వ్యాయామము. నేత్రములకును, కరములకును చక్కని తర్ఫీదు నొసంగును. మల్ఖాం అను వ్యాయామము నరములపట్టును వృద్ధిపరచి మల్లవిద్య

నభ్యసించువారలకు నెంతేయు ఉపయోగపడును. కుస్తీ చాలా ఉన్నతమైన పరిశ్రమ. దీనివలన మనుజుడు శౌర్యవంతుడగును. ఇందు శత్రువును ఓడించుటకు ౧౨౦ విధములగు పట్లు కలవు. మనరాజులలో పలువురు దీనిని వ్యాయామముగా నభ్యసింతురు. నిరోధక శక్తిని (Body resistance power) సహితము పెంపొందించును. యోగవ్యాయామ శ్రేష్ఠత్వమును కనుగొని పామరజనులకు వెదజల్లుటకై వాఖ్యాతులైన శ్రీ కువలయానందగారు (పూనా సమీపమున) కైవల్యధామ మను ఆశ్రమమున విశేషపరిశ్రమ గావించి తమ పరిశోధన ఫలితములను యోగమీమాంస యను పత్రికయందు ప్రకటించుచున్నారు. శీర్షాసనము, మయూరాసనము మొదలగు యోగవ్యాయామములందును, నేతి, ధౌతి, బస్తీ మొదలగు యోగక్రియలందును అభిరుచి గలవారు కైవల్యధామమున కరిగి వానిని గురుముఖముగా అభ్యసించిన ఎట్టిప్రమాదములకును లోను గారు.

దేశీయవ్యాయామ విధానము చొప్పున వ్యాయామశిక్ష నొందినవారు ఉత్సాహవంతులుగను, సుశిక్షితులుగను, సమయోచితబుద్ధి గలవారుగను నగుదురు. సమష్టిభావము, ఉదారగుణములును వీరియందు అభివృద్ధి చెందును. ఈవిధానము లాభదాయకముగను, ఆనందదాయకముగనుకూడ నున్నది. కాన స్వదేశ సంస్థానములయందేమి, మరి ఇతరప్రాంతములయందేమి, ఉన్న విశ్వవిద్యాలయాధికారులును, విద్యాశాఖామంత్రులును దేశీయవ్యాయామ పద్ధతియొక్క ఔన్నత్యమును గుర్తించి, మరి ఏఇతరపద్ధతులతోపాటైనను పాఠశాలలయందేమి, కళాశాలలయందేమి తప్పక త్వరలో తావొసంగెదరని విశ్వసించెదము.



మణికర్ణికాఘట్టము, కాశీ
(మరియొక దృశ్యము)

P. S. N.

ఆత్మపరీక్ష

కుందుర్తి నరసింహారావుగారు

పసరుచివుళ్ల దాపరికముండిన పికస్వరము పాడినదంట 'హరిజను'లని;
లేయెండ మొగసాల పాయలూడిన జడ నల్లు జవ్వని పాడె 'హరిజను'లని;
సందెగాఁపు గొంతు సవరింప పసుల కాపరి పాడుచున్నాడు 'హరిజను'లని;
ఇంటింట తనసొత్తునే చూచు బిచ్చగా డరచుచున్నా డోయి 'హరిజను'లని;
అక్కళించు మహాత్మగర్భాంతరమున - బక్కప్రాణాలు తమలోన చిక్కబట్టి
మాడుచున్న ప్రేవులమూక మరల మరల-'హరిజనులు,హరిజను'లని యరచినపుడు!

ప్రారంభించితి వోయి, తండ్రి! వికటప్రారబ్ధసంకల్పితా
చారధ్వంసమహోద్యమాధిగతయజ్ఞం బింతలోనే! బలే!
వీరాగ్రేసరచక్రవర్తి! హృదయోద్వేగద్విధాభిన్న మై
వారింపన్ వరియింప లోక మిటు లేడ్వన్ లెక్క లేదయ్యొ గా?

నీయుపవాసదీక్ష విననే వినలేని జగాలపాట నై
పోయిన దేమి సేయగలమోయి, తపస్వి! వినీలనేత్రగో
ళాయతమైన దీక్షమలజాంశము నీపరిహాసదృష్టిలో—
తీయని నీరు లేనగవు తీవియలే మము నాసపెట్టెడున్.

గుండె గుభిల్లుమన్న దనుకో, నిను జూడగ నింత పెద్దబ్ర
హ్మాండము సేయ నేటికి మహామహు లై నుతిగన్న మానవుల్?
కండలు గట్టియున్న తనుకాంతి రవంతయు లేక యిట్టి రే
మెండల గుప్పుచున్న మహనీయత నీకడ నేమి యున్నదో!

బక్కనరాలలో ముసలివగ్గువు! హైందవకోటి పేర్చ కం
పెక్కిన పాపరాశికి పవిత్రత నేడు ఘటిల్లజేయ నీ
వెక్కటి నింతబాధ సహియించెద వోయి, మహాత్మ? మాకునై
చక్కెరపూత బూసిన విషంబుల నెల్ల భరింతువో, సఖా!

కలుషము మూర్తికట్టినదొ కాని, మతం బనుమాటతోడ మ
మ్మలముచు కొంప గూల్చిన భయంకరమూర్తులు మూఢదేవతల్

కలరట సంప్రదాయవిషకాంతకు దాసులు : వింధ్యశైలసం
చలనము జూచియుం గదలజాలవో వారి హృదంతరాశముల్ !

ఆత్మజ్యోతి స్వతంత్రమై వెలుగు నీయం, దార్యవిద్యారహ
స్యాత్మోత్తేజము నీకనుంగవకు పూజల్ దిద్దు వైరాగ్యశ
ర్మాత్మాభిజ్ఞత నాడినాడికిని తానై నిల్చి వెల్గొందు ; ప్రే
మాత్మా ! నీ కిక శాంతికాశనము లే దన్నట్టి కొలంతా యిట్టె ?

లోకము నీపదార్చనవిలోలత గన్నులు మూసి ధన్య యౌ
నే కద ? అట్టివేళ నిను నీవ పరీక్ష యొనర్తు, వెంత విం
తో కదటోయి, మానివర ! దోర్బలదుర్జయు లైనవారు నీ
పోక లెఱుంగలేక కయిమోడ్తుర టూరక వింతవింతగా !

మతములతల్లి మాభరతమాత ధరించిన పూలదండ దే
వతలకు [illegible] గంధపరిపక్వత చాటు మతంబు హైందవ
ప్రతతికి వేదకాలమున వచ్చిన దిట్లు విదగ్ధ మైనచో
బ్రతుకున కాన వీడి పరిపాలన సేతు వటోయి, తాపసీ !

వేషం బొక్కటె నిల్చిపోయిన మతోద్వేగాన అస్పృశ్యతా
దోషాంకూరము పెల్లగిల్లవలె పో ! దోశ్శక్తికిం దక్కె వీ
కాషాయాంబరధారి పూనిన మహోగ్రప్రత్యహింసాత్మక
ద్వేషాభావ సుహృన్మిళన్నిరశనో ద్రిక్తప్రతిజ్ఞావిధుల్ !



దుర్గాఘట్టము, కాశీ

P. S. N.

భారతసంస్థానములు-భావిసంస్కరణములు

వడ్లమూడి సత్యనారాయణగారు

భారతదేశమునందలి రాష్ట్రములను, సంస్థానములను కలిపి రాబోవుసంస్కరణములలో నొక సమాఖ్యగా జేయుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. ఇట్టి తరుణమున భావిరాజ్యాంగములో సంస్థానముల కెట్టిస్థాన ముండవలెనని చర్చించుట అనవసరము కాదు. ఇందుకుగాను మొదట సంస్థానముల పూర్వచరిత్ర కొంచెము తెలిసికొను టుచితము,

పూర్వచరిత్ర

భారతదేశమునందలి మొత్తము సంస్థానములు చిన్న, పెద్దలు కలసి ౫౬౩. ఇందు కొన్నిటి సంవత్సరాదాయము వందలుమీఱదు. ఈసంస్థానములం దధికాంశము బ్రిటిషువా రిచ్చట రాజ్యము సంపాదించక పూర్వము మొగలుచక్రవర్తుల యధికారమునో మహారాష్ట్రసమాఖ్య యధీనముననో యుండెడివి. ఈప్రధానాధికారములు నశించినపిమ్మట నీసంస్థానములు బ్రిటిషువారి క్రిందికి క్రమక్రమముగా వచ్చెను. కొన్ని సంస్థానములు బ్రిటిషువారిచే స్వయముగా సృష్టింపబడినవి. కొందఱు సేనానాయకులు యుద్ధములలో ఈస్టిండియాకంపెనీ సైన్యములకు సహాయముచేయుటచే వారికి కొన్ని భూభాగములనిచ్చి యీసంస్థానముల సృష్టించిరి.

ఈసంస్థానములు మొదట పేరునకు కంపెనీవారి యధీనత నంగీకరించినను, స్వతంత్రాధికారములను చాల గలిగియుండెడివి. కాని వీటికి విడిగా నాంగ్లేయుల నెదుర్కొను శక్తి లేకపోవుటచేత, ప్రతిసారియు కొన్నియధికారముల తగ్గించుచు, క్రొత్త క్రొత్త సంధుల చేసికొనుట కీసంస్థానముల నాంగ్లేయులు వివశము చేసిరి. ఈరీతిగ వీటియధికారముల నన్నిటి పూర్తిగా తగ్గించివేసిరి.

భారతదేశమునందలి కొంద ఱాంగ్లోద్యోగులు సంస్థానములను పూర్తిగా నంతరింపజేసి బ్రిటిషురాజ్యభాగమునందు కలుపుకొనుట తమకు లాభదాయకమని తలచిరి. ఈయుద్దేశము నమలులోనికి తేబూనిన వారిలో వెలస్లీ, డల్‌హౌసీలు ముఖ్యులు. తత్ఫలితముగా నాగపూరు, సతారా, ఝాంసీ మున్నగు స్వతంత్రరాజ్యము లంతరింప జేయబడెను. ఆంగ్లేయుల యీ రాజనీతిచే దేశమంతటను హాహాకారములు బయల్వెడలెను. ఈరాజనీతియే ౧౮౫౭-వ సంవత్సరపు 'సిపాయి పితూరి' అనబడు విప్లవమునకు ముఖ్యకారణ మయ్యెనని చరిత్రకారుల యభిప్రాయము.

విప్లవానంతర మీనీతి యుపసంహరించు కొనబడెను. విప్లవము నణచుటకై బ్రిటిషువారిచే నెక్కువ నష్టమును పొందని సంస్థానములు కొన్ని యద్భుతమైన సహాయము చేయుటచే, భారతదేశములో బ్రిటిషుప్రభుత్వ చిరస్థాయిత్వమునకు సంస్థానముల యవసరము నాంగ్లేయులు గ్రహించిరి. పిమ్మట భారత ప్రభుత్వాధికారము కంపెనీనుండి పార్లమెంటునకు సంక్రమించెను. తరువాత సంస్థానముల అంతఃపరిపాలనలో నింగ్లీషువా రంతగా జోక్యము కలిగించుకొనలేదు.

ప్రస్తుతస్థితి

కాని యీనీతి తుదివఱకు సాగి సంస్థానముల నంతరింపజేయు కార్యము పూర్తిగా సఫలీకృతమయి నచో బాగుండెడిదని తలచువా రనేకు లిప్పుడు భారతీయులలో లేకపోలేదు. ఇందులకు కారణము భారతస్వరాజ్య సంపాదన యత్నమునకు సంస్థానాధీశు

లద్దుతేగులుచు ప్రజాభిప్రాయమున కంతగా సుము ఖులు గాకుండుటయే.

భారతదేశమునందలి సంస్థానములలో కొన్నిటికి స్వయముగా నాణెముల చేసికొను హక్కు కలదు. స్వకీయమైన వ్యాపారనీతియు (trade policy), సుంకముల విధించు హక్కును (customs' rights), సివిల్, క్రిమినల్ న్యాయనిర్వహణాధికారములును గలవు. అవసరమైనపుడు తమరాజ్యము లందలి శాంతి, భద్రతల రక్షించుకొనుటకును, బ్రిటిషువారికి కోరినపుడు సహాయము చేయుటకును కొన్ని సేనల నుంచుకొను అధికారమును కలదు. మించివచ్చిన రాజప్రతినిధి యొక్కయు, భారత ప్రభుత్వ సేనలయొక్కయు సహాయము నపేక్షింపవచ్చును. ప్రస్తుతము ఆళ్వారు, కాశ్మీరు రాజ్యములందలి ముసల్మానుల తిరుగుబాటు నణచుటకై యారాజ్యములు భారతప్రభుత్వ సహాయము గైకొనుట మన మెఱుగుదుము.

ఇక కొన్ని చిన్నరాజ్యములకు న్యాయ్య నిర్వహణాధికారము గాని, నాణెములు చేసికొను హక్కు గాని లేదు. వీటికి సొంతపోలీసు శాఖ గాని సైన్యముల పోషించవలసిన యవసరము గాని లేదు. ఈసంస్థానము లందలి ప్రజాశాంతిని, సంస్థానాధీశుల హక్కులను భారతప్రభుత్వమే రక్షించును. ఇవి పేరునకు మాత్రము సంస్థానములు. హిందూస్థానమునందలి సంస్థానము లన్నిటియందును సంస్థానాధిపు డన్యాయవర్తనుడై ప్రజలను పీడించుచున్నచో ప్రజలయొక్క న్యాయ్యమైన హక్కుల రక్షించునిమిత్తము, సంస్థానముల అంతఃపరిపాలనలో జోక్యము కలుగజేసికొనుటకు భారతప్రభుత్వమునకుహక్కు కలదు. కానిధనికులయొక్కయు, అధికారులయొక్కయు, మహారాజులయొక్కయు విశృంఖలత్వమునకు సామాన్యులు బలియగుచుండ చూచుచునూరకుండుట మన ప్రస్తుత ప్రభుత్వమునకు పరిపాటి యైపోయినది.

ప్రజలు, ప్రభువులు, పరిపాలన

ప్రస్తుతము భారతసంస్థానములందు ౭ కోట్లకుపైగా జనసంఖ్య కలదు. బ్రిటిషుఇండియా ప్రజలకన్న వీరు బీదవారని చెప్పిన వారి దరిద్రదశ యెంత దుర్భరమైనదో తెల్లముకాగలదు. సంస్థానప్రజలను మొత్తముమీద విద్యాశూన్యులనియే చెప్పవలెను. కొన్ని సంస్థానములు తమ ప్రజల విద్యాసౌకర్యమునకును, వైద్యసహాయమునకును కలిపి నూటికి ౨ వంతులకన్న నధికముగా వెచ్చించవు. అట్టియెడ వా రెంతటి విద్యాప్రవీణులై యుండగలరు దురో యూహించుట కష్టము గాదు. కొచ్చిన్, తిరువాన్కూరు, మైసూరు, బరోడా, గ్వాలియరువంటి కొన్ని రాజ్యములందు ప్రజల కెక్కుడు విద్యాసౌకర్యము లుండుట సత్యము. వీటిలో తిరువాన్కూరు సంస్థానము ప్రజలకు విద్యాసౌకర్యముల కలుగజేయుటయందు బ్రిటిషుఇండియాకన్న ముందంజ వేయుచున్నది. ౧౯౩౦-౩౧-వ సంవత్సరమునందు తన ప్రజల విద్యాభివృద్ధికై యీరాజ్యము తన మొత్తము రివిన్యూనుండి నూటికి ౨౧.౬ వంతులు వ్యయము జేసెను. ఈసంస్థానమునందు ప్రతి ౨.౦౬౧ చదరపు మైళ్ల విస్తీర్ణమునకును, ప్రతి ౧,౩౮౬ గురు జనులకును నొక ప్రభుత్వపాఠశాల గలదు. ఇట్టి సంస్థానమునందు విద్యాభివృద్ధి బాగుగా నుండుట వింతగాదు. ౧౯౨౯-౩౦ సంవత్సరమునకన్న ౧౯౩౦-౩౧-వ సంవత్సరము ౮,౦౦౦ లకు పైగా విద్యార్థు లెక్కువయిరి. ప్రస్తుత మీరాజ్యమున స్త్రీవిద్యార్థినులే ౨,౨౧,౦౦౦ కన్న నెక్కువగా నున్నారు. ఈయభివృద్ధి సంతోషదాయకమే. కాని మన మిప్పు డన్నిసంస్థానముల ప్రజలను గూర్చి మొత్తముమీద విచారించవలసి యున్నాము.

మైసూరు, తిరువాన్కూరు, బరోడా, గ్వాలియరులవంటి కొలది సంస్థానములందు తప్ప మిగతా వాటియం దెన్నదగిన పరిశ్రమలు సున్న. గృహపరిశ్రమలకు కూడ తగిన ప్రోత్సాహము లేనికారణముచే వ్యవసాయమే శరణ్యము. వ్యవసాయకుని యుత్పత్తి నుండి పదింట ఆఱువంతు లేవిధముగానైనను సంస్థానపు కోశమున జేర్చబడును. రైతుల పశుసంపద వారి కార్యములకు గాక సంస్థానోద్యోగుల యక్కఱల తీర్చుట కుపయోగపడును.

ఇక వెట్టిచాకిరి (బేగారీ) యన నేమియో రైతు వారీపద్ధతి యమలులో నున్నచోటి ప్రజలకు తెలియును. కాని బ్రిటిషు ఇండియాలోగూడ జమీందారీరైతులకు దాని మహాత్మ్యము బాగుగా తెలియును. బ్రిటిషు ఇండియాలోనే వెట్టిచాకిరీనుండి విముక్తి లేనపుడు నిరంకుశత్వమే యుగ్రపాలుగా పెరిగిన సంస్థానాధీశుల పరిపాలనలో రైతులకీ వెట్టిచాకిరినుండి రక్షణ లేదను టతిశయోక్తి గాదు.

ఆంధ్రదేశపు జమీందారీలలోని దాసీజనులను గూర్చి మనము కొంతవఱ కెఱుగుదుము. వారి జీవితయాత్రాభిధానమును గూర్చియు, జమీందారులయెడ వారు నిర్వహించవలసిన బాధ్యతలగూర్చియు నెల్లఱకు విదితమే. ఇంతకన్న నీచావస్థయందున్న దాసీజనులు సంస్థానములందు వేలకు వేలున్నారు. తమ యధీనమునందున్న భారతసంస్థానములందు బానిసవృత్తి లేదని యథార్థస్థితిని మఱుగుపఱచి జాతిసమితివంటి సభలందు బ్రిటిషుప్రతినిధు లితరదేశీయుల కళ్లకెంతగా కప్ప యత్నించినను, ఏటేట సంస్థానములందలి జనాభా లెక్కలను పరిశీలించిన నిజము స్పష్టము కాగలదు.

చాలమంది సంస్థానపతులు స్వదేశమునం దుండి తమ ప్రజల శ్రేయము వాంఛి, కష్టముల నివారింప యత్నించుటందుకంటె, పాశ్చాత్య దేశములందు విచ్చలవిడిగా ధనమును దుర్వ్యయము జేయుచు భోగవిలాసముల దేలుటయందు తమ కాలము నధికముగ వినియోగింతురు. స్వదేశములో వారి యారోగ్య మంతగా బాగుండదు. ఒక మహారాజు గడచిన మూడు వత్సరములలో నాల్గుసారులు యూరోపు కేగెను. ప్రస్తుత మాతడు పాశ్చాత్యఖండమునందే యున్నాడు. కొందఱు మహారాజుల 'జనానా'లను సవరించుటకై వేలకొలది రూప్యముల వేతనముపై నియమింపబడిన పాశ్చాత్య రమణులున్నారు. సంస్థాన ప్రజలయొక్క భాగ్యాభాగ్యములు నిరంకుశులును, ధనలోలుపులును అగు నుద్యోగుల వశమం దుండును. ఈయుద్యోగుల దుండగములు మహారాజుతో చెప్పికొనుట కవకాశము లుండవు. అయినను వినువా రెవరు? మొన్నమొన్ననే పన్నుల భారముచే క్రుంగిపోయిన రయితులపై విధించిన క్రొత్తపన్నును భరించజాల మని చెప్పికొనుటకై మహారాజు భవనమువద్ద కేగిన ఉదయపూరు సంస్థాన ప్రజా సమూహముపై తుపాకుల కాల్చుట మనము పత్రికలలో చదివియున్నాము. నిరంకుశులగు నుద్యోగులచే బాధింపబడు ప్రజలకు తమ యధిపునియెడ భక్తి యెటు లుండును? ఇతరులకు తాము సుపరిపాలకుల మని తెలియజేయుటకై తమ ప్రజల రాజభక్తిని గూర్చి సంస్థానాధీశు లెంతగానైన చెప్పికొననిండు. ఆళ్వారు, కాశ్మీరు రాజ్యముల యల్లరులును, ఇటీవల మనము పత్రికలలో చూచుచున్న హైదరాబాదుసంస్థానములోని యత్యధికసంఖ్యాకులైన హిందువుల యసంతుష్టియు సంస్థానాధీశులయెడ వారి ప్రజలకున్న రాజభక్తిని బయలు వెట్టుచున్నవి. నే నీవిషయము రసపుత్ర సంస్థానములందు పర్యటన మొనర్చునపుడు బాగుగా గ్రహించ గలిగితిని.

బ్రిటిషు ఇండియా పద్ధతి ననుసరించి కొన్ని సంస్థానములందు శాసనసభలును గలవు. కాని తిరువాన్కూరు, కొచ్చిను, మైసూరువంటి ౪, ౫ సంస్థానములందు తప్ప తక్కినసంస్థానములందు వాటి కెట్టి విలువయు లేదు. చాలవఱకీ శాసనసభలు అసలు కూడనే కూడవు. కూడినను ౧, ౨ రోజులలో పనియంతయు ముగించును. ౧౯౨౯-౩౦ సంవత్సరమందు బికనీరు శాసనసభ ఏప్రిలు ౧౫, ౧౬ తేదీలందు సమావేశమై యా రెండుదినములలోనే యావత్తుకార్యము ముగించెను. ౪౫ గురు సభ్యులలో ౨౩ గ్గురు హాజరైరి. ఈరెండురోజులలోనే శాసనసభబడ్జెటుకూడ చర్చించి, విద్య, వైద్యము, రోడ్లు మొదలగు ప్రజోపయోగకరములగు కార్యములకు మొత్తము ౧౦,౦౦,౦౦౦ పౌనుల రివిన్యూలో నుండి నూటికి ౩.౬ వంతును, మహారాజ భవనమునకును కుటుంబమునకును నూటికి ౨౨.౬ వంతును వెచ్చించ తీర్మానించెను.

జాం నగరు సంస్థానమునందు ౧౯౨౬-౨౭ బడ్జెటు ననుసరించి మహారాజు సొంత ఖర్చులకుగాను మొత్తము ౧౦,౦౦,౦౦౦ పౌనుల రివిన్యూ నుండి

౪,౧౦,౦౦౦ పౌనులు ఖర్చయ్యెను. ఈ ౪ లక్షల పౌనులు మహారాజకుటుంబమునకు, భవనములకు, మహారాజు మోటార్లు తిరుగురోడ్లకు, అతిథిశాలలకు, తదితర-చిల్లరఖర్చులకు వెచ్చింపబడెను. ఎంతటి సద్వినియోగము!

అధికారుల యుత్తరువు లేనిదే యెట్టి మీటింగులు (సాంఘికము లయినవి కూడ) చేయుటకు వీలుండదు. ఈమధ్యనే హైదరాబాదుసంస్థానమునందు మూడవ సంస్థానాంధ్రమహాసభాసమావేశమును నిషేధించిరి. ఈ క్రింది షరతుల కంగీకరించిన సభ సమావేశమున కనుజ్ఞ యివ్వమని ప్రభుత్వమునకు సిఫార్సు చేసెదనని పోలీసు మెంబరగు కల్నల్ 'ట్రెంచి' దొర తెలియజేసెను.—

“విద్య, రాజకీయములు, తదితరవిషయములందు ప్రజలకు గల కష్టసుఖముల నొక వ్యక్తి గాని, సంస్థ గాని యెట్టి పబ్లిక్ మీటింగు జరుపకుండగనే ప్రభుత్వము వారికి చెప్పికొన నవకాశ మున్నందున పైవిషయములను గూర్చిన ప్రభుత్వ నీతి గాని, యాజ్ఞల గాని యీసభలో చర్చింపరాదు, విమర్శించరాదు.

“పైషరతు లుల్లంఘింపబడవని సమావేశ కర్తలగు మాడపాటి హనుమంతరావుగారును, ఇతరులును ౨,౦౦౦ రూపాయిలకు జామీ నివ్వవలెను. షరతు లుల్లంఘింపబడెనో, లేదో, నిర్ణయించునది ప్రభుత్వ మొక్కటే.”

ఈవిషయ మొక్కటియే సంస్థానములందు గల ప్రజల స్వాతంత్ర్య మెట్టిదియో తెలుపును.

సమాఖ్య

సామాన్య మానవ-హక్కులనుండి గూడ వంచింపబడిన ప్రజలుగల సంస్థానములను, కొంతవఱ కంతకన్న నధికముగ స్వేచ్ఛ ననుభవించుచున్న బ్రిటిషు ఇండియా రాష్ట్రములను కలిపి యొకసమాఖ్యగా చేయ నిర్ణయించిరి. సమాఖ్య యనగా పూర్తిస్వాతంత్ర్య మనుభవించుచుండి, సమానప్రతిపత్తిగల కొన్ని రాష్ట్రముల కలయిక. సమాఖ్యలోని రాష్ట్రము లన్నియు సమాన స్వాతంత్ర్య మనుభవించిన యెడ నాసమాఖ్యకు స్థిరత్వము కలుగును. లేనిచో నది చిరకాలము నిలువజాలదు. అట్టియెడ ప్రజాపరిపాలితములగు బ్రిటిషు ఇండియా రాష్ట్రములును, నిరంకుశ రాజపరిపాలితములగు సంస్థానములును కలిపి సమాఖ్యగా చేసిన ఏమి లాభ ముండును? అందుచేతనే జిన్నా వంటివారు కూడ ప్రస్తుత పరిస్థితులలో సంస్థానములతో సంబంధము లేకుండ బ్రిటిషు ఇండియా రాష్ట్రములను మాత్రమే యొక సమాఖ్యగా చేయు టుచితమని చెప్పుచున్నారు. కాని యేది యెట్లున్నను సంస్థానములను కూడ సమాఖ్యలో చేర్చుటకు నిర్ణయించి బ్రిటిషుఇండియా ప్రతినిధులును, పార్లమెంటు ప్రతినిధులును, సంస్థాన ప్రతినిధులును కలిసి సంప్రతింపులు జరుపుచున్నారు. ఇందు కనుకూలవాతావరణము కల్పించుటకే బట్లరు, డేవిడ్సన్ కమిటీలు నియమింపబడి వాటిచే నివేదికలు ప్రకటింపబడెను.

బట్లరు కమిటీ

ప్రథమమున సంస్థానములకు, ఇండియా ప్రభుత్వమునకు గల సంబంధముల వివరించుటకుగాను బట్లరు కమిటీ నియమింపబడెను. ఈ కమిటీ, సంస్థానములపై ఇండియా ప్రభుత్వము (సభాయుక్తుడగు గవర్నరు జనరలు) ఈ క్రింది యధికారములు చలాయించు హక్కు గలిగియున్న దని యొప్పికొనెను.—

౧. విదేశ వ్యవహారములు.

౨. సంస్థానములలోని విదేశప్రజల రక్షణ, సంస్థానముల వలన వారికి గలుగు నష్టములకు పరిహారము నిప్పించుట.

౩. అంతర్జాతీయ వ్యవహారములందు సంస్థాన ప్రతినిధుల నియమించుట.

౪. బానిస వ్యాపారము నణచుట.

౫. విదేశ-నేరస్థులను స్వాధీన పఱచుకొనుట.

౬. దేశరక్షణ.

౭. యుద్ధసమయములందు కావలసిన రోడ్లు, రైళ్లు, విమానాశ్రయములు, సైనికస్థానములు, సైనిక

మార్గములు, కోటలు, ఆయుధములు, మందుసామాను, పోస్టు, టెలిగ్రాఫ్, టెలిఫోను, వైర్‌లెస్ ఆఫీసుల నుపయోగించుకొనుట.

౯. విద్రోహసమయముల సంస్థానాధీశుని రక్షించి యుచితమైన ప్రజల కష్టముల నివారణ చేయించుట.

౧౦. సంస్థానపతి దుష్పరిపాలకు డగుచో, లేక రాజభక్తిశూన్యు డగుచో నాతని తొలగించుట, లేక యధికారము తగ్గించుట, లేక యాతనిపై నొక రాజకీయ నిరీక్షకుని నియమించుట.

౧౧. సంస్థానములలో రాక్షసకృత్యములు జరిగినచో, ఘోరశిక్షలు విధింపబడినచో వానిని నివారించుట.

౧౨. మహారాజు మైనరగుచో నాతనికి విద్య గఱపుట, ఆతని సంస్థానమును పాలించుట.

౧౩. సంస్థానములు చిన్నవై ప్రభుత్వ బాధ్యతల నిర్వహించుట కసమర్థములైనచో సౌకర్యము కలిగించుకొనుట.

౧౪. యావద్భారత వర్షపు టార్థిక హితమునకు భంగము కలుగునని తోచినపు డుచితరీతిని నిర్ణయించుట. (బట్లరు కమిటీ రిపోర్టు, పేరా ౪౭ నుండి ౫౫ వఱకు).

ఈ పైయధికారముల సర్వాధికార మింతవఱకు ఇండియా కార్యదర్శిద్వారా రాజుగారి ప్రతినిధిగా పనిచేయు సభాయుతుడగు గవర్నరుజనరల్ గారిదేనని బట్లరుకమిటీ స్పష్టముగానే యొప్పికొనెను. సభాయుతుడగు గవర్నర్‌జనరలనగా ఇండియాప్రభుత్వమే యనుట నిర్వివాదాంశము. కాని యిండియాప్రభుత్వ పరిశీలనకు లోబడి యుండుటకు సంస్థానాధీశు లంగీకరించరు. కారణము, ఇండియాప్రభుత్వము భవిష్యత్తున వారివలెనే నల్లతోలు గలవారి యధీనమున నుండునన్న భయము తప్ప వేఱు కానరాదు. కాని బట్లరుసంఘము వారిభయమును తీర్చివేసినది. బట్లరు నివేదికయొక్క ౫౮-వ పేరాలో సంస్థానములకును, ఇండియాప్రభుత్వమునకును ఇపుడున్న సర్వాధికార సంబంధమును (relationship of the Paramount Power and the Princes) సంస్థానాధీశుల యిష్టము లేనిదే భారతశాసనసభలకు బాధ్యమైన నూతనభారత ప్రభుత్వమునకు మార్చగూడదని వ్రాయబడెను.

బట్లరుకమిటీవారి విచారణ రహస్యముగా జరిగెను. సంస్థానప్రజల యభిప్రాయము గాని, బ్రిటిషు ఇండియా ప్రజల యభిప్రాయము గాని తెలిసికొనబడలేదు. అసలాసంఘమున కిట్టి సలహా నిచ్చు అధికారమే లేదు. సంస్థానములకును, ఇండియాప్రభుత్వమునకును గల ప్రస్తుత సంబంధములను వివరించుటకే యాసంఘము నిర్మింపబడెను గాని భవిష్యత్సంబంధములగూర్చి సలహా నిచ్చుటకు గాదు. అట్టియెడ నిట్టి యభిప్రాయ మిచ్చుట యనౌచిత్యమని సర్ తేజ్ బహద్దర్ సప్రూ, దివాన్ బహద్దరు మోచర్ల రామచంద్రరావు మొదలగు సుప్రసిద్ధ భారతనాయకు లెల్లరు ఖండించిరి.

డేవిడ్సన్ కమిటీ

తిరిగి ఈయభిప్రాయమునే డేవిడ్సన్‌కమిటీవారు గూడ స్థిరపఱచిరి.

సంస్థానములపై భారతప్రభుత్వమునకు పరిశీలనాధికారమే లేనిచో సంస్థానాధిపుల నిరంకుశత్వ మిప్పటివలెనే సుస్థిరమై సాగును.

నెహ్రూని వేదిక

కాని ౧౯౨౭-వ సంవత్సరము మద్రాసులో జరిగిన అఖిల భారత జాతీయ మహాసభవారి యాదేశానుసారము భావి భారతరాజ్యాంగ విధానము నిర్ణయింప నేర్పడిన నెహ్రూకమిటీవారు సంస్థానములపై భారత ప్రభుత్వమువారు ప్రస్తుతము చెలాయించుచున్న యధికారము లన్నియు నికముందుకూడ భారతప్రభుత్వమునకే యుండవలె ననిరి. ఇట్లగుచో సంస్థానాధీశుల నిరంకుశత్వమునుండి ప్రజల కొకప్పుడైన రక్షణ గలుగును. బ్రిటిషు ఇండియానాయకు లెల్లయును, సంస్థాన ప్రజా

నాయకులను నెహ్రూసంఘమువారి యభిప్రాయము నంగీకరించిరి.

బ్రిటిషు వైఖరి

ఇక బ్రిటిషుప్రభుత్వమువా రెంతవఱకు సంస్థానాధిపతులనే సమర్థించు చుందురు. ఆ కోట్ల సంస్థాన ప్రజల కష్టసుఖములను వారు లెక్క చేయరు. సంస్థానాధీశుల పరిపాలనము గూర్చియు, వారిని బ్రిటిషువారు సమర్థించుటకు గల కారణమును గూర్చియు నీమధ్యనే లండనులోని 'డెయిలీ హెరాల్డు' పత్రికయందు ప్రొఫెసరు హెరాల్డు జె. లాస్కీగా రిట్లు వ్రాసిరి :

"వీనిలో (సంస్థానములలో) క్రౌర్యము మూర్తీభవించి యున్నది. ఇక్కడ మానవత్వమునకు స్థానము తక్కువ. ఈ సంస్థానప్రభువుల దుశ్చర్యలు హద్దు మీఱి పోకున్న నదియే పదివే లని చెప్పవచ్చు.

"........సాధారణముగ మనము అనాగరిక మని చెప్పుటకు తగిన పరిస్థితులను సహితము సహింతుము.

"సంస్థానములలో పెట్టబడు బాధలను గూర్చియు, జరుగు హత్యలను గూర్చియు నివర్ణన పూర్వకమైన గ్రంథములు కలవు. కాని వానిని మనము పఠింపము. సంస్థాన ప్రజాప్రతినిధులు (తమ ప్రభువుల) ఘోర నిరంకుశ చర్యలనుగూర్చియు, నీచభోగ లాలసత్వమునుగూర్చియు గాథలను తెలుపుచుందురు. కాని వానిని మనము వినము.

"సంస్థానాధీశుల దుశ్చర్యలు దుర్భరము కానంత వఱకు మనము వారితో గావించుకొన్న సంధిపత్రముల షరతులను పాటించుచు మౌనము వహింతుము.

"దీనికి కారణము సంస్థానాధీశులు బ్రిటిషు రాజ్య సమర్థకులై యుండుటయే......"

తిరిగి హెచ్. జె. లాస్కీగారు తమ వ్యాస మునందే బ్రిటిషువారి నిట్లు ప్రశ్నించుచున్నారు.— "భారతీయు లందఱు గర్వపడుటకు తగినట్లుగా తిరువాన్కూరు మహారాణిగారు పరిపాలన కొనసాగింప గలిగినప్పుడు మన సర్వాధికారమును వినియోగించి తక్కిన సంస్థానాధీశులుగూడ నట్లే పరిపాలన గావింప వలెనని మన మేల పట్టుపట్టగూడదు?"

మించివచ్చిన తప్ప బ్రిటిషువా రట్టిపని చేయరు. కారణము పైన విదితమే. అందుకనియే సంస్థానాధీశులు భారతీయులకు బాధ్యత వహించిన ప్రభుత్వము తమపై పెట్టి యధికారము వహించుట కిష్టపడకున్నారు. ఆంగ్లేయులుకూడ సంస్థానాధీశు ల్నడ్డుపెట్టుకొని సాధ్యమైనంతకాలము భారతస్వపరిపాలనాపథమును నిరోధింప యత్నించుచున్నారు. అందుచేతనే భారత సంస్థాన ప్రజలలో సగముమందినైన పాలించు సంస్థానాధీశులు భావిసమాఖ్యయందు చేరుట కిచ్ఛగించు వఱకు కేంద్రప్రభుత్వమునందు బాధ్యత ప్రసాదింప బడదని కడచిన మూడు రౌండుటేబిల్ సభాసమావేశముల యనంతరము వెలువరించిన వైటుపేపరునందు బ్రిటిషుప్రభుత్వమువారు స్పష్టముగా తెలియజేసిరి.

నెహ్రూకమిటీవారు తమ నివేదికలో, బ్రిటిషు ఇండియా కొకవేళ స్వపరిపాలనము నివ్వవలసివచ్చినను, సంస్థానములను మాత్రము ఐర్లండులోని అల్స్టరు వలె జేసి చిరకాలము తమ వ్రేళ్లపై నాడించుటకు బ్రిటిషురాజకీయవేత్తలు యత్నించుచున్నా రను భయమునుకూడ వెలిబుచ్చిరి.

కాని బ్రిటిషుఇండియాకు మాత్రము స్వపరిపాలనము నిచ్చిన యెడల, సంస్థానములందు మహారాజుల నిరంకుశపరిపాలనము నిర్విరోధముగా కొనసాగుట కష్టసాధ్యమని యాంగ్ల రాజకీయవిదులు తెలిసికొనిరి. మహారాజుల నిరంకుశత్వమే కొనసాగనిచో బ్రిటిషు ఇండియానుండి సంస్థానములను విడదీసి లాభ మేమున్నది? బ్రిటిషువారు చెప్పినటుల వినువా రెవరుందురు? అందుచే బ్రిటిషు ఇండియాకు స్వరాజ్య మివ్వకుండ సాధ్యమయినంతకాలము సంస్థానముల నడ్డుపెట్టుటే యుత్తమమయిన పద్ధతి యని ఆంగ్ల రాజనీతికోవిదులు విశ్వసించిరి.

ఒకప్రక్క మొత్తము సంస్థానముల జనసంఖ్యలో సగము జనులకైన పరిపాలించెడి సంస్థాన

నములు ఫెడరేషనులో చేరుట కియ్యకొనవనిదే కేంద్రము నందు బాధ్యత నెలకొల్ప వీలు లేదని ప్రభుత్వము తెలుపుచుండ నింకొకవంక ఫెడరేషనులో చేరుటవలన కలుగు నపాయముల జాగ్రత్తగా నాలోచించుకొను డని బ్రిటిషు 'టోరీ' పత్రికలు సంస్థానాధిపుల కర్ణపుటములు మారుమ్రోగునట్లు ఘోషించు చున్నవి. ఈ ఘోషవిఫలమై, సంస్థానాధీశులు భావిభారతసమాఖ్యలో చేరినను భారతప్రజాసామాన్యమున కందువలన సిద్ధించు లాభ మేమియు నుండదు. బ్రిటిషువర్తకుల స్వార్థసాధనకే వా రుపయోగ పడుదురు. లేనివాడు వైస్రాయిగారి సర్వాధిపత్య (Paramountcy) మున్నది గదా వారిని దారికి తెచ్చుటకు? అట్టియెడ నాంగ్లాధికారు లాజ్ఞాపించిన ట్లాడుటే వారికి విధి, లేక గతి కాదా? ఈ యుద్దేశముతోనే వైటుపేపరువిధానము తయారు చేయబడినది.

సంస్కరణముల యనంతరము ఫెడరల్ శాసనసభల రెంటింటియందును కలిపి ౬౩౫ గురు సభ్యులుండునట్లు నిర్ణయింపబడెను. అందు మొదటిశాసనసభయందు ౩౭౫ గురును, రెండవశాసనసభయందు ౨౬౦ మందియు నుందురు. దీనిలో సంస్థానాధీశులకు మొదటిసభకు ౧౨౫ మంది ప్రతినిధులను, రెండవసభకు ౧౦౦ మంది ప్రతినిధులను ఎన్నుకొను నధికారమివ్వబడెను.

భారతసంస్థానములలోని జనసంఖ్య సుమారు ౯ కోట్లు. అనగా మొత్తము భారతదేశ జనసంఖ్యలో నాల్గవ వంతుకు తక్కువ. భారతదేశ జనసంఖ్యలో నాల్గవ వంతుకూడ నివసించని ౫౬౩ సంస్థానములకు రెండుశాసనసభలందును కలిపి ౨౨౫ స్థానము లివ్వబడెను. అనగా మొత్తము స్థానములలో మూడవ వంతు కన్న నెక్కువ సంస్థానాధీశులకు లభించెను.

ఇక సంస్థానములు బ్రిటిషుఇండియాకన్న విద్యావంతములు, విజ్ఞాననిలయములు, నాగరికతాభరితములు ననుకొన్న నట్లుకాదు. ఇప్పటి సంస్థానములు ఒకశతాబ్దమువెనుక నుండవలసిన స్థితిలో నున్నవి. అట్టిచో నీసంస్థానములపై బ్రిటిషువారి కేల ఇట్టి యవ్యాజానురాగము కలిగెను?

సంస్థానాధీశుల ప్రతినిధులు తాము చెప్పినట్లు చేతు రన్న నమ్మకము బ్రిటిషువారి కున్నది. ప్రభుత్వసభ్యులు, యూరోపియను, ఆంగ్లో ఇండియను ప్రతినిధులు, స్వదేశీయుల విశ్వసింపజాలక బ్రిటిషువారి రక్షణ నాశించు అడిత్తర-మైనారిటీసంఘముల ప్రతినిధులు ప్రభుత్వమును వ్యతిరేకించరు. ఇట్టి స్థితిలో బ్రిటిషువారు కేంద్రప్రభుత్వమునం దివ్వదలచు కొలదిబాధ్యతయుగూడ భారతజాతీయవాదుల హస్తగతము కాకుండ జేయగలుగుదురు. ఇంతకన్న వారికి కావలసిన దేమున్నది?

భా వి స్థి తి

ఇక సంస్థానప్రజలకు భావిరాజ్యాంగముతో నెట్టి సంబంధము నుండదు. భావిసమాఖ్య వారి నే విధముగను ప్రస్తుతనిరంకుశత్వమునుండి తప్పింపజాలదు. ఫెడరల్ శాసనసభలకు ప్రతినిధుల నెన్నుకొనుటకు వారికి హక్కులేదు. ఫెడరల్ శాసనసభలకు సంస్థానముల ప్రతినిధుల నెన్నుకొనుహక్కు సంస్థానాధీశులకే యివ్వబడెను. పైగా ఫెడరల్ శాసనసభలచే గావింపబడు చట్టములు మహారాజుల యంగీకారము లేనిదే సంస్థానములందు వములులోనికి రాజాలవు. ఇట్టి రాజ్యాంగవిధానమును ప్రజ లామోదించకపోవుటలో నాశ్చర్య మేమున్నది?

సంస్థాన ప్రజాసంఘము లన్నియు తమ హక్కులకొఱకు తీవ్రాందోళన మొనర్చుచున్నవి. సంస్థానాధీశుల నిరంకుశత్వమును సుస్థిరమొనర్చు నీ రాజ్యాంగవిధానమును ప్రజాసంఘము లన్నియు నేకగ్రీవముగా ఖండించినవి. ప్రజల యసంతుష్టి పెచ్చుపెరిగి పోవుచున్నది. సంస్థానములందలి యసంతుష్టిని గూర్చి హెరాల్డు లాస్కీగా రిట్లు వ్రాయుచున్నారు: "అళ్వారు ప్రజల విప్లవము భారతదేశసమస్యలను శ్రద్ధగా పరిశీలించుచున్నవారి కాశ్చర్య జనకముగ లేదు.

తక్కిన పెక్కు భారతదేశసంస్థానములందు చాల కాలము క్రిందనే విప్లవము ప్రారంభము కాకుండుటయే వారి కాశ్చర్య మొదవించును."

ఇట్టి స్థితిలో బాధ్యత గల భారతనాయకు లెల్లరు సంస్థానాధీశులు తమ సంస్థానపరిపాలనలో ప్రజలకు సంపూర్ణబాధ్యత నీయనిదే వారికి భావి సమాఖ్యయందు స్థాన మిచ్చుటయు ననుచితమని నుడువుచున్నారు. 'ఔంధ్' సంస్థానాధీశుడుమాత్రము ౧౯౩౯-వ సంవత్సరాంతమునకు తన సంస్థానపరిపాలనయందు ప్రజలకు సంపూర్ణబాధ్యత నిచ్చెద నని ప్రకటించెను. కాని యీ సంస్థానము చిన్నది. తక్కిన సంస్థానాధీశులు 'ఔంధ్' సంస్థానాధీశుని ఆదర్శముగానైన గైకొను సూచన లేవియు గానవచ్చుటలేదు.

కొందరు తలచునట్లుగా ఫెడరల్ శాసనసభలలో సంస్థానాధీశుల కట్టి ప్రాతినిధ్యము లేకుండ జేయుట ప్రస్తుతపరిస్థితులలో నసంభవము. తుదకు మహారాజులకు న్యాయనిర్వహణాధికారము లేని సంస్థానములలో కూడ ఫెడరల్ శాసనసభలకు ప్రతినిధుల నెన్నుకొను హక్కు ప్రజలకే యొసగబడు నాశకూడ కాన్పించుటలేదు. సమాన స్వాతంత్ర్యము లేని రాష్ట్రముల సమాఖ్య భగ్న మగుట తథ్యమని పలువు రనుభవజ్ఞుల యభిప్రాయము. రాజప్రభుత్వ సమర్థకులగు సంస్థానప్రతినిధులకును, ప్రజాస్వామికాశయములుగల బ్రిటిషుఇండియా ప్రతినిధులకును సంఘర్షణ తప్పదు. భిన్నాశయములుగల వారి కలయిక సుస్థిరమైన దెట్లగును? అట్టియెడ భావి రాజ్యాంగవిధానము దృఢముగా నెట్లుండగలుగును?

RAYMALT



మధురమైన విటమిన్ ఆహారము

మాల్టుసారమును, కాంతివంతమైన పాలక్రొవ్వును ఏ. బి. సి. డి. విటమినులు విరివిగాగల యితర పదార్థములును, యిందు మిళితమైయున్నవి.

అమూల్యమైనది

ఎదిగేపిల్లలకు ఆరోగ్యము నిచ్చుటలోను, దంతములను, ఎముకలను చక్కగా నిర్మించుట యందును, అసమానమైనది.

రేమాల్టు

కృంగి కృశించెడివారికిని, పాండురోగమునకును, సామాన్య దుర్బలత్వమునకును, గర్భిణి సమయమందును, ప్రసవానంతరమును సరియైన పోషణ నొసగుటకును ఉపయోగించును.

Bengal Chemical &

Pharmacutical Works, Ltd.,

CALCUTTTA.

మద్రాసుస్టాకిస్టులు:—యస్. దేశాయిగౌండర్, బందరువీధి,

చిల్లరప్రదర్శనశాల:—చైనాబజార్ రోడ్డు, రాజాగారి ప్రతిమకు యెదురుగా.

వసంతాంత శ్రీముఖము

కవిరాజహంస, వోలేటి పార్వతీశముగారు

క్ష్మాతాపిఁ గడల గమ్మగ న్ననిపించి - తేనెపానకములఁ దేంట్లఁదనిపి
సత్ఫలోపకృతికి సర్వస్వ మర్పింప - నలరు లెల్ల సిద్ధమగుచు నుండె.
చివురులనవకంబు చెదరుచున్నకొలందిఁ గోకిలకంఠంబు గొణఁగఁదొడఁగె;
విరిదేనెఁ బుప్పొడి పొర మించినకొలందిఁ దేఁటినాలుక ఓట దేఱఁదొడఁగె;
కరువళ్లు పడమరఁ దిరుగుచున్నకొలంది నెళసీళ్ల నులివెచ్చ మలయఁదొడఁగె;
పట్టుగొమ్మల దోరపండ్లూడినకొలందిఁ బేదలిగలగొంతు బిగియఁదొడఁగె;
ఇనుఁడు రోహిణివగలఁ బెల్లెగయుకొలఁది- భువనగర్భాంతరాళంబు పొగయఁదొడఁగె;
శశి విశాఖాంతరస్థుఁడై జరగుకొలఁది - మధువనోపవనశ్రీలు మాయఁదొడఁగె.

ఆఁకలి దీరఁగాఁ జిగురుటాకులు మేయుచు నేఁడె మోహన
శ్రీకలపంచమశ్రుతులచే జగమెల్ల సుధామధుద్రవా
సేకవిముగ్ధ పరాసటులు చేసి ప్రమోదరసాబ్ధిఁ దేల్పుఁ డో
కోకిలలార! పల్కుబడి కోరిన రాదిఁక మీకు మీఁదటన్.

చీలికలైన వేణికలు చిక్కు నితంబము లాని తూలి కై
వ్రాలఁగఁ; దల్లడిల్లి నిడువాలుగ వాలుగనుల్ చలింపఁగా
నేల పరిభ్రమింతు వుదధీశదినేశు లుదారు లప్పలం
దేలిచి మేర మీరకయె తీరుతు రోడకు మోపయస్వినీ!

అడుగక పెట్టకుండఁగ సుఖానుభవంబులు సేయ సర్వముల్
విడిచి విహంగసంతతికి విందులమందిర మైననాపయిన్
బడితల మోది మోది ఫలభంగము చేసిరి క్రూరు లంచు బె
గ్గడిలకు త్యాగశీలి కడగండ్లకు జంకునటమ్మ చూతమా!
సరసఫలోన్నమధ్య సరసాలవనంబులఁ జేరి సౌమ్యవా
సరముల నాకలోకభవసౌఖ్యము లందితి రెల్లకాల ము
ర్వర నొకరీతి సాగ దుపవాసము సేయుఁడు గాని వేపలం
దిరిసి కులంబు గౌరవము తేలిక చేయకుఁ డమ్మ కీరముల్.

నడక బడలి, యాఁకలిమంట నుడికి చిలుక-కొట్టని తినంగ ఫలము నైకొంటి గాని
పాంథుఁడా! సంశయంబయ్యెఁబట్టిత్రిప్పి-చూచుకొనుమోయి! త్రాచుమూచూచెనేమొ?
సన్న నిలిచెనె నేఁటిలో నిండకుండ? - పగలు మిగిలెనె రాత్రిలోఁబడకయుండ?
అట్లె యీవసంతము గ్రీష్మమైనదాఁకఁ - గూరుచుండదు మన కిది క్రొత్తగాదు.



గీతోపదేశము

చిత్రకారుడు : శ్రీ యం. యస్. శర్మగారు.

ప్రతివిమర్శనము

"కుమారస్వామి విగ్రహము"

శ్రీ గో. వేం. రాఘవరావుగారి విమర్శనమునకు ప్రత్యుత్తరము

ఏప్రిలునెల భారతిసంచికయందు (పుట ౬౩౭) శ్రీ గొట్ముక్కల వేంకటానందరాఘవరావుగారు నావ్యాసముపై విమర్శనము వ్రాసినందులకు మిగుల సంతోషమైనది. నా వ్యాసమునందు ప్రమాదవశమున పడిన తప్పులను రెండింటిని నేనే సవరించుకొని వ్రాయదలచి యుంటిని. కాని నాకు ఇటీవల కలిగిన కొన్ని యనివార్యములయిన యిబ్బందులవలనను, మనస్స్వాస్థ్యము లేమిచేతను నాసవరణ రచనము ఆలస్యమైనది. ఇంతలో శ్రీ రాఘవరావుగారు తమ విమర్శనమును వ్రాసిప్రకటించి పాఠకలోకమున కుపకారము చేసినారు.

౧

విమర్శింపబడిన విషయములలో మొదటిది శకవర్షములసంఖ్య, అందలి తిథియును. శా. శ. ౯౬౪-వ సంవత్సరము క్రీ. శ. ౧౦౪౨-౪౩ వరకు సరిపోవును. కాని భారతియందు క్రీ. శ. ౧౦౪౨ అని యుండవలసినచోట క్రీ. శ. ౧౦౨౪ అని ముద్రితమైనది. ఇది అచ్చు తప్పు. నా వ్యాసము అచ్చులో నున్నపుడు ప్రూఫు చదువుటలో జరిగిన ప్రమాద మది. పాఠకులు మన్నింతురుగాక. ఆ తప్పును నేను సవరించుకొనుటకు వీలులేకుండ పోయినది. ఇక దానసమయము, తిథియు, మాసమును నేను తప్పుగా నూహించితిని. మూలమున సంస్కృతశ్లోకమునందు, "చైత్రం గతే భాస్కరే" యనియు తెలుగుభాగమున "విషువ సంక్రాతి నిమిత్త్యంబున" అనియు నున్నది. ఈ రెండును శాసనకాలమును సరిగా నిర్ధారణ చేయుటకు తోడ్పడు చున్నవి. చిత్రానక్షత్రమునందు సూర్యుడు ప్రవేశించిన తరువాత వచ్చు విషువత్పుణ్యకాలమున నీశాసనమం దుదాహరింపబడిన దాన మియ్యబడినది. చిత్తానక్షత్రములోని రెండుపాదములు కన్యారాశిలోనివి. మిగిలిన రెండు చరణములును తులారాశిలోనివి. సూర్యుడు చిత్రానక్షత్ర తృతీయచరణమునందు ప్రవేశించిన తరువాత వచ్చు విషువత్పుణ్యకాలము తులాసంక్రమణ సమయ మగుచున్నది. అదియే శ్రీ రాఘవరావుగారు వచించిన ఆటమ్నలు ఈక్వినాక్సు (Autumnal equi-nox); కాని అది శ్రీరాఘవరావుగారు చెప్పినట్టుల భాద్రపదమాసములో రాదు; ఆశ్వయుజమాసమందు వచ్చును. తులాసంక్రమణ పుణ్యకాలమే యీ శాసనము వేయబడిన తిథి యగుచున్నది. ఈ విషువత్పుణ్యకాలము, క్రీ. శ. ౧౦౪౨-వ సంవత్సరము సెప్టెంబరు ౨౩-వ తారీఖు ఆప్రాంతము అగుచున్నది. ఈ సంక్రాంతి పుణ్యకాలము శ్రీ విజయాదిత్య మహారాజుయొక్క పదునొకండవ విజయరాజ్య సంవత్సరమున వచ్చినది. అట్లయిన నా మహారాజు రాజ్యపాలనము, శా. శ. ౯౮౩ లో తులాసంక్రమణమునకు ముందు అనగా క్రీ. శ. ౧౦౬౧ సెప్టెంబరునెలకు పూర్వములో ప్రారంభమై యుండవలయును.

౨

శ్రీరాఘవరావుగారికి మూడు సందేహములు కలిగినవి. అందు మొదటిది "ఈవిజయాదిత్యుడు క్రీ. శ. ౧౦౬౧ లో రాజ్యము చేయ నారంభించుట యెట్లు సాధ్యమయినది?" రెండవది, "రాజరాజు సవతితమ్ముడగు విజయాదిత్యునకు-విష్ణువర్ధనుడను నామ మున్నట్లు నిదర్శనము లున్నవా?" మూడవది, "రాజరాజు పరిపాలనము క్రీ. శ. ౧౦౬౧ సంవత్సరమునందు అంతమయి నట్లును, అతని సవతితమ్ముని -విజయాదిత్యుని పరిపాల

నము ఆసంవత్సరములోనే యారంభమైనట్లును చరిత్ర నిదర్శనము లున్నవా?"

ఇటీవల నాపరిశోధనఫలితముగ జేలిన యంశము లను గొన్నింటిని ఈపత్రికయందు మున్నొకసారి "రాజ రాజు" అనువ్యాసమున ప్రకటించితిని. దానిని శ్రీ రాఘవ రావుగారు చూచెదరు గాక. ఇపుడు "కుమారస్వామి విగ్రహ" మను శీర్షిక క్రింద కొన్ని నూతనాంశములను స్థూలముగా నిరూపించితిని. కాని శ్రీ రాఘవరావుగారి వంటి పాఠకు లాంధ్రదేశమునందు పెక్కండ్రు కలరు గావున, వారికెల్లరకు నిట్టిసందేహములు నివారింపబడ వలసిన వను ఊహతో, వారి ప్రశ్నలకు సమాధానములు వ్రాయుచున్నాను.

రాజరాజుసవతితమ్ముడగు విజయాదిత్యుని చరిత్ర కారులు సప్తమ విజయాదిత్యుడని వ్యవహరించుచు న్నారు. కాని ఈరాజును అష్టమవిజయాదిత్యుడని పిలుచుట యొప్పును. పూర్వ చాళుక్యాన్వయములో పుట్టిన విజయాదిత్య నామాంకితులయిన మహారాజులలో నతడు ఏడవవాడగుటచే మొన మొన్నటివఱకు ఫ్లీటు మొదలయినవారు వ్రాసిన దానినిబట్టి ఈవిజయాదిత్యుని ఏడవవాడని చరిత్రకారులు వ్యవహరించుచువచ్చిరి. ఇటీవల లభించిన బాదపమహారాజు ఆరుంబాక తామ్రశాసనము వలన ఇమ్మడి అమ్మరాజునకు తరువాత విజయాదిత్య నామాంకితుడగు బాదప మహారాజు పరిపాలించెనని తెలియవచ్చినది. ఆమహారాజు బిరుదు గద్యయందు ఇట్లున్నది: "......వేంగీశో యుద్ధమల్ల క్షితిపతితనయో బాదపాఖ్యాధిరాజః...... స సమస్త భువనాశ్రయ శ్రీ విజయాదిత్య మహారాజాధిరాజ పరమేశ్వరః పరమ భట్టారకః పరమమాహేశ్వరః పరమ బ్రహ్మణ్యో మాతాపితృపాదానుధ్యాయీ..." ఇట్లు బాదపమహా రాజు విజయాదిత్య నామాంకితుడగుటవలన, బాదపుని సప్తమ విజయాదిత్యుని క్రిందను, రాజరాజు సవతి తమ్ముడు విష్ణువర్ధన విజయాదిత్యుని అష్టమ విజయాది త్యుని క్రిందను మార్చి పరిగణింపవలసివచ్చినది.

ముందు రెండవప్రశ్నకు సమాధానము తెలుపు దును—

ఈఅష్టమ విజయాదిత్యుని తామ్రశాసనములు మూడు మన కింతవఱకు లభించియున్నవి. అందు మొద టిది "సప్తమవిజయాదిత్యుని పాములవాక తామ్రశాస నము" అను శీర్షికతో ఆంధ్ర - ఇతిహాస పరిశోధక మండలివారి జర్నలు రెండవసంపుటమున ప్రకటింపబడి నది. ఈశాసనమునందు విజయాదిత్యుడు తనసవతిఅన్న రాజ్యముచేయుచుండగా నాతని ధిక్కరించి యాతడు సింహాసనమెక్కిన పండ్రెండేండ్లకు దేశమునుండి తరిమి వైచి వేంగీమహీమహా సామ్రాజ్యమునకు పట్టముకట్టు కొన్నట్లు ఆశాసనమందు తెలుపబడియున్నది. అందు అష్టమవిజయాదిత్యుని పేరు బిరుదు గద్యయం దిట్లున్నది:

"స సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన మహా రాజో రాజాధిరాజః శ్రీ విజయాదిత్యదేవః"

ఈశాసనము ఇంచుమించుగా క్రీ. శ. ౧౦౩౪ నాటిదని చెప్పవచ్చును. మిగిలిన రెండు శాసనములును గోదావరి జిల్లా రాజవోలుతాలూకా ర్యాలిగ్రామమున దొరికెను. ఇవి విజయాదిత్యుడు రాజరాజు ననంతరము రాజ్యముచేయుచుండిన కాలమున క్రీ. శ. ౧౦౪౩-వ సంవత్సరమున నీయబడినవి. గవర్నమెంటు ఎపిగ్రాఫిస్టు తనరిపోర్టులో వీటిని ౧౯౨౪-౨౫ సంవత్సరపు ౧, ౯ సంఖ్యలతో (నెంబరులతో) గుర్తించియున్నాడు. ఈ రెండుశాసనములందునుగూడ విజయాదిత్యుడు "సర్వలో కాశ్రయ శ్రీవిష్ణువర్ధనమహారాజః" అని వ్యవహరింప బడినాడు. కావున విజయాదిత్యునకు విష్ణువర్ధన నామ ముండెనాయను సందేహ మక్కరలేదు. ఇంకొక క్రొత్త విషయము—

పూర్వచాళుక్యాన్వయమున బుట్టిన మహారాజు లందరును ఇంచుమించుగా విష్ణువర్ధన, విజయాదిత్య నా మాంకితులే. ఈరెండుపేరులును వారికి కులక్రమాగతము లయినవి, వాటిపై వాతంశజులకు మిక్కిలి ప్రీతి. ఆ రెండింటిలో "విష్ణువర్ధన" నామముపై చాళుక్యులకు మరింత గౌరవము. దానికి కారణములు ఇక్కడ చర్చిం చుటకు తావు చాలదు. మొదటి శక్తివర్మ కాలమునుండి (క్రీ. శ. ౯౯౯-౧౦౧౧) వేంగీచాళుక్యరాజులు "విష్ణు

వర్ధన మహారాజులు” యని వ్యావహారిక నామమును పట్టాభిషేకమయినది మొదలుగా వాడుకొనుచుండిరి. అందువలన ఇంచుమించుగా నప్పటినుండియు చాళుక్య రాజులందరు పట్టము గట్టుకొన్న తరువాత తమకు వేర్వేరు నామములున్నను “విష్ణువర్ధన మహారా”జను వ్యవహార నామమున బరగుచుండిరి. వరుసగా మొదటి శక్తివర్మ మొదలుకొని, మొదటి కులోత్తుంగచోళదేవుని కుమారులలో వీరచోడునివఱకు (క్రీ.శ.౧౦౭౮-౧౦౯౨) పరిపాలించిన మహారాజు లెల్లరును విష్ణువర్ధన నామముతో బరగియుండిరి. తరువాత “సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజు” అనునది ప్రతిచాళుక్య వంశజునకును పరిపాటిగా ద్వితీయనామ మైపోయినది. రణస్థిపూండి శాసనమున విమలాదిత్యుడును, కోరుమిల్లి, నందమపూండిశాసనములందు రాజరాజును, పాములవాక, ర్యాలిశాసనములందు అష్టమవిజయాదిత్యుడును, నుమిరువాడ శాసనమున ఇమ్మడిశక్తివర్మయును, ఏలూరి తామ్రశాసనమున కులోత్తుంగచోడుని రెండవకుమారుడు, రాజరాజనామాంకితుడు నగు ముమ్మడిచోడుడును (C. P. No. 3 of 1921-22.), చేకి శాసనమున కులోత్తుంగచోడుని జ్యేష్ఠకుమారుడును రాజరాజ నామాంకితుడునునగు చోడగంగుడును, పిఠాపురము, చెల్లూరిశాసనములందు వీరచోడుడును “సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజ” అని వ్యావహారిక నామముతో పేర్కొనబడిరి. కావున అష్టమ విజయాదిత్యునకు విష్ణువర్ధననామ ముండుట స్పష్టమగుచున్నది. ఇందులకు మనకిపుడు నూత్నముగా దొరకిన రాజమహేంద్రవర శిలాశాసనమే ప్రబల ప్రమాణము. విజయాదిత్యునికే గాదు, అతనియన్నకును, కుమారునికిని గూడ విష్ణువర్ధనుడని పేరున్నట్లు తెలియుచున్నది. మరియు నింకొక విశేషమున్నది. “సర్వలోకాశ్రయు”డన్న బిరుదముకూడ నందఱకును సామాన్యముగా నుండినట్లు గన్పట్టును. ఇమ్మడి అమ్మరాజుకాలమువఱకు (క్రీ. శ. ౯౪౫ మొదలు ౯౭౦ అంతమువఱకును) “సర్వలోకాశ్రయ”, “సమస్తభువనాశ్రయ” అను బిరుదములను తండ్రి యొకటిధరించిన కొడు కొకటిధరించు చుండిరి. కాని యామహారాజు లవకు నారెండింటినిగూడ నుపయోగించుకొనెను. కాని మొదటి శక్తివర్మకాలమునాటినుండి సర్వలోకాశ్రయు డన్న బిరుదు సామాన్యముగా వేంగీచాళుక్యులును సమస్తభువనాశ్రయుడన్నది చోళులును, పశ్చిమచాళుక్యులును సామాన్యముగా ఉపయోగించుకొనుట ప్రారంభించిరి. చివరకు వేంగీచాళుక్యులకు ‘సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజులు’ అన్న బిరుదును, పేరును పరిపాటి యయ్యెను. అందువలన రాజరాజుకాలమునాటి కొన్ని శిలాశాసనములందును, అష్టమవిజయాదిత్యుని నాటి కొన్ని శిలా శాసనములందును విష్ణువర్ధన నామమేగాని యామహారాజుల నిజనామము గానరాదు. కులోత్తుంగచోడదేవుని తరువాత రాజ్యమేలిన చాళుక్యరాజుల శాసనములందు ఎక్కడనుగూడ రాజులపేర్లు గానరావు. ఏశాసనము జూచినను “సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజు” లనియే గానబడుచుండును.

అష్టమవిజయాదిత్యుని శిలాశాసనమొకటి గుంటూరిజిల్లా తెనాలితాలూకా జుత్తిగగ్రామమున వాసుకిరావి సోమేశ్వరస్వామివారి యాలయమున దొరకినది. అది ఆరాజమ్యుని విజయరాజ్యవరుషములు ౧౩ నాటిది. అనగా క్రీ. శ. ౧౦౭౪ నాటిది. అందు విజయాదిత్యుడు విష్ణువర్ధన-విజయాదిత్యుడని పేర్కొనబడినాడు. ఆ మహారాజు కరవాల భైరవుడను తన బిరుదు పేరిట కరవాల భైరవమంటపమని యొక శిలామంటపము వాసుకిరావిసోమేశ్వరస్వామివారి యాలయమున కట్టించె నని ఆశాసనమందు తెలుపబడినది.*

ఇక మొదటి ప్రశ్నకును, మూడవ ప్రశ్నకును ప్రత్యుత్తర మిత్తును.

రాజరాజుయొక్క కాలమునాటి కొన్ని శిలాశాసనములు దొరికియున్నవి. అందు అతని విజయరాజ్య వర్షములును శకవర్షములునుగూడ నీయబడినవి. కావున అవి ఆమహారాజుయొక్క రాజ్యపాలనారంభసంవత్సర

* A. R. No. 738 of 1920.

మును సూచింపగలవు. రాజరాజు నలుబదియొక్క సంవత్సరములు పాలించెనని యాతని తరువాతిరాజుల శాసనములు తెలుపుచున్నవి. వాటిలో మిక్కిలి ముఖ్యమైనది యాతని సవతితమ్ముని కుమారుడు రెండవ శక్తివర్మ యమియవాడ తామ్రశాసనము.* అమ్మనవిజయాదిత్యుని ర్యాలి తామ్రశాసనములందుగూడ నట్లే వక్కాణింపబడియున్నది. కోరుమిల్లి, నందమపూండి శాసనములందు రాజరాజు యొక్క పట్టాభిషేక కాలము తెలుపబడియుండుటచేతను, దానికి సరియైన ఇంగ్లీషు తేది ౧౬-వ ఆగస్టు ౧౦౨౨ అని లెక్కింపబడియుండుట చేతను, ౧౦౨౨ కు నలుబదియొక్క సంవత్సరములు కలిపి క్రీ. శ. ౧౦౬౩ జూలయి నెలలో రాజరాజు రాజ్యకాలము ముగిసెనని చరిత్రకారు లూహించి వ్రాసిరి. ఇందులకు భిన్నములయిన నూతనవిషయములు తెలుపు శాసనములు మనకు లభించినందువలన రాజరాజు యొక్క రాజ్యపాలనకాలమును ఇంచుక మార్చి వెనుకకు గొంపోవ వలసియున్నది.

గుంటూరుజిల్లా తెనాలితాలూకా నందివెలుగు గ్రామమున అగ్నేశ్వరస్వామివారి యాలయమునందున్న రాజరాజు కాలమునాటి యొకశిలాశాసనమున విజయరాజ్యవర్షములు ౩౭ అనియు, శకవర్షములు ౯౮౦ అనియు తెలుపబడియున్నది. శకము ౯౮౦ లోనే ౩౭-వ సంవత్సరము పూర్తియై ౩౮-వ విజయరాజ్యవర్షము ప్రారంభమయ్యెను. అందువలన రాజరాజు పరిపాలనము శకము ౯౪౨ లో ప్రారంభమైనట్లూహింపవలయును. రాజరాజు కాలమునాటి మరియొక శిలాశాసనము తెనాలితాలూకా వలివేరు గ్రామమున స్వయంభూదేవుని యాలయమున నున్నది. (నెం. ౬౭౨-౧౯౨౦) అది శకము ౯౮౩ ప్లవనామ సంవత్సరమునాటిది. అందు రాజరాజదేవనామాంకితుడగు సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన మహారాజు యొక్క విజయరాజ్యవర్షము ౪౧ అని యివ్వబడినది. దీనినిబట్టిగూడ రాజరాజు పాలనము శకము ౯౪౨ లో ప్రారంభమయ్యెనని విదితమగుచున్నది. ఈ రెండు శాసనములనుబట్టి వెనుకకు లెక్కవేసినయెడల రాజరాజు పట్టాభిషేకము చేసుకొన్నకాలమునకు పూర్వము రెండేండ్లనుండియు తండ్రిజీవించియుండగనే రాజ్యభారము పూనియుండెనన్నట్లు తెలుసుకొనవచ్చును. శ. ౯౪౨-వ సంవత్సరము రౌద్రినామసంవత్సరమునకు సరిపోవుచున్నది. ఆయేటి చాంద్రమాన చైత్రశుద్ధ పాడ్యమి క్రీ. శ. ౧౦౨౦ సంవత్సరము మార్చి ౧౦-౧౧ తారీఖులకు ఇంచుమించుగా సరిపోవుచున్నది.

రాజరాజు, తండ్రి యాజ్ఞానుసారము శకము ౯౪౩-వ సంవత్సరము కొన్ని నెలలు గడచినతరువాత రాజ్యభారము బూనియుండినట్లూహించుకొనవచ్చును. ఆతని రాజ్యారంభము చాంద్రమాన శ్రావణమాసమందో, భాద్రపదమందో జరిగియుండును. ఈ యూహ సరియైనదని యెంచినచో రాజరాజు పరిపాలనము క్రీ. శ. ౧౦౬౧-వ సంవత్సరము జూలయి నెలలో ముగిసియుండవలయును. అది శకము ౯౮౩ శ్రావణమో, భాద్రపదమో అయియుండనోపు. అప్పటికే రాజరాజు పరిపాలనము ప్రారంభించి ౪౧ సంవత్సరములు గడచియుండును. మరియు శకము ౯౮౩ సంవత్సరమున తులాసంక్రమణమునకు ముందే యాతని సవతి తమ్ముడు విజయాదిత్యుడు రాజ్యము సేయ నారంభించియుండునని యాతని కుమారుడు ఇమ్మడిశక్తివర్మశాసనములోని యీ క్రిందివాక్యములు స్ఫురింపజేయుచున్నవి:

"విమలాదిత్యా చ్చోడాన్వయైకలక్ష్మ్యాః శ్రీ మేడవ మహాదేవ్యాః, అజని జయ శ్రీనిత్యో విజయాదిత్యో నరేశ్వరస్తుత్యః॥.

"పరోక్షే రాజరాజస్య భ్రాతు ర్ద్వైమాతురస్య యః । ప్రత్యగ్రహీ న్మహీరాజ్యశ్రియం వీర శ్రియా యుతః॥

విమలాదిత్యునికి చోడరాజకన్యయగు మేడవ మహాదేవికి జనించిన విజయాదిత్యుడు-రాజరాజు నలుబది యొక్క సంవత్సరములు రాజ్యముచేసినపిమ్మట యని పై

* ఇది ఆంధ్రా హిస్టారికలు రిసర్చి సొసయిటీవారి జర్నలు అయిదవసంపుటములో ప్రకటింపబడినది.

నున్న శ్లోకభాగముతో నన్వయము. తన సవతియన్న పరోక్షమందు అనగా అతడు దేశమునందు లేని సమయమున రాజ్యమును బలాత్కారముగా నాక్రమించుకొనెనని యీ వాక్యములందలి తాత్పర్యము. దీనిని బట్టి రాజరాజు ప్రస్తుతము తెలియరాని కారణాంతరముల వలన దేశాంతరమం దుండినవేళ విజయాదిత్యుడు వేచియుండి రాజధానిపై బడి రాజ్య మాక్రమించుకొనెనని స్పష్ట మగుచున్నది. విజయాదిత్యు డంతటితో నూరకుండక తన కుమారుని రెండవశక్తివర్మను రాజమహేంద్రవర సింహాసన మెక్కించెను. విజయాదిత్యుడు వేంగీ మహీరాజ్యము నాక్రమించుకొన్నది క్రీ. శ. ౧౦౬౧ సంవత్సరములో పూర్వార్ధమునందని స్థిరము చేసుకొనవచ్చును. విజయాదిత్యుడు రాజరాజుతరువాత పదునైదు సంవత్సరములు ఆంధ్రభూమిని పాలించినట్లు రాజరాజతనూభవుడైన మొదటి కులోత్తుంగ చోడదేవ చక్రవర్తియే చెప్పియున్నాడు. చూడుడు వీరచోడుని చెల్లూరి పిఠాపుర శాసనములందలి యీక్రింది వాక్యములు:—

"మయా వేంగీ మహీరాజ్యం చోడరాజ్యాభిలాషిణా, మత్పితృవ్యే పురా న్యస్తం విజయాదిత్య భూభుజి. స చ పంచదశాబ్దాని పంచాననపరాక్రమః, మహీం రక్ష న్మహీనాథో దివం దేవోపమో గతః."

ఈ వాక్యములే రాజరాజచోడగంగుని చేకితామ్రశాసనమునందుగూడ గలవు. కులోత్తుంగచోడుడు పినతండ్రికి ఎట్లు రాజ్యమిచ్చె నన్నకథ యిక్కడ చర్చించుటకు తావు చాలదు. అన్న దేశమున లేనివేళ విజయాదిత్యుడు రాజ్యమాక్రమించుకొనుట జూచి రాజకొడుకు పినతండ్రిపై దాడివచ్చి యోడించి, కారణాంతరములచే చోడరాజ్యాభిలాషియై, మరల పినతండ్రితో సఖ్యము చేసుకొని వేంగీమహీరాజ్యము నాతనికి వశపఱచి దక్షిణమునకు బోయెను.

విజయాదిత్యుడు పదిరేనుసంవత్సరములు ఆంధ్రదేశము నేలెననుట సత్యము. అతనితరువాత వేంగీసామ్రాజ్యాభిషిక్తుడైనవాడు కులోత్తుంగుని రెండవ కుమారుడు రాజరాజ-ముమ్మడిచోడుడు. అతని పట్టాభిషేకము శకవర్షములు ౯౯౮ న కర్కాటకమాసమున (చాంద్రమాన ఆషాఢ) బహుళదశమీ బుధవారమున కులాలగ్నమున జరిగెను. ఇందులకు సరియైన యింగ్లీషు తేది జూలయి ౨౩, క్రీ. శ. ౧౦౭౬ అగుచున్నది.* దీనినిబట్టి చూచినను అష్టమవిజయాదిత్యుని రాజ్యకాలము క్రీ. శ. ౧౦౬౧ లో ప్రారంభమైన గాని క్రీ. శ. ౧౦౭౬ లోనికి పదిరేనుసంవత్సరములు పూర్తికావు.

—భావరాజు వేంకట కృష్ణరావు.


---

* A. R. E. 1922, of 97-98.



"సాముద్రికము"

—వి. వెంకటరత్నము.



౫. చెరువుగట్టున పడవల పాకలు



౬. చెరువు - దూరమునుండి



౭. పడవరేవు



౮. చెరువుబాట



శ్యామా దేశము
శాంతియుతమగు నూతనవిప్లవము
(Blood-less revolution in Siam)

శ్యామా దేశము (సయాం) భరతఖండమునకు ఆగ్నేయమున నుండు ద్వీపకల్పభాగము. ఈరాజ్యపు విస్తీర్ణము ౨ లక్షల చదరపుమైళ్ళు. జనసంఖ్య నాలుగు న్నరకోట్లు. ప్రజలు బౌద్ధమతస్థులు. రాజునకు పేరు ప్రజాధిప. ఆరాజాన్వయమునకు ఏడవతరపువాడీప్రభువు. ౧౯౨౫ సం. మున పట్టమునకు వచ్చినది మొదలు రాజ్యాధికార మంతయు తనచేతియందే యుంచుకొని మంత్రుల సాహాయ్యముతో తానెరిగినంతవరకు ప్రజలను కొదువలేక పరిపాలించుచుండెను. ఇట్లున్నను ప్రజ లున్నదన్నట్లు కడచిన ౧౯౩౨ జూన్ నెలతుదియందు తమప్రభువుపై తిరుగబడిరి; రాజ్యాధికారమంతయు తమదై యుండవలెనని పట్టుబట్టిరి; దేశపుసైన్యము నే లోబరచుకొని ప్రభువును నిర్బంధమందుంచిరి. మహారాజు తన యధికారము ప్రజల కొప్పచెప్పుటకు సమ్మతించెను. ఈపరివర్తనమునకు ఆస్థానపురోహితుడు ౧౯౩౨ సం. డిసెంబరు నెల ౧౦-వ తేది పగలు ౨ ఘంటల ౫౩ నిమిషములకు శుభలగ్నము నిర్ణయించెను. ఆసమయమునకు సరిగ ప్రజాధిపుడు కిరీటమును ధరించి సింహాసనము నెక్కి ప్రభుత్వాధికారము నంతయు జనులలో పెద్దలగువారికి ఒప్పచెప్పినట్టును పత్రము నే వ్రాసి తనముద్ర నొత్తించెను. ఆపత్రమును ఒక చిన్న బంగారుపళ్లెరమునందిడి, దానిని మరియొక గొప్ప బంగారు తట్టయందుంచిరి. పిమ్మట మహారాజు తన నగరు సౌధము నెక్కి యెత్తైన వాతాయనము (కిటికి) నుండి కూడియున్న ప్రజలందరు వినునట్లు దానిని చూపి చదివి వినిపించెను. ఆతరుణమున నాకాశమున విమానముల విహరింపజేసిరి. ఇరువదియొక్కసారి ఫిరంగుల నెగిరించి అయ్యది రాజ్యమునకు శుభసమయమని ప్రకటించిరి బ్యాంకాక్ (Bangkok) అను రాజధానియందలి దేవాలయములోని ఘంటలన్నియు నొక్కుమ్మడిగ మ్రోగెను.

ఈ పరివర్తనపత్రము ఉన్నదున్నట్లు పుట్టినది కాదు. ప్రజాసభవారు కూడి రెండువారములు దీర్ఘముగ నాలోచించి రచియించినట్టిది. మహారాజు బౌద్ధుడుగ నుండవలెననుటయు, ప్రభుత్వమువారు బౌద్ధమతమునే పోషించవలయుననుటయు, ప్రజాధిపు డెప్పటివలె సింహాసనము నధిష్ఠించవలెననుటయు, ప్రభుత్వాధికారమంతయు ప్రజలదై యుండవలెననుటయు నీరచనయందలి చర్చితాంశములు. ప్రజలు వేరుమతము నాచరించు వారైనను, ప్రభుత్వము భేదములేక అన్ని జాతులవారిని, మతములవారిని ఒకటేవిధమున నాదరించవలెననుట యీ పత్రములోని మరియొక షరతు. ఇక ముందు సర్కారు జరుపు పెద్దల గుంపునకు ' స్టేట్ కౌన్సిల్ ' (State Council) అని పేరు. అనగా ప్రజాప్రతినిధుల సభయనుట. ఇది యేలెక్షన్ పద్ధతి ననుసరించి నిర్మింపబడవలెననుట వేరుగ చెప్పబనిలేదు.

ఈ పరివర్తన పత్రము రచించి ప్రకటించిన పిమ్మట మహారాజు సింహాసనాధిష్ఠుడై కొలువు తీరెను. ప్రజలందరు గుమిగూడిరి. ఈ పరివర్తనమునకు కారకులైన ఏబదిమువ్వురు ప్రజాధికులు సభ నలంకరించిరి. వీరిలో పదునైదుమంది రాణువయం దధికారము గల

వారు. పదునాల్గురు దేశపు యుద్ధనావలకు కర్ణధారులు. ఇరువదినల్గురు పాలనాధికారులు. వీరందరు ప్రముఖులై సన్నిధిని నిల్చి మహారాజునకు స్వర్ణభాజనమున ధూపదీపపుష్పముల నర్పించి యీ పరివర్తనమును సమకూర్చుటయందు తా మొనర్చిన యపరాధమును క్షమింప వేడుకొనిరి. ఈ సమయమున ప్రజాధిపుడు సెల విచ్చిన ప్రత్యుత్తర మిది: "నేటి మీపరివర్తనము నాకు మిక్కిలి సంతోషదాయకము. ఇందుకు కారణము మీరు నాకు క్షమాపణ వేడినారనుటకు కాదు. మరియొందుకన, మీ యపరాధముల నంతకుముందే క్షమించినాడను. మీరు మీ దేశాభివృద్ధిని మదినుంచి చేసిన ప్రయత్నమును ముందే గ్రహించినవాడను. ఈ పరిణామమునకు నాచేతనైనంతవరకు యత్నించి మీకు తోడుపడితిని. దేశమునే సంపాదించి యీస్థితికి తెచ్చుటయందు నా మన్వయమువారును, నాకుటుంబమువారును చేసిన మేలును క్షమాపణ పత్రికయందు మీరు బహిరంగముగ పేర్కొనియుండుట నాకు పరమసంతోషము. గా౧౯౨౮ సం. జూన్ ౨౮-వ తేది మీరు మాకు సమర్పించిన విన్నపమందు దేశాభ్యుదయమునకై మేమును, మావంశమువారును ఏవిధమైన ప్రయత్నమును చేయలేదని నిందించియుంటిరి. ఈనింద నాకును, నావారికిని మనస్సున నొప్పి కల్గించియుండెను. ఇపుడు మీరర్పించిన క్షమాపణపత్రములో నా ప్రమాదముల సవరించియుండుటచే మామనస్సు కొదువతీరినది. ఇదియు నా మందలింపు లేకనే మీయంతట మీరే ముందుకువచ్చి యిట్టి విన్నపము సమర్పించుటచే నాకు గల్గిన సంతోషము ద్విగుణమై యొప్పారినది. ఈపరివర్తనమందు మీ తప్పును మీరే గ్రహించి యీమహాసభయందు బహిరంగముగ ఒప్పుకొనుట సముదాయమున మీనడవడికకే యార్జవమును సత్యనిరతియును సొమ్ములుగా నమరియుండుట మిక్కిలి యలంకారము."

(From 'London Times')

—టి. శివశంకరము

అగ్నిపర్వత పరిశోధన

మీద కొండకొనను, నన్ను అంటిన సన్నని రాతి నారదారమూ, క్రింద సలసల ఉడుకుతూన్న శిలా ద్రవమూ (Lava) అలలవలె పైకి కమ్ముతూన్న ఆవిరిపొగలూ, నడుమ దారంకొసను వేళ్లాడుతూ ఎనిమిది వందల అడుగుల లోతులో మండుతూన్న నిప్పుగుండం లోకి ఉరుకుతూన్న నేనూను.

బద్దలయి పడే రాతిచెక్కల దెబ్బలు తగలకుండా నెత్తిని ఉక్కుకుళ్లాయి ఉంది. దుస్తులూ, కాళ్లచేతుల తొళ్లూ - అన్నీ రాతినారవి తొడుక్కున్నాను. లోపల ఊపిరి పీల్చడానికి ప్రాణవాయువు గొట్టాలు రెండు వీపున కట్టుకున్నాను.

నేను ఎన్నోనాళ్లనుంచీ అనుకుంటూండిన విజ్ఞానశాస్త్ర పరిశోధనసాహసం నాకు ప్రత్యక్షం అవుతూంది. మంటలు కక్కుతూ ఉన్న అగ్నిముఖ పరిశోధనం నేను చేయబోతూ ఉన్నా ననీ, భయంకరమయిన ఆగోతిలోకి నేను దిగుతాననీ, పొగలు కక్కుతూన్న ఆ బిలద్వార ప్రదేశాన్ని ఫోటో తీస్తాననీ, తరుచూ పేలుతూ, విపరీతంగా ఉత్పాతాలు కలిగిస్తూండే చోటికి పోతా ననీ చెప్పడంతో నామిత్రు లందరూ నాకు వెర్రెత్తిం దనుకొన్నారు.

"ఇంతకు ముందు అగ్ని పర్వతాల పరిశోధన తలపెట్టిన వాళ్లెవళ్లూ మండుతూండే బిలంలోకి దిగడానికి సాహసించారు కారు. వెసూవియసు, ఎట్నా అగ్నిపర్వతాలు శాంతంగా ఉన్నప్పుడు వాటి ద్వారం దగ్గిరికి పోయి చూచి రావడంతో వాళ్లందరికీ తృప్తి కలిగింది. నాప్రయత్నం కడతేరితే ఇదివరకూ ఎవ్వరూ చూడని కొత్త అద్భుత ప్రదేశాలనూ, విషయాలనూ తెలుసుకొన్నవాణ్ణవుతాను. అధోలోక యాత్ర చేసి తిరిగి గట్టెక్కి సూర్యుడివెలుగులో పడ్డానంటే అక్కడి వింత వింతలయిన ఘన, వాయుపదార్థాలకు మచ్చు తీసుకు రాగలుగుతాను" అని నేనీపరిశోధనకు పూనుకున్నాను.



సాహసికుడు పరిశోధకుడు ఆర్పడుకిర్నరు
కొండకొమ్మునుండి దారముకొసను వ్రేలాడుట.

'సిసిలీ' కి ఉత్తరంగా మధ్యధరాసముద్రం అనుకొని ఉన్న 'స్ట్రింబోలీ' పర్వతంవద్ద నాపరిశోధన సాగింప నిశ్చయించాను. ఆకొండంతా అగ్నిగుండాలే. అనెప్పుడూ మంటలు కక్కుతూ ఉంటవి. మరెక్కడా అట్లా ఉండవు. నేననుకుంనంతా అక్కడ చూడవచ్చునని నా నమ్మకం. అందుకనే నా పరిశోధన అక్కడ చేయనలచాను. అక్కడ కొండ సముద్రం నీళ్లలోంచే నిట్రంగా నిలుచుని ఉండడం చేత కావలసిన సామగ్రంతా కొండపై కెక్కించడం చాల కష్టం అయింది.

కొండ లెక్కేవాళ్లు కట్టుకునే లాంటి పటకా నడుముకు కట్టుకున్నాను. రాతినారదారం దానికి గట్టిగా బిగించాను. దిగేచోటికి కొన్నిగజాలదూరాన కొండపైన బరువులు దింపే యంత్రం ఒకటీ, ఆకొండ అంచుకు కప్పీఒకటీ అమర్పించినాను. నానడుముకు కట్టిన రాతినారదారము కొండరాళ్లను రాచుకోకుండా ఉండేటందుకు కప్పీపైనుంచి యంత్రంద్వారా దింపే ఏర్పాటు చేశాను. నామిత్రులూ, వారికి సాయంగా తీసుకున్న ఆదీవివారు కొందరూ యంత్రాన్ని తిప్పే వారు. నేను లోపలినుంచి ఏదయినా సంజ్ఞ చేయ డానికి ఒక ఎలెక్ట్రికుదీపంకూడ నాతో తీసుకున్నాను. అది వెలగడానికి విద్యుచ్ఛక్తిని పుట్టించే తీగలు రాతి నారదారంతో కూర్పించాను.

నేను కొండమీదినుంచి జారడంతోటే నా నెత్తి మీది అపాయం నాకు తెలిసివచ్చింది. నేను తిరి ప్రాణాలతో బయట పడడం ఒక పెద్దసమస్య అవ కున్నాను. నాపరికరాలు చాలక పోవచ్చు; లోపల వేడిని, దుర్వాయువులను నాహృదయం, ఊపిరి తిత్తులూ సహింపక పోవచ్చు; అంతరాళంలో దిగ బడుతూన్న నేను ఎక్కడికి ఎంతదూరం పోతున్నానో ఎక్కడ అడుగు పెడతానో నాకు తెలీదు. దిగి తర్వాత అక్కడ గట్టి బండే ఉందో, ఉడుకుతూ ఉన్న శిలాద్రవమే ఉందో, నిప్పులరాశే ఉందో తెలీదు. అదీ నాస్థితి.



దిగుటకు ముందు అగ్నిబిలములోతును
కొసకు రాతిని కట్టిన దారముతో కొలుచుట.

నేను దిగుతూ కొండప్రక్కలను పరిశీ చాను. అవి నలుపు, ఎరుపు, పసుపు రంగులు కల

వాటిలో గంధకం ఆవిర్లు వస్తూండేగోతులు ఉన్నవి. క్రింద భాగలు కక్కుతూ ఉన్న పెద్దగోతులు ఉన్నవి. అప్రకు పైకి చూచాము. ఎంత లోతుకు పోయిందీ తెలుసుకున్నాము. 'దారం ఒరిపేడికి ఆగుతుందా! మళ్లీ నన్ను పైకి చేసుకుంటారా' అనుకున్నాము. ఉన్నట్టుండి కాలుతూ గట్టిగా ఉన్న చట్రాతిపైన అడుగు పడింది. అక్కడ లోతు, మీదినుండి ఎనిమిదివందల అడుగులు. వేడి కొన్నిచోట్ల ౭౧౨ (F) డిగ్రీలదాకా ఉంది. గాలివేడి ౧౫౦ డిగ్రీలు. స్థలం అంతా అపాయకరం అయిన గంధకవాసనతో నిండి ఉంది. ప్రాణవాయువుగొట్టాలుండబట్టి మంచిగాలి పీల్చగలిగాను. అక్కడ అంతటా పరిశీలింప మొదలుపెట్టాను. దారాన్ని ఆపల పెట్టాము.



పరిశోధకుడు ఆర్పడు కిర్నరు, అతని మిత్రుడు.

అసలు నిప్పు ఎక్కడ పుడుతుందో కనిపెట్టా లనుకొన్నాను. ఎక్కడ చూచినా పెద్దపెద్ద నిలువు గోతులు-౧౦ మొదలు కొని ౩౦ అడుగులవరకు వ్యాసం కలవి ఉన్నవి. అప్పుడప్పుడూ భయంకరం అయిన ధ్వనితో పేలి ఉడుకుతూన్న శిలాద్రవం వాటిల్లోంచి పొంగి వస్తూ ఉంటుంది. ఆగోతులు ఏటవాలుగా ఉంటవి. అందుచేత పొంగే శిలాద్రవం ఒకవైపునే పారుతూ ఉంటుంది. అవి పేలకుండా ఉండేసమయం కని పెట్టి, అప్రకు వాటిద్వారందగ్గరికి వెళ్లి, నూతిలోవలె వాటిలోపలికి తొంగిచూచాను.

లోపల దట్టంగా చిమ్ముకొన్తూఉండే పొగకూ, దాన్నంటే ఉన్న వింతవింత రంగుల ఆవిర్లకూ క్రింద, అల్లకల్లోలంగా ఉడుకుతూ, కదులుతూ, మండుతూ ఉన్న శిలాద్రవం కనపడింది. చూస్తూ చూస్తూ ఉండగానే లోపలి ద్రవపదార్థం పొంగింది. లోనున్న అద్భుతశక్తిమూలాన ఆద్రవం పొంగడం మొదలు పెట్టింది. నేను వెంటనే అక్కణ్నుంచి పరుగిడి ఆవలకు వచ్చానో లేదో, పేలడం, ద్రవం గోతినుండి వెలువడి వందలకొలది అడుగుల ఎత్తున కెగజిమ్ముకోవడం, మండుతూండే ఘనపదార్థాలు మళ్లా గోతులో పడడం ద్రవం అంతా 'ధుంయి' అనే శబ్దంతో సముద్రంలోకి జారడం జరిగిపోయింది.

గోతు లెప్పు డెప్పుడు ప్రేలుతవో తెలుసుకోవడానికీ, అక్కడి వాయువులనూ, ఘనపదార్థాలనూ సేకరించుకోవడానికీ, అక్కడి వింతవింత రంగాలను పరీక్షించడానికీ, వాటికి ఫోటోలు తీయడానికీ- ఈవిసం అయిన పరిశోధన మూడుగంటలకాలం అయింది. ఇంక నీరసించిపోతా నన్న భయం వేసింది. నన్ను పైకి లాగం డన్న గుర్తుగా నాచేతి దీపాన్ని వెలుగ చేశాను. నన్ను పైకి చేరుకోవడానికి ఎంతెంతో కష్టం అయింది. ఎంత బిగబట్టినా ఆగలేక పోయినాను. ప్రయత్నం వ్యర్థం అయింది. ప్రాణవాయువు అయిపోయింది. గంధకం ఆవిరిని పీల్చవలసి వచ్చింది. ఊపిరి తిత్తులు చెడిపోయినవి. పైకి చేరుకొని మంచిగాలిలో పడవేసేటప్పటికి రక్తస్రావం మొదలు పెట్టింది.

కొంతసేపు బాధపడి తెప్పిరిల్లాను. తర్వాత చాలా హాయిగా ఉణ్ణింది. ఇన్నికష్టాల పాలయినా, అందరూ అసాధ్యం అని తలచిన ఒక గొప్ప సాహస కార్యం చేయగలిగా నని ఎంతో సంతోషం అయింది.

(౧౯౩౩, మేనెల మాడరన్ రివ్యూ నుండి)



శ్రీ సర్. సి. వి. రామనుదంపతులు
శ్రీ రామనుగారు బెంగుళూరు విజ్ఞానకళాశాలకు ప్రధానాచార్య పీఠము నధిష్ఠించిరి.

పంచదార పరిశ్రమ

"మైసూరు ఎకనమిక్ జర్నలు" నందు కే. యస్. శ్రీ కంఠనామకమహాశయులు ధాన్యపుధరలు చాల నీరసించి పోవుటచేత భూస్వాములు, రయితులు చాల మంది ఆయవ్యయములను సరిపెట్టుకొనలేక యిదుమల బడుచున్నారనియు, కాన సాగుబడికి లాయకు అయినపొలమున చెరుకు సాగు చేయవలెననియు, ఇండియాలో మున్ముందు పంచదారపరిశ్రమ అభివృద్ధి కాగలదనియు నొక వ్యాసము వ్రాసినారు. అందలి యీ క్రిందివాక్యములు రైతులకు ప్రోత్సాహమును గలిగించునవి. వీరిసూచనలనుపాటించి ప్రభుత్వ వ్యవసాయశాఖవారు పంచదారపరిశ్రమ పెరుగుటకు వలసిన సౌకర్యములను రైతులకు కలిగింప దగుదురు.

ఇండియాలో పొలముల మాదిగులను పరీక్షించుటయును, వర్షకమున కుపయోగించు పంటలను, వరిపంటకు మారుగా, వేరు పంటలను సూచించుటయును వ్యవసాయశాఖవారికి కర్తవ్యము. ప్రభుత్వమువారి సంరక్షణము పురస్కరించుకొని రయితులు చెరకుపంట నధికము చేయుదురను నమ్మకము కలుగు చున్నది. ఇండియాలో చక్కరకొరకు కోట్లకొలది ధనము విదేశములపాలగు చున్నది. ఇండియాలో తయారయిన చక్కరనే కొనునట్లు ప్రచారము చేయ ఒక సంఘము ఏరుపడి చక్కర పరిశ్రమకు ప్రోత్సాహము గలిగింపవలెను. అరటి, బంగాళదుంప, టెంకాయ, ప్రత్తి, వేరుసెనగ వీనిపంటయెడ కూడ వ్యవసాయశాఖవారు శ్రద్ధ వహింపవలెను.

కాబట్టి ఇతర-రైతులకును'వరిపిచ్చ' శీఘ్రముగా తొలగ జేయవలెను.

ప్రకృతము చెరకుసాగుబడి ఎట్లును సరిగా లేదు. ఇండియాలో ౩౦,౦౦,౦౦౦ ఎకరముల విస్తీర్ణము గల పొలమున చెరకు సాగుబడి యగుచున్నది. ఈ విస్తీర్ణము ప్రపంచమంతట చెరకు సాగుచేయు విస్తీర్ణములో చక్క సగము. ఇట్లయ్యును విదేశముల పంచదారను మిక్కిలి ఎక్కువగా తెప్పించుకొను చున్నాము. ౧౮౯౫-౯౯ సంవత్సరముల మధ్యకాలములో మన దేశమున ప్రపంచమంతట తయారగు చక్కెరలో రమారమి సగము తయారయ్యెను. ౧౯౧౪-౩౦ సం.ముల మధ్యకాలమున అయిదవవంతుకు తగ్గిపోయెను. చెరకు పెరుగు పొలమంత యధికముగనుండియు మనము విదేశములనుండి పంచదారను తెప్పించుకొను చుండుట విచారకర మని చెప్ప బనిలేదు. ఇండియాలో పంచదార ఒక ఎకరా విస్తీర్ణమున క్యూబాలోకంటె మూడవవంతు, జావా లోకంటె ఆరవవంతు, హవాయీలోకంటె ఏడవవంతు తక్కువగా ఉత్పత్తి అగు చున్నది. మన దేశపుపంచదార ఇట్లు విదేశముల పోటీకి ఆగజాలక పోవు చున్నది. ఈ పోటీని నివారించుటకు చెరకుపంట అధికమగుట మాత్రము చాలదు. ఎక్కువ పంచదారను సులభముగా తయారు చేయుటకు మార్గములను కనుగొనవలెను. ప్రకృత మున్న పద్ధతుల వలన పంచదార ఎక్కువగా తయారగుట అసాధ్యము. సులభ మగు మార్గములను చెరకు సాగుచేయు రైతులకు నిరూపించిచూపు టావశ్యకము.

భారత దేశమున జైళ్లు

విద్యాధికులయిన భారతీయు లనేకులు రాజకీయశిక్షలవలన బాధితు లయినారు. జైళ్లయందు వారికి లభించు నిత్యజీవన సౌకర్యములను రెండుమారులు జైలుపకు పోయిన ఒక ‘వ్యక్తి’ “ది థియాసఫిస్టు” అనుపత్రికలో ఇట్లు వర్ణించినాడు:

ఖైదీలగదులు సూర్యోదయముతో తెరువబడును. మరల సూర్యాస్తమయసమయమున నాగదులలో బంధింపబడువరకు ఖైదీలు జతలుజతలుగా సంచరించు చుండవలెను. ఒక ఖైదీలగుంపు తొలుత ఉదయ కాలకృత్యములు తీర్చుకొన బయలుదేరు నమకొనుడు. అందలి ఖైదీలు దొడ్డిముందర జంటలుజంటలుగా వరుస దీరి కూరుచుండవలెను. అందు మొదటిజంట శౌచమునకు పోయిరాగానే ఇంకొకజంట పోవలెను. తక్కినవారు కదలక మెదలక కూర్చుండవలెను.

మొదటియిద్దరు తొలుత పలుదోముకొని వచ్చి వేరొకచో కూరుచుండవలెను. తరువాతి జంటలు అట్లే చేయవలెను. అందరికి అయినపిదప గుంపంతయు మరియొకకార్యమును చేయుటకు పోవలెను. భోజనమునకు కూడ ఇదే పద్ధతి. భోజనము కాగానే ఒక్కొక్కజంటయు తమ పళ్లెముల నెత్తుకొని చేతులు, పళ్లెములు కడుగుకొన పోవలెను. అందరికి అగువరకు కడుగుకొనినవారొక్కచో వరుసగా కూరుచుండ వలెను. తరువాత వారక్కడనుండి కదలిపోవలెను. ఈపద్ధతి చాల మంచిదిగనే కాన్పించినను ఆచరణమున చాల వింతగను, అవమానకరముగను ఉండును.

జైలున, ఖైదీలజీవితము యంత్రమువలె నడుచు చుండును: శౌచము, స్నానము మొదలయిన ఎల్లపను లకు కొన్నికొన్ని నిమిషముల కాలము పరిమితి. ఒకింత యైన ఖైదీ లాపరిమితిని మించరాదు. మించినచో వార్డరుల తిట్లు, గుద్దులు, తన్నులు సంప్రాప్తించును.

జైలునందలి యుద్యోగులు ఖైదీలను తిట్టుమాట చేర్చక పేరులతో పిలుచుట అరుదు. అది వారికి పరిపాటి. అట్లే వారికి చిన్నచిన్న విషయములకు గూడ గుద్దులు, పటకాదెబ్బలు తగులుచుండును. జైలు ఉద్యోగుల అనుమతి లేక మాట కాదు, సంజ్ఞయైనను పనికిరాదు. ఖైదీలను కనుపెట్ట నియమింపబడిన పాత ఖైదీలుకూడ వారిని తిట్టుటయందు వార్డరుల కింతయు దీసిపోవరు. ఒకొకప్పుడు వారు కొట్టుటయును కలదు. జైలు అధికారులదృష్టిని ఖైదీలు మనుష్యులు కారు;

మరియు భారతదేశమున మృగములకన్న నధమముగా పరిగణింపబడుదురు.

ఖైదీల కిడు భోజనము ప్రాణధారణమాత్రమునకు జాలినది. సామాన్యముగా వంటకమునకు పనికిరాలిన సామగ్రి యొసగబడును. అవి ఎంత దరిద్రము డయినను తిన నిచ్చగొననంత చెడ్డవిగా నుండును. బియ్యమున ఇసుక, రాళ్లు నిండియుండును. ఒక కబళమయిన నిసుక, రాయి లేక యుండదు. పుచ్చిన గోధుమలపిండి రొట్టెల కుపయోగింపబడును. వానిని నమలి మ్రింగుట చాల కష్టము. తోటకూర కాడలు మెండలుగువానిని కట్టలుకట్టలుగా తెచ్చి, అట్లే ముక్కలుగా తరిగి వానిని కడుగకుండ నీరు, కొంచెము నూనె పోసి ఉడుకపెట్టి నీటివలె పలుచగా తయారుచేయుదురు. అందులో మరికి దుమ్ము కావలసినంతయుండును. ఇట్టిది రాజకీయశిక్షితుల కిడు తిండి. కైదీలు చాల శ్రమపడి కొంచెము మంచితిండి పెట్టుటకు కొన్నిచోట్ల కేరుపాటులు చేయించుకొనినను, కొన్నిచోటుల యథాపూర్వముగనే యున్నది. కొన్నియేండ్లకు పూర్వము కైదీలకు పెట్టుచున్నతిండికంటె నిప్పటితిండి చాలమెరుగని పేరు! జైలులోపల మనుజుని మనుజు డేమి చేయుచున్నాడో దైవమునకెరుక!! దీనితత్త్వ మేమన: జైలు ఉద్యోగులు, కంట్రాక్టరులు కలిసియే ఇట్టి పెట్టి తిండిని కైదీలకు పెట్టించుచున్నారనుట. నియతకాలము లయం దాహారపదార్థముల పరీక్షయు జరుగుచుండును. పరీక్షాకాలము జైలుఉద్యోగులకు బాగుగా తెలియును. కావున సూపరింటెండెంటుగారికి మామూలుపదార్థములకన్న మంచివగువానినే చూపించుచుందురు. జైళ్లయందుత్తములగు నుద్యోగులును, వానియెడగల దృష్టి మారుట కవకాశములును సమకూడక ఈశాఖ యందు సంస్కరణమును గనుట సాధ్యము కాదు.

(ప్రెసిడెంటు) రూజువెల్టు సతి

అమెరికా అధ్యక్షుడగు ఫ్రాంక్లిన్ డి లానో రూజువెల్టుగారి ధర్మపత్ని భర్తవలె సచ్చిదానందురాలు. ఆమె ఎల్లప్పుడును నగుమోముతో అలరారుచుండును; భర్తకు సర్వవిధముల తోడ్పడుచుండును. ఆమె అత్యంతప్రతిభాశాలిని. అమెరికాదేశములో ఉన్నతాశయములు గల స్త్రీలపాలిటి కామెయే కల్పతరువు. ఉదారభావము లన్నియు ఆమెయందు మూర్తీభవించినవి. ఆమె భర్త, ఆల్బనీ గవర్నరుగనున్నంతకాలము, ప్రతివారము రెండురోజులు ఆమె ఎక్కడ ఉన్నను సరే, న్యూయార్కున కేగి, అచట టాడ్ హంటర్ పాఠశాల పిల్లలకు దేశచరిత్రను, ఆంగ్లమును నేర్పుచుండును.



రూజువెల్టు సతి

ఆమె వాల్కిలు సామానుదుకాణమును సాగించుచున్నది. దానివలన ఆమెకు కొంత ఆదాయము లభించుచున్నది. చాలమందికి ఆమె ఈదుకాణములో జీవనోపాధిని కల్పించుచున్నది. తన దానధర్మముల నిమిత్తము ఈమె రేడియోలో ఉపన్యాసములను గావించి, ఎంతయో సొమ్మును ఇటీవల, కడచిన కొన్ని మాసములక్రిందట గడించెను. భోజనానంతరము ఉపన్యాసము లిచ్చుటలో ఈమె చాతుర్యమునకు అందరును మెచ్చుకొనుచున్నారు. అందరును ఆమెను ఆహ్వానించి ఇట్టియుపన్యాసముల నీయకోరెదరు. అపు

డపుడు భర్తకు మారుగ ఆమెయే ఉపన్యసించును. ఈమె యొక మాసపత్రికను నిర్వహించుచున్నది. ఎవరైన ఈమెసహాయము నపేక్షించిన తప్పక చేయును. ఎన్నడును అట్టి అవకాశమును వృథా పోనీయదు. అయిదు సంవత్సరములనుండి ఆమె న్యూయార్కు రాజ్యశాసనసభకు యువకులను విద్యార్థులను గొని పోయి, ప్రజలకు వర్తించు శాసనము లెటుల చేయబడుచున్నదియు వారికి తెలుపుచున్నది.

ఆమె ప్రతినిమిషము ఏదో ఒక పనిని చేయుచునే యుండును; రైళ్లలో పోవుచు వ్రాయుచుండును; ప్రక్కమీదకూడ చదువుచునే యుండును; ఉపన్యాసములను వినుచు అల్లుచుండును.

ఒక్కరోజుకూడ చేటిసరికి ఆమె జబ్బుపడి ఎరుగదు. ఐదుగురు పిల్లలు. వారిని దృఢకాయులుగను, అందముగను పెంచెను.

రూజువెల్టుసతియాదరణ అపూర్వము. ఆమె అందరిని గౌరవించి, ప్రీతితో ఆదరించును; భర్తకు సర్వవిధముల ఉపచారము చేయుచుండును.

అమెరికాలో ప్రెసిడెంటు రూజువెల్టు తన పతి వలన బడెయు సాహాయ్యమును అమెరికాలో మరి ఎవరును తమ పతులవలన పొంది ఎరుగరు. తనభర్త అమెరికాకు ప్రెసిడెంటు అగుటవలన ఆతనికి పనులు ఎక్కువగా నుండును గాన, ఆయన చూచుకొనవలసిన తపాలు, నడపవలసిన ఉత్తర ప్రత్యుత్తరములు విస్తారముగ నుండును గాన ఈపను లన్నిటియందును ఈమె తన భర్తకు కుడిభుజముగ నుండి తోడ్పడుచుండును. తాను అందరికిని ఉత్తరములను వ్రాసి, దేశముయొక్క పరిస్థితులను తననాథునకు తెలుపుచుండును. ఈ ఉద్దేశ్యముతో ప్రజలు తనకు ఉత్తరములను వ్రాయవలె ననియు ఈమె కోరుచుండును. నిజముగ అమెరికా అధ్యక్షపదవిలో రూజువెల్టుసతి భాగస్థురాలుగ నున్నది. అమెరికనుప్రభుత్వమున జోక్యము గలుగజేసికొన్న స్త్రీ ఇంతవరకు ఈమె ఒక్కర్తయె. ఈమె చాల శాంతస్వభావురాలు.

ఈమె హస్తమున పుస్తకములకట్ట లేనిదే ఎన్నడును ప్రయాణ మొనరించదు. ప్రపంచానుభవ మీమెకు మెండు. చదువు ఇష్టము లేని పిల్లలను నిర్బంధించి చదివించదు. సదా ఆమె మద్యపాననిషేధమునే బలపరచును. పిల్లలకు ఎంత స్వాతంత్ర్యమైనను ఇవ్వవలయు ననును. వయసు వచ్చిన పిదప వారికి బుద్ధిని గరపుటకంటె చిన్ననాటనే స్వతంత్రముగ ఆలోచించి లోకజ్ఞానమును గడించి జీవయాత్ర గడుపుటకు దారి చూపవలె ననును. అందరును స్వానుభవముచేతనే ఎల్లపనులను నేర్చుకొనవలె ననును. ఈమె, మనము చేసిన తప్పులను చేయకుండ మనపిల్లలను కనిపెట్టి చూచుట కష్టమే గాని వారిని మందలించినందువలన ప్రయోజనము లేదనును; వారి విశ్వాసమును మనము చూరగొనునటుల మనము ప్రయత్నించుట యావశ్యక మనును. తనపిల్లలను పెంచుటకును, ఆడించుటకును, పోషించుటకును రూజువెల్టుసతి ఇంట దాదులను నియమించి ఎరుగదు. చిన్నప్పటినుండియు పిల్లలు తమ ఇండ్లకు వచ్చు ప్రేక్షకులతో మాట్లాడ ప్రోత్సహించును. అమెరికాలో నున్న ధనికురాండ్రను, తీరికగల స్త్రీలును రూజువెల్టుసతి ధనార్జనమునకు గడంగుట బాగులే దనెడివారు. తనపతి ప్రభుత్వోద్యోగి అయి యుండగా ఆమె ధనార్జనమున కెల గడంగవలె నని వా రందురు. అట్టిది గౌరవభంగ మందురు. తన దానధర్మములకు అంతరాయము లేకుండుటకు ఆమె ధనము నార్జించుచుండెనట. కుటుంబాదాయమును విస్తరింపజేయుట కీమె ఈప్రకారముడబ్బును గడించుచున్నది. ప్రజ లనుకొన్నటుల రూజువెల్టు ధనికుడు గాడట. హూవరుతో పోల్చి చూచితిమేని రూజువెల్టుగారు పేదయే. పిత్రార్జితము నూరువేల డాలరులు రూజువెల్టుకు వచ్చెనట. సవతి అన్నగారి ఆస్తి ఇదే మొత్తము ఆతనికి దఖలుపడెను. హైడ్ పార్కులో అందమగు జమీను రూజువెల్టు జననిది.

రూజువెల్టుపతికుస్తులు సామాన్యస్త్రీ దుస్తులనే పోలియుండును. అధ్యక్షుని సతిని గదా యని డాబు లేదు. ఈమె కున్న నగ లన్నియు సాదా

ఉంగరము, పెండ్లినాడిచ్చిన పెండ్లి ఉంగరము, ఇంకొక బంగారు ఉంగరము మాత్రమే.

రాజావెట్టుదంపతులకు కుటుంబబంధుత్వము గలదని న్యూసుక్రానికలుపత్రికలో ఒకవిలేఖకుడువ్రాసెను.

—జరుగుమిల్లి సాంబశివరావు, బి. ఏ.



డా. మార్గరెటు స్పెయిగలు (జర్మనుయువతి) మహాత్ముని శిష్యురాలు

జపానుకొక హెచ్చరిక

బెర్నార్డుషాగారు బొంబాయిలో భారతీయ పత్రికా విలేఖకులతో సంభాషించినట్లే, జపాను పత్రికా విలేఖకులతో సంభాషించారు. వారి సంభాషణలు హాస్యరసంపూతల్లో గాంభీర్యపు మెరుగులను చిమ్ముతూన్నవి. వాటిని 'ది జపాను వీక్లీక్రానికల్' పత్రిక ప్రకటించింది. వాటిలో కొన్నిటిని "మాడరన్‌రివ్యూ" (మే-౧౯౩౩) ఉద్ధరించింది. అవి, ఐరిషువాళ్లు ఇంగ్లీషువాళ్లను బాధించినట్లు చైనావాళ్లు గెలుపుకొంటూ ఉన్న జపానువాళ్లను బాధిస్తే వాళ్లగతి ఏంకావాలి? అనే విషయాన్ని తెలుపుతవి.

వాటి అనువాదం:

"మీరిదంతా ఆత్మ సంరక్షణాని కంటూ ఉన్నారు. ఆత్మసంరక్షణకోసమే పోరుతూ ఉన్నారు. జరిగిన యుద్ధాలన్నీ ఆత్మ సంరక్షణకోసమే!"

"మీరు యుద్ధప్రకటనం చేయ నంతవరకూ మీరు చేసే ప్రాణనష్టాన్నీ, హత్యలనూ, ఇతర దురంతాలనూ సాగనిస్తూ తూష్ణీంభావంతో మాట మాత్రానకున్న నానాజాతి సమితివల్ల ఏంప్రయోజనం?"

కాని నేను పరాయివాణ్ణయినా, నాకు నిజంగా దీని తత్త్వమేమిటోకూడ మీరు ఆలోచించకుండా ఉండడం చాలా ఆశ్చర్యంగా ఉంది.

నేను ఐరిషువాణ్ణి. ఐర్లండు ఒక దేశంతాలూకుచిన్న కాబేజి కూరమడిఅంత ఉంది. అక్కడ నాలుగు మిలియనుల జను లున్నారు. ఇంగ్లాండులో నలభయిమిలియనులున్నారు. అయినా ఇంగ్లాండు ఐరిషువారు తమ జాతీయతను స్థాపించుకోకుండ చేయ లేకపోయింది. ఐరిషువారిని అణచి వేయడానికి ఎన్నో దురంతాలు జరిగినవి. యథేచ్ఛగా రక్తం ప్రవహించింది. అనేకులు చెరసాలలపా లయ్యారు. పెక్కుమంది శతఘ్నుల వాత పడ్డారు. హత్యలపరిమితంగా జరిగినవి. ఐరిషు నాయకుల్ను మైకేలు కాలిన్సు "ధ్వంసము చేయబడిన

ఒక్కొక్క జపాను దుకాణానికీ రెండేసి పెద్దబంగాళాలను తగలబెట్టి బూడిద చేస్తా" నన్నాడు. అది మీరు గమనించారా! మంచూరియాలో ఇలా మిలియనుల చైనావా రున్నారుకదా. వాళ్లను మీరెట్లా ఊరుకో పెట్ట గలరు? పోలీసువాళ్ల సహాయంతో మీ రాపని చేయలేరు. పోలీసువా డెందుకూ పనికిరాడు. ప్రజలనుమతిస్తేనే తప్ప పోలీసువాడు పూర్తిగా నిష్ప్రయోజకుడు. చైనావా ళ్లాపనిచేయరు. ఇంకో వంద యేండ్లయినా కూడా ఆబాధ మీకే పడవలసుంటుంది.

సాగారు తన వయస్సు డెబ్బయియేండ్లనీ, తన బాల్యంలో ఇంగ్లాండులో గుర్రపుబండ్లు విస్తారంగా ఉండేవనీ, ఒకొక్కప్పుడు బండి గుర్రము రోడ్డుమీద కాలుజారి పడిపోతూ ఉండేదనీ చెప్పి ఇట్లా అన్నారు:

"అప్పుడేమయ్యేది? అందరూ దానితలపయిన కూర్చోడానికి పరుగెత్తి వచ్చేవారు. లేకుంటే, అది లేవడానికి గింజుకొంటూ, ముస్తీబులో, ఏడికోలలలో తను లుకొని పోతుంది."

"జాతీయత నణగద్రొక్కడం గుర్రంనెత్తిన కూర్చోడం వంటిది. ఇం కేపనీచేయడానికి సందుం డదు. ముప్ఫయియేండ్లకాలం ఇంగ్లీషు పార్లమెంటుకు ఐరిషు వ్యవహారాన్ని చర్చించడానికి తప్ప ఇంకదేనికీ అవకాశం లేకుండా ఐరిషువారు చేశారు."

"ఇంక వందఏళ్లు గుర్రం నెత్తిన కూచుని కాలం గడపడం వస్తే మీ కేం వస్తుంది? తక్కినపని ఎవరు చేస్తారు? ఏపనీ చేయనే చేయరా? మీ పనులను జాతీయవాదులు దేశభక్తులు చేసిపెట్టరు. వాళ్ల కాలం మాటలతోటే గడిచి పోతుంది."

తర్వాత సాగారు జాతీయ వాదాన్ని గూర్చి అప్రస్తుతంగా కొంచెం మాట్లాడారు.

"ఏ తెలివితక్కువవాడయినా జాతీయోపన్యాసా లియవచ్చు. ఏపిచ్చివాడయినా స్వాతంత్ర్యాన్ని గురించీ, చరిత్ర గొప్పతనాన్ని గురించీ మాట్లాడవచ్చు. జాతీయ వాదం చాల సులభమే కాని అది ఒక పెద్దతొందర. చివరకు మీకు జాతీయత లభించిందంటే, వెంటనే జాతీయవాదులనందర్నీ కాల్చి వేస్తే మే లనుకుంటారు. ఇంక వేరే ఏపనిసాగదు.

"మీ రిదంతా నిజంగా దీర్ఘదృష్టితోనే ఆలో చిస్తున్నారా? చైనాను వశపరుచుకోవడంలో జపాను కేగతి పడుతుందో, మీరు యోచించారా? తిరుగు బాట్లు, బెదరింపులు ఎడతెగకుండా జరుగుతూ ఉంటవి దాని మూలాన ఒక్కొక్క చైనావానికి ఒక్కొక్క పోలీసువాడు లేక శాంతిని నెలకొలపడం మీకు సాధ్యం కాకపోతుంది."

కొడైకెనాలు

మధురజిల్లాయందలి పళనికొండల వరుసయం దత్యున్నతమైన శిఖరముగల కొండ కొడైకెనాలు. ఈ కొండఎత్తు ౭౦౦౦ అడుగులకు మించియుండును. కొండపైన చాలచల్లగా నుండును. అరవభాషయందు కొడైకెనా లనగా: (కోడై = ఎండకాలము; కానల్ = కొండపైని అడవులు) ఎండకాలమందు చల్లదనము నిచ్చు రమణీయమగు ప్రదేశమని యర్థము. ఇక్కడ నుండి మధురకు షుమారు ౭౦ మైళ్లు దూర మున్నది. ఆకాశము నిర్మలముగ నున్న రాత్రులందు మధుర దేవాలయ గోపురములయందలి దీపము లిక్కడికి మిణుగురుల వలె కనబడునట. ఇచటనే ప్రభుత్వమువారి వాతావరణస్థితి నిర్ణయయంత్రశాలయు, భౌతిక, భూశాస్త్రాలయములు ఉన్నవి. మీదు మిక్కిలి, యిది ఆరోగ్యాశ్రమ మగుటచే దేశములోని అన్నిభాగములనుండి యూ జనులు ఆరోగ్యముకొరకిందు వచ్చి యుందురు. చెన్నపురిరాజధానిలోని ముఖ్యమగు ఆరోగ్యాశ్రమములలో నిది యొకటిగ బరిగణింపబడుచున్నది. కొండమీదను, లోయలయందును దర్శనీయములగు స్థలము లనేకములు గలవు. సమభూమి ఎక్కువగ లేనందువలన కొండ మీద సేద్యమునకు వసతి లేదు. గోధుమలు, వెల్లుల్లి, కాఫీ మొదలయినవి యిచ్చట విస్తారముగ పండు చున్నవి. ఇచ్చట పండునట్టి పండ్లు మంచివికావు, కొండక్రింద్ర నారటితోట లనేకములు కలవు.

ప్రస్తుత మింత ముఖ్యస్థానమయి యున్న కొడై కెనాలు పూర్వము విల్పట్టి మజరాలోని కుగ్రామమయి యుండినది. ౧౮౮౯-వ సంవత్సరమున కొడైకెనాలు నందు మునిసిపాలిటీ యేర్పడినది. యూరోపియనుల పిల్లలకొర కొకబడియు, క్రైస్తవుల ప్రార్థనాలయ ములు మూడును ఇందు గలవు.

ఇచటి శీతోష్ణస్థితి కొంచె మించుమించు ఉదక మండలమందువలెనే యుండును. కొండమీదను, ప్రక్క లను పచ్చిక బయళ్లు, చిట్టడవులు అనేకములున్నవి. కొండ చరియలనుండి ఎల్ల ప్పుడును సెలయేళ్లు పాఱుచుండును.

కొండపైనున్న తోటలలో సొగసైన చెరు వొకటి యున్నది. ఇచటి ఆకర్షక దృశ్యములలో ఈచెరువే ముఖ్యమైనది. చెరువుయొక్క విస్తీర్ణము షుమారు ౬౦ ఎకరము లుండును. చెరువు సర్పా కృతి గలిగియున్నది. దీని చుట్టుకొలత 3¼ మైళ్లుండును. మధురజిల్లా కలెక్టరుగ నుండిన సర్ వియర్ లెవింజిగారు ఈచెరువున కొకప్రక్క కట్ట కట్టించిరి. ఇండ్లన్నియు ఈచెరువుచుట్టు కట్టబడి యున్నవి. చెరువుగట్టువనున్న పెద్దరస్తామీదనే సామాన్యముగ జనులు షికారు వెళ్లుచుందురు. కొండ పైని రోడ్లన్నియు చక్కగ కంకరవేయబడియున్నవి. చెరువునందలి నీరెప్పుడును నిశ్చలముగ నుండుటచే అచుట్టుపట్ల చెట్లు, భవనములు ప్రతిబింబించుచుండును. ఈచెరువులో పడవపందెము లనేకపర్యాయములు జరుగు చున్నవి.

కొండదగ్గరనుండి రైలుస్టేషనునకు షుమారు ౫౦ మైళ్ల దూరమున్నది. స్టేషనువొద్దనుండియు రోడ్లున్నవి. కాని అవి మంచివికావు. ఇచట హోటేళ్లు చాలాయున్నవి. వ్యాయామసంఘములు పయిత మున్నవి. దీనినింకను అనేకవిధముల అభి వృద్ధిచేయుటకు వీలున్నది. కాని కొండపైకిపోవుటకు మార్గములు సరిగ లేనందున సదుపాయముల నమర్చుట కింకను ఆలస్యమగుచున్నది. కొడైకెనాలు చిత్రములు కొన్ని యీ సంచికయందు ముద్రితములయినవి.

స్త్రీ పురుష స్వాతంత్ర్యము

'స్త్రీ ధర్మ' పత్రిక యిట్లు వ్రాయు చున్నది:

"మా హక్కులను మేము పొందగోరుచు "స్త్రీలు బానిసలుగ నున్నచోట పురుషు లెట్లు స్వతంత్రులుగ నుండ గలుగుదురు?" అని పలుమారులు ప్రశ్నించితిమి. 'తెల్ల కాగితము' ను పరికించిన తరువాత 'పురుషులు బానిసలుగ నున్నచోట ఆచారసంప్రదాయ పాశముల వలన స్త్రీ లెట్లు విముక్తిని గాంచగలుగుదురు?' అని పై ప్రశ్నను తలక్రిందులుగ మార్చ మనస్సు పుట్టినది. టర్కీ దేశపు ఆడువారిని గనుడు. వా రెంతలో పైకి వచ్చినారు? తమహక్కులను సంపాదించుకొన గలిగి నారు! అంతఃపురవాసము, బహుపత్నీకత నియమ ముగా నుండిన యాదేశమున, స్త్రీ పురుష సమానత, స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్ర్యము సర్వసామాన్యముగా వ్యాప్తమయిపోయినది. మున్నొకకాలమున మిక్కిలి వెనుకకు బడియుండిన చీనాదేశపు స్త్రీలు పయితము స్వాతంత్ర్యమును గడించుకొనిరి; ఉత్తరాధికారము సంపాదించుకొనిరి; వివాహరిజిష్ట్రేషను పొడవు చేయించుకొనిరి; బహుపత్నీకత శాసనముద్వారా నిషే ధింపబడినది. ఏకకాలమున నిద్దరితో పెండ్లి దండనకు పాత్రమయినది. అంతఃపురవాసము ప్రాతబడిపోయినది. రక్షణ శాఖ (Police Department) యందును, సైన్యమునందును వారి కుద్యోగములుకూడ లభించుచు న్నవి. జపానుదేశపు స్త్రీలుకూడ పౌరజనాధికారము లేకున్నను, యూరపుఖండమునందలి యితర స్వతంత్ర దేశములలోని స్త్రీలవలె స్వాతంత్ర్యమును పొంది యున్నారు. కాబట్టి స్వాతంత్ర్యము, ఉత్తరవాదిత మాత్రమే వ్యక్తి జాతిగతములగు ఉత్తమ గుణాదులను ప్రకటింప గల వనునమ్మకము కుదిరినది. కేవలము బాధ్య తకు, ప్రాతినిధ్యమునకు తావుగల భారతదేశ ప్రభుత్వము వలననే భారతదేశ స్త్రీ పురుషులయందు స్త్రీ పురుష శబ్దార్థార్హత సంపూర్ణముగా నిండుకొన గలదు."



సారాయి దాసుడు

శ్రీ బి. కేసరిసింగు (బెంగుళూరు)గారి రచనము

రేఖలు – అపరాధులు


పురుషులహస్తములందును, పాదములందును విచిత్రములగు రేఖలు కనబడును. అరచేతిలోని రేఖలు లావుగా నుండుటవలన చాలవరకు స్పష్టముగ నగపడును. వ్రేళ్లపై నుండు రేఖలు చాల సన్నముగ నుండును. ఈరేఖలను బట్టి జోస్యులు భవిష్యత్తును చెప్పుచున్నారు. ఈరేఖలు ప్రతి యొక్కరికిని భిన్నభిన్న ప్రకారముల నుండును. ఇందువలననే అందరిభాగ్యమును ఒకేవిధముగ నుండదందురు.

హస్తరేఖలు వస్తువులను పట్టుకొనుటకును, పాదరేఖలు నడుచుటకును సాయపడుచున్నవని విజ్ఞానశాస్త్రమువలన తెలియుచున్నది. రేఖలే లేనియెడల వస్తువులను పట్టుకొనునపుడు అవి వదిలిపోవునట! మనుష్యులు నడచునపుడు జారి పడుదురట! ఈరేఖలకు

స్పర్శవలన తెలిసికొను శక్తి యుండును. ఇందుచేతనే మనము దేనినైనను తాకి అది వేడిగా నున్నదో, చల్లగా నున్నదో, జిల్లుమను చున్నదో గ్రహింపగలుగు చున్నాము.

మనుష్యుల ముఖములందును, రూపమునందును గట్టి పోలిక లుండినను, అసలే పోలిక లేకపోయినను, ఈరేఖలు ప్రతివ్యక్తియందును భిన్న భిన్న-ఆకార ప్రకారములు కలిగి యుండు ననుట విదితము. ఈరేఖల నాధారము చేసికొని అపరాధులను గుర్తుపట్ట గల్గుచున్నారు. ఒక ధనాపహరణపు కేసులో నొక అపరాధపరిశోధకుడు (పత్తేదారు) ఈ రేఖల గుర్తుల సహాయముతోనే దొంగను పట్టి యిచ్చె ననుట నిజముగా జరిగిన సంగతి. అతడు రొక్కపుపెట్టెపై హస్తముద్రను చూచినాడు. చాల జాగ్రతతో నత డాముద్రకు నకలును తీసియుంచుకొని తనకు అనుమాన ముండిన ఎల్లవారి హస్తముద్రలను తీసుకొనెను. ఈ యన్నిటిని పోల్చి పరిశీలించిచూడగా రొక్కపుపెట్టెపైని గుర్తు పడిన ముద్రతో సరిపోయిన వ్రేలిముద్ర బయలుపడెను. వెంటనే పత్తేదారు దాదొంగను పట్టి అరెస్టు చేయించి శిక్ష వేయించెను.


ప్రపంచ మంతటను న్యూ స్కాట్‌లండ్ యార్డ్ యొక్క సి. ఐ. డి. రహస్యశోధకులు అతి చతురులని పేరొంది యున్నారు. పారిపోయిన అపరాధులను, ఖయిదీలను పట్టుకొనుటకై వీరు క్రొత్త క్రొత్త ఉపాయములను పన్నుచున్నారు. మొగము పోలిక-రూపము - నించుమించు ఒకేమాదిరిగల ముగ్గురు అపరాధులను, ఈ సి. ఐ. డి. ఉద్యోగులు పట్టుకొని యుండిరి. ఈ అపరాధులలో నేయొక్కరిని గాని విడిగా చూచినవారికి వీరు వేరువేరు వ్యక్తులని తెలియుట కష్టసాధ్యము. కాని వీరి బొటనవ్రేళ్ల రేఖల గుర్తులు బొత్తుగా కలియవు. ఈ గుర్తులవలననే వీరు ముగ్వురును భిన్నులగు అపరాధులని తెలియగలిగెను.



చిత్రము ౧

ముగ్గురు అపరాధులయు, వారి వ్రేళ్లముద్రలయు చిత్రములు

(వీరుముగ్గురు ఒకటేపోలిక నుందురు కాని వ్రేలిరేఖలు మాత్రము వేరువేరువిధముల నుండును. కావున వీరిని వేరువేరు మనుజులని తెలిసికొనవచ్చును.)



చిత్రము ౨

అయిదుగురు అపరాధుల పదిచిత్రములు

(క్రిందిఫోటోకంటె పైఫోటో కొంచెము ముందుతీయబడినది.
ఒక్కొక్క అపరాధికి రెండేసి ఫోటోలు. కాని రెండు నొక్కనివేయని తెలిసికోజాలము.)

అపరాధులు పట్టుబడిన తరువాత వారి హస్తములయొక్కయు, పాదములయొక్కయు సంపూర్ణముగ గురుతులు తీసుకోబడును. ఎప్పుడైనను, ఎవడైనను ఖయిదీ కారాగారమునుండి పారిపోయినచో, ఈ రేఖల సాయమునసే వానిని వెదకి గుర్తించి పట్టుకొందురు. అపరాధులు శిరోముండనము చేయించుకొని, గడ్డము పెంచుకొని, దుస్తులు బదలాయించి వేషము మార్చి వేసి కొని తమ నిజరూపమును దాచిపుచ్చగలరు. కాని హస్తరేఖలను ఏమి చేయగలరు? ఇవి మార్చివేయ లేరు కదా! రెండవచిత్రమున ఐదుగురు ఖైదీల తాలూకు పదిరూపములు ముద్రింపబడి యున్నవి. ఇవి చూడగా, పదిమంది బొమ్మలవలె నున్నవి కాని వాస్తవముగా ఒక్కొక్క అపరాధియొక్క చిత్రములు రెండేసి యున్నవి.

ఇపుడు పశ్చిమదేశములలో కుక్కలను దొంగిలించుట అధికముగ నున్నది. యజమానులు తమ కుక్కల ముక్కుల అచ్చును కాగితముపై తీసి యుంచు



చిత్రము 3

కుక్కముక్కుముద్ర.

కొందురు. ఎవరైన ఈ కుక్కలను దొంగిలించికొని పోయినచో, ఈముక్కులపైని రేఖల ఆధారముతో ఆ పోయినకుక్కలను వెదకి తెచ్చుకొందురు.

ఏవిధముగా మనుష్యుల హస్తరేఖలు పరస్పరము పోలియుండవో, అట్లే కుక్కల ముక్కు గుర్తులను ఒకపోలిక నుండవు.

విద్యాప్రసాద శ్రీవాస్తవ, బి. యస్ సి.

(హిందీ 'మాధురీ' నుండి)




౯. సెంటు మేరీ చర్చి



శ్రీరాముని జన్మస్థానము, అయోధ్య

(వి. యస్. గోపాలదేశికాచారిగారి చిత్రము)



న్యూయార్కునగరము, రాత్రివేళ

E. N. P.



శ్రీ శ్రీ శ్రీ విక్రమదేవవర్మ మహారాజుగారు




విజయనగరస్థ భారతీతీర్థకులము శ్రీవారిని 'సాహిత్య సమ్రాట్' బిరుదము నొసగి సన్మానించినది.

---

10. 6- 17

శ్రీ సూర్యదేవర భద్రయ్యగారు



గుంటూరుమండలమున చేబ్రోలు సూర్యదేవర భద్రయ్యగారి నివాసస్థలము. వీరు ౬౭౦ పౌనుల బరువుగల ౧౨౦ తూకపు ఇనుపగుండ్లను (రెండుపాదముల రెండు, భుజమునకు నాలుగులెక్కను రెండుభుజముల నెనిమిది, రెండుచేతులను రెండు.) మోయుచు పదు మూడుగజములు నడువగలిగిరి. ఒక పేట కొబ్బరి నారత్రాటిని తెంపగలిగిరి. మరికొన్ని యిట్టి యద్భుత బలప్రదర్శక కార్యములను చేసిరి. వీ రిట్టి శరీరబలమును స్వయంకృషిచేతనే సంపాదించుకొనినవారగుట విశేషము కావున ప్రశంసకు పాత్రులు. వీరివలెనే నేటి యాంధ్రయువకులు ముఖ్యముగ వస్థిపంజరములవలె కళాశాలానిష్క్రమణము కావించుచున్న యువకులు కొంతకు కొంతయైన శరీరబలమును సంపాదించుకొనుట శ్రేయము. దుర్బలశరీరులకు జీవితము దుర్భరము. వారిహపరములకు గానివారగుదురు. మనుజునికి ఐహిక సంపదలలో మొదటిది శరీరబలము. కావున నూరుపనుల నైన మగ్గబెట్టి యనుదినము వ్యాయామము చేసి శరీరము నకు బలమును, ఆరోగ్యమును సమకూర్చుకొనుట పరమావశ్యకము.

వైశాఖము

ఉభయభాషాప్రవీణ, కుమాండూరి లక్ష్మీనరసింహాచార్యులుగారు

వైశాఖ, దేవతాద్వయము నీయందుంట జంటఁ గోరుచునుంద్రు చానలెల్ల
మాధవ, నీరాక, మాధవుఁడేఁడని దలఁచుచుందురుగదా తరుణులెల్ల
రాధ, నీదినముల, రాధవాయంచు స్వరమణునిఁ బిలుతురు రమణులెల్ల
చైత్రునకంటెను జిత్రమౌ సౌఖ్యము నీవలననె కల్గు నిం జూచియు
మాధవా, "ఋతూనాంకుసుమాకరోఽహ"మనుచుఁ జెప్పెను బరమాత్ముఁడచ్యుతుండు
వానిదయఁబోలు తొలకరివాన గురియు-నట్టి నినుఁబోలు మాస మీసృష్టి లేదు.

నడ బడలిక వాయ వడి నిమ్మనీటిని బోసక మిడు ప్రపాపాలికలును
లేక పూవులు "రాత్రిలేదు మీ"కని ప్రియుల బెదరించుచున్న యువిదమిన్నలు
పిల్లలకూఁతల విని తమపాలఁతులవేయని భ్రమియించు కోయిలలును
సాయాహ్నముల నతి సౌఖ్యమ్ములను జనమానసంబుల కిచ్చు మారుతములు
జల్లుమనఁ బల్లవులగుండె యుల్లసిల్లఁ బల్లవించిన యుద్యానవల్లరులును
సతతసంతోష మిడఁగను సాగుచుండు-వేసవిని బోలు వేఱొక మాస మున్నె ?

గాకు వాగాని వా కది గాదు గాదె ? - వాకు గా ఘైనచో నెట్లు వలనుబడును ?
వేసవిని లేని బిందువు వేసఁ గనెడు-రూపమునయందు నన్నయరూపిత మిది.

అని యీరీతిగ నీరూ - పనిర్ణయంబుకొఱకుఁ బాటుపడుదు రీ
తెనుఁగున వైయాకరణులు-గని 'ప్రవాళ'మనుచోటకంటె గౌరవ ముంటన్.

ప్రకృతి వాదువు గీర్వాణ భాషయందు-వికృతి వాదువు చిత్రము వికృతియందు
మాసములలో విచిత్రము మాధవుఁడవు-ప్రకృతి ! వికృతి ! పరమాత్మ ! వందనంబు.

భారతీయ మహిళా మండలి

నా తెలుఁగు చెల్లెలు :

కళోపాసిక,



శ్రీ కుం. తిరుమలరాజమ్మ.

ఈయమ్మ! పరమానురక్తుఁడు, రసజ్ఞుఁడు నగు శ్రీమాన్ తిరుమల తాతాచార్యశర్మగారి* ఇల్లాలు; కళాలోలురగు అన్నలకుఁ† చెల్లెలు; కడుపుబండిన తల్లి. ౩౨ సం. వయసు. వాసము బెంగుళూరు. నాదబ్రహ్మమున లీనమయిన వీణా శేషన్న (మైసూరు) గారి యంతేవాసిత్వము గన్న వారిలో మేల్తరపు పెన్నికగన్న వలఁతి.

పతిగట్టినతాళియుఁ, బసుపు-కుంకుమలును ఈ మానవతికి నిత్యమంగళాశాసనములు; బిడ్డలు గృహాలంకారములు; విభుఁడు నిజమనోరాజ్యాధిదేవత; సంగీత-సాహిత్యములు తోడఁబుట్టిన తోడవులు; కళోపాసనము గమ్యపదము. ఈవధూవరులు ప్రకృతి-పురుష సంబంధముఁ జాటుదురు.

గానము :

శ్రోతల యంతస్సులను ఆలౌకికపదవికి జవురుకొని పోవఁగలశక్తి ఈయమవీణావాదమునఁ గలదు. చేఁబట్టిన వీణను చెవులునులిమి, చైతన్యము వోసి, శ్రుతియు, గతియుఁ దప్పనీకుండ మనోధర్మమువెంట, మధురవాణివెంటఁ బలికించుకౌశలము ఈయమ్మకుఁ బ్రకృతిదేవత ప్రసాదించినది.

ఈ విదుషివీణాగానమున నాజూకుసగిషీపను లే గాని నొబకుదందడు లుండవు; శ్రవణపేయమగు సంచారమేకాని సాగతీత లుండవు; భావానురంజక వృత్తియేకాని పాండిత్యముపేరి బయటికమ్మరి సుత్తెపెట్టు లుండవు; కమ్మనిసంగతులేకాని దొమ్మరిలాగు లుండవు; రక్తిప్రపంచమేకాని రణగుణధ్వను లుండవు; శాంతిప్రసన్నతయే కాని సన్నిపాతపు దెగనీల్గు లుండవు; తలితీపులేకాని తలయూఁపు లుండవు. చేత వీణ

---

* బెంగుళూరు 'విశ్వకర్ణాటక' పత్త్రికాసంపాదకుఁడు.

† కందాడై రామణ్ణ, బి. ఏ., యల్ యల్, బి; (వకీలు) - కందాడై కృష్ణయ్యంగారు, బి. ఏ. (దేశీయ విద్యాశాల టీచరు - బెంగుళూరు.)

యున్నంతసేపు చిత్రితప్రతిమ; సమాధిస్థితయోగిని. విసెడుకోలఁది తనివిసనదు. ప్రారంభమునుండి పరిసమాప్తివఱకు 'బాలపల్లవ గ్రాస కషాయ కంఠకల కంఠ వధూకలకాకలీధ్వను' లే.

ఈసతి గురుని మెప్పించినది; జగద్గురుని గాంధీ మహాత్ముని కొలువున, ఆత్మనివంచీరవమున సతిలోక యోగము ప్రయోగించి అగ్రతాంబూలము గొన్నది; ప్రాణప్రియుని హృదయముఁ జూఱగొన్నది; శీలమునకు ఉదాహరణ మయినది.

కవిత :

తనయింటి తెలుఁగుమీఁదికన్నఁ గన్నడమునమీఁది వలపు మెండు. కన్నడమున నీయమ్మ రచించిన కథలు, ఖండకావ్యములు—గద్య - పద్యాత్మకములు గలవు.

కన్నతండ్రియగు వాల్మీకిచే విస్మృతమయిన ఆఁడుబిడ్డను, ఊర్మిళను, మఱుఁగుననుండిన మానవతినిఁ గటాక్షించి, కరుణించి తనకలమునీడకుఁ జేరఁదీసి, భర్తృవిరహమునఁ గుందు నామె నోదార్చినది, ఈబిడ్డలఁ గన్నతల్లి రాజమ్మ. ఈకథ రూపకముగా రచించి "తపస్వినీ" నామముం గూర్చినది; - ఆమెను జీవితేశ్వరునియక్కునఁ జేర్చినది; పెద్దల దీవనలకుఁ, జిన్నల మన్ననలకు భాజనమయినది; కవయిత్రి యనుట, కన్నకడుపు అనుట సార్థకపఱచుకొన్నది.

ఉక్త "తపస్వినీ" రూపకమునకై ఈరచయిత్రి సేకరించిన వస్తువు, కల్పించిన సన్నివేశము, చిత్రించిన పాత్రవృత్తియు, చిలికించిన రసము, పలికించిన కన్నడమడికారము, తులకించిన వాదచాతుర్యము - సహృదయరంజకము.

సంగీత - సాహిత్యము లీయమ్మకు ఊర్పులు. క్రొత్తసంగతిస్ఫురించినవాఁడు, కోటినిమ్ముల నోలలాడినవానికన్న నెక్కుడగు సంతుష్టి ఈ యమ్మకు. తనువు చిక్కుకొలఁది మనసు కళాప్రపంచమున నెక్కు-

చుండును. పతికిఁ జేదోడు వాదోడునై పత్త్రికను నిర్వహించుచున్నది.

ఈచెల్లెలికిని, ఈయమకుటుంబమునకును ఆయురారోగ్యభాగ్యములు ప్రకృతిజనని ప్రసాదించుగాత! ఈయమకళాప్రయోగముం భోగింపు యోగము తెలుఁగుసీమ కబ్బుగాత!

'గుణాః పూజాస్థానమ్ గుణిషు న చ లిఙ్గమ్, న చ వయః'


—మున్నంగి...శర్మ.

శ్రీమతి కల్యాణసుందరి గారు



చెన్నపురి విశ్వవిద్యాలయపు పట్టపరీక్ష (బి. ఏ) లో గానకళయందు విజయమునుగాంచి సర్వోత్తమ స్థానమును బడసెను.

శ్రీమతి ఇ. టి. చొక్కమ్మాళుగారు, బి. ఏ.



చెన్నపురమున గౌరవ న్యాయాధికారపదమున నియమింపబడిరి.

బాలక్రీడలు

శ్రీమతి చిల్కపాటి సీతాంబగారు

ఆయ్యొ గోపించు మాయమ్మ గొట్టునటంచు దలకి బాలురమధ్య దాగిదాగి
తనజాడ గోపిక లరిమిపట్టెద రంచు నొగి సందుసందుల నొదిగియొదిగి
అల్లడుగో కృష్ణు డని యొక్కచెలి పల్క దత్తరింపుచు బరు గెత్తియెత్తి
రా రండు బాలులారా రండు రండని పలుమ రుత్సాహితుడై పిలిచిపిలిచి
చెంగి బృందావనాంతరసీమలందు - సంగడలను గుమిగూర్చి సంతసమున
కరము కరముల గీలించి పరమమైత్రి - మురిసి పల్కు యశోదమ్మముద్దుపట్టి.
ఈవనసీమ మాధవమహీపతికిన్ గృహలక్ష్మియో లె. శో
భావహమై సుపుష్పతరుభాసితమై చెలువొందె నీయెడన్

జేవగ దాగుమూతలును జెంగనగంతులు కోతికొమ్మలుఁ
భావము లుల్లసిల్ల బహుభంగుల నాడగ రండు మెందుగన్.

నేన తల్లిని తల్లిని నే నటంచు - పట్టుపట్టుకొనుం డొరుల్ పంతమాడి
కడకు రాముని తల్లినిగా నొనర్చి - కన్నులు వసంతునకు మూయగా నమర్చి
దిక్కుదిక్కుల కొక్కరొక్కరును - తక్కుగలవారు పరువెత్తి దాగియుండ-

దాగిలిమూతలు

తల్లి:—

బంటిదేవచ్చె దొంగలు భద్రమనుచు - తల్లిగా నున్న బాలుడు తత్క్షణంబ
పట్టుమని సైగచేయ నాబాలకుండు - నీవలావల బరువెత్తి యిందునందు
నణగి బాలురనవ్వడి యరయుచుండ - కొమ్మపైనున్న కోకిల 'కో'యటన్న
పరభృతధ్వని కలరి గోపాలు డపుడు - గూడ 'కో'యంచు గూయనా గురుతెఱింగి
దొంగగోపాలు డిల్లదె దొరకెదొరకె - పట్టు బలభద్రు డల్లదె పారిపోయె.

శ్రీదాముడు:—

కొంటెకృష్ణుడు నను ముట్టుకొనిమె నిదిగొ - చిన్నిశ్రీదాముడే నీకు చిక్కిపోయె
కొంటెగోపాల కోకిలకూత కూసి - యెంత చేసితివోర కానంతలోనఁ
పట్టెదను చూడు నిన్ను నే బల్మి నిపుడు - పట్టకుండిన నీకు నే బావగాను.

కోతికొమ్మచ్చు

శ్రీకృష్ణుడు:—

ధాతకైనను మరి వానితాతకైన - జిక్కువాడనె నీచేత జిక్కితేని
ఔదుగద నీకు బావ నీయనుగుజెలియ - కాయిలాలలితాంగి కేమౌదు నదియు
జెప్పుకో మూత మావావి చెప్పితేని - చిక్కెద క్షణంబులోన నోచిన్నిబావ.

తనచేతిదండ మెంతయు నేర్పుకల్మిచే రహి నిక్కి చాఁదూరమున విసరి
అదిగొని తనుబట్ట నరుగుబాలునికన్న కడు మునుమున్న వృక్షంబు నెక్కి
ఆకొమ్మ కీకొమ్మ కతిరయమ్మున బారి తగు ముట్టవచ్చు బాలుని గలంచి
కడువేగ దిగివచ్చి వడి దండమును ముట్టి చాలగా పెల్లుబ్బి యీలవైచి
చప్పటులు గొట్టి గంతులు చాల వైచి - మీర లోడిరి గెల్చితి మేమటంచు
గ్రుచ్చి పలుకుచు కోతికొమ్మచ్చు లాటలాడు చున్నాడు గోపాలు డదుగొ నేడు.



మఱ్ఱిచెట్టు
(తైలవర్ణ ప్రకృతిచిత్రమునకు ప్రతికృతి)

—యల్. పెంట్లండు కన్య.

(చెన్నపురి లలితకళాప్రదర్శనమున లలితకళాసంఘమువారి ప్రథమ బహుమతిని పొందినది)



సాయంకాలపు వానజల్లు
(వర్ణప్రకృతిచిత్రమునకు ప్రతికృతి)

—ఎ. హెచ్. మారీ.



భక్త మందారము

త్రిపురాన పత్యానందరాయ విరచితము. క్రౌను సైజు ౯౦ పుటలు, వెల రు ౦-౧౨-౦

ఇది యొక నాలు గాశ్వాసముల ప్రబంధము. దత్త మనురాజ్యమున కధిపతి అర్యము డనువాడు సవర పల్లెలను జూచి మరలుచు ఒకచో అరణ్యమున విశ్ర మించి యుండగా కళావతి యను నొక జవ్వని అతనిని గాంచి అతని గుణరూపములకు విభ్రమమంద తిలకించు చుండును. ఒక పాము అతనిశిరస్సుపై పడగ నెత్తి యాడుచుండును. అది అతనిని కరచునేమో యని యామెకు భయము. కాని పాడవదు. ఆమె మాత్రము మూర్ఛ బొందును. అతను మేలుకొని యామెపై నీటిని చల్లి తెలివి తెప్పించును. ఇరువురును ఒకరినొకరు తెలుసుకొని వివాహ మాడుదురు. పిమ్మట వారిరువురు పతంజలి యను మునీశ్వరుని యాశ్రమమునకు బోవు దురు. అతను వారికి ప్రేమను గూర్చియు, దాసపుత్ర మిత్ర మధుర భావయుక్తమైన భక్తిని గూర్చియు ఉపన్య సించును ప్రబంధపు పడికట్లన్నియు నిందు చేర్చబడి యున్నవి. శైలి నిర్దుష్టము, లలితము.

గ. స.

మైత్రేయి

క్రౌనుసైజు, ౧౦౫ పుటలు.

పండిత సీతానాథతత్వభూషణుగారు ఆంగ్లములో వ్రాసిన వైదికయుగము నాటి కథను శ్రీమతి జ్ఞానాంబ గారు ఆంధ్రమునకు తర్జుమా చేసిరి. యాజ్ఞ్యవల్క్యుడు కాత్యాయనిని ఆమెకు తనపై నున్న ప్రేమకారణమున వివాహమాడుచు, మైత్రేయి వేదాంత జిజ్ఞాసతో తనపై చూపుచున్న గౌరవముకారణమున ఆమెనుకూడ వివాహ మాడును. ఈ వివాహమువలన ఆ ముయ్యురిలో నెట్టి ఆధ్యాత్మిక పరిణామము కలిగెనో కథయందు చిత్రింప బడినది. గ్రంథాంతమున మరి కొన్ని వర్ణాంతర స్వయం వర వివాహములను వర్ణించి వైదికయుగమునాటి సంఘువ్యవస్థయొక్క చిత్రమును గ్రంథకర్త పూర్తి చేసినారు.

గ. స.

కథాగుచ్ఛము

క్రౌనుసైజు, ౨౩౦ పుటలు, వెల రు. ౧-౮-౦

రవీంద్రనాథఠాకూరుగారు వ్రాసిన ౧౧ బంగాళీ కథల కాంధ్రానువాదము. విశ్వభారతి గ్రంథమాల మద్రాసు ఏజన్సీకి అధిపతి కారుమూరు వైకుంఠరావు గారిచే ౭-వ కుసుమముగా ప్రకటింపబడినది. ఒకటి నొకటి పోలని చిత్రవిచిత్రములగు స్త్రీపురుష సాంఘిక మానవప్రకృతు లతిరమ్యముగ చిత్రింపబడినవి. సులలిత శైలి. ప్రతులు ప్రకాశకునివద్ద (౩౨౩, తిరువత్తూరు హైరోడ్డు) దొరకును.

గ. స.

శ్రీరామచక్రవర్తి అనబడు కోసల సామ్రాజ్యము

క్రౌను సైజు, ౧౬౪ పుటలు, వెల రు ౦-౧౨-౦.

గ్రంథకర్త: బులుసు వెంకటసుబ్బరావుగారు, బి ఎ., బి. యల్., వకీలు, కాకినాడ.

భవభూతి ఉత్తరరామచరిత్రను, వేదము వేంకటరాయశాస్త్రిగారి యనువాదమును ఆధారము చేసుకొని యీ కథను గ్రంథకర్త వ్రాసినట్లు తెలుపుచున్నారు. కథాభాగ మిదియే. శూర్పణఖ మోహమును మాయలును రావణమరణముతో తీరక యింకను పయి పయి విజృంభించుటయే సీతాపవాదము, వనవాసము, అశ్వమేధము, శంబూకవధ మొదలగు ఘటనలకు కారణమైనట్లు గ్రంథకర్త చక్కగ చిత్రించినారు. పాత్రపోషణమును, కథాపరిణామమును రమణీయముగ నున్నవి.

గ. న.

మనస్స్వాతంత్ర్యము (రెండవ భాగము)

గ్రంథకర్త: వల్లూరి సూర్యనారాయణరావుగారు బి. ఏ., బి. యల్., యల్. టి.,

క్రౌను సైజు: ౧౪౬ పుటలు. వె. రు. ౦-౮-౦.

ఈ గ్రంథపు ప్రథమభాగమునుసరించి వ్రాయబడిన మర్శనల కీరెండవభాగము ప్రతివిమర్శనము. మొదటి భాగమునందు మనపురాణములు, మతములు మొదలగు వానినిగురించి వ్రాయబడినది. అందుపై బయల్వెడలిన మర్శనము ప్రతిఘటించుటకు గ్రంథకర్తగారు మరికొంత గ్రంథశోధన గావించి మనస్స్వాతంత్ర్యావశ్యకతను గురించి ఈ గ్రంథమును వ్రాసిరి. ఎపుడో, ఏసందర్భములందో ఏర్పడినశాస్త్రములు ఇప్పటిపరిస్థితులలో సరిపడకయుండవచ్చును. అట్టి సందర్భములలోగూడ పూర్వపుటాచారములనే పూనియుండవలనుగాదనియు, అందువలన లాభము లేదనియు, కాలానుగుణముగా మతుల మార్చుకొని సన్మార్గమును వదలక, స్వార్థమును వదలి, నిష్కల్మషహృదయము గలిగియుండవలెనను గ్రంథకర్తగారి యభిప్రాయము ఒప్పియున్నది.

'రాజు'

తిరుమల తిరుపతి శాసననివేదిక

ఈ నివేదిక శ్రీ తిరుపతి మహంతువారి యనుమతిని సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి (B. A.) గారిచే ప్రకటింపబడినది. ప్రొఫెసరు కే. ఏ. నీలకంఠ శాస్త్రి గారు దీనికి ప్రవేశిక వ్రాసినారు. ఇందలి పీఠికనుండి తిరుమల దేవస్థానములలో ౧౧౫౦ శాసనములు కనిపెట్టబడినవని తెలియుచున్నది. గ్రంథమంతయు రెండుభాగములుగా నున్నది. అందు మొదటిదానిలో తిరుపతి మున్నగు నాలయములలోని పూజోత్సవాదులనుగూర్చియు, నితర ధర్మసంస్థలనుగూర్చియు శాసనములనుండి తెలియు విశేషములు గలవు. ఉదా:— నిత్యదీపనిత్య నైవేద్యములు, బ్రహ్మోత్సవడోలోత్సవాద్యుత్సవములు, పండుగలు వీని నేయేసమయములలో, నేయేవిగ్రహముల జరపుట కేయేభక్తు లెట్టి దానములను జేసిరో యీ సందర్భమున జర్చింపబడినవి. ఆలయముల యభివృద్ధికై వాహనముల నిచ్చియు, పుష్పవాటికలను వేయించియు, తిరుమలకు మెట్లు గట్టించియు, రామానుజకూటములను, భోజనశాలలను నెలకొల్పియు, ఆలయములను బాగు చేయించియు, భక్తులు తోడ్పడిన విధములుగూడ నీ మొదటిభాగమున ప్రకటింపబడినవి. మన దేశమునందు దేవాలయము నిరుపమమగు నొక సంస్థగ నుండినది. దాని చరిత్రమునకును దేశచరిత్రమునకును సన్నిహితమగు సంబంధము గలదు. జాతీయ జీవితమునకు మూలాధారముగ నుండి సాంఘిక, మత, నైతిక విషయములలో తన ప్రభావమును జూపియుండిన దేవాలయము నొక సంస్థగ నెంచి, దాని పరిణామము నింతవరకు నెవ్వరును బరిశీలించ లేదు. ఈ శాసన నివేదికలోని మొదటిభాగ మా పరిశోధనకు మిక్కిలి తోడ్పడ గలదు. ఆంధ్రదేశమునందలి ద్రాక్షారామము, సింహాచలము, శ్రీ కూర్మము మున్నగు

స్థలములందలి శాసనములను గూడ బరిశీలించి యీతీరు వనే గ్రంథరూపమున ప్రకటించు టత్యవసరము.

నివేదికయందలి రెండవభాగము చరిత్రాత్మకము. ఇందు పల్లవ, చోళ, పాండ్య, యాదవరాయ, తెలుగుచోళ, తెలుగుపల్లవ, విజయనగర రాజవంశముల శాసనములపై చర్చ గలదు. ప్రకాశకులు తమ పీఠికలో "But the historical meterial furnished in these records ... prompted me to attempt an historical account of ,South Indian dynasties represented in them" అని వ్రాసిరి. మదరాసు శాసన పరిశోధక శాఖవారి నివేదికలనే శాస్త్రిగారు మాతృకగా బరిగ్రహించిన ట్లున్నది. కాని యింతటి చారిత్రక చర్చ శాసననివేదికలో ననవసరమని తోచుచున్నది. ఇందు మూలమున శాసనాంశము లేవియో, యితరాధారములనుండి కొనబడిన విషయము లేవియో సరిగ దెలియుట లేదు. ఉదా:— తెలుగు చోళరాజగు అల్లుతిక్కన విజయగండగోపాలుని నిజముగ నాశ్రయించిన కవి తిక్కన, ౪౩౦. నంబరు గల శాసన మొకటిమాత్రమే యీనివేదికలో నున్నది. దీనిపై చర్చ రెండుపుటలలో నున్నది (పు. ౧౨౪, ౧౩౫). నండలూరు, కాళహస్తి శాసనములలోని విషయములును, తిక్కన నిర్వచనోత్తర రామాయణమునందలి సంగతులు నందు చేర్కొనబడినవి. "నెం. ౪౩౦ T. T. శాసన మీరాజు ౫-వ రాజ్యసంవత్సరము నాటిది." అనునది మాత్రమీశాసనాంశము. అదియునుగాక శాస్త్రిగారు క్రీ. శ. ౧౨౫౫ వరకు నీతిక్కరాజు రాజ్యమేలె నని వ్రాసినారు. ఇది సరియైన నిర్ణయము కాదు. క్రీ. శ. ౧౨౬౧ లో మరణించిన కాకతీయ గణపతిదేవుడు తిక్కన పుత్రుడగు మనుమసిద్ధికి సాహాయ్య మొనర్చి యతనిని నెల్లూరు రాజ్యమున బ్రతిష్ఠించెను. అట్టిచో మనుమసిద్ధిరాజ్యారంభము, దాయాదులచే దరుమబడుట, గణపతిచే దిరిగి ప్రతిష్ఠింపబడుటయు క్రీ. శ. ౧౨౫౫-౬౧ ల మధ్య జరుగవలెను.

ఈ చారిత్రికభాగమున విజయనగర రాజవంశములకు సంబంధించిన నూతనాంశము లెన్నియో తెలియ నగుచున్నవి. ఇందు ముఖ్యములైనవి విజయనగరదండనాయకులయొక్కయు, వైష్ణవ మతాచార్యులయొక్కయు చరిత్రములు. విజయనగరరాజులందరిశాసనములు నిందు గలవు. సుప్రసిద్ధ సంగీతవేత్తలు, కవులునగు తాళ్ళపాకవారియొక్క వంశచరిత్ర యిందు గలదు. ఈ వంశీయులు రచించిన వ్యాకరణ, లక్షణగ్రంథములును, శృంగారాధ్యాత్మ వైరాగ్య సంకీర్తనములును ౩౦౦౦ రాగిరేకులపై వ్రాయబడి తిరుపతిదేవస్థానములో నున్నవి.

ఈశాసననివేదిక చరిత్రజిజ్ఞాసువుల కెక్కుడుగ నుపకరింపగలదు. రెండవ భాగమునం దనవసరములగు చర్చలు చేర్చుటచే గ్రంథము కొంచెము పెరిగి, తిరుపతి శాసనములలోని వాస్తవ విషయములు కొంతవరకును మరుగుపడినను, సంపాదకుల ప్రయత్న మెంతయు శ్లాఘ్యము. ఈగ్రంథములో నొకశాసనప్రతిబింబమును, తాళ్ళపాకవారి సంకీర్తనము లున్న రేకులలో రెండింటి ప్రతిబింబములును, తిరుపతిలోని తీర్థములయొక్కయు, దేవాలయములయొక్కయు ప్లానులును, ౫౬ ఫోటోలును గలవు. తిరుమల, తిరుపతి, తిరుచానూరులలోని దేవాలయములకు సంబంధించిన యీఫోటోలలో శ్రీ వేంకటేశ్వరస్వామి యాలయమందున్న విజయనగరరాజుల విగ్రహములకు సంబంధించినవి ముఖ్యమైనవి.

తాళ్ళపాకవారికృతులను ప్రకటనార్థమై సుప్రసిద్ధభాషాసేవకులగు శ్రీయుత మానవల్లి రామకృష్ణకవి గారు సిద్ధముచేయుచున్నారని యీ నివేదికలో వ్రాయబడినది. ఆప్రకటనము త్వరలో జరిగినచో, నీనివేదికలోని శాసనములు ఆంధ్రదేశచరిత్రకువలెనే, పైకృతులాంధ్రవాఙ్మయమున కమూల్యమగు నుపకారమును చేయగలవు.

మా. రా.

కొందఱు నెల్లూరి గొప్పవారు

గ్రంథకర్త: వంగోలు వేంకటరంగయ్య పంతులుగారు.

క్రౌను సైజు ౧౨౮ పుటలు

యరగుడిపాటి వేంకటాచలంపంతులు, వేమగంటి బొజ్జైమ్మగారు, వెన్నెలగంటి సుబ్బరావుపంతులు, హాజీ మౌలవి మహమ్మద్ రహమతుల్లాసాహేబు, ది ఆనరబిల్ రాజమంత్రప్రవీణ పప్లె చెంచల్రావు పంతులు సి. ఐ. ఇ. గార్ల జీవితసంగ్రహము లీగ్రంథమున గలవు. వీరందరు చాలగొప్పవారు, త్యాగశీలురు, లోకహితైషులు. వీరందరును గతశతాబ్దమున నుండినవారు. వీరి జీవితవృత్తములు దేశచరిత్రరచన కుపకరించునట్టివి. ప్రస్తుతము మనదేశమున నిట్టి గొప్పవారి జీవితముల నెరిగినవా రనేకులు లేరు. స్వరాజ్యము నపేక్షించుచుండు నీకాలమున ఈతర మునకు ముందుతరములలో నెంతయు గొప్పపనుల జేసి నిర్వహించినవారు మనదేశమున నుండిరని తెలిసి వారి జీవితముల నెరిగియుండుట వరిష్ఠధనులగు యువజనుల కుత్సాహకరముగనుండి, వారియందు లీనమైయుండు ధీరత్వధురీణత్వముల ప్రజ్వలింపజేసి వారల మహోద్యమములకు పురికొల్పుట కాధారమై యుండగలదు. కావున గొప్పవారి జీవితచరిత్రముల వ్రాసియుంచు టావశ్యకము.

ఇట్టిపుస్తకముల పాఠశాలలయందు ప్రవేశపెట్టిన బడుల పిల్లలు మనదేశపు గొప్పవారిజీవితములను, వారి చర్యలను తెలుసుకొని వారివలెనే దేశౌన్నత్యము కొరకు పాటుపడగలరు. "ఆంధ్రభక్తు లింకను నిట్టి వీరులచరిత్రముల గడించి యాంధ్రసేవ జేయదగుదురు."

'రాజు'

గ్రంథ స్వీకారము

కంఠమాల

కవి: జయంతి గంగన్నగారు, రాజమహేంద్రవరము. క్రౌను సైజు: ౩౫ పుటలు. వెల ౬ అ. ఎనిమిది ఖండకావ్యముల సంపుటము.

మాధవాశ్రమము

ప్రథమభాగము, సాంఘికనవల. శ్రీ కృష్ణదేవ రాయ గ్రంథమాల, బళ్లారి—౪-వ పుష్పము. గ్రంథకర్త: గంటి సుబ్రహ్మణ్యశర్మగారు, క్రౌను సైజు, ౧౩౨ పుటలు, వెల ౭ అ.

నవ్యసూక్తిముక్తావళి

రెండుభాగములు, రెండుసంపుటములుగా. 'విద్వన్మానవిద్వత్కవివరులచే విరచితము.' విద్యావినోదినీ గ్రంథమాల, చిత్తూరు. టెక్స్టుబుక్కుకమిటీవారు పాఠశాలలకై ఆమోదించినవి.


క్రౌను సైజు: ప్ర. భాగము ౧౮౬ పుటలు; ౧౦ అణాలు. ద్వి. భాగము: ౧౨౦ పుటలు; ౧౨ అణాలు.

బందిగములున్నవే దేశభక్తులకును?

"లార్డు బైరన్‌గారి 'ప్రిజనర్ ఆఫ్ చిలాను' నుండి అనువదింపబడినది." గ్రంథకర్త: జె. సుబ్బయ్యగారు, ప్రొద్దుటూరు, కడపజిల్లా. క్రౌను సైజు: ౨౪ పుటలు. (౨౬౭ గీతపాదములు). వెల ౪ అ.


తర్కసంగ్రహము

'ఆయుర్వేదాచార్య, డాక్టరు ములుగు విశ్వేశ్వరశాస్త్రిగారిచే, రచింపబడిన ఆంధ్రతాత్పర్యచరక




కోళ్ల పెంపకము

E. N. P.



రోముపట్టణము-(ప్రాతది, క్రొత్తది)

E. N. P.



మధ్యాహ్నపు సముద్రము
(యస్. జి. కృష్ణస్వామయ్యరుగారి చిత్రము)



బాతుల నీరాటము (కె. గోపాల్ గారి చిత్రము.)

మతదీపికాఖ్యాయుర్వేద మతవివరణసహితము'. ప్రకాశకులు: ఇండియన్ మెడికల్ స్టోర్సు, తెనాలి. ఫూల్ స్కేపుసైజు: ౯౬ పుటలు, వెల ౧ రు.

---

i యమున

డెమ్మీసైజు, ౨౨౦ పుటలు, వెల చందాదారులకు ౬ అ. ఇతరులకు ౧౦ అ.

గ్రంథకర్త: శ్రీ శ్రీరామచంద్ర శాస్త్రిగారు.

ii ప్రేమ

డెమ్మీసైజు, ౧౯౮ పుటలు, వెల తెలియదు. గ్రంథకర్త: శ్రీ నారాయణమూర్తిగారు.

,ప్రకాశకులు:—అనువాదగ్రంథమండలి, పాలకొండ (విశాఖపట్టణము).

శ్రేవుడు

మంగిపూడి శ్రీ రామచంద్రశాస్త్రికృతము

శ్రీ ఉమ్రా అలిషా కవిగారి 'రాధేయుడు' అను ఏకాంకరూపకముపై విమర్శనము—లలితనుండి.

విశాఖపట్టణముజిల్లా పాలకొండలోని అనువాద గ్రంథమండలి ప్రచురించినది.

భారత సీతులు

పద్యములు. గ్రంథకర్త్రి: శ్రీమతి వాజపేయయాజుల మహాలక్ష్మిగారు, స్నేహలతాకవితాసంఘము, కొల్లాపురము.

డెమ్మీసైజు: ౨౦ పుటలు, వెల ౪ అ.

భారతసీతులు

డెమ్మీసైజు, పుటలు ౨౬, వెల 0-౪-0

గ్రంథకర్త్రి: వాజపేయయాజుల మహాలక్ష్మి, స్నేహలతా కవితాసంఘము, కొల్లాపురము.

పత్రికలు

ఆంధ్రభూమి

సచిత్ర మాసపత్రిక

సంపాదకులు, ప్రకాశకులు: ఆంధ్ర శేషగిరి రావుగారు, బి. ఏ. ఆంధ్రభూమి కార్యాలయము, వేపేరి, మదరాసు.

సంవత్సర చందా రు. 3-0-0.

భాషాసంస్కరణము

ప్రపంచమున నూతనయుగము ప్రారంభ మైనది. అది పరివర్తనయుగము; విశ్వకల్యాణ సంధాయకయుగము.

వివిధమానవజాతులు సంస్కరణ పరాయణము లై యున్నవి. సర్వత్ర సంస్కరణములు జరుగుచున్నవి. కొన్నిట సంపూర్ణ పరివర్తనమును జరుగుచున్నది. అందువలన సంప్రాప్తములగు వికాసాభివృద్ధులు నిఖిలశ్రేయస్సంపాదకములు.

సంస్కరణకార్యము నేడు జరుగుచున్నది కాదు; సృష్టివెంట బుట్టినది. సృష్టియొక్క విచిత్రపరిణామమే సంస్కరణ మూలకములగు వికాసాభివృద్ధులకు నిదర్శనము.

ప్రకృత మాంధ్రదేశమున దేశాభ్యుదయ హేతువులగు సకలవిషయములను వికాసాభివృద్ధులు క్షీణించినవి. అవియెల్ల పునస్సంస్కరణాపేక్షము లయినవి. కొన్నిటికి సంపూర్ణ పరివర్తనము నావశ్యక మగుచున్నది. అనుకూలింపని దేశకాల ప్రవాహముల కెదురీదుకొనుచు కొందరు ధీమంతులు, ఉత్సాహవంతులు సంస్కరణ పరివర్తనముల యావశ్యకతను గుర్తించినారు; తత్సంచారమునకయి దారి బాగుచేయు చున్నారు. వికాస కారణమగు సంస్కరణమును వినాశకారణముగ తలంచు సంస్కరణ పరాఙ్ముఖులు కొందరు వారి దారిని పెనుబండలవలె నడ్డుదగులుచున్నారు. కతిపయవత్సరములకు పూర్వము తత్కాల దేశసౌకర్యముల నెంచి తత్కాలీనులగు ధీమంతులు కావించిన నియమములే పరమావధిగా భావించి, వాని నతిక్రమించుట మహాపాతకమని భీతిల్లుచు, ప్రపంచమంతయు వానియందే కలదని వాని యాథార్థ్యము నారయ దొరకొనక కూపస్థమండూకములవలె నుండుట వారి పనియయినది. అది కేవలము వారి దోషము వలన నయినది కాదు. విషయపరిశీలన తత్త్వ నిర్ణయసమర్థమగు ధీశక్తిని ప్రసాదించు జ్ఞానము నార్జించుకొను నవకాశము వారికి లభింపక పోయినది. వారు బుద్ధికిని, శరీరమునకును ఇంచుకయేని శ్రమ నొసగజాలని-ఒల్లని-అలస భావమునకు స్థానములయి కూరుచున్నారు. తమవలన తాము పుట్టువుగనిన ప్రపంచమున కొకింతయైన ప్రయోజనము గలుగవలయు నను తలంపున కీషన్మాత్రావకాశమునయితే మొసగజాలని యజ్ఞానము వారి మస్తిష్కముల నలమికొనిపోయినది. వారీవిధమున స్వపరప్రయోజనదూరు లయినారు. సంస్కరణమను పదము వారిచెవిని సోకినవెంటనే వాక్ శతఘ్నిముఖము 'ధిక్' శబ్దరూప తప్తాయః పిండములను భయంకరధ్వానముతో వెడల గ్రక్కుచుండును. అన్ని విషయముల నీయుభయ

పక్షములవారికిని ఇట్లు ఘోరమగు పోరాటము జరుగుచున్నది. ఇట్టి విపరీతస్థితి మఱియు నిటీవల కొన్నిశతాబ్దులనుండియే సంప్రాప్తమయినది. దీనివలన దేశాభ్యుదయము స్తంభించినది. సరయముగ నేతన్నివారణోపాయముల నరయనిచో నిక దేశ మధోగతికి రాక తప్పదు. ప్రతివిషయముయొక్క తత్త్వమును సహేతుకముగను, సోదాహరణముగను వివరించు సాహిత్య మింకార్యమున కెంతయు జాలినది. సంస్కరణాభిలాషు లట్టి సాహిత్యమును యథేష్టముగ సృష్టించి తద్ద్వారమున సంస్కరణావశ్యకతా జ్ఞానమును విపక్షులకు గలిగించి వారిని సుముఖులను గావించుకొనవలసియున్నారు.

సంస్కరణ సాహిత్య రచనమునకు భాష ప్రధానము. కావున తత్సంస్కరణము ప్రథమ కర్తవ్యము. అందును గ్రాంథిక వ్యావహారిక భేదముల రెండుచీలిక లేరుపడినవి. గ్రాంథిక భాషావాదులు 'నియమరహితమయి తలకొక తీరున తగులబడి స్వైరముగ విహరించుచున్న' దని వ్యావహారిక భాషను నిరసించుచున్నారు. 'నియమబహుళ బద్ధమయి నిర్జీవప్రాయముగ నున్న' దనియు, 'జనసామాన్యమునకు నిత్యజీవనోపయోగకరములగు విషయములను బోధించు సాహిత్యమును సృష్టించుట కుపకరింప' దనియు గ్రాంథికభాషను వ్యావహారిక భాషావాదులు తెగడుదురు. ఈవివాదము కొలదియేండ్లకాలమునుండి దేశమున ప్రబలియున్నది. ఈ యుభయవాదములయందును సత్యము కలదు. నిత్యవ్యవహారమునందు భాష యనేకవిధముల నభివృద్ధిని చెందుచుండును. దాని నేనాడో ఏరుపడిన నియమములతో బంధించియుంచుట తగనిపని. తలకొక్కతీరున పుట్టి, 'వచ్చాడు, వచ్చేడు, వచ్చీడు, వచ్చినడు, వచ్చిండు, పోయాడు పోయేడు, పోయీడు, పోయినడు, పోయిండు' మున్నగు వికృతాకృతులగు పదములతో స్వైరవిహారమును చేయుటయు తగదు. ఈ రెండుమార్గములును భాషాభివృద్ధికి భంగమును గలిగించునవియే.

ఆదిని పరస్పర భావావిష్కరణార్థ మేరుపడినధ్వనులు శబ్దముల రూపమును దాల్చినవి. తత్సముదాయమే వాఙ్మయ మనబడినది.

ఆంధ్రభాషకు తల్లియగు సంస్కృతము తొలుత కొన్ని దేశముల ప్రాకృతుల సంభాషణ రూపమున నుండినది. అదియే ప్రాకృతమన బడి నది. అది యొకింత సంస్కారమును బడసి వైదికవాఙ్మయ రచనమున కుపయుక్తమయి నది. అనంతర మావిర్భవించిన పురాణేతి హాసాదులు, కావ్యనాటకాదులు ఇంకను సంస్కారమునుగన్న పదములతో నిర్మితములయినవి.

ఉపర్యుక్త సంస్కరణ యుగములయందే శబ్దానుశాసనాదులుకూడ నుప్పతిల్లినవి. శబ్దములకు రూపాంతరములు, వానివిషయమున మతాంతర, పక్షాంతరములు నేరుపడినవి. సాహిత్యాంగములగు ఛందోలంకారాదు లవతరించినవి. ఛందములలో ననుష్టుప్ ఛందము

అలంకారములలో నుపమాలంకారము నాద్యములు. అవి యనేకములుగ పెరిగినవి. ఇతర శాస్త్రములును ఇంతలంతలయి తామరతంపరలయినవి. కాలక్రమమున వాఙ్మయ మీరీతిరున వికాసము గాంచినది. ఇట్లు సంస్కరణముల గాంచుటచేతనే యాభాష సంస్కృత మనుపేర బరగినది.

ఆంధ్రభాషయును సంస్కరణ మూలకమగు నతిమాత్ర వికాసమును గాంచినది. నన్నయకు పూర్వము మొదలుకొని ఇంచుమించు రెండు శతాబ్దముల కాలమునకు పూర్వమువఱకు—వాఙ్మయాభివృద్ధి స్తంభించిననాటివఱకు—పుట్టిన సాహిత్యమును పరిశీలించిన యెడల సంస్కరణప్రాప్తమగు వికాస పరిణామములు విస్పష్టము కాగలవు. అసలు ప్రాకృత సంస్కృత ద్రావిడభాషలయందలి పదములనేకములు ఆంధ్రభాషానురూప సంస్కారమును జెంది ఆంధ్రమునకు పుష్టినిగలిగించినవి. తనకు పూర్వమున్న భాషను నన్నయ్య సంస్కరించి శాసించి వాగనుశాసను డనబరగినాడు. పదములకు రూపబాహుళ్యము ప్రాప్తించినది. నాటి యా నన్నయ్యమొదలుకొని మొన్నటి చిన్నయ్యవఱకు నెన్నిరో వ్యాకరణములు పుట్టినవి. వానియందు మతాంతర పక్షాంతరములనేకములు బయలుదేరినవి. యతిప్రాసములయు, ఛందోవృత్తములయు సంఖ్యలు క్రమముగా పెరిగినవి. మహమ్మదీయుల సంబంధమువలన వారిభాషయందలి పదములు పెక్కులాంధ్రభాషయందు ప్రవేశించినవి. లాక్షణికుల సమ్మతిని బడసి యవి సాహిత్యమునకెక్కి ప్రామాణ్యములుగ బరిగణింపబడినవి. ఇదియంతయు నొక్కకాలమున జరిగినది కాదు; ఆయాకాలముల వాఙ్మయాభ్యుదయాకాంక్షులు, ధీమంతులు నగు పండితులు పలువురు ధైర్యముతో కావించిన సంస్కరణముల వలన కలిగినది. ఈ వికాసక్రమము దాదాపు రెండు శతాబ్దములనుండి యాగిపోయి ఇటీవల శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారి కాలమున తత్సంస్కరణ ప్రియత్వము కారణముగా మరల నొకింత తలయెత్తినది. కాని యదియు నల్పమాత్రముగ నిలిచిపోయినది. ప్రకృత మాంగ్లభాషాపఠన జనిత సంస్కారమువలన నాంధ్రమునకు వికాసము కలుగు నవకాశము లధికముగ కలవు. ఈయవకాశము వలన కొంతకొంతగా వాఙ్మయ సాహిత్యములయం దభివృద్ధి కనిపించుచున్నది. కాని వ్యావహారిక భాషావాదుల ప్రాపున సంప్రాప్తమయిన స్వైరవిహారము చెలరేగుచున్నది. సంస్కరణమయినను నియమములకు లోబడకయున్నచో నిలుకడ గనజాలకపోవును.

అనభిజ్ఞత, అశక్తత, ఔదాసీన్యము సంస్కరణములను సాగనీయవు. జీవద్భాషయైనను సంస్కరణవిహీనమగునేనివికసింపజాలకపోవుట యటుండ క్రమముగ నది వినాశోన్ముఖమును కాగలదు. కొన్నిభాషలు, జాతులు మొదలయినవి సంస్కరణ విహీనములయి నామమా

త్రావశేషము లయిపోవుటను ప్రపంచచరిత్ర మెరుకకు దెచ్చుచున్నది. కావున సంస్కరణములు పరమావశ్యకమగుట తప్పనిసరి.

పూర్వపూర్వ సంస్కర్తలవంటి సంస్కరణ ప్రియులు, సంస్కృతాంధ్రాంగ్లభాషా తత్త్వ కోవిదులు, విశాలహృదయులు నగువార లిందుల కధికారులు. అట్టివారు తొలుదొలుత భాషాసంస్కరణమును సాగించుట కనుకూలించు మార్గములను, సంస్కరణ విధానమును తత్స్వరూపమును వివరించుచు వ్యాసములను వ్రాసి ప్రజలకు భాషా సంస్కరణములవలన గలుగగల ప్రయోజనములను బోధపరచవలెను. ఆవ్యాసములను దేశమున వ్యాపింపజేయ భారతి నిండిన కుతూహలముతో వేచియున్నది. సంస్కరణాభిలాషులు భారతి కౌతూహలమును దీర్చుచు భాషావాఙ్మయాభివృద్ధిని కావింతురుగాక!

ఉచ్చారణసంజ్ఞలు

ఆంధ్రము లుచ్చారణసామ్యములు కాని ఆంధ్రేతర భాషాపదములను సరిగా నుచ్చరించుటకయి అట్టి ప్రత్యేకోచ్చారణకు 'పోలిక ధ్వనులు గల అక్షరాలను రాసి వాటి ఉచ్చారణభేదాన్ని తెలుపడానికి ఆ అక్షరాలకిందో పైనో అడ్డగీటుకాని, నిలువుగీటుకాని... ఒక్కొక్క రొక్కొక్కమాదిరిగుర్తును వరుస తీరు లేక పెడుతున్నా' రనియు, 'అప్పటికీ ఆమాటలను తెలిసినవాళ్లు, ఇంగ్లీషువచ్చినవాళ్లు సరియైన ఉచ్చారణలతోనే ఉచ్చరిస్తున్నారు. కాని' తదితరులు సరిగా ఉచ్చరింపజాలకున్నా రనియు 'వుచ్చరించేటట్లా రాయలేకపోడం' అను 'లోటు' 'సవరించి ఉచ్చారణకు సరిపోయేటట్లానే రాయడం ఏర్పరుచుకోవచ్చు' ననియు శ్రీ. కే. కామేశ్వరరావుగారు 'అట్టి అక్షరాలపైన అడ్డంగా రెండుచుక్కలుగుర్తు పెడదాం' అన్నారు.* ఈగుర్తుకూడ 'ఒక్కొక్కరొక్కొక్కమాదిరి'గా 'వరుస తీరు లేక పెడుతున్న' గుర్తులసంఖ్యను అధికము చేయుటయేగాని ఉద్దిష్టార్థలాభమున తత్పూర్వపుగుర్తుల కింతయు దీసిపోదు. ఒక భాషను చదువక, వినికిడి, అభ్యాసము నైన లేక ఆభాషయందలి పదములను సరిగా నుచ్చరింపజాలుట కలలోనిమాట. ఆంధ్రము సంస్కృతమయము. దానిని అక్షరాభ్యాసము నాటినుండియు పాఠశాలలయందును, తరువాత కళాశాలలయందును 'లెస్సగా' జదివిన బి. ఏ., యం.ఏ. పట్టములను గడించినవారు సయితము ఎందరోయందలి సంస్కృతపదములను సరిగా నుచ్చరింపజాలకుందురు. వారు 'భాగవతము'ను 'బాహావతము, బాఘవతము, బాగవతము' అనియు, 'బ్రాహ్మణుడు'ను 'భ్రామ్మను, బ్రామ్మడు' అనియు, 'ఉచ్చారణ'ను 'ఉచ్ఛారణ' అనియు, 'బీభత్సము'ను 'భీభచ్చము, బీబచ్చము' అనియు, 'షడ్జమును' 'షడ్ఘము' అనియు, 'భుజము'ను 'బుఝము, బుజము' అనియు, 'అర్థము'ను 'అర్ధము' అనియు, ఇట్లే ఇంకను ఎన్నింటినో వెఱ్ఱిమొఱ్ఱిగా నుచ్చరించుచున్నారు. ఉచ్చారణకు సరిపోవు సంజ్ఞలు - అక్షరములు - లేకయా వా రిట్లుచ్చరించుచున్నారు? వినికిడి లేదంటురా? ఉగ్గుబాలతో పెట్టినఆంధ్రమంతయు సంస్కృతమయముకదా! అయిననేల సరిగ నుచ్చరింపరు? అభ్యాసము లేక, నోటికి శ్రమనీయ నిష్టమున లేక! లెస్సగా చదివినవారినోటనే యిట్లు మాతృభాషయందలిపదములు వెలువడుచుండ, చదువురాని, లేక, తెనుగుమాత్రమే చదివినవారినోట నెట్లు విదేశభాషాపదములు వెలువడునో యూహించుట చాల సులభము. కావున నిట్టిప్రయత్నములవలన ఫలము గలుగు ననుకొనుటకు వలనుపడదు. అట్టిప్రత్యేకోచ్చారణగల విదేశభాషా పదములకు పఠనలేఖన సౌఖ్యములకు సమానపదముల నాంధ్రమున చేరుపరుచుకొనుట యుక్తము. ఇంగ్లీషు

*వైశాఖమాస భారతిసంచికయందలి 'ఉచ్చారణ-విభేదపుగుర్తులు' అను వ్యాసమున.

మొదలగుభాషల పదము లెన్నియో యాంధ్రమున కుదురుకొనిపోయినవి. క్రమముగా క్రొత్తవియు (ఇక ముందుగూడ) చేరి కుదురుకొనగలవు.

తరువాత వ్యాపకర్త Bank, Mail మొదలగుపదములలోని a, ai మొదలగుఅచ్చులవలనపుట్టుధ్వని 'అచ్చు' కాదనియు, 'హల్లు' అనియు, ఆధ్వని ఆయచ్చుకు పూర్వమున్న b, m మొదలగు హల్లులతో కూడినపుడు దానిని 'దవడలసహాయంతో' ఉచ్చరింతురుకావున దానికి-అనగా ఆయా యచ్చుతో గూడిన ఆయాహల్లులధ్వనికి—'తాలువ్యసహాయహల్లు' అని పేరిడవచ్చుననియు ననిరి. ఆపద్ధతి మీదనే 'వర్ణసమామ్నాయము' నను మార్పులు చేసి క్రొత్తగా తయారుచేసిరి. Bank, Mail పదములయందలి a, ai అచ్చులయుచ్చారణములే కదా ఆంధ్రలిపిని వ్రాయ సాధ్యము కాకుండునవి! అచ్చుల యుచ్చారణములుహల్లులయుచ్చారణము లెట్లు కాగలవు? ఒకభాషలోని అచ్చు లింకొకభాషయందు హల్లు లగునని యేభాషాతత్త్వవేత్తయు, ఏశబ్దశాస్త్రజ్ఞుడును చెప్పినట్లు కానరాదు. 'అచ్చువీడ మళ్లా అచ్చు కలియడం' 'అసందర్భం' అని ఏ ఐ ఓ ఔ ల ఉచ్చారణతత్త్వమును తెలిసినవా రన సాహసింపరు.

Furlong, Pharmacy మొ. పదములయందలి మొదటి వర్ణములయుచ్చారణమును దెలుపుటకు వక్రింద నొకచుక్క పెట్టవలయు నన్నారు.

వచ్చాము, వచ్చారు, కావాలా, తాటాకు, విడాకులు మొదలగు పదములలోని చ్చా-చ్చా-వా-టా-డా మొదలగు వర్ణముల నంటియున్న అచ్చును వ్యావహారికముగా నుచ్చరించునపుడగు ధ్వనిని దెలుపుటకును వానిమీద రెండుచుక్క లుంచవలయు ననిరి. అసలీపదముల యుచ్చారణమే యొకతీరున లేదు. వచ్చేము, వచ్చీము- వచ్చేరు, వచ్చీరు- కావాలె, కావాలి-తాటేకు, విడేకులు అని ఊరి కొకదినుసుగా నున్నది. ఎన్నిగుర్తులుంచినను వానియుచ్చారణ మొక్కతీరున నిలువదు. 'మామ, ఏమి, రామమ్మ'ల విషయము నింతయే.

తెలుగున అచ్చుఅక్షరములు (Types) తొమ్మిది వందలవర కున్నవి. ఈ క్రొత్తఅక్షరములు మరిరెండు మూడువందలు కాగలవు. ఇపు డున్నవానిని తగ్గించి అచ్చుకూర్పును సుకరము చేయవలసియుండ ఇంకను వానిని ఎక్కువచేయదలచుట సంస్కరణముకాదు.

సంస్కరణము లభ్యుదయహేతువులు. కాని తాము సంస్కరింపబూనిన విషయముతత్త్వమును చక్కగా దెలిసి, సంస్కరణమువలని సాధకబాధకములను లెస్సగా విచారించి, సంస్కరణ ప్రయోజనములను నిశ్చయించి సంస్కర్తలు సంస్కరణమును జేయవలసియుండురు. సంస్కరణములపట్ల కేవలము నభిలాష, ఉత్సాహము నెవ్వరికిని సంస్కరణార్హతను గలిగింపజాలవు.

మాలవ్యాగారి దోషారోపణము-
ప్రభుత్వఖండనము

కాంగ్రెసునాయకులు కొందరు ఏప్రియల్ మొదటి తేదీన కలకత్తాయందు జాతీయసభను జరపిరి. ఈ మహాసభ సమావేశమయినపుడు బెంగాలుపోలీసువారు ప్రతినిధులను నిర్దాక్షిణ్యముగా కొట్టి రని మాళవ్యగారు బెంగాలు పోలీసువారిమీద ఆరోపణ గావించిరి; ప్రభుత్వమువారిని ఈ విషయమై విచారణ సల్పవలసినదిగా కోరిరి.

ఇండియా ప్రభుత్వమువారి కోరికపై బెంగాలు ప్రభుత్వమువారు ఈ విషయమై ఒకనివేదికను ప్రచురించిరి. ఈ నివేదిక మాలవ్యాగారి ఆరోపణలు పట్టి అబద్ధములపుట్టయని తెల్పుచున్నది. కాని నివేదికయందలి వాదములు అసందర్భములనియు, సత్యదూరములనియు తెల్పుటకు నివేదికయందలి కొద్దిభాగమును ఇచ్చుట పొంకుపరచిన చాలును.

"ఏప్రియల్ మొదటి తారీఖున కాంగ్రెసు మహాసభను జరుప ప్రయత్నించినపుడు పలువురు ప్రతినిధులు పోలీసు సార్జెంటులచే మర్దింపబడి రని ఆరోపింపబడినది. తీర్మానములను ప్రతిపా

దించుటకు వేదికపై నిలిచిన ప్రతినిధులను సార్జెంటులు తమ శక్తికొలది లాఠీలతో కొట్టి అంతటితో తృప్తినొందక తన్నులుకూడ తన్నిరనియు కూడ ఆరోపణలయందు కలదు. ఇది సత్యముకాదు. కారణము: కాంగ్రెసుసభ పెద్దబయలునందు జరిగినది. కలకత్తాయందు ఎప్పుడును జనసమ్మర్దముగల రోడ్లకూడలియొద్ద ఈ బయలు కలదు. పోలీసు చేయుపనులన్నియు జనులకు బాగుగా అగపడును. ఆసమయమున పత్రికాప్రతినిధులందరు వచ్చిరి. అతివాద పత్రికలుకూడ తమ ప్రతినిధులను పంపినవి. ఈ పత్రికలయందు ఒకదానియందుకూడ లాఠీచార్జి జరిగినట్లు లేదు. రెండవతారీఖు లిబర్టిపత్రికమాత్రము లాఠీచార్జి వలన ౧౨ గురు గాయపడి మెడికల్ కాలేజీ ఆసుపత్రి నుండి విడుదలచేయబడి రని వ్రాసినది. ఈ ఆరోపణలు చాల దినములు జరిగినపిమ్మట కలకత్తాయందుగాక కాశీయందున్నవారిచేతను, సభ కుందున్నవారిచేతను మిగిలినవారిచేతను చేయబడినవి."

పైని పేర్కొనిన కారణములవలన మాలవ్యాగారి ఆరోపణలు అబద్ధములని నివేదిక నిరూపింప సమకట్టినది. ప్రస్తుతము భారతీయులు చట్టములతో బిగింపబడిరి. వారెటు కదలుటకు వీలులేదు. పత్రికలకు కూడ వాగ్బంధము కలిగినది. ప్రభుత్వమునకు అమర్యాదను తెచ్చువార్తలు ఏవియు ప్రచురించుటకు వీలులేదు. అట్టివార్తలు ప్రచురించిన పత్రికలు మరునాటికే ధరావతు కట్టవలసినదే. అట్లుచేయని యెడల పత్రిక ప్రచురణమును విరమింపక తప్పదు. ఇందువలననే "అతివాద పత్రికలు" కాంగ్రెసు విషయకమైన వార్తలను మాత్రము ప్రచురింప సాహసింపలేదు.

నేరములమోపినవారిసంగతి: ఈమహాసభకు పండితమాలవ్యాగారిని అధ్యక్షునిగా ఎన్నుకొనిరి. వారిని కలకత్తాకు రానీయకపోవుట వల్ల, పోలీసు "అత్యాచారములు" కన్నులార వీక్షించు భాగ్యము కలుగలేదు. కాని వారికి చెప్పినవారు దెబ్బలతినినవారే. వారికి తగిలినగాయములు ఆయనకు కనబడకుండునా? సర్ సామ్యూలుహోరుగారు పార్లమెంటునందు ఈ ఆరోపణలు అబద్ధములని నుడివిరి. ఆయన స్వయముగ చూచినాడా? ఇండియా ప్రభుత్వమువారు పంపిన సమాచారమునే కదా ఆయన ఆధారపడినది? అదియునుగాక లిబర్టి పత్రిక పండ్రెండుగురికి గాయములు తగిలిన సంగతి వ్రాసినవిషయము వీరే ఒప్పుకొనుచుండిరిగదా? తమ అతిథి జగ్గరాజుగారి గాయములు చూచినపుడు మాలవ్యాగారికి మనస్సు కరగినదట. కాబట్టి ఆరోపణలు చేయుటకు మాలవ్యాగారు అచ్చటనుండ నవసరము లేదు. దెబ్బలుతినుటకూడా అవసరము లేదు.

షి. మోగా హిందూ మహమ్మదీయుల కొట్లాట

బెంగుళూరు మే ౯.

"షిమోగాయందు ఆదివారమురాత్రి మతవైషమ్యములకు సంబంధించిన కొట్లాట జరిగెను. కొందరు దుండగీండ్రు లాఠీలు, ఎలెక్ట్రిక్కు దీపాలు, పెట్రోలు తెచ్చి హిందువుల యిండ్లను తగులబెట్టిరి. మొహరం ఉత్సవమున హిందువులు అశ్రద్ధవహించి తగినంత సహాయము చేయలేదను అనుమానముపై యింత పుట్టెనని తెలియుచున్నది.

కొట్లాటను పోలీసువారు వచ్చి ఆపిరి. మహమ్మదీయులందు ఒకడు చనిపోయి ఇద్దరు గాయపడిరి. ఒక పోలీసువాడు ౮ గురు హిందువులు ఆసుపత్రికి గొంపోబడిరి. సుమారు లక్షరూపాయలు నష్టము. చాల మంది అరెస్టుచేయబడిరి." (అ. ప్రె.)

హిందువులకు మహమ్మదీయులకు అనాదినుండియు స్నేహభావము తక్కువ. హిందూదేశమును పరిపాలించిన మహమ్మదీయ చక్రవర్తులు అనేకులు హిందూమతమును సంపూర్ణముగనే నిర్మూలింప కంకణము కట్టుకొనియుండిరి. ఈ ఉభయమతములకుగల పరస్పరవైషమ్యమే ఉభయమతములవారికిని తరచుగలిగెడు సంఘర్షణములకు కారణము. అందువలననే హిందువులుమహమ్మదీయులపండుగలందుగాని, మహమ్మదీయులు హిందువులపండుగలందుగాని సహజముగా పాల్గొనరు. ఈ కొట్లాటవలన మహమ్మదీయుల మనస్సంస్కారముయొక్క పరిమితి వెల్లడియగుచున్నది.

కీ. శే. దొంతముసెట్టి నాగేశ్వరరావు

పాపము! దొంతముసెట్టి నాగేశ్వరరావును ఉన్నటులుండి మొన్న మృత్యువు తనవాత బెట్టుకొనినది. జీవకోటికి మరణము తప్పనిదే యయ్యును, నాగేశ్వరరావు వర్ధాయుషుడగుట, నాతని యకాలమరణము చాల విచారమును గలిగించుచున్నది. ఇతడు చాల ఉత్సాహము, కార్యదీక్ష గలవాడు; చిన్ననాటినుండి స్వయంసాహాయ్యమువలననే అభివృద్ధికి వచ్చినవాడు. కృష్ణామండలమునందలి గ్రామమున పుట్టి, చెన్నపట్టణమును చేరుకొని స్థిరనివాస మచటనే సమకూర్చుకొనగలిగినాడు. ఔషధవ్యాపారమును సాగించినాడు. వ్యాపారవిషయములయందు నీతనికి నేరుపు గలదు. తన పోషణము వలననే ప్రయోజకతను బడయుచున్న తమ్ములతో గలిసి పాటివారిలో పేరు ప్రతిష్ఠల సంపాదింప ఉవ్విళ్లూరుచుండినవాడు అసలు తానే లేకపోయినాడు. అతని ఆశలన్నియు గాలిమేడ లయిపోయినవి.

వయస్సు ముప్పదిని దాటియుండును. ముగ్గురు పసికూనలు. ఆలు ముద్దరాలు. వయసుచెల్లిన తలిదండ్రులకు తానే మొదటిసంతానము. అతనినే నమ్మియుండిన ఇంత కుటుంబము సంతాపము మితిలేనిది.


నాగేశ్వరరావు కొన్నాళ్లు స్వజాతి-అభివృద్ధి కొరకు 'దేవాంగజ్యోతి' అను పత్రికను నడిపినాడు. తొలుత నితనికి 'ఆంధ్రపత్రిక' లో ప్రవేశము కలిగినది. తరువాత 'భారతి' ప్రారంభముతో తత్సంపాదకశాఖకు జేరి ఆరేడేడులు 'భారతి' సేవ చేసినాడు. గ్రంథప్రకటనమును కావించినాడు. ఇటీవల, నామమాత్రావశిష్టమయిపోయిన ఆంధ్రప్రకాశికను మరల ప్రకటింపబూని, వ్యర్థవ్యయమునకు పాలయినాడు.

ఇతడు స్వాభిమాని. తదనురూపప్రవర్తనమే యీతనిది. పలువురు ప్రముఖులతో పరిచయమును



సంపాదించుకొనినాడు. స్వాభివృద్ధిమార్గముల నిరంతరము నాలోచించుచు భావిసుఖమయ జీవితస్వప్నముల గనుచుండినాడు. ఈతని ప్రయత్నము లవశ్యఫలసిములు కావలసినవి.

పరిమితమగు నితని సాహిత్యపరిశ్రమ మపరిమిత ప్రయోజనము నాకాంక్షించుచుండినది. ఇట్లు అభ్యుదయకరము లగు లక్షణము లన్నియు నీతనియం దమరియుండినవి. ఎన్నియున్న నేమి? ఆయువు అంతరించినది. దానితోపాటు అన్నియు నంతరించినవి. ఇక మిగిలినది అశ్రుతర్పణము.



ధర్మసంస్కారము

గాంధిమహాత్ముని యుపవాసదీక్ష ప్రపంచమునం దంతటను తాత్కాలికముగనైనను ధర్మసంచలనమును, ధర్మనిరీక్షణమును, ధర్మసంస్కారమును గలుగ జేయుటకు వినియోగపడుచున్నది. ఆచారావృతమైన ప్రపంచమునందు ధర్మసంస్కార మనవరతము ధర్మసంచలనమును, ధర్మవికాసమును గలుగ జేయుచున్నది. ప్రపంచప్రవృత్తియందు పశుప్రవృత్తి మానవప్రవృత్తిగను, మానవప్రవృత్తి దైవప్రవృత్తిగను పరిణమించుటకుగలిగిన సంస్కారపరంపరల సంరంభము పరమవిషాదమును గలుగజేయును. కుటుంబాభిమానము, కులాభిమానము, దేశాభిమానము, జాత్యభిమానము, ధనాభిమానము, విద్యాభిమానము, మతాభిమానము మున్నగు అభిమాన దేవతలు యథేచ్ఛగను విహరించుచు గలుగజేసినట్టియు, గలుగజేయుచున్నట్టియు ఘోరసమరములు, పురుషార్థసిద్ధికి సాధనములైన పవిత్రచరిత్రములుగను పరిగణింపబడుచు ధర్మస్వరూపమును, స్వభావమును సంకుచితము లైనవి. ప్రపంచేతిహాసములందు మమకారాహంకారపూరితములైన సామ్రాజ్యములు, మతములు, వృత్తులు, సారస్వతములు, కళలు, వ్యాపారములు, సంపదలు, ధర్మశాస్త్రములు, వేదములు ధర్మసంస్కారమునకు సాధనములు గాక ప్రతిబంధకము లైనవి. సంహారదక్షు లైన మహారథులు, కుబేరులు, శాస్త్రజ్ఞులు, ప్రవక్తలు జాతీయదేవత లై పూజాపాత్రులుగ నున్నారు. ప్రపంచసంస్కారము ధర్మపరమైన సుఖప్రాప్తికిని దుఃఖనివృత్తికిని వినియోగపడక యధర్మపరమైన సుఖనివృత్తికిని, దుఃఖాభివృద్ధికిని వినియోగపడుచున్నది.

ప్రపంచప్రవృత్తియందు శ్రీరామరావణులు, శ్రీకృష్ణకంసులు, విజయకర్ణులు, ధర్మజదుర్యోధనులు, గౌతమబుద్ధచార్వాకులు, హరిశ్చంద్రచాణక్యులు, సుదామనందనాదులు ధర్మాధర్మ సంస్కారరూపమునను గలుగజేసిన ధర్మసంస్కారపరివర్తనము నేటికిని దురారాధ్యముగ నున్నది. శ్రీకృష్ణుడు విజ

యున కుపదేశించిన భగవద్గీతార్థమె ప్రపంచప్రవృత్తియం దనుక్షణమును గోచరం బగుచున్నది. ఆత్మజ్ఞులైన భాగవతభక్తులు ధర్మసంస్కారపరమైన విశ్వగీతామృతము ననుభవింపగలిగినను సామాన్యులకు దురారాధ్యమై దుస్తరముగ నున్నది. ప్రపంచప్రవృత్తియందు విషాదపరిస్థితులందు ధర్మాత్ములైన మహాత్ములాత్మసాక్షాత్కారమును జేయుచు ధర్మసంస్కారము నుద్ధరించుచుందురు. ప్రపంచసంస్కారమునందు ధర్మావతారఘట్టము లనవరతమును సంభవించెడి విధమును ప్రపంచేతిహాసము లనంతముఖములను బోధించుచున్నవి. జీవయాత్రయందు జీవజాలములకు ధర్మనిర్వహణము పురుషార్థమునకు సాధనముగనున్న విధమును పురాణేతిహాసములు, ధర్మశాస్త్రములు, వేదవేదాంతములు బోధించుచున్నను ధర్మపరిజ్ఞానము దుర్లభమై ధర్మారాధనము దురారాధ్యముగ నున్నది.

"కర్మజన్యోఽభ్యుదయ నిశ్శ్రేయసహేతు రపూర్వాఖ్య ఆత్మగుణో ధర్మః"

అని గౌతములు ధర్మనిర్వచనము చేసిరి. ఈ పరమార్థమునె గీతాశాస్త్రము సర్వత్ర బోధించుచున్నది.

శ్లో. "యదా యదాహి ధర్మస్య గ్లాని ర్భవతి భారత!
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్."

ధర్మసంస్థాపనమున కాత్మసాక్షాత్కారము సాధనభూతమైనవిధమును ధర్మసంస్థాపకులైన మహాత్ముల పవిత్రచరిత్రము లనంతముఖములను బోధించుచున్నవి. గాంధిమహాత్ముని నిరశనవ్రతమును వర్తమానసమయమునందు విషాదావస్థయందు మునిగియున్న ప్రపంచమున కాత్మ ధర్మోద్ధరణావశ్యకతను బోధించుచున్నది.

* * * *

ధర్మాధర్మ సంరంభము

ప్రపంచప్రవృత్తియం దనవరతము ధర్మాధర్మములకు సంరంభము గలుగుచు ధర్మాభ్యుదయము గలుగుచున్నది. ప్రపంచాభ్యుదయపరంపరలకు మూలమైన ధర్మాభ్యుదయము బాహ్యసాధనముల మూలముననుగాక నాత్మసాధనమూలమున నె సాధ్యముగాగలవిధమును ప్రపంచేతిహాసములం దాత్మధర్మఘట్టములైన మహాత్ముల పవిత్రచరిత్రములు వేయినోళ్ల ను చాటుచున్నవి. ప్రపంచవ్యాప్తములైన వివిధమతములును మతస్థాపకుల ధర్మచరిత్రములును ఆత్మధర్మప్రతిష్ఠాపనమునకు నిదర్శనములు. ఆదికాలమునందు ధర్మాధర్మసంరంభమునందు శ్రీరాములు రావణాదిరాక్షస సంహారమును జేసి ధర్మసంస్థాపనమును జేసిన ఆత్మధర్మేతిహాసము ధర్మసంస్కారేతిహాసమునందు మనోహరాధ్యాయము. ఆత్మధర్మారాధనమునకు విషయాధారములైన కాంచనకనకముల విజయము మూలస్కంధము. పశుబలమును ధర్మబలము సులభముగను జయించుచున్నది. దశకంఠుని పశుబలమును నరుడైనను శ్రీరాముని ధర్మబలము జయించినది. రామాయణేతిహాసము సంసారప్రవృత్తియందు దేహాత్ముల ధర్మసంరంభమును రామరావణ సమరరూపముగను,

సీతా రాముల శృంగార ప్రేమరూపమునను, దశరథపుత్రుల సోదరానురాగరూపమునను, హనుమంతుని నిశ్చలభక్తిరూపమునను, వీర శృంగార భక్తిరసానందపూర్వకముగను సువ్యక్తముచేయుచున్నది. ప్రాకృతిపురుషుడైన శ్రీరాముని కాత్మధర్మారాధనమునకు పరాక్రమము, రాజ్యము, గృహస్థాశ్రమము, సైన్యములు, సంగ్రామమున్నగు ప్రకృతివిలాసములవసరములైనవి. అధ్యాత్మరామాయణము సకలమానవులకుసాధ్యముగుటకు ధర్మసంస్కారాభ్యుదయ మవసరమైనది. పశుబలము మనోబలముగను, మనోబలము బుద్ధిబలముగను, బుద్ధిబల మాత్మబలముగను, పరివర్తనమును బొందుటకు ధర్మసంస్కారము పరివర్తనమును బొందిన విధమును మహానుభావుల ధర్మజీవయాత్రలు విశదముచేయుచున్నవి. సకలధర్మములును పూర్ణమైన ఆత్మధర్మమునం దంతర్గతములైయున్నను ధర్మపరంపర లన్యోన్యాశ్రయములై ధర్మసంస్కారము వికసించుచున్నది.

*   *   *   *

దేహ మనోబలములు

పశుబలమును మనోబలము జయించగల విధమును నిత్యవ్యవహారములు బాలురకును విశదముచేయుచున్నవి. మత్తమాతంగమును మావటివాడు వశపరచుకొనినటులు మనస్సు కర్మేంద్రియ జ్ఞానేంద్రియముల నిగ్రహించి వశపరచుకొనుచున్నది. సంసారప్రవృత్తియందు దేహేంద్రియవికాసమువలెను మనోవికాసమును ధర్మసంస్కారమునకు మూలముగ నున్నది. సకలకర్మలకును ప్రయోజనము జ్ఞానము. జ్ఞానమునకు ప్రయోజనము ధర్మసంస్కారము. భాగవతపురాణము శ్రీకృష్ణావతారరూపమున నీ పరమార్థమును హృద్యముగను విశదముచేయుచున్నది. శ్రీకృష్ణావతారము ప్రవృత్తియందు సకల సందర్భములందును ఆత్మయజ్ఞమును చేయగలవిధమును విశదము చేయుచున్నది. వీర భయ శృంగారాది రసానందానుభవ భేదము దశాభేదముగాని రసభేదము గాదు. ఉద్యోగపర్వమునకు ధర్మము హృదయము. ధర్మస్వరూపుడైన శ్రీకృష్ణపరమాత్ముని రాయబారము లేని యుద్యోగపర్వము మృతకళేబరము.

ఉ. సారపు ధర్మముఁ విమల
      సత్యముఁ బాపముచేత బొంకుచేఁ
  బారముఁ బొందలేక చెడఁ
      బాతిన దైవయవస్థ దక్షు లె
  వ్వార లుపేక్ష సేసి రది
      వారలచేటగుఁ గాని ధర్మని
  స్తారక మయ్యు సత్యశుభ
      దాయక మయ్యును దైవ ముండెడున్.

భారతసంగ్రామము రాజస తామస సంగ్రామముగాని ఆత్మసంగ్రామము గాదు. ధర్మసంస్కారము, ధర్మవిజయము సమకూర్చి స్వర్గారోహణమును జేయగలవిధమును స్వర్గారోహణపర్వము విశదము చేయుచున్నది. మానసిక ధర్మారాధనము భౌతికవిజయమును సమకూర్చినను, ఆత్మవిజయమున కపారమై

ధర్మసంస్కార మవసరమైనవిధమును ఘోరమైన ప్రపంచేతిహాసములు విశదము చేయుచున్నవి. భారతయుద్ధము గడిచి అయిదు వేలేండ్లయినను ప్రపంచప్రవృత్తియందు జీవయాత్రయం దాత్మోపలబ్ధికి ఆత్మధర్మ సంస్కారము దుర్లభముగ నున్నది. భారత యుద్ధానంతరము తాత్కాలికముగను బుద్ధియోగసాధ్యమైన శాంతిపర్వము సాధ్యమైనను ఆత్మయోగసాధ్యమైన శాంతిపర్వము సాధ్యము గాకున్నది.

* * * *

బుద్ధిధర్మసంస్కారము

పశుబలమువలెను మనోబలమును ధర్మసంస్కారమునకును, శాంతిపర్వ స్థాపనమునకును నిరుపయోగముగ నున్నది. బుద్ధదేవుడు బుద్ధిధర్మయోగాధారమునను ధర్మసంస్కారమును జేయుటకు బూనికొనిన ధర్మారాధనము ప్రపంచమునందు మహాధర్మపరివర్తనమును కలుగజేసినది. బాహ్య కర్మారాధన లక్ష్యమాత్మధర్మారాధన లక్ష్యముగను బరిణమించి ది. ఆత్మధర్మారాధనము బుద్ధియోగము ందు లక్ష్యమును బొందినది. కర్మయోగము కును, ధర్మయోగమునకును బుద్ధియోగము ందు సమన్వయము గలిగినది. బుద్ధియోగా తమైన ఆత్మ ధర్మసంస్కారమును స్థాపించు కు ధర్మపరిపక్వము గావలసియున్నది.

తన్నుఁ దాను పాలించుకొనవలెను. ఇతరులు తనకుఁ బ్రభువులు గారు. అహంకారము నడఁచుకొని జీవితముఁ గడపువానినిఁ బ్రభువులే వచ్చి ప్రార్థించెదరు. (ధమ్మపదము)

సుజ్ఞాతమైన బుద్ధియోగమునకును, అజ్ఞాతమైన ఆత్మ ధర్మయోగమునకును జనసామాన్యమునందు ధర్మయోగసమన్వయము దుర్లభమైనది. వైదికకర్మయోగము, ప్రాపంచిక కర్మ ధర్మయోగములు, బౌద్ధబుద్ధియోగము ప్రజాసామాన్యమునందు దురారాధ్యములైనపుడు విషాదయోగము సంప్రాప్తమైనది. జీవయాత్రను ప్రజాసామాన్యమునందురసవంతము చేయుటకు భక్తియోగము శరణ్యమైనది. కర్మయోగమును, ధర్మయోగమును, జ్ఞానయోగమును భక్తియోగమునందు సమన్వయమును బొందజేయుటకు క్రైస్తవమతము, మహమ్మదీయమతము, శైవ రామానుజాదిమతములు తలపెట్టిన ప్రయత్నములు వర్తమానకాలమునందు వ్యాప్తమైన ధర్మసంస్కారమున కాధారములుగ నున్నవి. ఏసుక్రీస్తు పర్వతము మీదను ధర్మోపదేశమును, మహమ్మదుచేసిన ధర్మోపదేశములును, దయానంద రామకృష్ణ వివేకానందాదులు చేసినబోధలును వర్తమాన కాలమునందుద్యోగపర్వమునకు వినియోగపడినటులు శాంతిపర్వమునకును స్వర్గారోహణ పర్వమునకును వినియోగపడకున్నవి. ఐరోపా మహాసంగ్రామము గలుగజేసిన మహాదుఃఖానుభవమునయితము శాంతిపర్వస్థాపనమునకు నిరర్థకమైనది. సంగ్రామమునందు గెలిచిన రాజ్యములును, ఓడినరాజ్యములును దుఃఖవేదన ననుభవించుచున్నను తిరిగి మహోద్యోగ

పర్వము నుపక్రమించినవి. శాంతిపర్వస్థాపనము మహాసంగ్రామదుఃఖానుభవము లేక ననంభవమైనను ధర్మపరాయణము లైన శ్రీకృష్ణరాయబారములు సర్వకాలములందును నవసరము లగుచున్నవి. శాంతిధర్మోపదేశమునకు భీష్ముడు అంపశయ్యనుండి శాంతిపర్వసందేశమును ప్రకటించినటులు గాంధిమహాత్ముడు నిరశనవ్రత శయ్యనుండి శాంతిపర్వసందేశమును పంపి ప్రపంచమునకు- ముఖ్యముగ భరతఖండమునకు ధర్మసంస్కారావసరమును ప్రత్యక్షము చేసినాడు.

*   *   *   *

నిరశనవ్రతము – ఆత్మధర్మసంస్కారము

నిరశనవ్రతము ధర్మప్రవృత్తియం దాత్మధర్మసంస్కారమునకు వినియోగపడగల విధమును మహానుభావుల తపఃప్రభావము లోకమునకు సువ్యక్తము చేయుచున్నది. దేహధర్మము, ఇంద్రియధర్మము, మనోధర్మము, బుద్ధిధర్మము మొదలగు ధర్మసంస్కారములు అనన్యమైన ఆత్మధర్మమునందు సమన్వయమును పొందించుటకు నిరశనవ్రతదీక్ష సాధనముగ నున్నది. ఆత్మధర్మసంస్కారమునకు నిరశనవ్రతము సాధనమైనవిధమును మహాత్ముని యుపవాసవ్రతము విశదము చేయుచున్నది.

శ్లో. విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః,
రసవర్జం రసోప్యస్య పరం దృష్ట్వా నివర్తతే.

ఉపవాస వ్రతము విషయవాసనలను నదలింపజేయుటకు సాధనంబైనను పరానుభవమునకు సాధనముగాజాలదు. ఉపవాసవ్రతము దైవసందర్శనమునకును, ఆత్మధర్మసందర్శనమునకును వినియోగపడుటకు భాగవతభక్తి పరమసాధనముగ నున్నది. ఉపవాసకాలమునందు గాంధిమహాత్ము డనవరతము నభ్యసించిన భక్తియోగము వ్యక్తులందువలెను జాతులందును ధర్మవిజయమునకు పరమార్థసాధనమును బోధించుచున్నది. ధర్మపరిణామమునందు బాహ్యధర్మారాధన మాత్మధర్మారాధనరూపమును దాల్చుటకు ప్రపంచము చేసిన ఘోరమైన తపస్సును ప్రపంచేతిహాసము లనంతముఖములను బోధించుచున్నను ఆత్మధర్మసంస్కారము దుర్లభముగ నున్నది. గాంధిమహాత్ముని యుపవాసము వర్తమానసందిగ్ధసమయమునందు భాగ్యభోగపరాయణంబై బాహ్యధర్మ పరాయణంబైన ప్రపంచమున కాత్మధర్మప్రతిష్ఠను అనుభవైకవేద్యము చేసినది. ఆ సనాతనానుభవమును స్వయముగ సేవించుటయును, లోకమున కుపదేశించుటయును హిందూమతమునకు పరమార్థము.

*   *   *   *   *

హిందూధర్మ పరమార్థము

హిందూమతమహార్ణవమునందు సత్యస్వరూపమును గ్రహించుట పండితులకును, పామరులకును దుర్లభముగ నున్నది. చైతన్యరహితమైన ప్రజాహృదయమునందు మతప్రయోజనములు ధర్మసంరక్షణమునకును, ధర్మ

ప్రతిష్ఠకును నిరర్థకము లైనవి. ఆచార దేవతకు గల ప్రతిష్ఠ ధర్మ దేవతకు గలుగకున్నది. వైదిక మత పరమార్థమును వేదమునందు సమన్వయము చేసిన వ్యాస వసిష్ఠ శంకర రామానుజ వివేకానందాదుల బోధలు బధిరశంఖారావములుగ నున్నవి. నిరర్థకమైన సనాతనధర్మఘోష హిందూ: తపరమార్థమునునిర్వీర్యము చేసినది. పరమధర్మములైన అహింసాధర్మము, సత్యధర్మము, ఆత్మధర్మము నిందాపాత్రములుగ నున్నవి. సామాన్యధర్మములైన హింసాధర్మము, వ్యావహారికధర్మము, దేహేంద్రియమనోధర్మములు స్తోత్రపాత్రములుగ నున్నవి. సర్వాత్మతత్త్వమును లోకకల్యాణమునకై యుద్ధరింపవలసిన పరమావసరము లోకమునకు గలిగినది. భౌతికధర్మములు గలుగజేయుచున్న దుఃఖమును ఫాసిస్టుమతము, హిట్లరుమతము, సోవీటుమతము, విప్లవమతము, సామ్రాజ్యాభిమానము, స్వార్థము మొదలగు మతపరంపరలు విశదము చేయుచున్నవి. భౌతికధర్మము నాత్మధర్మము ప్రతిఘటింపగల విధమును గాంధి మహాత్ముని ఉపవాసవిజయము విస్పష్టము చేసినది. "అహం బ్రహ్మాస్మి"యను సనాతన ధర్మారాధన సంస్కారము ఆత్మధర్మ సంస్కారమూలమునసె గలుగగలదు. ఘోరమైన ఉపవాసదీక్షాసాధనము నను ప్రపంచమునకు — ముఖ్యముగను నిద్రావస్థయందు మునిగియున్న భరతవర్షమునకును ఉత్తమమైన ఆత్మధర్మమును శ్రవణమనన ధ్యాన సంకీర్తన సందర్శనములను జేయుట కవకాశములను గలుగజేసిన గాంధిమహాత్ముడు సకలవిధములను వంద్యుడు, లోకారాధ్యుడు. సనాతనులును, సంస్కారులును సంకుచితములైన ధర్మసంస్కారావరణముల నతిక్రమించి విశాలమైన ఆత్మధర్మసంస్కారావరణమును జేరుట కాత్మస్వరూపులైన హరిజనులందును, నితరులందును ఆత్మధర్మసందర్శనము గలుగుటకు గాంధిమహాత్ముని దీర్ఘప్రచండోపవాసము వినియోగపడుటకు భగవదనుగ్రహము గలుగుగాత!

---

rinted and Published by C. Seshagiri Rao, B. A., at the Andhra Patrika Press, No.7, Thambu Chetty St., Madras
Editor: G. Subbaramayya.



ANDHRA PATRIKA PRESS, MADRAS.